# స్వేచ్ఛా కవిత్వం

మూడో సంపుటం (2013-2015)



మాదిరాజు రంగారావు

2026

రసధుని సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్-28.

# స్వేచ్ఛా కవిత్వం

## మూడో సంపుటం

రచనా కాలం 2013 - 2015

**మాదిరాజు రంగారావు**

### నాన్నగారి జ్ఞాపకార్థం

మా నాన్నగారు ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి స్వేచ్ఛా కవిత్వం మూడో సంపుటం **(Volume III)** పునః ముద్రణ చేసి సాహితీ సహృదయులకు, శ్రేయోభిలాషులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

**మాదిరాజు సంతోష్ కుమార్**

**దేవులపల్లి హరిత**

**మాదిరాజు చరిత**

**రసధుని**

**సాహితీ పరిషత్తు**

శాంతినగర్, హైదరాబాద్

**SWECCHAA KAVITHVAMU**
**Volume III (2013 - 2015)**

**by**
**Prof. Madiraju Ranga Rao**

© **Dr. M. Santhosh Kumar**

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Frist Edition 2015
Second Edition 2026

ISBN : 978-93-5635-842-3

**Price : 1000/-**

*For Copies :*
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

*Printed at :*
**Anupama Printers**
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

# స్వేచ్ఛా కవిత్వం

**మూడో సంపుటం**

**రచనా కాలం 2013- 2015**

## విషయ సూచిక


1. ఖడ్గం కన్నీరు కార్చదు (54)............................... 2013

2. చార్‌ధామ్ (జల విలయం) (55)......................... 2013

3. ఆల్ ఇన్ వన్ (56) ...................................... 2013

4. ఉద్యమ పథం (57)........................................ 2014

5. అడవిలో ఆయుధం (58)................................. 2014

6. చెదరిన ప్రజాస్వామ్యం (59) ............................ 2014

7. గాయపడిన ప్రజాస్వామ్యం (60)........................ 2014

8. ఈనాటి నిజం (61)........................................ 2015

9. ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం (62) ........... 2015

10. సంస్కృతి (63)............................................. 2015

హృదయం నుండి హృదయానికి

11. తెలంగాణ స్వరం & ఆత్మబంధం (64)................. 2015

# పీఠిక

## వర్తమాన సమాజ ప్రతిఫలనం

కవిత్వం ప్రధానంగా మనస్సు కేంద్రంగా సాగే సృజన చేతనకు సంబంధించింది. (1) శబ్ద శక్తి 2) అభివ్యక్తి విధం 3) దృష్టికోణం 4) సామాజికత 5) దార్శనికతతో కూడింది. దీనికి 1) ఆవేశం 2) అనుభూతి 3) సంస్కారం 4) భావన 5) కళాత్మకత ప్రేరణలుగా కనిపిస్తాయి. కవిత్వ తత్వాన్ని గురించి ఇంతవరకు చివరమాట లేదు.

ఆధునిక యుగంలో స్వేచ్ఛా వాతావరణం చేత ఎంతో వైవిధ్యంతో కూడిన కవితా ప్రపంచం దర్శనమిస్తుంది. అందువల్ల ఎవరి వ్యక్తిత్వం వారిదిగా ఏర్పడుతూంది. అనేకమైన అంశాలు వివిధ నిష్పత్తుల్లో కలియడం చేత, కవుల రచనల్లో ఎన్నో భేదాలేర్పడడం జరుగుతూంది. స్థూలంగా 1. సాధారణమైనవి 2. ప్రత్యేకమైనవి 3. విశేషమైనవి 4. అతీతమైనవి. విశ్లేషణకందుతాయి. ఆయా సందర్భాన్ని బట్టి కవి స్పందనను బట్టి దృష్టిని బట్టి కోరే ప్రయోజనాన్ని బట్టి ఉంటాయి. దేనికదిగా కాక వీటి కలయిక (Mixed) తోను దృష్టికి వస్తాయి.

ఈనాటి కవివత్వం (1) ఆంతరమైన అస్తిత్వాన్ని విశాలతరం చేస్తూంది 2) వెలుగును దర్శించే వీలు కలిగిస్తూంది 3) హ్లాదాన్ని కలిగిస్తుంది. 4) సంస్కారాన్ని పెంచుతూంది 5) అంతకుముందున్న వ్యక్తిత్వం పై పెంపును భావింపచేస్తూంది 6) సామాజిక వికాసానికి తోడ్పడుతుంది. ఇది ఆలోచనలోనే కాక ఆచరణలోనూ పయనింప చేసే శక్తి కలిగింది. మార్పుకు సంకేతమైంది. మానవ సంస్కృతికి పూర్ణతను చేకూర్చే ప్రయత్నమే ఈనాటి స్వేచ్ఛా కవిత్వం.

స్వేచ్ఛా కవిత్వంలో సామ్యవాద స్పృహతో ప్రజాస్వామ్య దార్శనికత కలిగిందీ, వెలుగులో పయనింపచేసేదీ. ఈ సంపుటం భౌతిక మానసిక మేళనంతో అవతరించిన వర్తమాన సమాజ ప్రతిఫలనం.

**– మాదిరాజు రంగారావు**

స్వేచ్ఛా కవిత్వం - 54

# ఖడ్గం కన్నీరు కార్చదు

(శిఖల మధ్య ప్రజాస్వామ్యం)

మాదిరాజు రంగారావు

2013
రసదుని సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Sveccha Kavithvamu - 54

# KHADGAM
# KANNEERU KAARCHADU

(Shikhala Madhya Prajasvamyam)

by

Prof. Maadiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

**Y.P. : 2013**

# అంకితం

మరోవైపు -

ప్రజాస్వామ్య మార్గదర్శి

యుగకర్త

మహా రచయిత గురజాడ అప్పారావు గారికి

150 వ జయంతి ఉత్సవ సందర్భంగా

# 1. ఖడ్గం కన్నీరు కార్చదు

## i. నీలి కవర్ నుండి

తెరచిన నీలి కవర్ నుండి
 చేతిలో విప్పారే ఉత్తరంలా
ఈ రోజు వర్తమాన రూపం
 చిర సమాజ బంధంలో సృజన మయం.

పదం వెంట పదం చదివే కొద్దీ
 క్షణం వెంట క్షణం నడిచే కొద్దీ
పదం క్షణం రెండూ కలిసి
 జీవన పథాన మనిషి యానం

మనిషితో మనిషి కలిసీ
 ఊహతో ఊహ చేరీ
పూర్వం ఎరగని కొత్త అనుభవంతో
 ఘటనలతో సన్నివేశ దృశ్య జగం

ఎవరి అయనం వారిదే అయినా
 ఒకరి నొకరు క్రాస్ చేయక తప్పదు.

విభేదాల వివాదాల ఒరపిడిలో రాపిడిలో
 సమన్యాయం అందుకునే యత్నం! నిచ్చెనపై
రెపరెప లాడే ఎర్రని పతాక ఫాలంతో
 కళకళ లాడే పచ్చని ప్రకాశ వదనంతో
తళతళ లాడే తెల్లని హంసీ హృదయంతో
 నిలిచిన ఆదర్శాన్ని నీలి చర్యలు కమ్ముతాయి.

ఆదర్శం తమ చేతిలో బొమ్మలా ఎవరికి వారు
 పోటీ ముగియకముందే విజయోత్సవ సన్నాహం!

# 11. మరో దారి

ఓటమి భయం తప్పని కటు సందర్భంలో
అనుకోని దారి! మరో వైపు నుండీ
తెలియని సమూహ దృశ్యం లోకి నడిపిస్తుంది
సరికొత్త అనుభవ గాథకు తెరవేస్తుంది.

ఆ వెళ్ళే దారిలో విశాల వట వృక్షం
పురా సమాజ చిహ్నం శాఖోపశాఖలుగా దిగీ
రోజు కొక కథ చిక్కు వడిన సమస్యతో
ఆ ముడి వీడితేనే! రహస్యం బయట పడేదీ

దారి ప్రక్కన పెద్ద శిల! ఎత్తుగా ఎప్పటిదో
పెరిగే నగరానికి ఆటంకమయి, అదృశ్యమైంది.
ఎపుడో ముక్కలు ముక్కలయి తరలింపబడీ
ఏ నిలయానికో పునాది రాళ్ళు కావచ్చు!
కఠినతకు చిహ్నమయిన రాతి శకలాలు
ప్రత్యర్థులపై కురిసీ గాయ పరచనూవచ్చు
ఏ ఉద్యమ చర్యలకో ఉపయోగపడనూవచ్చు
ఏ దారినో పరచబడీ సేవా కృతి పొందవచ్చు
కొండల్ని దాటుతూ నదుల్ని తరిస్తూ
దూరం బహుదూరం వెళుతూ లెక్కచేయకుండా
ఎదురుపడిన గోడల్ని దాట లేని స్థితిలో
కనిపించని ఆవలి దృశ్యం గురించి ఆలోచన!

అవరోధం తొలిగేదీ అడుగులు సాగేదీ
సందేహం తీరేదీ సందేశం ఇచ్చేదీ
వర్తమాన స్పృహతో భవిష్యత్తు దర్శనం
అంతరంగ దృష్టితో మానవీయం వీక్షణం!

## III. తెలుపూ ఎరుపూ నుండి

పూలతో పండ్లతో చూపుకు నిండుగా
      చైతన్యం పురి విప్పిన పచ్చని చెట్టు
చూచే మనిషి మనసు నలంకరిస్తుంది
      జీవన సుందరతకు పునర్భవ మిస్తుంది.

ఏ కవీ బ్రతుకులో ఎప్పటికీ అనుక్షణం
      ప్రేలుతూనో మండుతూనో గడప లేడు.
తా నున్న బాధలోనూ సమాజ భారాన్ని
      ఏ నిరాశకో తగిలించి సాగ లేడు.

అనల రాగం వినిపించే బాణం వెనకనే
      మేఘ రాగం స్వనించే సాయక మవసరం
వేదనలో హృదయం అమృత స్పర్శ కోరుతుంది
      రహస్య చిత్రంతో బాష్ప కణం జారుతుంది

ఎవరు కోరినా కోరకపోయినా
      కాలం సంధించే జటిలమైన ప్రశ్నలకు
ఆర్ద్రమయిన మానవీయ సమాధానం కవిత్వం
      ఎవరి నిర్వచనం వారికి అస్తితలో ప్రమాణం

ఒర నుండి బయట పడుతుంది
      తెలుపు నుండి ఎరుపులోకి, పూర్వ సంధ్య
ఒర లోకి వెళ్ళి పోతుంది
      ఎరుపు నుండి నలుపులోకి, సాయం సంధ్య

ఖడ్గం కన్నీరు కార్చదు
      హృదయం కన్నీరు మరవదు.

# 2. తప్పని పరిమితులూ హద్దులూ

సృజన సమయం కవి హృదయం గాజు కేస్‌లో
విశాల భావ క్షేత్రంలో ఉన్నత మతి శిఖరంతో
దీని చుట్టూ తిరిగి వెళ్ళే వారూ
చూచీ చూడనట్లు పట్టనట్లు కదలే వారూ.

బయటి నుండి లోనికీ, లోనుండి బయటికీ
కనిపించే దృశ్య జగంలో ఒకటొకటీ
రాజనీతి కోణంలో ఒక సంస్థితిలో
వాస్తవాన్ని వదలనివీ మట్టిని నమ్మినవీ.

కళాభావ రూపంతో నవ నిర్మాణంలో
అతీతాన్ని వదలనివీ ఆంతర గుణ రుచితో
భౌతికమూ మానసమూ స్థాయిల్లో ఒకరొకరూ
అతీతమూ దార్శనికం స్థాయిల్లో ఒకరొకరూ

కురిసే వాద వివాదాల వానలకు
ఏ గొడుగూ ఏ రెయిన్ కోట్ అవసరం లేదు
కాసే కోప తాప శిఖల ఎండలకు
ఏ నీడతో నిలయంతో పని లేదు.

వీచే చలితో కురిసే మంచుతో
అంతరాయ విరామ సమయాలసలే లేవు

తా వరించిన ఏకాంత గగనంలో
ఏకాగ్రతా శిఖరంపై ఉన్నా
ఎంతటి మనిషికీ తప్పవు
పరిమితులూ హద్దులు తనలో!

# 3. గాజు కేస్ నుండి

బయటి నుండి వెలుగు
గాజు కేస్‌ను తళతళ లాడిస్తూ
లోన చీకటి ప్రసక్తి లేదు
సృజన భావ ప్రకాశంతో

సృజన సమయం ముగియడంతో
గాజు కేస్ అదృశ్య మవుతుంది

గడచే కాలంతో నడచే జీవితం
లోక యాత్రలో ఇక సాధారణ యంత్రం!

గాజు కేస్‌లో గడచే వేళల్లో మనస్సు
ఆదర్శానికి దగ్గరగా, గాయాలకు దూరంగా

మంచి కల రావాలనీ నిలవాలనీ
చెడు కల మరపున బడి పోవాలనీ
రెండూ సాధ్యం కానివి ఆలోచనలో దిగీ
మరో కొత్త కలకు దారి తీయవచ్చు

గాజు కేస్‌లో గడచిన సమయంలో
సమాజ బంధం చెదరదు తొలగదు కవిలో
సమాజాని కిచ్చే సృజన భావ రూపం కన్నా
సమాజం నుండి పొందే సృజన శక్తి ఎంతో!

తనలో సృజన ప్రపంచం నుండి తొలగీ
గాయాల గుర్తుల సమాజంలో భాగమయి
ఆలోచన కదలుతుంది, సృజనేతరమయి
అనుభవం వెలుగుతుంది, లౌకిక ప్రభతో.

## 4. అవసరాన్ని మీరి

ఎవరి అవసరమెంతటి దయినా కానీ
నిరసన పాత్రలు ఎదురు కావచ్చు
ఉద్యమ ఝంఝ వీచవచ్చు
రణ సమాన రూపం తల ఎత్తవచ్చు.

ఊహకు అందని దయినా
సాహస గుణ చరణంతో
సూర్యునితో చేతులు కలపాలనుకోవడం
తీవ్రతీవ్రంలో బూది బొమ్మ అవడమే.

ఎంతటి పేరాశలోనూ
అధికారం ఆర్జన పదవీ కాంక్షతో
చంద్రునితో కలిసి కదలాలనుకోవడం
పగలు దాటి నిశి లోకి వెళ్ళాలిసిందే!

మునుముందుకు దూకుతూ పరుగెత్తే
మహా ప్రవాహంతో సాగాలనుకుంటే
ముంచేసే బీభత్సం చూడాలిసి వస్తుంది
కళ్ళ నుండి చిరు జలలు బయటికి వస్తాయి.

ఈ గాయా లెక్కడివీ? అనీ!
ప్రత్యక్ష రణ చర్యలవా?
పరోక్ష తంత్ర రూపాలా? అంటే
రెండూ చెరో వైపు నుండి తొంగి చూస్తాయి.

పగలు అయినా రాత్రి అయినా బాధ ఒకటే
ఆలోచన వేరు వేరు! ఎండలో చీకటిలో వెన్నెలలో

## 5. హృదయం అగ్నులు పంచదు

రోజు కొక తేదీ క్యాలెండర్ లో మౌనంగా
స్మృతుల చిత్ర సంకలనం వదలి వెళ్ళి పోతుంది

కోరికలూ యత్నాలూ గెలుపూ ఓటమి ఏదయినా
సృజన దర్శనం తనలో దయితేనే అస్తిత
ఈ రోజు దృశ్యంలో కనిపించని ముఖం
మరో రోజున అనుకోకుండా కనిపించ వచ్చు.

స్వేచ్ఛలో మొదలయిన ఆలోచన! స్వార్థంలో
పర పీడనతో ముగియడం మహా దారుణం.
ఈ రోజు స్వార్థంతో తొడిగిన కవచం
మరో రోజున మ్యూజియంలో చేరి పోవచ్చు

గాయ పడిన మనిషి కళ్ళ నుండి
జారే బాష్ప బిందువు లొకటొకటీ
అనల చిత్రాల్ని విడుదల చేయవచ్చు
ఆయుధంకై చేయి చాచవచ్చు.

ప్రతి పదం అర్థంలో నాణెంలా చెల్లుతుంది
కోరికపై అవసరమై విలువ పెరుగుతుంది

సమస్యకు పరిష్కారం చర్యల తోనే సాధ్యం
బాణంతో బాంబుతో తప్పదు నాశన పర్వం

తాపంతో సముద్రం తహతహ లాడుతుంది
కరుణతో జలదాన్ని అవని పైకి వదలుతుంది
హృదయం అగ్నులు పంచదు
వేదన ఏ రిమోట్‌కూ అందదు.

## 6. కాలం ఆగదు

మనిషి మనసు ఒక గుహ
గుహలో సింహం వసించవచ్చు
భిక్షువు చేరవచ్చు శిల్పం చూప వచ్చు.
కాలం ఆగదు బాధలు మానవు
బ్రతుకు బరువు ఎరగనీ బ్రతుకు బరువు మోయనీ
బ్రతుకు బరువు తెలియనీ ఎందరో, ఎప్పటికీ

రాలిన ఆకుల లిప్తలతో జీవన రూపం
పూచిన పూవుల లిప్తలతో జీవన దృశ్యం
స్మరణీయమో కమనీయమో చదరంగం గడుల్లా

నిశ్శబ్దం ఒక విశ్వ వాద్య విశేషమై
నిరంతరం మ్రోగుతుంది జీవన స్వర మేళనం
ఎవరు విన్నా! వినక పోయినా, కోరినా కోరక పోయినా
సమయ సమయం మారుతుంది వాద్య విశేషం
అన్ని రుచులు చూపుతుంది సమాజ నేపథ్యంలో

వీధిలో వస్తూ పోయే మనుషుల దృశ్యంతో అందం
సహ జీవన సుందరతకు గుర్తుగా, ఇంద్ర ధనుసులా!
గగనాన కదలే మేఘంలా ఆలోచన మతిలో
హృదయమెంత తపిస్తే అంత కంత ఘన రూపం!

తెలుపులో హ్లాదంలో మచ్చ! స్పష్టంగా శశి బింబంలా
ఎరుపులో తేజంలో మచ్చ! కనిపించదు! రవి బింబంలా
దేవతల్ని మరవడం! మనిషికి సులభం కాదు
మనుషుల్ని గుర్తించడం కష్టం కాకూడదు

## 7. విజేత

ఎగర లేని విహగం తన రెక్కలలో సమత తప్పి
అవని పైన వాలుతుంది, నింగిపైన నిందలతో
సృజన రుచులు తెలియని ఎద, మోడు ముఖం చూపుతుంది
అనుభవ నవ కిరణ రశ్మి లేని మనో గుహలతో

కెరటం ముందుకు సాగని ఎండిన నదిలో
ఎక్కడుంది? ప్రవహించే ధారా రూపం
దాహం కలిగిన వారిని ఎన్ను కోదు జలాశయం
తన ఒడిలో బ్రతికే వారిని ఎన్నుకోదు ధరా తలం

ఆకులు రాలే సమయం నవ వసంత మెక్కడిదీ?
కాలాని కతీత మయిన కవి నిజ స్వరం తప్ప!

పవనం తరలిస్తుందీ గగనంలో మొయిలును
కాలం నడిపిస్తుందీ దిశ దిశలో మనిషిని
నలుగురిలో మాటలు గాలికి ఆకుల గలగలలా
నలుగురితో చేతలు జలనిధి తరగల వడిలా

భయ మెరగవు రాతిరి చుక్కలు
చీకటిలో మెరసే వెలుగుల దివ్వెలు
అల అలపై తేలీ తీరం చేరీ నావపై
క్షణాలలో అంతా మరపున బడి పోతుంది

మనిషి చేతిలో ఒక ఆయుధమై, దైవం
సమయానికి అవసరం ఫలించీ! విజేత మానవుడే

గడియారం లయతో శబ్దిస్తుంది హృదయం
స్వరమయమై ధునియై ప్రవహిస్తుంది కాలం

## 8. జీవితానికి రూపం

మూసిన గ్రంథం లాంటిది మనిషికి మౌనం
దీన్ని తెరచి చూచే బాధ్యత మరొకరిది

ఒక పీఠం తరువాత మరొకటి భ్రమణంలో
దీని కయి నిరీక్షణలో జీవితమంతా
నిజ రూపానికి తొడిగిన దుస్తులతో చరిత్ర
ఇది తెలిసేందుకు పరంపరగా ప్రయత్నం!

వాడి అయిన మతి! ప్రతిదీ ముక్కలు చేస్తుంది
మెత్తనయిన హృది! ప్రతిదీ కలిపే దవుతుంది
రూపానికి ముందుగా కనిపిస్తుంది నీడ
దీని పైన ఊహలతో కల్పనతో జీవితం!

గిరి శిఖరం తుపానుకు సమాధాన మిస్తుంది
గిరి చుట్టూ తిరిగి గాలి కదలి పోతుంది
మిల మిల లాడే కిరణాలతో శిశుమయ దృశ్యం
మనసును విసరేస్తుంది బాల్యం లోకి.

అద్దంలో ముఖాని కెదురుగా ప్రతిబింబం
ఇది సమయం కాదని, అసలు ముఖం తొలగుతుంది

నిన్న నిండిన తటాకంతో అతిశయించిన గర్వం
నేడు ఎండిన ఆశయంతో క్రుంగ దీసే దైన్యం
రేపు వచ్చే మంచి ఘడియల వాస్తవంపై ధైర్యం
నిన్న నేడూ రేపు కలిసీ చలన జీవన రూపం

## 9. ఈనాటి అవసరం

ఉగాది వచ్చే సరికి
మనసులో ఆలోచన కలశంలో గంగలా
ఊహలో ఆదర్శం అద్దంలో దిన మణిలా

పండుగ వెళ్ళి పోతుంది
కలశం కలశమే! తన పరిమితిలో
అద్దం అద్దమే! ముఖ బింబంతో

మెలకువలో జీవితమొక చైతన్య ప్రవాహం
వీలు వెంట వాలు దారి నవలంబిస్తుంది
దారిలో బండలకూ ఎత్తులకూ భయపడదు
లక్ష్యం వైపు పోతుంది మెలికలు తిరుగుతూ

దూరాన తళతళలాడే మృగ తృష్ణను
గుర్తించే వివేక నయన మవసరం
హృదయ శాఖపై ప్లాస్టిక్ చిలుకను
పసికట్టే వాసంత చిత్త మవసరం

అవసరానికి ఏ బుజంతోనూ పనిలేదు
చెదరని ఆత్మ బలం! ఒక్కటి చాలు
పలు శ్రేణుల్లో దేవతలకు కొదవ లేదు
మ్యూజికల్ చెయిర్ ఆటలో భ్రమణ పంక్తిలో

ఈ రోజు మనఃఫలకంపై
వీరుని చేతిలో ఖడ్గమో! బాణమో!
క్షణాల్ని 'శాంతి' అక్షరాలతో దిద్దుతూంది
ఈనాటి అవసరాన్ని గుర్తుకు తెస్తూంది.

## 10. కాలానికి సన్మానం

ఈ ఉదయం మొదటి కిరణం
క్రిందికి దిగి మెత్తని చేతులతో
కాలం ముఖాన కన్నీరు తడుస్తూంది
రాగంతో కవితా పరాగం అద్దుతూంది.

గుహ నుండి మైదానానికి చేరిన సంతోషం
వెనక నుండి స్వేచ్ఛను ముందుకు నడిపిస్తూంది

ఖడ్గానికి పూల దండను హత్తుకొనీ
బ్యాగ్‌లో బాంబు విషయం మరచీ
నిర్వైర సుందరంగా ఈరోజు యానంలో
మనిషిలో స్నేహ వల్లి మెరపు తీగెలా

రాత్రి పహరా చేతిలో దాట రాని ఖడ్గం
ఈ ఉగాది రోజున స్నేహ సేతువవుతూంది
రేపటి నుండీ నిరంతరం శాంతి చక్రం
ఎక్కడా ఆగకుండా తిరుగుతూ ఉండాలనీ

భౌతికమో! మానసికమో! అదను చూచి దరిద్రం
తలపై  కెక్కాలనీ శాసించాలనీ చూస్తూంది

ఈ ఏడు మొదటి రోజు
కాలం నుదుటి పై తిలకంలా
మలినం లేని మచ్చ ఎరగని
సృజన యశోరూపంతో కవిత!

కాలానికి సన్మానం! ఈ ఉగాది
కోరే మార్పుకు తొలి సోపానం!

# 11. మార్పులో అనివార్యం

తరం నుండి తరానికి మార్పులో అనివార్యం నవ్య దృష్టి
సమాజ శక్తులతో ప్రవాహ శీల గమనంలో
ఏ కవీ పాఠకుణ్ణి అర్థం కాని అడవిలో వదలాలనుకోడు
దారి తప్పి బాధలలో నిలవాలనీ కోరడు.

కవిత అవతరిస్తుంది మేఘంలా మనసులో భూమికతో
కనిపించే జలదాలన్నీ వర్షించవు, ఎవరో కోరే చోటికి రాలేవు
దూరం నుండి నక్షత్రంలా, దగ్గరలో పుష్పంలా
దారిన వెళ్ళే ప్రతి ముఖంలో, ఏదో ఒక ఆకర్షణ

ప్రతి వ్యక్తిలో ఆకర్షణతో పాటు వికర్షణమూ పక్కనే
ప్రతి మనిషిలో వేరు వేరు సంస్కార ప్రవర్తనం
ప్రకృతీ సమాజం రెండిటికీ మధ్య మనిషి
తలపై చీకటితో, ఎదలో గిరి బరువుతో

భయంలేని సమాజంకై బాధలేని బ్రతుకుకై
ఎన్ని విధాల యత్నాలో! అన్ని దారులు ఎదురుగా
మానవత కన్న మిన్న లేదు! ఒకే ఒక శూన్యం తప్ప!
శూన్యానికి కల్పనలో తమ కిష్టమయిన రూపం ఇవ్వొచ్చు!

ఒకసారి మొదలయిన విభేదం! ఆగదు!
ఘర్షణలో ఏది ఎన్ని ముక్కలయినా, కానీ!
అయినా పరవా లేదు! అన్నట్లుగా
ప్రతి ముక్కలో తన ముఖం కనిపించాలనీ మనిషిలో

కూడలిలో నిలిచీ నాలుగు దారులపై ఆలోచన!
తరం నుండి తరానికి కూడలి మారుతుంది, దారులు మారుతాయి
పసి పాప వెన్నెల ముఖం! సంధ్యా వర్ణ చిత్రమవుతుంది.

## 12. మరపించే అమృతం కన్నా

మనిషి ఆవాసం మొదలయి, అడవి దూర దూరం జరుగుతుంది
ప్రకృతిలో లేదు రహస్యం! అంతా బట్టబయలే
జలపాతం! తుపాను! అగ్ని పర్వతం! లోయలు! మైదానం!
మనిషి బ్రతుకులో బయట పడని రహస్యా లెన్నో!

శిశిరానికీ వసంతానికీ మధ్య ఘర్షణ! రేఖపై
గ్రీష్మానికీ వర్ష ఋతువుకు, మధ్య ఘర్షణ హద్దులో
గెలుపుకూ ఓటమికీ మధ్య ఘర్షణ అంచులో
మేలు జరిగితే మోదం! జరగక పోతే ఖేదం!

కన్నీటి బిందువులో రెండింటికీ ఉంది చోటు
దుఃఖానికీ సంతోషానికీ, చెరి ఒక వైపు నుండి
ఒక వైపు నుండి మరో వైపుకు ఆడబడే
బంతిలా! మనిషి జీవితంలో ఒక్కొక్క సమస్య.

ముఖాల్ని చూస్తూ, చేష్టల్ని గమనిస్తూ పోవలసిందే
హృదయం తెలుసుకొనే అవకాశం ఎక్కడుంది?
వేల ప్రశంసల కన్నా, ఒక హిత విమర్శ చాలు!
కిరణంలా దూరి, చూడని కోణం చూపిస్తుంది.

మట్టి కల నిజమవుతుంది! వాన చినుకుతో
మనిషి కల నిజ మవుతుంది! వెలుగు మనసుతో.
వెలుగు అడుగు పడే కొద్దీ, పురోగమనంలో
చీకటి! వెనక్కి వెనక్కి జరిగి, జారి పోతుంది

దుఃఖంలో వేదనలో మరపించే అమృతం కన్నా
చేయి అందుకొని సాగే మానవతా స్పర్శ గొప్ప
నేను నడచే దారి, అందరికీ పరిచయమే
నేను పలికే మాట, అందరికీ అవసరమే.

## 13. మనిషి మనిషిగా, మనసు మనసుగా

అకాల వర్షాన్ని ఎవరూ కోరరు
అయినా వస్తుంది మధ్యంతరం ఎన్నికల్లా
ఊహించని కష్టాలకు నష్టాలకు గురిచేస్తూ
అసమయ బాష్పాల్ని ఎవరూ రాల్చరు
అయినా వస్తాయి అనుకోని పరిస్థితిలో
ఊహించని స్పందనతో, ప్రతి చర్యకు గురిచేస్తూ

బాష్పలవం చివర! చీకటి పేలిక! వేలాడుతూంది
హృదిలో అనల కణంపై బూది పొరను తలపిస్తూంది
దీని వెనకున్న చరిత్ర! పరి గుప్తంగా
తెరచిన ఎద కంటికి మాత్రం కనిపిస్తుంది.

రిమోట్‌తో ఆడే పాడే మాట్లాడే
రోబోట్ లెన్నో! మనుషుల్ని మరపిస్తాయి!
తానూ ఒక బొమ్మగా మారే మనిషిలో
మరచిన తన రూపం! తలపుకు రాదు.

జ్ఞాపకాలు చుక్కల్లా ఎప్పటికీ పైపైనే
అవనికి దిగి రావడ మంటూ ఉండదు
వాటితో అవసర మనుకుంటే ఎపుడయినా
కల్పనలో రెక్కలపై పైపైకి ఎగరాలిసిందే

తత్కాలంలో అధికారం వశమయ్యేందుకు
వర్తమాన రాజకీయ సంచలన విపరీతాల్లో
మనిషి మనిషిగా కనిపిస్తే చాలు! వెలుగుతూ
మనసు మనసుగా సరిస్తే చాలు! తేటగా

# 14. పురస్కారంలో తిరస్కారంలో

దాహం తీర్చే ఝరిణి కెవరి శిక్షణతో పని లేదు
ప్రాణం నిలిపే గాలి కెవరి అనుమతితో పనిలేదు

ఏ దిశ అయినా ఒకటే గగనానికి
ఏ దారి అయినా ఒకటే భూమికి
శిల కే దేవత శిల్ప మయినా ఒకటే
మనిషికి మాత్రం! దేని కది ప్రత్యేకం.

తన చిరునామా నిర్ణయ మెవరిది వారిదే
తన ప్రతి చిహ్నం, సిగ్నేచర్ దేని కదే ఏకైకం!
శిశువు పెదవి మట్టి కణం తాకడంతో
జీవన రుచి మొదలవుతుంది! తెలియకుండా

పుట్టగానే పండు కోసం పై కెగసిన హనుమలా
చేతి కందబోయే వస్తువు రుచి చూడాలనీ
వివేక ముదయించీ కోరిక తీవ్రత అణగీ
మానవ రూపానికి సంస్కార మబ్బుతుంది

నేలపై గులాబి పాదాలతో
అడుగు పెట్టిన శిశువు
పెరిగి పెద్ద అయ్యే కొద్దీ కంటకాలతో
వర్గం వర్ణం మతం ప్రాంతం మొనలు పైకి తేలుతాయి.

ప్రజాస్వామ్య శక్తి ముందు సమాజంలో
ఎంతటి ఘను డయినా తలవంచక తప్పదు
మెడలో పూల మాల పడవచ్చు, పురస్కారంలో
మెడపై కత్తి వేటు పడవచ్చు, తిరస్కారంలో

## 15. సంక్షోభం నుండి

ఎప్పటి కయినా తప్పని మృత్యువు రాకను
పోస్ట్‌పోన్ చేయిస్తూ విజ్ఞాన శాస్త్ర బలంతో
దుస్తర కష్టాల్ని దాటి గట్టెక్కే ప్రయత్నం
ఒక్క మనిషికి మాత్రమే సాధ్యం ప్రాణుల్లో

దివిలో లభించే స్వర్ణ కిరీటం కన్నా
భువిలో పొందే పుష్ప గుచ్ఛం గొప్ప!
ఈ భూమి ఎవరినీ ఆహ్వానించదు
ఆ వచ్చే వారి నెవరినీ తిరస్కరించదు

తోటలో గులాబి పుష్పాల్ని వదలి
ముళ్ళపై దృష్టి పడుతుంది! నిశిత విమర్శలో
తనపై విసర బడే బాణానికి ముందుగా
రక్షణ కవచాన్ని సిద్ధం చేస్తుంది తంత్రం!

భయంతో విజయంలో సగం శ్రేణి కోల్పోయినట్లే
ధైర్యంతో ఓటమిలో సగం పంక్తి గెలిచినట్లే
గెలవరాని సమస్య అంటూ లేదు, ఉండదు
చెదరిన లక్ష్యం, దారి తప్పి జటిల మవుతుంది

అవమానాల్ని సహించడం అలవాటు కాకూడదు
పరాజయాన్ని పొందడం సాధారణం కాకూడదు
సంకల్పం ఎన్ని పనుల నయినా చేయిస్తుంది
లోతును కొలవాలనీ, ఎత్తుకు చేరాలనీ

ఒక సాహస లిప్తలపై అడుగులు వేస్తూ పోవడం
ఒక మనిషికే చెల్లుతుంది విజయోత్సాహంలో
సంక్షోభ స్థితి నుండి కొత్త విలువలతో
కొత్త రూప మవతరిస్తుంది సమాజంలో

## 16. స్వేచ్ఛా హృదయంకై

హృదయం తప్ప మరొకటి కనిపించని స్వేచ్ఛా రూపం
అపుడపుడూ పావురంలా ఎగసి వచ్చి వాలుతుంది
క్షణాలలో మనిషి నుండి బయటికి నిష్క్రమిస్తుంది
ఇదొక సహజ మయిన సుందర సందర్భ సన్నివేశం.

మెరపుల్నీ పిడుగుల్నీ జలాల్నీ దాచుకొనీ కదలే
మేఘాల్లా జీవితంలో కొన్ని కొన్ని ఘటనలు!
ఎపుడేది మెరసేదీ ఉరిమేదీ కురిసేదీ! తెలియదు
ఇది తెలిసేందుకు మనిషి చేసే పరిశోధనలెన్నో!

కళ్ళలో దాగిన కాంతిని మేల్కొల్పుతుంది మెరపు
గుండెలో పాదు కట్టిన భయాన్ని పెకలిస్తుంది పిడుగు
అనుభూతిలో కరువయిన ఆర్ద్రతను కదలిస్తుంది జలం!
ఈ మూడింటి త్రయీకరణ సశేషం కవిత్వం.

మాట్లాడే ముఖం వెనక రహస్యం మిగిలీ
దీనికయి సాగే అన్వేషణలెన్నో! వివిధ పథాలలో
నేలపై చీలిన మహానది పాయల్లా ఆలోచన!
నిటారుగా నిలిచిన పావురాళ్ళ స్తంభంలా శరీరం!

మేఘం వెళ్ళి పోతుంది తన దారిన, ఆగదు
మెరసీ ఉరిమీ కురిసీ బరువును దించుకొనీ
మనిషి కదలిపోయేను మరణం లేని స్వేచ్ఛతో
కనిపించీ కనిపించని బరువుల్ని ఎత్తుకొనీ

హృదయం తప్ప మరొకటి కోరని స్వేచ్ఛా రూపం
అతిథిగా వస్తుంది! అమృత ముద్ర వదలి పోతుంది!

# 17. ముఖాన వెలుగుతో

ముఖంలో వెలుగును దాచే అవసరం లేదు
    ముఖాన చీకటితో బయటికి రావడం అసహజం
ఇది ముసుగు కావచ్చు, చిన్ని తెర కావచ్చు
    జీవ కళను కప్పేసి చీకటిలోకి జారడం అనుచితం.

కఠిన బంధనం నుండి బయట పడే పోరాటం
    ఏ ముసుగు లేని తెరలేని స్వేచ్ఛకు ఆహ్వానం
చీకటికి నిప్పు పెట్టే గీసిన అగ్గి పుల్లకు బదులు
    వెలుగును చూపుతూ, నడచే దీప శిఖ మేలు!

ఇది తన వరకే పరిమిత మనుకోవడం
    ఇతరులు తన అనుమతిపై నడవాలనుకోవడం
రెండూ నిరంకుశంగా సమాజాన్ని నడిపాయి
    జీవితాల్ని సుడిగుండంలో పడవల్ని చేసాయి

మూసిన కిటికీ తలుపుల సందుల్లో నుండి
    కిరణం బయటికి రావాలని చూస్తుంది, ఎపుడూ
ఉద్యమ కాంతి ఖడ్గ యశో తోరణాలు
    వ్యక్తిలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి గుర్తులు
గురిలో ప్రేలే ఆయుధాని కన్నా
    విడుదలైన బులెట్ కే లక్ష్యం బాగా తెలుస్తుంది

జీవితం మొదలు! మొదటి ఏడుపుతోనే
    ఇది చివర వరకూ సాగాలని ఎవరూ కోరరు
జన విలోల సమాజం, శ్రమ వికాస నిలయం
    కోరుతుంది! కాలాన్ని నడిపే ప్రజాస్వామ్యం!

## 18. అంతకంత విలువ

మేల్కొన్న మనిషి, ఉదయమయ్యే సరికి
    సమాజం లోకి సమస్యల తంత్రం లోకి

మస్తిష్క గగనంలో ఎగిరే హంసతో
    వెన్నెముకలో ఎగసే కుండలినితో
స్వేచ్ఛలో విప్పారిన ధైర్యంతో అడుగు! ముందుకే
    ఉదయ మింత శక్తి నిస్తుందని అనుకోని విశేషం

మనిషిలో దివ్యమయిన స్వచ్ఛమయిన మనో నిలయం
    జీవితంలో మానవేతర మయి సుదూరమవుతూంది
కాలాని కెవరూ దగ్గర కాదు!  దూరం కాదు
    మనిషిలో అవసరాలు ఆశలు, దూరం దగ్గర చేస్తాయి

కంటి ముందు ఈ భూమి! ఎప్పటిదో పాతది
    మొక్కతో పూలతో ఫలాలతో అభినవాన్ని పొందుతూంది
ప్రాణమున్న మనుషులు మనిషికి బరువులవుతూ
    ప్రాణం లేని నీడలు! మనసు నలంకరిస్తున్నాయి

రాజనీతిలో నీతి జారిపోయి అధికారం మిగిలి
    ప్రజాస్వామ్య సమాధి పై పూలజల్లు పడుతూంది.
శిథిల దృశ్యం లోనూ వినగలిగిన వారికి
    జీవన సంగీతం వినిపిస్తుంది సనసన్నగా

చరిత్రలో మానవ శక్తిని జ్ఞాపకం చేస్తుంది
    ఆగని కాలాన్ని ఒక క్షణం పాటు నిలుపుతుంది.
ఎంత పాత బడితే చరిత్ర! అంత కంత విలువ
    విషయ మెంత రహస్యమైతే! అంత కంత కీర్తి.

## 19. కన్నీరు అందంగా

కనక రత్న భూషణాలతో సంస్కృతిలో
మట్టి పాత్రలూ వస్తువులూ పనిముట్లూ ప్రదర్శనలో
ఒంటరిగా నిదురలో కలల కన్నా
మెలకువలో వాస్తవమెంతో అందమయింది
మనిషినీ మనిషినీ దగ్గర చేస్తుంది
బ్రతుక్కి సార్థక రూపాన్ని ఇస్తుంది

కాలం లాక్కొని పోతుంది తన వెంట
మనిషినీ మనిషితో పాటు సమాజాన్నీ!
కల్పనలో నుండి వాస్తవానికి మరలిస్తూ
భేదాల్ని గుర్తిస్తూ, వాదాల్ని మన్నిస్తూ

మెతుకు లేక, మాట రాక, రాలే ప్రాణాలూ
దారి లేక, తోడు లేక, తప్పే బ్రతుకులూ
చుట్టూ ఎన్నో! పొలం! పంట! తోట! సమాజం
ఏదీ తనది కాదన్నట్లు ! ఫలితం చేతికి అందదు

వెలుగు నిచ్చే విద్యుత్తు జీవితంలో
షార్ట్ సర్క్యూట్‌తో చీకటి అవుతుంది
పొగలతో సెగలతో మంటలతో
మృత్యువు బొమ్మలాట! లాడిస్తుంది.

దీని ప్రభావ మెవరిపైన? అంటే
ఏ దైవ ప్రసక్తి ఎరగని సమాజంపై
మనిషి బాధ చూస్తూ కళ్ళు ఉండీ చూడలేని మనీషులు
ముఖానికి అందంగా స్టేజిపై నటనలో జారే కన్నీరుతో!

## 20. అనుకోని విధంలో

రాజకీయ సంస్థితిలో అభిప్రాయ భేదం
ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తి కున్న హక్కు
దొరికిన అవకాశంలోకి ఆవేశం దిగుతుంది
పరచిన ఆశలలో చుక్కలు మిలమిలలాడతాయి.

బుసలు కొట్టే ఉద్రేకంతో
అదుపు తప్పే ఉద్వేగంతో
సంక్షోభం సుడులలో చిక్కే అమాయకులు
ముళ్ళ నుండి బయటికి రాలేని గులాబీలు

సమస్య ఎంత విస్ఫోటక స్థాయి చేరినా
సమయ మెంత అగ్ని శిఖరమయినా
జ్వాలల్లో ఆహుతి కావడం దారుణం
కళ్ళ ముందు బలి అవడం అమానుషం.

ఆటంకం అవరోధం నిరాకరణ విరోధాలతో
రావలసిన బింబం ఫలించని ఉదయం!
ఎక్కడో సన్నని దారంలా దొరికిన వెలుగులో
దారికి అడ్డుగా అనుకోని టెంకాయ కొండలు!

సంతోషం సంతృప్తి విజయం భాగ్యం
దగ్గరలో అంద బోయేవిగా నిలిచీ
కురవని మబ్బుల్లా దూరం జరిగి పోతాయి
నిజం బయట పడేదీ స్వేచ్ఛలో వెలుగులోనే!

అనుకోని విధంలో సమయం వేడెక్కి
నిప్పు రవ్వల పందిరియై ఎదురు కావచ్చు.

## 21. రాజకీయ పరీక్షలో

అగ్ని పరీక్షలో రాజకీయ గ్రీష్మతాపం!
రెక్కలు ముడిచిన పక్షిలా కదలని వాతావరణం
అపుడపుడూ తాప హరణ జలద శకలం! హాండ్ కర్చీఫ్‌లా
ఏ పిపాసను తీర్చగలదు? ఏ బడలిక మాపగలదు?

మార్పులో నిశిత శీత పవన లహరి
శరీరాన్ని తాకుతుంది, కొత్త బ్లేడ్‌లా
ఇంద్ర జాల రీతులతో! నట సమాజ బృందం
చిటికెలపై శిశిరాన్ని వసంత ముఖంతో తీర్చాలనీ

హరిణంలా బయట పడిన వసంతం
గంతులేస్తూ పొదల మధ్య అదృశ్యమవుతుంది
ఒక దాని లోకి మరొకటి! ప్రవేశిస్తూ
ఏ రుతువునూ పూర్తిగా నమ్మేట్లు లేదు.

ఒక పార్టీ నుండి మరో పార్టీలోకి
డ్రెస్ మార్చినంత సులభంగా! రోజొక రాజకీయం
సముద్రం స్వప్నిస్తుంది! రసమయ హృదయంతో
పచ్చని సమాజం కయి జలదాన్ని వదలుతుంది

మౌనం వీడుతుంది భూమితో మాట్లాడుతుంది
నేలపై, నీడ తివాచీ పరుస్తూ పోతుంది
జలాంజలితో జలదం కదలుతుంది ప్రాణ దాన ప్రతీకగా
చినుకులతో సిగ్నేచర్ చేసి మాయమవుతుంది

ఎంతటి ఘన మయిందయినా
అంత ఎత్తునుండి! గుడ్‌బై చెప్పక తప్పదు
డ్రిల్‌లో యువ సమూహం అమాయక వాలకంతో,
చేరే తీరం తెలియని జలధిలో అలల్లా.

## 22. సృజన సమాజం

ప్రతి లిప్త! సృజన హృదయ బంధువు కాదు
ఒక సమయంలో యంత్ర సమమూ అవుతుంది
బయటి స్వార్థ రూపానికీ, లోన అంతరంగానికీ మధ్య
నిజాన్ని కనబడనీకుండా గోడలు! మూసిన తలుపులు!

తరిగిన విలువలతో దారి తప్పిన సమాజం
పునాది చెదరితే నిర్మాణం ఒరిగిపోతుంది

ఒక సమయంలో జీవితం! జైలును తలపిస్తుంది
బాష్ప కణం బయటికి రావడానికి సిగ్గుపడుతుంది
శూన్యాన్ని భరించడం కష్టమై ఒంటరిగా నిశ్శబ్దంలో
ఎవరయినా ఒక మనిషి స్వరం వినాలనిపిస్తుంది.

ఒక పిలుపు! మాట! అరుపు! హెచ్చరిక!
నిశ్శబ్దాన్ని పరుగెత్తిస్తూ శూన్యాన్ని నింపుతాయి
జైలులో ఉండదగిన వారూ, ఎందరో
స్వేచ్ఛగా బయట తిరిగే మాట కూడా వాస్తవం.

త్యాగంతో కర్తవ్యం బోధించే సనాతనం
త్రిశరణాలతో విధిని మరపించే మహాబోధి
సగం నగ్న శరీరంతో భాగ్య చిహ్నం! మహాత్ముడు
చూపుడు వేలుతో పోవలసిన దిశ చూపే దార్శనికుడు
నాలుగు వైపుల నుండీ విలువల ఆరోహణలో
సృజన భావ సమాజం!! మనిషి కేంద్ర బిందువుగా

ఎవరు బ్రతుకుతారు వేయి ఏండ్లు!
కొన్ని పదులు చాలు! జారిపోని విలువలతో!

## 23. నేను వస్తాను

పూవునూ పండునూ పైరునూ పంటనూ మాడ్చేసే
గ్రీష్మమయం తాపభరం మండుటెండలో
క్షేత్రం పయి కదలే! వినీల జలదంలా
చుట్టూ సంతోషం మొలకెత్తిన ముఖాలతో
నేలపై నడచీ నేను వస్తాను
నాకయి ఎవరూ ఎదురు చూడ నవసరం లేదు

పైకి రాలేని జలాలకు ఉత్ప్రసరణ ప్రేరణగా
మౌన గిరి శిఖరం నుండి ప్రవాహ గమనంతో
వసుంధరా ఫాలంపై పచ్చని పైరు చాలులా
ఆకు రాలిన తరుణంలో స్మిత వసంత శోభతో

ఉదయ సూర్య రశ్మిలో స్వర్ణ హృదయ భావనతో
రాగంతో ఎరుపెక్కిన తూర్పు ముఖాన కళతో
చంద్ర బింబ కాంతిలో స్నేహ మయ కరాలతో
పగలూ నిశకూ అతీత మనోజగంతో నేను వస్తాను!

వర్తమాన సంచలన రాజకీయ దౌర్భాగ్యంలో
భవిష్యత్తు భాగ్యానికి దగ్గర అయ్యే గతితో
ఆర్ద్ర కాల సూచి ఇంద్ర ధనుసు ఊహ నలంకరిస్తూ
పద పదం జన విజయం మతికి పదును పెడుతూ

ఉదార చరితను స్పందించే జీవన రుచి కామనతో
అణచ బడిన గళ ధ్వనికి ఉద్గమన ద్వారమయి
నేను వస్తాను ప్రజాస్వామ్య హృదయంతో
నాకయి ఎవరూ ఎదురు చూడ నవసరం లేదు.

## 24. నాకయి ఎదురు చూడనవసరం లేదు

కన్నీళ్ళూ కలలూ భయమూ ఓటమిలో
బరువు బరువుగా కదలే వర్తమానంలో
రాత్రి వీథి స్తంభాన్ని ఆనుకొనీ ఒరిగీ
వాలిన దేహాన్ని చూచే కోరిక రేగీ
చీకటిలో దారిచూపే ఫోకస్ చూపుతో
నేను వస్తాను! నాకయి ఎదురుచూడ నవసరం లేదు

ఇక్కడ ఎవరూ కదల లేని మూర్తులు లేరు
గాలి కెగిరి పోయే  బూది బొమ్మలు కారు

బయటికి ఒక బ్యాగ్ లోపల ఒక బ్యాగ్
అవసరాలకు వేరు వేరు, లక్ష్యంలో ఒకటిగా
దేనికయినా సిద్ధమయ్యే సంకల్ప వరణంతో
విధ్వంస వినిర్మాణ తంత్రంలో జీవితాలు!

మనిషి బాష్ప బిందువులో విద్యుదున్మేషం
బల్బును వెలిగించే ఆశ చూపుతుంది
యంత్రాన్ని నడిపించే ఉత్సాహం నిలుపుతుంది
గుండెను నిలిపేసే షాక్‌కూ గురి చేయొచ్చు.

మొదటి ఉదయ కిరణంలో చేతనతో
పురి విప్పిన సంకల్పం మనిషి మనిషిలో
నిరాశకూ నిస్పృహకూ తలుపులు మూసేస్తూ
విశ్వంభరపై సమాజ దృశ్యం ఆత్మీయంగా

నేను వస్తాను, ప్రజాస్వామ్య చేతనతో నడచీ
నాకయి ఎవరూ ఎదురుచూడ నవసరం లేదు.

# 25. మారే దృశ్యం నుండి

అన్వేషణలో సమాజ చరిత్ర పరిశోధనలో
స్థలం నుండి స్థలానికి ఆట బంతిలా
దిశ నుండి దిశకు వెలుగు బల్బులా
ఊళ్ళూ నగరాలూ ఆవాసాలు దాటుతూ
కర్తవ్యం మరచిన మనిషికి జ్ఞాపికగా
ఆర్తి హరణ కరుణ హృదయ స్పందనలో
మనసుకు హత్తిన అనుభవ దృశ్యం
ఎప్పటికీ మాయదు, తరగదు, తొలగదు.

ఏదో ఒక ఆదర్శం తమలో ఏర్పడింది
ఎవరికి వారు కత్తిరించి తమ కనుగుణంగా
ప్రదర్శనలో టేబిల్‌పై అమర్చిన బొమ్మల్లా
ఒకటొకటీ అవసరాలకు వదలబడతాయి.
రాత్రి చీకటి పెట్టెలో పదిలంగా ఒంటరిగా
పగలు వెలుగు వేదికపై అందరిలో

ఏ గ్రాఫ్‌కూ అందని ఆరోహణ అవరోహణలో
మనిషి ప్రక్కనే మనిషి! భిన్న మనో జగంతో
చుట్టూ పనిచేసే సమాజ శక్తుల చలనంలో
ఎప్పటి కపుడు మారుతుంది దృశ్యం! ఒకటొకటీ.

ధ్వంసమయిన సౌధ శిఖరాల ప్రక్కనే
తిరిగే కంకాళాలూ ఎదురవుతాయి
అందరూ నడచే భూమి తలం ఒకటే
అనుభవ సూక్ష్మాలు వేరు, మనుషుల గమ్యాలు వేరు.

# 26. అన్వేషణలో

శిథిలాల్లో శిల్పాల్లో అన్వేషణ మౌనంగా
తెలియంది ఒకటి తెలిస్తే, వజ్రం దొరికినంత సంతోషం

గగనంలో కదలే వినీల జలదానికి
పయనంలో విరామ శైల శిఖరంలా
మౌనం ఒక వరం, విశేష సందర్భాల్లో
అవసరానికి మనిషిలో, శాంత సుందరంగా

జీవన యంత్రానికి వాజ్నియతికి సాధనం
ఊహకూ ఊహకూ మధ్య ప్రేరణ చిహ్నం
నిరంతర వ్యవహార చలనంలో విరామ వాటిక
మనిషిలో శక్తికి రహస్య భావ పేటిక!

దీక్షలో మౌనం భగ్నమయితే, లోపిస్తే
సౌధానికి ఆధారం పునాది కదలినట్లే
అర్థాని కవసరమయిన శబ్ద రూపం తొలగినట్లే
భూమిలో తరు మూలం ఛిన్నమయినట్లే.

ఊహకూ క్రియకూ మాటకూ ఉత్సేక బలం
అలంకార మయం కన్నా శక్తి నిచ్చే క్యాప్సెల్.
బయటి మనిషి గురించి చింతన సాగుతూనే
లోపలి మనీషిని మరచి పోనీయదు! మౌనం.

మౌనంలో బింబిస్తుంది నిశ్శబ్ద ప్రపంచం
చిత్రంలో శిల్పంలో అనుభవ భావనలా
శబ్దమయ మవుతుంది, అర్థంతో
జీవన గత మవుతుంది, సమాజ గతిలో.

# 27.అనుభవ దృష్టిలో

బాల్యంలో జవాబు దొరకని ప్రశ్నల్లా ఎదురై
పరిష్కారం కాని సమస్య లెన్నో! అనుభవంలో

సంతృప్తీ సంతోషంతో పాటు ఆవేదన! అశాంతి!
ఒకటి తరువాత మరొకటి వరసగా
కారణాలు రాసులు రాసులుగా విశ్లేషణలో
ఒక బరువు తొలగితే మరొకటి చేరుతుంది

నేల బారుగా సాగే సుకుమార సృజన వల్లికి
ఆరోహణకు వీలు లేదు, ఉన్నతి కవకాశం లేదు
లోతును కొలిచే అవసరమూ ఉండదు
ఉనికిలో ఒకే ఒక సజీవ స్పృహ తప్ప!

గిరి శిఖరంపై పతాకలా నిలిచిన
మనిషి చుట్టూ తిరిగి పోతుంది గాలి!
నేలపై నడచే మనిషి వెనకనే
కదలాలని చూస్తుంది! ధూళి పటం!

శైలం తన కఠినతకు బాధ పడదు
తన ఉన్నతికీ స్థిరతకూ గర్విస్తుంది
నది తన చంచలతకు దుఃఖ పడదు
తనలో ఆర్ద్రతకూ, వేగానికీ సంతోషిస్తుంది.

నదికి తెలియదు! తన పుట్టుక శిలా శిఖరమనీ
శిలల నుండి బయట పడీ భూమిపై ధైర్యంగా
కదలుతూ ఇరువైపుల అందంగా పచ్చని శాలువాలతో
సృజన దృశ్యం! అనుభవ దృష్టికే తెలుస్తుంది! బాగా.

## 28. మనిషిపై - మనిషిలో

జలధి నుండి పై కెగసిన మేఘం వెనక్కి వెళ్ళదు
తీర మెంత దూరమయినా అల ముందుకే సాగుతుంది
సుఖమో కష్టమో ఎలాంటి సందేహ స్థితిలోనూ
బ్రతకడాని కెవరి అనుమతితో పని లేదు.

జీవిత మే స్థాయిలోనూ ఏ రోజునా
ముందుగానే సెట్ చేసిన పత్రిక కాదు
ఎపుడో తీసి కూర్చిన ఫొటోల ఆల్బం కాదు
దేనికీ ప్రతిరూపం కాదు, అనుకరణం కాదు.

రాజకీయం లేని సమాజ చలనం లేదు
విపణి విధం లేని జీవన రూపం లేదు
నటనలో పాత్ర కాని మనిషి చర్య లేదు
సమాజ బంధం లేని, ఊహ లేదు మనసు లేదు.

సమాజ చలన వికాసాల్లో శక్తి వంతం ఆర్థికం
స్వేచ్ఛా వీధులలో భాగ్యం కయి నిత్యం భ్రమణం
వెలుగులో నీడలా మనిషిలో మాలిన్యం
గెలుపులోనూ ఓటమి ఒకవైపున కార్నర్‌లో

గడియారం ముందుకు కదలే ముళ్ళతో
కాలాన్ని వెనక్కి నెడుతుంది గతంలోకి
వర్తమాన క్షణాల్ని ముందుకు నడిపిస్తుంది
చాచిన చేతులతో భవిష్యత్తు నాహ్వానిస్తుంది

మనిషిపై మనిషికి విశ్వాసంతోపాటు
మనిషితో మనిషికి అపజయమూ తప్పదు.

## 29. జ్ఞాపక రూపం నుండి

జీవ సృష్టిలో సుందర నర శిశు రూపం
సమాజానికి కానుకగా బయటికి వస్తుంది
దశ దశలో పెరిగి పెద్దయి బింబంలా
తనకీ సమాజ మొక కానుకగా తలచేను

మారే సామాజిక సంబంధాలతో పోను పోను
దృష్టి కోణం మారుతూ పోతుంది జీవితంలో.

వద్దు అన్నా, సందేశాలు వినిపిస్తాయి
కాదు అన్నా ఉపదేశాలు ధ్వనిస్తాయి
చూడక పోయినా, ప్రవక్త లెదురవుతారు
నచ్చక పోయినా, అవతారాలు దిగివస్తాయి

ప్రతి ఉదయ మొక కొత్త పాఠంతో మొదలు
ఎవరి లక్ష్యాన్ని బట్టి వారు! ఎన్నుకొన్న దారులలో

సాహస చర్యలో అడుగు వెనక్కి పడవచ్చు
అడవి దారి బట్టి, కను మరుగై పోవచ్చు
దైవ శక్తి పేరుతో, పూజ లందుకోవచ్చు
దేశ భక్తి పేరుతో, సన్మానం పొందవచ్చు

హద్దు లేని అభిమానంతో, ఓటమి లోనూ
ప్రతిమలు వెలయవచ్చు, జ్ఞాపక రూపాలుగా
వీథిలో కూడలిలో ఎత్తులో వేదిపై విగ్రహం
వస్తూ పోయే వారిని పట్టించుకోనట్లు ఉన్నా
తన వైపు చూచే ప్రతి మనిషి మనసులో
అమృతవాణి వినిపిస్తుంది, హేతు పథం చూపిస్తుంది.

## 30. మాయని జ్ఞాపకాలు

గ్రీష్మ తాప చండతను సహిస్తూ
వర్షా జల సేచనకు పరవశిస్తూ
నిశిత శిశిర తీవ్రతను ఎదుర్కొంటూ
బుజాలపై మంచు శాలువా కదలుతూ
జీవన చలన రీతులకు సాక్షిగా
మనుషుల్లో గుణ కర్మలు తిలకిస్తూ
నాలుగు వీధుల మధ్యన విగ్రహం
వ్యక్తిలో దార్శనిక భావ చిహ్నం

ఉద్యమ మథనంలో వచ్చే అమృతం కయి
చాచిన చేతులకు శూన్య భాండ మెదురై
నిరాశకూ నిస్పృహకూ కారణ మేదయినా
చెదరిన విలువలతో దారి తప్పే అవకాశముంది

మొన్నటి వ్యక్తిలో చూచిన యాథార్థ్యం
నిన్నటి ప్రతిమలో నిలిచిన ఆదర్శం
నేటి మనిషిలో పొంగే విధ్వంస గుణం
ఆరోహణ నుండి అవరోహణ సంకేతం

కాలం పుటలో ఎన్ని చర్యలు చేరినా
ఎంతటి క్షమ లోనూ మనసుకు
తగిలిన గాయాల బాధా స్మృతులు
ఎప్పటికి మరపున బడి పోవు.

పెట్టెలో పాత నాణాల్లా జ్ఞాపకాలు
జీవన సంపదలో భాగమయి పోతాయి
ఉద్రేకంలో మాయమయిన విలువల్లో
తెలియని వెన్నో! తెలిసింది, ఐస్‌బర్గ్ మాత్రమే!

# 31. బోనులో సింహంతో

మాతృ గర్భ నిలయం సుభద్రమనీ
కోరి నంతకాల శిశువు ఉండ లేదు
నియతమైన దశలో బయటికి రావలసిందే!
సుఖమైనా కష్టమయినా ఇష్టమయినా అనిష్టమయినా

రాత్రి వేళ చందమామ కిందికి దిగి రావాలనీ
మల్లెల నవ్వులతో ఆడుకోవాలనీ అభిలాష శైశవంలో

పగటి వేళ గగనంలో వెలిగే సూర్యుని
చూడలేని కళ్ళకు, మబ్బు ముక్క ఆలోచనతో
నీడకో నిలయానికో చేరే ఆశలు! ప్రౌఢంలో

ఆరోహణలో ఆయువు శిఖరం సమీపించి
గగనానికి తిలకమై సంఘానికి దీపమై
అద్దంలో అస్తమించే సూర్యుని బింబంలా వృద్ధత

దైవం తన కేదో మేలు చేస్తూనే ఉండాలనీ
తాను మాత్రం! ఇంతలకు అంతలు పోతూ,
చుక్కల్ని దాటి నింగిలోకి దూసుకపోవాలనీ
కానీ! భూమిపై తన అడుగులు కదిలితేనే సార్థకం

మనిషిలో ఆలోచన పతాకలా ఎగురుతుంది
మనసులో ఉపాయం మెదలుతూనే ఉంటుంది
అడవిలో ఎక్కడో నివసించే సింహం
బోనులో తన వెంట! రావాలనీ! నిలవాలనీ!

## 32. బ్రతికేందుకు

బ్రతికేందుకు ఉన్న స్థితిలో డబ్బు చాలదు
అవసరాల చలన రేఖలతో గ్రాఫ్ మారుతుంది

ఒక చోట సమ్మె పిలుపు వినబడుతుంది
ఒక చోట శ్రమ యంత్రం తిరుగుతూ ఉంటుంది
ఒక చోట ఇల్లు దోపిడికి గురి అవుతుంది
ఒక చోట జేబు కత్తిరింప బడుతుంది

ఒక చోట బిగిసిన ఉచ్చులో స్కామ్ స్వనిస్తుంది
ఒక చోట మెడలో జరీ కండువా మడతల్లోనో
పూల దండ క్రిందనో కరెన్సి నోట్లు నిదురిస్తాయి
పూల గుచ్ఛంలో అందుతాయి, బహు పరాకుగా

ఒక చోట వితరణ కణాల కయి
ఎదురు చూచి కాయలు కాచే కళ్ళు!
ఒక చోట ధన సంపద కళా ప్రదర్శనం!
కళ్ళు బయర్లు కమ్మే విపరీత దృశ్యం!

సమాచార హక్కుల రథ సారధులు
చేతులు చాచి ఉన్న ప్రసార మాధ్యమాలు
రాత్రిని జయించి ఆలస్యం చేయని పత్రికలు
ఎప్పటికీ తెరచి ఉండే కెమెరా కన్నూ!

ఎవరి అవతారం వారికి బహు ప్రియం
ఇతరుల దృష్టికి నాటకంలో పాత్ర రూపం
బతకడం చేత కాని వారెవరూ లేరు
కావలసిన అవకాశం రాకనే శిలామయం!

## 33. బ్రతుకొక పాపం కాదు

కోరికలో అందమైన కల్పన ఏర్పడుతుంది
 పర్వత శిఖరాన్ని అలంకరించే మబ్బులా
కల్పన చేయని మనసు లేదు
 వాస్తవాన్ని ఎదుర్కోని జీవితం లేదు

కల్పనలో మృగతృష్ణను చూపే కాలం
 వాస్తవంలో ప్రవాహ చరితను పొందుతుంది
విలువల ఉన్నతిలో సంస్కృతీ శిఖరాలకు
 సోపాన క్రమం తప్ప! అడ్డ దారి లేదు.

ఏది ఉన్నా నడిపించే 'డబ్బు' కీలకం
 ప్రయాణ పర్వంలో బాధల ఘట్టం తప్పదు.
గడ్డి పోచ తానొక మహా తరువై
 చుట్టూ వేదికతో నాలుగు దారుల కూడలిలో
సాక్షీభూత పాత్రకు కల్పనలో ఊగుతుంది

పేదరికం పీడనం విధి శాపం కాదనీ
 అరణ్య వాసంలో అజ్ఞాత యంత్రాలై
'ఎవరి కోసమంటే? సమాధానం! 'క్రియా సిద్ధి' తోనే సర్వం.
సమాజంలో సంపన్నులు మరచిన
 సాటి సంఘం భవిత కోసమనీ

బ్రతు కొక వర మవునో కాదో కానీ
 గతి శీల చరిత్రలో శాపం కాదు!
మారణ పీడన బాధల సంకలనం కాదు.
 సామాజిక శక్తిమయం విజయ సాధనం

## 34. అంతరంగమొకటే !

జలదం విడిచే జల కణ పంక్తులు
గుండెలో బరువును వదలు తూన్నట్లు ఉంటుంది
శరీరం నుండి శ్రమ బిందువు లొకటొకటీ
బ్రతుకులో సారాన్ని విడుస్తూన్నట్లు ఉంటుంది

ఉదయ మయినా అందరికీ ఒకలా ఉండదు
ప్రతి హృదినీ రాగ సజ్జితం చేయలేదు
ఎక్కడి నుండో చిరు మబ్బు వచ్చి కప్పవచ్చు
మంచు తెర లొకటొకటీ అడ్డుగా సాగవచ్చు.

చూపుకు చల్లని దృశ్యం! హ్లాదకరమయినా
మనిషికి నీల లోహిత కిరణ శక్తి అవసరం
బిగిసిన చీకటి చేతి వేళ్ళ సందుల్లో చిక్కి
ఇంకా బయట పడని కిరణం! ఉండనే ఉంటుంది.

సమయం గడచి! సూర్యుడు తీక్షణంగా ప్రకాశించవచ్చు
ఆ తేజో రూపంపై చూపులు నిలిచేనా?
ఉషః కాల కిరణ సమయం! మళ్ళీ రేపే!
అపుడు ఏ అడ్డూ లేక పోవడం! అదృష్టం!

చేతిలో విశాల దర్పణంలా ఉదయం
విశ్వంభర దృశ్యం! ప్రతిఫలనంతో
అందంగా అగ్ని రూపం! మసి అంటని హృదయంతో
ఎగసిన కిరణ ఫణి! నిలిచిన శక్తికి చిహ్నం!

వేదననూ ఆనందాన్నీ కొలిచే యంత్ర మెక్కడుంది?
అంతరంగ మొకటే, కానీ ఎక్కడో గుప్తంగా! మరవబడీ!

## 35. మనసులో నిలిచీ

చెట్టు కొమ్మ పయి పక్షి వాలుతుంది
చెట్టులో లేందీ తనలో ఉందీ అనుభవానికి వస్తుంది
పక్షి వాలుతుంది! మనిషి కెదురుగా
పక్షిలో లేందీ తనలో ఉందీ అనుభవానికి వస్తుంది
ఒక కరతాళ ధ్వనికి పక్షి ఎగిరి పోతుంది
దీని కే విద్యతో చతురతతో పనిలేదు.

గాలి వెలుగు నీరు వనం ఈ విశాల పృథ్విపై
ప్రకృతి సమస్తం! దేవతలూ! విశ్వం! అన్నీ
తన కోసమే అన్నట్లుగా! మనిషిలో
అధిక భావ బీజం! మహా తరువవుతుంది!

విపణిలో కొన్నవీ పొందినవీ పరంపరగా
మస్తిష్కశాలలో వివిధ వస్తు జాలం!
ఎప్పటి కపుడు సరి కొత్తవి చేరుతూ,
పాత జ్ఞాపకాలతో కొత్త అనుభవాలతో
మనసును సమాజ చక్రంపై తిప్పుతాయి
ఆయువుతో గుండె లయను సాగిస్తాయి

ప్రవాహంలో పడవల్లా వస్తూ పోయే క్షణాలు
జీవన గమనంలో దృశ్యానికి ఆకృతినిస్తాయి.

ప్రతి వస్తువు వెనక నుండి
అప్పటి చిరు నవ్వో చిరు కోపమొ!
జారిన మంచు కణంలా! ఆరిన నిప్పు రవ్వలా!
మనసులో నిలిచీ! శిల్పమై చిత్రమై కవితయై.

# 36. అన్నీ ఆత్మ బంధు రూపాలే

ఎప్పటిదో, ఈ సందేశం! సంభాషణ! చరిత్ర
మానవేతర ప్రపంచంతో హృదయ నివేదనం!
పక్షితో మేఘంతో శశితో తన వృత్తాంతం!
చెట్టుతో గిరితో గగనంతో ఆత్మీయం.

సాంద్రమయిన అనుభూతి శిఖర భూతమయి
లోపలి నుండి బయటికి రావాలనీ ఆరాటం
ఎవరో ఒకరికి తమ గాథలో వేదన
వినిపించాలనీ! మనిషిలో కోరిక అలలా

సందేశమో సంభాషణో రసాకృతి పొందుతుంది
సానుభూతి చూపే పవనంతో కదలుతుంది
ఆ సమయం గడుస్తుంది తృప్తిగా హ్లాదంగా
మోయలేని బరు వేదో దిగిపోయినట్లు ఉంటుంది.

వేదనలో బాధనూ, దూరమయిన ప్రేమనూ
పలికే సుందర సృజన రూపం మనోభవం
విప్పారిన పద్మంలా ఆలోచన పరిమళిస్తుంది
పరిధులు దాటిన విశ్వమయం మనో గతం.

ప్రాణమున్న పక్షితో, ప్రాణం లేని మేఘంతో
ఆకాశ వాసి శశితోనూ సందేశం
చెట్టూ గగనం గిరితో భాషణం
బదులు పలక వేవీ, మౌనం అంగీకారంగా

అవసర సమయంలో మనిషికి జీవన రుచిలో
చరాచర ప్రపంచంలో అన్నీ! ఆత్మ బంధు రూపాలే!

# 37. కాలం అమరుతుంది

చరిత్రలో కాలం అమరుతుంది అలంకార ప్రియంగా
అందులో నిజమెంతో? ప్రశ్నకు గురి అవుతూ
మనిషి జీవితంలో ఎంతటి స్థితిలోనూ
ఇంకా ఏదో లేమితో లోటుతో గడుస్తుంది.

కాలాన్ని విభజించలేం, మంచి అనీ! చెడు అనీ!
ఇవి మనుషుల ఊహల చర్యల ప్రభావ రూపాలే!
తృప్త హృదికి సృజన మతికి మంచితో
భగ్న హృదికి నష్ట మతికి చెడుతో.

చీకటి మెట్లపై అడుగులు వేస్తూ పోవడం తప్పదు
ఎక్కడో ఒకచోట ఆగీ జారీ తప్పీ పడీ పోవచ్చు!
ఆలోచన! ఎప్పటికీ వెలుతురు మెట్లపై సాగాలనీ
చీకటిని దూరం చేసే యత్నం! సాగుతూనే ఉంటుంది.

సమాజంలోకి రావడమొక అదృష్ట విశేషం
కాల దర్పణంలో బింబించే దృశ్యంలో భాగమై
భూమి ఎదురు చూస్తుంది! విశాల యశోరూపంకై
నింగి ఎదురు చూస్తుంది! ఉన్నతిలో తోడుగా.

బయటి నుండి లోనికీ
లోపలి నుండి బయటికీ
గమనాగమనంతో జీవితం
భౌతికమూ మానసికమూ కలిసీ!

ఏ రోజూ! స్వాగత తోరణంతో ఎదురు కాదు
ఏ రోజూ, వీడ్కోలు గుచ్ఛంతో నిష్క్రమించదు.

# 38. నిరంతరం నిరీక్షణం

కను రెప్పల కిటికీ తలుపులు తెరవ బడీ
కనిపించే విశాల ప్రపంచ దృశ్యంలో
హృదయ నిలయం తలుపులు విప్పారీ
నిఖిల సమాజానికి దారులు తెరుస్తాయి.

ఎప్పటికపుడు! రావలసిన మార్పులతో
మారబోయే కొత్త బ్రతుకు కోసం
సమాజ మెదురు చూస్తూ ఉంటుంది.
చినుకు కయి చూచే తప్త శాఖిలా

ప్రవాహం వెంట పరుగెత్తే ఆరాటం ఒక విధం!
ప్రవాహాని కెదు రీదే ఆవేశం ఒక విధం
ప్రవాహాన్ని తన దారికి తెస్తూ యత్నంలో
సస్యమయం చేసే ఆలోచన! ఒక విధం!

వెలుగుతో నీడ అనివార్యంగా
నిలుచున్నా కూచున్నా నడచినా అంటుకొనీ
హఠాత్తుగా వదలి వెళ్ళిపోతుంది
చీకటిలో కలుస్తుంది! జలధి లోకి చేపలా!
నిశా సముద్రంలో చంద్రుడు నవనీతంలా
దీన్ని చూస్తూ ఉంటే ఉదయం ఊహకు రాదు.

గాయపడిన ఒడుదుడుకుల నావ
తీరం చేర్చే నమ్మక మెక్కడుంది?
పచ్చని ఆకులేని కొమ్మలతో సమాజం
చల్లని నీడ నిచ్చే అవకాశ మెక్కడుంది?
పేదరికంలో భౌతిక సుఖ భాగ్య మెక్కడుంది?
సమాజ కల్పనలో అందని ఫల రుచి తప్పు!

# 39. పీఠం కయి ఆరాటం

వర్గం వర్ణం కులం మతం ప్రాంతం
దేని కది పీఠం కయి ఆరాటం
ఆక్రమణం ఆలోచనతో ఒకరొకరూ
ఆటంకం యత్నంలో ఒకరొకరూ

ఘర్షణ కోణాలతో జీవితాల సమాజంలో
నిప్పు లాంటి నిజానికి దూర దూరం భయంతో
వజ్రం లాంటి నిజానికి దూర దూరం తెలియక
చివురు లాంటి నిజానికి దూర దూరం చూడకా

ఎంతటి మహనీయ సూక్తి భాషణ మయినా
బతుకు బరువు తగ్గే సూచనతో వచ్చీ
గాలిలో కదలుతూ అలలా ప్లోదంగా
ఈ చెవిన బడి ఆ చెవి నుండి వెళ్ళి పోతుంది

దప్పిక ఎడారిలా పరచుకొని ఉంటే
పవన సూక్తు లెవరిని కదిలిస్తాయి
ఆకలి! గ్రీష్మ శిఖయై గంతులేస్తూ ఉంటే
సహన మంత్ర మెవరికి వినిపిస్తుంది.

అడవిలో హరిణంకై దారులు కాసే పులీ
బ్రతుకులో విజయంకై దారులు వెదకే మనిషీ
ఓటమి అంచు నుండి గెలుపుకై యాతన
ఏ దారి అయితేనేం, పీఠంకై అన్నట్లుగా!
అందినట్లు అనిపిస్తూ పరుగెత్తే కాలంతో
ఆ వెనకనే సమాజం! సంక్షుబ్ధ దృశ్యాలతో!

# 40. అందరిలో ఏదో ఒక ఆదర్శం

అందరిలో ఏదో ఒక ఆదర్శ దర్శనం
అందంగా బింబిస్తుంది, విశ్వమయం
మబ్బూ మంచూ చీకటి అవరోధం! ఏదయితేనేం?
ఎవరూ పూర్తిగా చూడలేని స్థితిలో

పరుగెత్తే వాహన చక్రం కింద నలిగిన సర్పాన్ని
ఎక్కడి నుండో చకితంగా ఎగిరి వచ్చి
ఎత్తుక పోతుంది గద్ద! కను రెప్ప పాటులో
ఒకరి విషాదం అంచున, మరొకరి ఉల్లాసం!

ఉరి శిక్షలోనూ మనిషి కళ్ళలో ఆశా పుష్పం!
వాడి పోకుండా క్షమించ బడవచ్చు, పోస్ట్‌పోన్ కావచ్చు.

స్వేచ్ఛ పొందిన ఖైది లా కిరణం
ఉదయం! విశాలమైన అవకాశం లభించీ
స్వేచ్ఛ పోయిన సింహంలా కిరణం
చీకటి బోనులోకి ప్రవేశించీ

ఏ ఆకు అంచునో మొగ్గ చివరనో
వేలాడే మంచు బిందువులో వేదన;
తనపై సూటిగా పడే తపన రశ్మికి
'ఒక్క మబ్బు ముక్క తెరలా వస్తే బాగు' అనీ.

రోజు వస్తుంది ఒక విశిష్ట అతిథిలా
మర్యాదకూ మన్ననకూ అర్హంగా
మనసు కవితను నడిపిస్తుంది
బ్రతుకు కవితను శాసిస్తుంది.

# 41. నడిపిస్తూ చేతనతో

మండే కాలానికి 'వసంతం' దుస్తులతో పాటు ముఖోటా తొడిగి
ఉల్లాసానికి బాటలు వేయాలని చూచే వారూ
సగం బ్రతికి ఉన్న ప్రాణంతో శరీరానికి
'క్షేమం' లేబుల్ అతికి, సమయం గడపేవారూ

స్వప్నంలో అమృతం సేవించి అమరుల మనుకుంటూ
ఊహలపై దివి దాకా ఓపికతో పయనించే వారూ

శ్రమ రహితంగా లభించే పరితృప్తితో బ్రతికేవారూ
భూమిపై జీవన మారణ దృశ్యాల్ని మరచే వారూ
నిరుత్సాహ రథంపై 'కిం కర్తవ్యమ్' విచికిత్సతో
తమలో ఆర్తిని దేవతలకు నివేదించే వారూ

పత్తి నుండి దారంలా కాలాన్ని సాగదీస్తూ
ఎత్తూ లోతూ ఎరగని కదలికలో గడిపేవారూ

నాలుగు దారుల కూడలి జీవితంలో ట్రాఫిక్ గుర్తులు మరచి
అపాయంలో సమాజాన్ని నిందకు గురిచేసి శపించే వారూ.
రోడ్డుపై ! అదుపు లేని వాహనాల అతి వేగంతో
అకాల మృత్యువు నీడలు పోటీ పడుతున్నాయి.

పేదరికం పీడన దారులలో బాధలు వేదన తీరులలో
తర తరానికీ మారుతుంది! కవి స్వరం.

గతి సూత్రం పై నడచే సమాజంలో
వినతి నుండి విప్లవ దిశగా పోరాటం
నిదురించే అగ్నిని రగిలిస్తూ జ్వాలగా
శప్త శిలను నడిపిస్తూ చేతనతో.

## 42. గమనం ఆగమనం

పూవు పూస్తుంది, పరిమళాన్ని వదలుతుంది
అనురాగ సుందరతను నింపుతుంది అందరిలో
పూవు వాడుతుంది, ముడుచుకొనీ, రాలుతుంది
తాత్త్విక చేతన చివురిస్తుంది కొందరిలో.

తెల్లని పావురం ఎక్కడి నుండో వస్తుంది ప్రియంగా
ఇంటి ముందు వాలుతుంది నిర్భయంగా ఎదురుగా
భయ పెడితే పైకి ఎగిరి పోతుంది క్షణంలో
సంఘంలో లోపించే 'శాంతి' కి అవసర చిహ్నం.

పగలూ రాత్రీ తెరచిన హృదయ ద్వారం నుండి
విగ్రహాలు నడచి రావు, మనుషులు తప్ప!
విగ్రహానికీ మనిషికీ భేదం తెలిస్తే
సమస్యలో సగ భాగం పరిష్కార మయినట్లే.

తీరాన నిలిచిన నావ పయనంలో
దుస్తరాన్ని దాటే ఉపాయాన్ని బోధిస్తుంది
దారిలో సైన్ బోర్డు హిత కర సూచనతో
వచ్చే సమస్యకు సుగమ విధం చూపుతుంది.

పూవు రాని కాలంలో వ్యర్థమనీ చెట్టు కొమ్మను
నరికి శూన్యాకృతి నిచ్చే తెలివి చూపరెవరూ!
బ్రతుకు బరువు మోయలేని కలిసి రాని కాలంలో
ఆత్మ హత్య! ఎన్నటికీ శరణ్యం కాదు.

సమాజం నుండి ఏకాంతంలోకి, ఏకాంతం నుండి సమాజం లోకి
సాగే ఒకరి కవిత! అస్తితలో, మరొకరి ముఖం వ్రేలాడ కూడదు.

# 43. ఊరు విడిచి

ఊరు విడిచి మరో ఊరు చేరడం
విహగంలా ఎగిరి వచ్చి వాలేంత సులభం కాదు
తాను చేయ గలిగిన పనికి అవకాశం దొరకాలి
కొత్త కొత్త వ్యవహార బంధాలు కుదరాలి.

తనలో ఆశా ప్రపంచంతో మనిషి
ఒక చోటు నుండి మరో చోటుకు
లోయల్ని తలపించే ప్రతికూలత ఒడ్డు నుండి
జీవన కామన ముందుకు నడిపిస్తుంది.

మనిషికీ మనిషికీ వేరు వేరు దారులు తప్పవు
ఊరుకూ ఊరుకూ పొలిమేరలు తప్పవు
దేశానికీ దేశానికీ మధ్య సరిహద్దులు తప్పవు
వీటి తోనే గుర్తింపూ, అస్తిత నిలిచేదీ

బ్రతుకులో కలల్నీ వాస్తవాల్నీ నింపుకొనీ
ఖజాన బ్యాగ్‌తో ప్రత్యక్షమయ్యే నాలో
అలసట ఎరగని కాలి నడక నేర్పిందీ ఊరు,

సుఖానికి దగ్గరగా పయనం చూపిందీ నగరం
మంత్రంలా అదే పనిగా శబ్దించే యంత్ర రూపం
గుప్తమైన అర్థాలతో మనిషి మనిషి కొక విధం

వ్యర్థం కాని స్వార్థంతో అనుక్షణం
విపణి వీధి విలువలతో నగరం.
ఊరుకు బహు వచనం నగరం
నగరానికి ప్రాక్ రూపం ఊరు

# 44. వాస్తవ భూమిక

నగరం విస్తరణంలో కూల్చబడిన గుడిసెలు
విసరేసిన ఎండిన పూల గుత్తుల్లా చెదరీ
తోటలు పంటలు మాయమయి యాంత్రికంలో
వేడి పెనం మీద పడి దొర్లుతూన్న బ్రతుకులు!

మరొకరి బ్రతుకును బంతిలా ఆడుకునే
రాజకీయం! ఎప్పటికీ తమ గెలుపు కోసమే
మానుషాన్ని మరచిన పాలనా విధానంలో
రెఫరీ బాధ్యతల్ని మరుస్తోంది ప్రభుత్వం

నిన్న కొందరి బుజాలు పల్లకీలు మోసాయి
అపుడు వారి బుజాలు కాయలు కాసాయి
నేడు కొందరి చేతులు సూట్ కేసులు మోస్తాయి
ఇపుడు అరచేతులు బొబ్బ లెక్కుతున్నాయి.

ఒకరిపై ఒకరు అనుమానం పెను భూతంతో
ఒకరి నొకరు బ్లాక్ మెయిల్ చేస్తూ
ఒకరి ముఖాన్ని మరొకరు వికృత పరచాలనీ
అందరిలో ఎవరికి వారు తామే వెలగాలనీ

రుతు చక్ర భ్రమణంతో ప్రకృతిలో పరివర్తనం
అదే సమాజంలో మార్పుకు ఎన్ని ఉద్యమాలు రావాలో
వ్యక్తి స్వేచ్ఛలో వెళ్ళేది కొంత దూరం మాత్రమే!
సమాజ గతిలోనూ అడుగడుగున చెక్! బ్రేక్!

లేని వైభవం గురించి చింతన కల్పన కన్నా
ఉన్న జీవితం గురించి వాస్తవ భూమిక ముఖ్యం.

## 45. వీడని బంధం

చిన్న నాటి ఊరు లోకి పొలిమేర దాటుతూనే
ఎప్పటివో స్మృతులు మనో నిలయమాక్రమిస్తాయి
ఎంతటి మనిషిలోనూ తీగెలా సాగుతుంది ఆలోచన
బాల్యంలోని అమాయక శిఖరాల్ని స్పృశిస్తుంది

ఊరు వీడిన ఒక నాటి వియోగం అణగీ
ఊరు చేరిన ఈనాటి సంతోషం పొంగుతుంది
ఈ పొంగుపై మనస్సు పయనిస్తుంది
ఎంత దూరమో? మరో విషయ తీరం చేరే దాకా

కోర్కెల బండిలో ఊరు విడిచిన వారూ
కోర్కెల మూటతో బయట పడిన వారూ
ఇక్కడ ఉన్నది నమ్ముకోనీ ఉండి పోయిన వారూ
హద్దుల్లో, ఆశలు దాటలేని తృప్తి మతులూ

ఊరు విడిచి వెళ్ళిన వారికీ
ఊరులోనే ఉన్న వారికీ
మధ్య! దాటించే వంతెనలా నేను
ఎప్పటికీ వీడని ఘన బంధంతో

పూర్వం పరిచయ మున్నవీ లేనివీ ముఖా లొకటొకటీ
ఆహ్వానం పలుకుతాయి మరో జగత్తులోకి
ఉన్న విలువలకు మరో అంకెను చేరుస్తూ
మనసుకు విందు నిస్తాయి మౌన ప్రియంగా

ఊరు మధ్య మహా వృక్షం! చుట్టూ వేదికతో
ఆటకూ పాటకూ చర్యకూ తీర్పుకూ సాక్షిగా
తరాల చరిత్రను నింపుకున్న సి.డి.లా
పైకేమీ కనిపించని మౌన వాలకంతో.

# 46. సమస్య ఎప్పటికీ

చిన్న నాటి ఊరు ఎప్పటికీ ఆలాగే
ఉండాలనుకోవడం! తెలిసిన అమాయకం
చదువూ విజ్ఞానం సంపద ఆధునికం
అంచులలో పదును తేలే తెలివైన నగరం

దీని ముందు ఊరు హఠాత్తుగా
అడుగు వెనక్కు పడుతూన్నట్లు ఉంటుంది.
ముఖాన చెట్ల కొమ్మల నీడలు సవరించుకుంటూ
ఊహలో పంట కాల్వలూ! పచ్చదనం పరచుకొనీ

అవసరాల వెనకనున్న కోర్కెలు మిగిలీ
దొరికింది తృప్తి నీయని భాగ్యంతో
నగరం ఒడి లోకి అడుగులు జారతాయి
కోరికలకు మితం లేదని తెలిసీ
తృప్తికి హద్దులు లేవని తెలిసీ

జీవన గతిలో స్థాయీ భేదాలతో
ఊరు అయినా నగరమయినా అంతరాలతో
కాలం ఎక్కడా ఆగదు! మందంగానో వేగంగానో
అడుగులు వేస్తుంది వర్తమాన వాస్తవతలం పై

ఏది మంచి ఏది చెడు అనేది చర్చా కమనీయం
ఎవరూ తీర్పు చెప్పలేని జటిలమైన సహనీయం

తరాలు గడచే కొద్దీ రాసులుగా ప్రశ్నలు!
వీటి నుండి ఎవరికి ఎప్పుడేది అవసరమో
ఎన్నుకొనే సమస్య! ఎప్పటికీ ఉండేదీ.
సమాధానాలు మాత్రం ఎవరి బ్రతుకులో వారివి.

# 47. ప్రశ్నకు అవకాశం

ప్రతి సమస్యలో ప్రశ్నలు కావకాశముంది
ప్రతి జవాబు నంటుకొనీ ప్రశ్నల పొది! సిద్ధంగా
అది సరిపడక పోవచ్చు! చాలక పోవచ్చు!

ఆశల్ని పెంచుతూ నడిపించే ఫుట్ పాత్‌లతో
ముఖానికి సేదతీర్చే సౌధ శిఖర పంక్తులతో
నగరం! మనిషిని తన వైపుకు పురి కొల్పుతుంది
పల్లెను చక్కగా పక్కకు పెడుతుంది, తెలియకుండా.

పలు రంగుల్లో అక్షరాలు! ఎన్ని విధాలయినా
ఆ మాటల కర్థం! అన్నిటిలో ఒకటే
ఊరునూ నగరాన్నీ ఒకటిగా కలిపేస్తూ
భేదం చెరపేసే! హృదయ లిపి ఒకటే!

విశ్వ మెంత దగ్గరయినా
ఊరు ఎంత ఆప్తమయినా
మనిషికీ మనిషికీ ఎడం! ఎప్పటికీ!
అల అల నుండీ కొలత లేని గగనం దాకా

ఊరు నుండి విశ్వం దాకా
విశాల వికాస రూపం! కవి అస్తిత్వం!
సరిస్తుంది సృజనలో ప్రవాహమై, కవితయై

అనలం అనిలం గంధం బంధం మనుషుల్లో
అనుభవ స్థాయిని బట్టి విభేదాలు సహజం

కవి ఎవరయినా సృజన హృదయ మొకటే
దేశ మేదయినా బ్రతుకు మూల మొకటే.
ఎన్ని ఎంత మారినా తల్లి ఒడి మారదు
ఎంత పైకి ఎదిగినా కంటి తడి ఆగదు.

## 48. రాజకీయ గంధం

ఈ దేశం! నా దేశం! హృదయ ప్రియం!
పర దేశంపై లేదు అసహనం! వైరం!
హృదయ మెక్కడో ప్రతి స్పందన మచటే
మేధ ఎక్కడో ఆలోచన అటు వైపే.

దేశ యశశ్శిఖరం వెనక జనతా దౌర్భాగ్యం
చింతనతో పాటు ఆచరణ చణం ముఖ్యం
దుర్భర సమాజ గతిలో విప్లవ మొక అవసరం
దుస్సహ సంక్షోభంలో తాత్త్విక మొక శామనం

మనిషి మనసు పోత పోసిన వస్తువు కాదు
మారే రీతులలో నీతులలో ఊహల కందనిదీ.
ఏదో ఒక పేరుతో వ్యూహం నుండి వ్యూహానికి
నిజాన్ని ఎవరు చూపగలరు మనో దర్పణంలో.

సంకెళ్ళు విడిపించే సాహస చర్యలతో
కిరాతకాలు తుడిచేసే మానవ బాధ్యతతో
తప్పదు మనిషికి వాడి వేడి నిర్ణయం! జన హితంకై
హిమ శిఖరం కరిగితేనే ప్రవాహం సరిస్తుంది.

శిథిల నిలయ స్థానంలో మహా సౌధం చూపవచ్చు
అగ్గిలో బుగ్గి అయి ఆయువు తరిగిన రూపాన్నీ
బాధలో కళ తప్పిన మానవ మనోజ్ఞ ముఖాన్నీ
గతాన్నీ ఎవరు తిరిగి ఇవ్వగలరు? చూపగలరు?
రాజకీయ గంధం సోకని సమాజ విషయం లేదు
సమాజంలో భాగమయిన కవిలో తప్పనిదీ ప్రభావం!

# 49. ఎదురు చూచే ప్రశ్న

ఎక్కడో తప్పి పోయినట్లు అనిపిస్తుంది
కాని ఉన్నది ఇక్కడే ప్రజలో కలిసీ
నేను ఉన్న దిశ వైపున చూపు పడక పోవచ్చు
నేను ఉన్న స్థితిలో ఆనవాలు పట్టక పోవచ్చు.

ఆకాశం కనబడకుండా పైన కప్పు పరచబడీ
చుట్టూ నిలిపిన ఇనుప శలాకల వలయం నుండీ!
కనిపించే బయటి ప్రపంచం చూస్తూ లోపల స్వేచ్ఛా భ్రమణంలో
ఎవరికి వారు అద్దంలో తన రూపం వరకే పరిమితం!

పగలు ఎట్లా ఉన్నా! రాత్రి నిద్రాయానం తప్పదు
చుట్టూ ఒకే ఒక వినీల గభీర మహా సముద్రం
సముద్రంలో పడవలా! నిశి చంద్రవంకలా స్వప్నం
ఏదో ఒక రూపంలో మనసు బయట పడుతుంది
దరిద్రంలో బంగారు ప్రతిమల కొలువుతోనో
భాగ్యరేఖ తెలియని ఎడారి నిలయంతోనో

గేటు ఇనుప చువ్వపై రెక్కలు ముడుచుకొనీ
కూర్చున్న పావురంలా! ప్రతి మనసులో నిశ్శబ్దం.
నీళ్ళలో మునిగి తేలే నిప్పు కణంలా ఆలోచన
ముఖంలో దొరకని జవాబు కయి ఎదురు చూచే ప్రశ్న!

అగ్గి పుల్ల గీసి దీపాలను వెలిగించవచ్చు
గుడిసెను శిఖలతో భగ భగ లాడించవచ్చు.
ఏ అనుమానం లేకుండా, చాచిన చరిత్ర హస్తం!
చీకటి కుటిలో విసరవచ్చు! వెలుగు పీఠంపై నిలపవచ్చు.

# 50. వర్తమాన సింహాసనంకై

గతాన్ని మరపిస్తూ భవిష్యత్తును మురిపించే
ఏ రోజూ వర్తమాన సింహాసనం పై మోజు!
విజయాశయ ఫాలంతో ఏ రోజు కారోజు
మనిషిలో వివిధశక్తులకు ప్రతీకలుగా పాత్రలు!

శాస్త్ర చర్చా శ్రేణుల వీధులు తిరిగీ
వాదాల చక్రాల అరల నుండి బయట పడీ
కలలు నిండిన బరువు సంచీ దారిలో వదలీ
కవితా నిలయం చేరుతుంది కవి మనోరూపం.

కాలం కదలుతుంది! కవితా నిలయం ముందు
అతిథిగా బంధువుగా మిత్రంగా లోనికి ప్రవేశిస్తుంది
మమతతో సమతతో విషమంలో శాంతికై
భవిష్యత్తు దర్శనంతో ఫలాన్ని పిడికిలిలో దాచీ!

చలిలో మండే సమిధలా
ఎండలో చల్లని నీడలా
వానలో విప్పిన గొడుగులా
సృజన సమయం ఒకటొకటీ!

ప్రకృతి శక్తుల సమన్వయంతో మారే సమాజం
వివిధ వర్ణ గుణాల కలయికతో గడిపే మనిషీ!

కోరికలకు అర్హతలతో పని లేదు
వర్తమానం తన స్వంతం కావాలనే!
ఏదీ శాశ్వతం కాదని అందరికీ తెలుసు
అయినా సింహాసనంపై ఎవరికీ మోజు తగ్గదు.

# 51. సృజన శిఖర సమయం

సృజన శిఖర సమయం నాలో
వర్తమాన సమాజ మూలంతో మనో రూపం
స్వేచ్ఛగా అలరాలనీ మానవత చివురించాలనీ
సమత కుసుమించాలనీ జన హితం ఫలించాలనీ

ఈ చింతన సమయంలో నాలో
రచనా క్రియ అవిరామంగా
అక్షర సేన మార్చింగ్ చేస్తుంది
కణ కణంలో విజయ స్పర్శతో

ఈ ప్రభావ సమయంలో నాలో
మౌనం అర్థవంత మవుతుంది
శబ్దంలో చేతన ప్రసరిస్తుంది
సమాజ చలనంతో ఒకటవుతుంది!

ఊహలో సరికొత్త చిత్రం కనిపిస్తుంది
మాటలో సరికొత్త బింబం తేలుతుంది
ఎప్పటివో జ్ఞాపకాలు క్యూలో నిలుస్తాయి
చేతనలో అనుభవాల చక్రం తిరుగుతుంది

అణు విద్యుత్ కేంద్రంలా మస్తిష్కం
సృజన రమ్య ప్రకాశాన్ని ప్రసరిస్తుంది
సమతా మానవతా హృదయంతో ఒకటై
స్వేచ్ఛగా మానవ సమాజాలు ! నాలో
ఈ ధరిత్రి! నా నుదుట తిలకమై
ఇతిహాసం! నా ఎదుట బింబమై

# 52. ప్రజాస్వామ్య స్వేచ్ఛలో

నిజరూపం ఎక్కడ? ఎవరికి దొరుకుతుంది?
కవితలో కనిపించేది ఒక కవి పాత్ర ప్రపంచంలో!
మనో విపంచి మీటుతూ శబ్ద జగం పలుకుతూ
తలపై పూల కిరీటంతో వసంత భ్రమను కలిగిస్తూ
ఇంద్ర ధనుసు చుట్టుకొనీ బయటికి కనిపిస్తుంది!
అసలు వ్యక్తి ఎక్కడ! నిజ రూపం ఎక్కడ?

ఊహల రెక్కలపై ఏకాంత గగనం వదలి
వాస్తవ చరణాల పయి నేలపై సమాజంలో,
భవిష్యత్తు ద్వారం తెరచే సాహస క్రియలో
సమూహం నుండి సమూహానికి వంతెనలా కవిత్వం

బయటికి ఏడుపు! అందరికీ వినిపిస్తుంది
లోపలి బాధ! ఎవరిది వారికి పరిమితం
ఏడుపుకు ఉన్న ఆకర్షణ! బాధకు లేదు.

ఏ పక్ష మయినా ఏ వాదమయినా మనిషిలో
ఆదర్శానికి ఆచరణ చరణ మవసరం
కవి గళం అంతిమంగా 'శాంతి'ని ధ్వనిస్తుంది

ప్రతి హృదిలో చుట్టిన మంటలతో శాంతి ద్వీపం!
అనలమయ జలాలను తరించే నావ కయి యత్నం!

నిరంకుశ బలాల విజయం మన్నించలేను
బులెట్ల గాయాలతో దేహాన్ని అలంకరించలేను
అసలు మనిషికై అన్వేషణ! ఎప్పటిదో ఇప్పటికీ జరుగుతూంది
బయటి రూప వేషం మారుతుంది! చిరునామా మారుతుంది.

మానవ నిజ రూపం ఎక్కడో! నేనూ అక్కడే
ప్రజాస్వామ్య చేతనతో స్వేచ్ఛా సమాజంలో.

స్వేచ్ఛా కవిత్వం-55

# చార్ ధామ్

## జల విలయం

### దీర్ఘ కవిత

మాదిరాజు రంగారావు

2013

రసధుని - సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

# CHAR DHAM
# Jala Vilayam

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2013

జల విలయ బాధితులకు

సమర్పితం

# చార్ ధామ్
## జల విలయం

**1.** చూస్తూ చూస్తూనే కళ్ళ ముందు క్షణాలలో
వర్షా జల ధారల ఉగ్ర విలయ తాండవం

కదలే తరగల చేతుల కందింది మింగుతూ
గడ్డి పరకల వలె తరలే శరీరాలతో
కింద వరదలు
పైన మబ్బులు

తీవ్ర ధారా శరాలను విడుస్తూ
విరామం లేని వినాశన పర్వంలో
కదలి వచ్చే జలద పంక్తులు వరసగా

ప్రజలూ సంపదలూ నిలయాలూ
ఎక్కడి కక్కడ ఛిన్నా భిన్నమవుతూ
చార్ ధామ్ క్షేత్రం! విలయ కాండలో

ఒకరి చేయి మరొకరు పట్టుకొనీ గట్టిగా
పోరలి తరలి వచ్చే వరదల ఉధృతిలో
భర్త నుండి భార్య
తల్లి నుండి పిల్లలు
జారి పోతూ కనబడకుండా
తమ కళ్ళ ముందు మృత్యు పాశ వశులవుతూ

ఎదకు హత్తు కొన్న పిల్లలతో
క్షేమం కై కొండ పైకి తల్లులు తండ్రులు
ప్రాణా లర చేత పట్టుకొని నడచీ నడచీ
చరియ లూడి విరిగి పడీ అణగే వారూ
తోడుగా ఉన్నవారు చెదరీ
ఎటు జరిగి పోయేదీ తెలియదు

**2.** బదరీ కేదార్ గంగోత్రి యమునోత్రి
నాథ నిలయ ధామాలు, నాలుగు వెలుగులు

చార్ ధామ్ విలయ వేదికగా మారుతూంది
అయిదు భూతాల్లో జల భూతం శాసిస్తూంది

ప్రకృతిలో జనులకు ప్రియమైన ప్రవాహాలు
భాగీరథి మందాకిని యమునా సరస్వతి
ప్రజలను కన్నీటి లో ముంచి పైకి తీస్తున్నాయి
"ప్రమోద" పదం మారుతూంది 'ప్రమాద' స్థలంగా

కింద ఉన్న ఒక్క మనిషే కాదు
పైన ఉన్న ఆ దైవం కూడా
ప్రశ్నలు బోనులో నిలవాలిసి వస్తూంది
జవాబు కయి దిశలు! చూడాలిసి వస్తూంది

కమ్మిన మబ్బులతో కురిసే ధారలతో
వెలుగులు మూత బడీ యాత్రా పథంలో
చీకటి విచ్చుకొనీ నాలుగు ధామాల్లో
కళ్ళ ముందు బాధామయ జీవన దృశ్యాలు!

నాలుగు తేజాల మధ్య ప్రభావ శాంత క్షేత్రం
హరిద్వార్ ముఖం నుండి
హృషీకేశ్ హృదయ మందుకొనీ
కుడి ఎడమల పాయలుగా సుఖద భావ స్థానాలు
దేవ రుద్ర ప్రయాగల నుండి చార్ ధామ్ గమ్యం!
ఉత్తరా ఖండ్‌లో దేవ భూమి హృదయం!

**3.** నీలి మబ్బు మసక వేసి గగన ఫాలం కమ్మీ
నీటి అలలు విసరి, అవని తలం ఆక్రమించి
కనిపించని మృత్యు లీల! వరద భయంలో

ఊళ్ళ నుండి జనం, బెదరి చెదరి తరలీ
ఎచటి కెచటికో, తెలియని చోటికి కదలుతూ

చెప్పరాని బాధలతో జీవితాలు
కనిపించే గాయాలతో కొన్నీ
కనిపించని వేదనతో కొన్నీ
తిరిగే కాల చక్రం అరలలో పడి నలిగీ

ఆపదల నుండి బయట పడే అదృష్టం
ఈ సమయ మంత సులభం కాదనిపిస్తూంది
అయినా సమాజ యత్నం, మానుష గుణ సహజం!

ఒక కష్టం పై మరొక కష్టం విరుచుక పడుతూ
విషాద పర్వాలతో వినాశన ఖండ మవుతూంది

ఏలాగో బయటపడీ దిగ్భ్రమలో కొందరు
చెదరి మనో ధైర్యం కుప్ప కూలి కొందరు

కలత చెంది నిద్ర నుండి వ్యధలో
అపుడే మేల్కొన్నట్లుగ! జన సమూహ రూపాలు

ఎరుపు రంగులో అపాయ రేఖలతో
నీలి పుట లొకటొకటీ! ప్రకృతి చరిత్రలో

4. ప్రకృతి శరీరంలో బిగిసిన కండరాలు
కొండ చరియలు లొక టొకటీ ముక్కలుగా
విరిగి పడీ దారిని మూసేస్తున్నాయి
మనుషుల్నీ వాహనాల్నీ ఆపేస్తున్నాయి

మేలు పొందే కన్నా, కీడు పొందే యాత్రలో
నీటి పైన తేలుతూ దూరమయ్యే వారూ
వరదలో కొట్టుకొనీ పోయే వారూ
శిథిలాల శకలాల క్రింద అణగిన వారూ

మొదట పదులలో, ఆ పైన వందలలో
అనుమానం పెంచుతూన్న మృతుల సంఖ్య
పొందే భయానికి ఆశ్చర్యం జోడిస్తూంది

ధామంలో నాథ దర్శనంతో తమలో
ఏదో గొప్ప శక్తి విలసించే విశ్వాసంతో
ఎంత దూరం నుండో వచ్చిన యాత్రా గణం!

తోడుగా ఉన్న వారు చెదరి జరిగి పోయీ
ఎందరికో మారుతూంది! మారక యాత్రగా

శివ మయమై, అలరించే ప్రకాశ రూపం
రుద్ర విలయ చక్రంగా మారుతూంది

భౌతికమే కాదు, మనో జగం లోనూ
మనిషికి మనిషే రక్షణ కవచమై, ఈ సమయం
దేవతలను మరపిస్తూందీ, విశీర్ణ జీవన దృశ్యం

5. రైలు బస్సు కాలి బాట, అశ్వం నర వాహనం
శాంతికో శక్తికో ముక్తికో మానస ప్రపంచంలో
దుష్కర యాత్రలో భక్తి ఫలం పై ఆశతో
ఉన్న వ్యక్తి! ఈ సమయం! విషాద భ్రమణంలో

గడచి వచ్చిన వేల మైళ్ళ ప్రయాణం
చిటికెలో ఎక్కడి దక్కడ సమాప్త మవుతూంది

మొదటి రోజు కురిసే వర్షంతో అవరోధం
రెండో రోజు పరచిన వరదలతో బీభత్సం
మూడో రోజు మునిగిన ధామంతో విలయ వశం

మబ్బు మసకతో గగన తలం కమ్మి
నీటి వరదలో అవని తలం మునిగి
కేకలు అరపులు! ఆపదలో హాహా రవాలు

'కీ'తో తిరిగే బొమ్మల వలె మనుషులు
మృత్యువు నీడల వలలో చిక్కిన ప్రజలు!
క్షేమంగా బయట పడేసే ఉపాయంలో యంత్రాంగం
రంగం లోకి దిగిన వైమానిక సైనిక బృందం!

అటు వైపు ఎత్తైన కొండల వరసలు
ఇటు వైపు లోతైన లోయల పంక్తులు
సన్నని దారుల మలుపులలో హఠాత్తుగా
ఊడి పడే పెళ్ళలతో దొరలే రాళ్ళు
తరలి వచ్చే జల ధారల వరదలకు తోడుగా
దొరికిన కాస్త అవకాశాన్నీ మూసేస్తున్నాయి

6. నెమ్మదికి నిలయమైన నడకల మందాకిని
ఆగ్రహంతో ఊగి పోయే అలలతో
పోటెక్కిన వరదలతో! ఊళ్ళను తుడిచేస్తూంది
ప్రజల ఆర్త రవాలతో! ధ్వనిస్తూంది క్షేత్రం

చెవులు చిల్లులు పడే అరపులు కేకలు!
వర్షా ధ్వనుల తెరలను చీల్చుకొనీ

ఏమవుతుందో ననీ తెలుసు కునేందుకు
బయటికి వచ్చిన మనుషులూ ఆ వరదల్లో
జాడ లేక తరలి పోవడం విచిత్రం!
విషాద ఘటనలతో వార్తలు! ఒకటొకటీ

జగద్గురువుల సమాధి తాళలేక చెదరింది
ఎప్పటివో కట్టడాలు అవశేషాలు మిగిలాయి

ఊళ్ళూ ఇళ్ళూ ఆలయ విభాగాలు నిలయాలూ
ఒండు మట్టి బురదలో కూరుక పోయాయి

నీలి రంగు  తెర వెనక నిలిచీ దైవ ప్రకాశం
ఎదురుగా కఠోర రూపం ముందుకు వస్తూంది

మందాకిని పాయ, సహన మూర్తి సరస్వతి
చకితంగా అశాంతికి గురియై ఎగసింది
కల్లోల జలాలలోకి సమాజాన్ని దింపుతూంది
మనిషికి ఊహించరాని పరీక్ష మొదలయింది

విషాద ఛాయ లొకటొకటీ కదలుతూ ఎదురుగా
ఈ సమయంలో మనిషికి మనిషే! అవసర తేజం!

**7.** రోజు రోజుకూ ఆపద పెరుగుతూ
ఉగ్రాకృతి చూపుతూ ప్రవహిస్తూంది గంగ
భయదాకృతి వహించి సరిస్తూంది యమున
నష్టాకృతి పూని కదలుతూంది శారద

ఒకే సారి భీకర ముద్రలతో జల దృశ్యం
తనలో కరుణకు బదులు క్రూరత తలపిస్తూంది
మృత్యువు చాచిన విలయ కరాల స్పర్శతో
జల సమాధులయి పోయే ప్రాణి సమూహాలు!

ఏ చోటున ఎగుడో? దిగుడో?
ఏ వైపున దారి ఉందో? లేదో?
తెలియని జల వలయంలో చిక్కి
మిత్ర గణం బంధు జాలం వేరై
చెదరి పోయి కను చూపు నుండి మాయమై
మనిషి మనసు శూన్యంలో పరిభ్రమిస్తూంది

మంత్రం తంత్రం దైవం తత్వం భక్తీ వెనకబడీ
మానవ బంధం మానస రాగం బయటికి వస్తూంది

విషాద భావ నిలయమై చార్ ధామ్ క్షేత్రం
దైవం ఉనికిపై ఊహ చెదరి పోతూంది
ఒకే ఒక మానవతా గంధం! తలపులో!
మనిషి మనిషినీ దగ్గరకు చేరుస్తూంది

ఒకే ఒక మానవతా రూపం! బ్రతుకులో
కాంతి బింబమై దారులు చూపుతూంది
పడవయై ఒడ్డుకు చేరుస్తూంది, అదే
వంతెనయై లోయను దాటిస్తూంది అదే!

8. వరద నుండి బురద నుండి శిథిలాల నుండి
వెలికి తీసి ప్రాణాలను కాపాడే సైనిక శ్రేణులు
సేవా భావనతో కరుణోదారంగా
సాహస ధైర్యాలతో త్యాగాన్ని వరిస్తూ!

గంగా ప్రవాహ వేగానికి తరలీ వరదలు
ఎక్కడి కక్కడ కూలిన చెట్లూ ఇండ్లూ వంతెనలు
ఇసుక దిబ్బ లెగసీ

మట్టి మేట లేర్పడీ
జరిగిన జల విలయానికి
గుర్తులతో పరిసర దృశ్యం!

మళ్ళీ మళ్ళీ తెగబడే వర్షాఘాతానికి
కొట్టుకపోతూంది! మిగిలిన కాస్త భాగ్యం!

ఆలోచన లాగి పోయి
సంవేదన కీల లెగసి
చలన మాగి జడత క్రమ్మి
ఎక్కడి కక్కడ ఖండ ఖండ మైన సమాజం!

అడవిలో కొండపై లోయలో ఊళ్ళలో
ఎటు చూచిన నీరే నీరు! నలువైపుల
నేలను క్రమ్మీ కను చూపు మేరలో!
తాగే జల బిందువు కరువై

జీవ శక్తిలో వేడి తగ్గుతూ
మంచు ముద్దగా మారుతూంది శరీరం
కడుపులో ఆకలి! అగ్ని శిఖలు చిమ్ముతూంది
సానుభూతితో చెట్లు చేతులు కదలిస్తున్నాయి

9. అనుమాన జలధిలో ఈదే కొందరి
ఆచూకీ తెలియడం కష్టంగా ఉంది
కొందరు క్షేమంగా ఉన్నా రన్న వార్త
శూన్యాన్ని సంతోష చిత్రంతో నింపుతూంది

ఆపద తప్పిన మనుషుల్ని భద్రంగా
రక్షిత స్థానాలకు చేర్చే బాధ్యత వాయు సేనదే
సర్వం కోల్పోయిన ప్రజలకు ఆపై
పునరావాసాల నిర్మాణ కర్తవ్యం! పాలకులదే

ఎంతటి విపరీత ఘడియలోనూ
మంచి వార్త వినాలనే అభిలాష సహజం

హెలికాప్టర్ నుండి కిందికి దిగగానే వృద్ధురాలు
కింద నిలచి ఉన్న జవాన్ అందించిన బాటిల్ లో
నీరు తాగి అతని ఎద పయి వాలిన దృశ్యం టెలివిజన్‌లో
కరుణతో నిండిన సేవకు కృతజ్ఞతా రూపం

మెరసే కళ్ళతో పూల గుత్తుల్లా భద్రంగా
జవాన్‌ల చేతుల్లో పిల్లలు! రక్షితులు!

విధ్వంస కాండతో ఊగే ప్రకృతి నుండి
బాధిత దు:ఖిత ప్రజ రక్షణ పనిలో జవాన్‌లు

ఒక వైపున, పడే కష్టాలకు ఆగని దు:ఖం
ఒక వైపున, ఆదుకునే ఉదారతకు సంతోషం
ఇది ఎదురయ్యే వాస్తవ రూపానికి దర్పణం
మనిషికి మనిషే శరణ్యమన్న మాటకు చిహ్నం

10. అలక నంద నది పక్కన
వెలసిన ధారా దేవి!
మనిషి నమ్మకానికి నిలయమై

ఉదయ సమయం బాలికగా
పగలు సమయం యువతిగా
సాయం సమయం మాతృమూర్తిగా
ఈ "దేవ" భూమికి భద్రాకృతి!

కంటికి రెప్పలాగ యాత్రికుల్ని కాపాడే
ఆ ప్రజలను రక్షించే క్షేత్ర పాలకురాలు!

ఏ వికాస చర్యలోనో ప్రతిమను కదలించడం
ఈ విపదకు కారణమనీ ఒకరి విశ్వాసం
ఇదొక ప్రకృతి సహజ విపరీతమనీ ఒకరి ఆలోచన
చుట్టూ నిర్మాణాల ప్రభావమనీ కొందరి వాదన

కారణ మేదయినా ఊహించలేని విషాద పరిణామం
సమాజ చరిత్రలో! మరవరాని బీభత్స సన్నివేశం

రోజు గడచే కొద్దీ ఎవరి నుండి
ఏ దు:ఖ వార్త వస్తుందో నన్న భయంలో
ఆకాశాన ఎగిరే హెలి కాప్టర్ ఒకటే
సహాయ బృందంతో! ధైర్యాన్ని నిలుపుతూంది

వినాశన దశలలో దాట రాని ప్రవాహాలపై
తాళ్ళ వంతెనపై నుండి భద్రంగా ఒడ్డుకు చేర్చే
దుష్కర యత్నంతో రక్షించే ఉపాయ విజయం
ఒక సుశిక్షిత సాహస మూర్తులకే సాధ్యం!

**11.** వారం పది రోజులుగా ఇంకా ఎన్ని రోజులో
మబ్బుల రాకతో వరసగా భయపెట్టే వాతావరణం
కర్మ సాక్షి వెలుగు కళ్ళు పూర్తిగ మూయబడీ
మానుష యత్నానికి ఆటంకం! జోరున వర్షం!

వాయు సేన హెలి కాప్టర్ కుప్పకూలిన వార్త!
సేవలో నున్న వాయు సేనా బృందం, దుర్మరణం!
జరగ కూడనిదే జరిగిన విషాద సందర్భం
కర్తవ్యంతో కదలిన త్యాగానికి ఆదర్శం

రోజు రోజుకీ విషాద ఛాయా రూపం
పునరావృతం కాకూడదనీ! మనిషిలో! కోరిక సహజం

మనసుల కాశా పూర్ణత నిచ్చే ధామం
నిరాశను నింపుతూ రుద్ర భూమి అయింది
ఈ క్షేత్రంలో మృత్యు నృత్య విహరణం
ఏ ముక్తికి సంకేతం! ఏ భక్తికి ఫల రూపం

ప్రకృతిలో సుందరతను వికృతం చేసే
భవిష్యత్తు దారుల్ని మూసేసే, చెరపేసే
ఇంతటి బీభత్స రచన
దీని కిదే సాటిగా ఉంది
ఏ రణ రంగంలో దృశ్యమూ
దీని ముందు నిలవ లేదు

గంధపు చెక్క లాంటి మనిషి మనసు
ఆర్ద్ర స్పర్శతో పరిమళాలు చిమ్ముతుంది
ప్రాణుల రక్షణలో సేవా చర్యలతో
మానవతా స్పందన! విజయానికి చేరుస్తోంది

**12.** ప్రకృతిలో వికృత శక్తులు విజృంభించీ
బద్దలయిన జలద పంక్తులతో కాలం!
కుంభ వృష్టితో భూమి తలం జలమయమై
ప్రజలను కాపాడేందుకు! వాయు సేన సిద్ధంగా

అందంగా వంపులలో మలుపులతో
రాజ నర్తకిలా కదలి వచ్చే నది
ఈ సమయం! విషమ లిప్తలలో
ఉన్మద వేషంతో చిందులు వేస్తూంది

అలల నురుగుల చిరునవ్వులు విసరుతూ
హ్లాదంగా తీరాలను పలకరిస్తూ వచ్చే గంగ
ప్రాణుల్నీ మనుషుల్నీ పాడినీ పంటనూ ఏకంగా
తుడిచి వేస్తూ, విలయ రూపం ధరిస్తూంది

కొద్ది కాలమే అయినా ఈ దుర్భర ప్రభావం
నీలి ముద్రలు నిలుపుతూంది! అంతటా

ఎన్నో ఏండ్లుగా సాధించిన ప్రగతి పరంపర
క్షణాలలో కనుమరుగై పోతూంది, విధ్వంసంలో

బహు నమ్మకమైంది! ఒకటే ప్రాణి జీవితంలో
అది మృత్యువు! ఇపుడు పై బడ చూస్తూంది
తన వెంట తీసుక వెళ్ళే! ఇంత వరకు చూడని మిత్రం
వెలుగు కెదురుగా చీకటి దుస్తులతో వస్తూంది

నిప్పురవ్వలు ఎగసి పడే దారిలో
మంచు పూల పక్కన పయనం సాగేనా?
మంచు తెరలు జారి పడే దారిలో
నిప్పు రవ్వల అంచున పయనం సాగేనా?

**13.** దైవం తత్త్వం భక్తీ మోక్షం స్థానంలో ఇపుడు
జీవితమూ సమాజమూ! మనిషీ మానవత! ప్రముఖమై
మానవ శక్తిపై ప్రజ్ఞపై అచంచల విశ్వాసంతో
పయనం సాగడ మొకటే! ఇపుడు శరణ్యం

చంచల ప్రకృతిని నమ్మే వీలు లేని స్థితిలో
సంక్షుబ్ధ జలాలను దాటే యత్నం
సంకల్పం ఆలోచన సమన్వయ గుణంతో
నవ సమాజ నిర్మాణం! ఒకటే గమ్యం

నిశ్శబ్ద వాతావరణంలో శబ్దం వినిపిస్తుంది
అది అర్థవంత మవడానికి సమయం పడుతూంది

గుడిలో గంటల శబ్దం! నిలిచి పోయి హఠాత్తుగా
నిశ్శబ్దాన్ని చీల్చుకొని వినిపిస్తూంది, మనిషి స్వరం!

ఇంకా వీడని భయ దృశ్యం! మనసును పట్టుకొనీ
దీనంగా క్షణాలు! ఇంకా విలయ భావ స్పర్శతో

ఒక చోటు నుండి మరో చోటుకు గాలి
ఆగి ఆగి కదలుతూంది జాగ్రత్తగా
ఏ దుఃఖ వార్తను మోసుక పోవలసి వస్తుందోననీ

ఈ క్షేత్రంలో ఆవాస పరికల్పన లొక టొకటీ
మనిషిలో ఒక్కొక శక్తికి పరీక్ష పెడుతున్నాయి

మధ్యలో జారి పోయే ఆశా హస్తాన్ని అందుకునీ
పైకి చేదుకొనీ, ముందుకు సాగాలిసి వస్తూంది
సమాజ శ్రేయంపై దృష్టితో, పురోగమన మొకటే ఎదురుగా

14. కిటికీ నుండి చూస్తే ఇంకా ఉన్నా ననిపిస్తూ
విలయ చరణం వేసే చివరి ముద్రలతో! వానలు
ప్రకృతి ఖడ్గ చలనంలో చెదరిన సమాజం
సర్దుకొనే అవకాశం దొరక లేదు! ఇంకా

పగలంతా నిశి నీడలు! కమ్మిన ఈ రోజు
రేపటి కయినా తొలగి, వెలుగు వస్తుందనే

చీకటిలో దీప కాంతి ఎంత అవసరమో
విపత్తులో స్నేహ హస్త మంత ముఖ్యమయిందీ

ధూళి పటం ఓర్వ గలిగి, కదలే శరీరాలు
చేరిన బురదలో నుండి, నడవ లేకపోతున్నాయి

పొగలతో అలముకొన్న తడి తడి గాలులలో
కాడులో అగ్ని శిఖలు! దహనానికి వెనకాడుతున్నాయి
మనిషుల రూపం మాపి బూది చేయడం
ఎవరికీ అంత సులభం కాదనిపిస్తూంది
"సర్వ భక్షకుడ"న్నమాట చెల్లడానికి
అగ్నికి మరింతగా సమయం పడుతూ ఉంది

ఈ సమయం కావలసింది! హృదిలో
వెలుగులతో శక్తిని నింపే విశ్వాసం
ఈ పయనం పోవలసింది! బ్రతుకులో
ఉదార చరితతో నవ సమాజ నిర్మాణం

త్యాగంతో సుందరమైన సేవా హృదయంతో
ధైర్యంతో ముందుకు వెళ్ళే అభియానంతో
బాధల అధ్యాయం పుటలు వెనక్కి మరలి
బాగ్యంలో హ్లాదంతో అధ్యాయం కొత్తగా

**15.** మూసిన స్వర్ణ కవాటం ఇంకా తెరచుకోలేదు
సూర్యుని ముఖమయినా కనిపించని దశలో
కష్టంలో తానెవరో మరచిన మనిషిలో
రవి కిరణం ఒకటే నవ శక్తిని నింపుతుంది

క్షితిజంలో నీలి తెరలు పక్కకు జరిగీ
జీవన గతిలో నీడలు పోవలసీ ఉంది

బౌన్సు అయిన చెక్‌లా జన యాత్రలు
మధ్యలో వెనక్కి మరల వలసి వస్తూంది

బ్రతుకును ఉక్కిరి బిక్కిరి చేస్తూందీ విలయం
చినిగిన ముక్కలతో నిజ రూపం చెదరీ
వరదలు! ఉప్పెన! పెను తుపాను! భూకంపం!
యుద్ధమో! అన్నీ మనసును చింతనతో నింపేవీ!

ప్రకృతి ప్రకోపం ముందు
ఏ రక్షణ యంత్రం పనికి వస్తుంది?
మానిసి రణ చండత ముందు
ఏ నీతుల తంత్రం పనికి వస్తుంది?

ఏ దేశం అయినా ఏ కాలం అయినా
ఆపదలో వినిపించే గళ రవ మొకటే
ఏ భావం అయినా ఏ రాగం అయినా
వేదనలో స్పందించే ఆశయ మొకటే

చార్ ధామ్ జల విలయ కాండ! మిగులుతుంది స్మృతిలో
ప్రకృతి కెదురుగా నిలిచిన సమాజ విజయానికి గుర్తుగా

స్వేచ్ఛా కవిత్వం -56

# ఆల్ ఇన్ వన్

మాదిరాజు రంగారావు

2013

రసధుని - సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

# ALL IN ONE

(Telugu Poetry)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2013

*Presented to*

*my daughter*

*Haritha* M.A. (Lit.)

Detroit, M.I. U.S.A

*with affection*

*and*

*blessings*

# ఆల్ ఇన్ వన్

## 1. అందాక

అందాక, వెళ్ళాలని బయలు దేరితే
ఎవరెవరో ఎదురవుతారు చిరునవ్వుతో
'ఎందాక?' అనీ ప్రశ్నతో అలంకరిస్తారు.
ఎవరి దారిన వారు
ఎవరి పనిలో వారు

'ఇందాక!' అనీ ప్రతి మనిషికీ సమాధానం
ఆ అందాకలలో
ఈ ఇందాకలు ఎన్నో!

అందాక – ఎందాక? – ఇందాక! ల
అర్థమూ భావమూ విస్తరణం జీవితం

నలువైపుల నున్న ప్రకృతినీ ప్రాణినీ
వీడ లేని విశాల బంధంతో మనిషీ!
అన్నిటికీ కేంద్రమై
అన్నిటిలో మిన్నయై

గమ్యంలో హద్దు లేని ఆశల రూపం
ఎన్నటికీ అంద రాని చంద్రుని బింబం

లక్ష్యంలో ప్రతి వ్యక్తిలో ఒక ఆదర్శం
అద్దంలో అంద బోయే సూర్యుని బింబం
దారిలో ఎత్తిన ఖడ్గాల వలె నియంతలు
పక్కనే పచ్చని తరువుల వలె ఉదారులు
మనిషి మనిషికీ! దిశ దిశలో
వేరు వేరు అందాకలు!

# 2. టు ఇన్ వన్

అలజడి బ్రతుకులో మండే కోర్కెలతో
సంఘంలో అంతో ఇంతో స్థానంకై యత్నం

దృశ్యం నుండి దృశ్యానిక గమనం ఎప్పటికీ
ఏ క్షణమూ మనసు శూన్య పటం కాదు

ఒక సమయం చలనంలో ఆట బంతిలా
ఒక సమయం అచలంగా మట్టి బొమ్మలా
రెండిటికీ సిద్ధం కావడ మొకటే
కాలానికి అతీతంగా మానుష ధర్మం

'స్థలమూ కాలం తోడై సాగే చర్యలతో
ఎవరి అధీనంలో లేనిది జీవన యంత్రం
సమస్య నుండి సమస్యకు లౌకిక తంత్రంలో
ఎవరెవరి చేతిలోనో పనిచేసే రిమోట్‌తో

చెట్టు నీడ అవసరం! తాపంలో
ఇది పచ్చని రూపం తోనే సాధ్యం

అగ్నిలో తేజనం! సంప్రేరణ రూపం
ఇది చేసే మరో పని! కాల్చడం
నీరులో శామనం! ఆర్పేసే రూపం
ఇది చేసే మరో పని! ముంచడం

సృజన విలయ రూపాలు రెండిటిలో
మంచీ చెడు కలయికతో మానుషం
ప్రతి మనసూ టూ ఇన్ వన్
ఈ కవిత ఆల్ ఇన్ వన్

# 3. లాస్ట్ బట్ వన్

వెలిగే అహం నుండి సృజన విభాతం
మండే అహం నుండి విలయ విషాదం
ప్రతి మనసులో తనదైన ఒక కోడ్
తనకు మాత్రమే తెలిసిన లో పొరలో

చేతిలో స్విచ్ ఆన్‌తో టార్చ్ వెలుగు
మనసుకు తొడుగుతుంది ఆశా కవచం
రక్షణలో ముందుకు నడచే ఖడ్గంలా
మనిషికి చెదరని ధీరత నిస్తుంది
పాల రాతి ప్రతిమలో తోచే దేవతలా
చీకటిలో ఎదురుగా దారిని తీరుస్తుంది

సమస్యల పాయల మధ్య అంతరంగం
కదలే మబ్బుల మధ్య సూర్యునిలా,
అంతరంగ ప్రమేయమే ఉంటే
మానవ కథ ఇట్లా ఉండేదా?
విపణి తీరులో తిరిగే మనసుకు
అంతరంగం! ఎపుడో! మెరుపులా

దైవ కణం గురించి పరిశోధనలో
ఎప్పటికపుడు రహస్యం ఛేదించిన సంతోషం
ఎంత కాలం నిలుస్తుంది? అంటే
మరొకటి కొత్తగా కనుగొనే దాకా

సమస్య పరిష్కారంలో
చివరి మాట అంటూ లేని పరంపరలో
అప్పటి నిర్ణయ మొక భాగం మాత్రమే
నిరంతర గవేషణలో! లాస్ట్ బట్ వన్

# 4. ఏకాంతం నుండి

ఏకాంతం ఎప్పటిదో! మానస బంధువు
కోరుతుంది అజ్ఞాతం, వరిస్తుంది రహస్యం
అనుభవ గుణంతో మనసును బంధిస్తుంది
ఆలోచన చక్రం పై బ్రతుకును తిప్పుతుంది

సరసిలో జలాలలో పైకి తేలే
మట్టి అంటని కమలంలా
మనసులో ఏకాంతం ఎప్పటికీ
చుట్టూ తిరిగే భ్రమరాల్లా కోర్కెలు!

తన చుట్టూ ఉన్న సమాజ బంధంతోనూ
సృజన రచన జరిగేదీ ఏకాంతంలోనే

ఆత్మ భావ శిఖరంపై ఏకాంతం
ఒక సమయంలో మనసుకు అవసరం
బయట పడని లోని జగం ఒక సమయం
స్వగతంలో నిజ రూపం చూపుతుంది

గిరి శిఖరం నుండి కదలి జలాలు
ధరణికి తరలే జల పాతంలా
ఏకాంతం నుండి సమాజం లోకి
స్వేచ్ఛా గమనంలో మనిషి జీవితం

మౌన బంధం వీడుతుంది
శబ్ద లోకం విప్పారుతుంది
విశాలమై క్రియాశక్తి సమాజంలో
లో లోపల గుప్తంగా మిగులుతుంది ఏకాంతం

# 5. ఏదో ఒక క్షణం

బయట వీథిలో సమాజ దృశ్యం
ఎపుడూ తను కోరేదే ఉండదు
దృశ్యంలో ప్రతిదీ తన కోసం కాదు
తనతో సంబంధం ఉండకనూ పోవచ్చు
వీలు వెంట వాలులో సాగి పోవడానికి
కదలి పోయే అలలు కావు! కాళ్ళు

తన కిష్టంగా ఆడుకునేందుకు
ఆటలో బంతి కాదు సమయం!
బాధ లోనూ హ్లాదంగా గడపడానికి
ముళ్ళ మధ్య గులాబి కాదు హృదయం

చీకటిలో దారి చూపడానికి
టార్చ్‌లైట్ బల్బులు కావు కళ్ళు

కల వస్తుంది! దాని అంతట అదే!
ఏ మనోజగం లోని చిత్రంతోనో
ఎవరి అనుమతితో పని లేకుండా
వాస్తవమూ! దాని అంతట అదే
బ్రతుకులో సమస్యల్ని మోసుకొనీ
ఎవరి అభిమతితో పని లేకుండా
ఏదో ఒక క్షణం ఎరగా
ఏదో ఒక క్షణం కొక్కెమై
కాలం మనసుకు గాలమై! నిగళమై
బ్రతుకును విలవిలలాడిస్తుంది
మానుష సంకల్పం ఆశకు ఊపిరి పోస్తుంది
బంధన తొలగీ సంకెల వదలి నట్లవుతుంది

# 6. ఒక బెగ్గర్ తప్ప

ఎవరి దారి వారిది సమాజ దృశ్యంలో
ఊహలో ఇంద్ర ధనుసు భవిత కాంక్షతో

బజారులో ఎగసే ధూళికి భయపడి
బయటికి రావడ మెవరూ మానరు

చీకటి కలవాటు పడిన ముఖానికి
వెలుగు ముఖం చూచేందుకు భయం
తనకు ముఖం లేనట్లే చీకటి తెర చాటు నుండీ
తన రహస్య మేదయినా బయటపడ వచ్చుననీ

అంగడిలో బొమ్మ లున్న చోటికి వెళ్ళి
తానూ ఒక బొమ్మ కావడం విచిత్రం
దీన్ని సరి దిద్దే యోచనలో యత్నంలో
ఉపదేశ ప్రసారాలు నలు వైపుల నుండీ

పయన మెంత దూరమయినా
దారిలో మైలు రాయి నిశ్చలంగా
గడచి వచ్చిన దూరంతో పాటు
గడవాలిసిన దూరాన్నీ సూచిస్తుంది

గడచిన తేదీల అంకెలు క్యాలెండర్‌లో
వయసు లెక్క కట్ట డానికే కాదు
పలికిన మాటకూ చేసిన పనికీ
రోజు రోజు చేరే విలువ కట్టడానికీ

కాలి బాటలోనూ వాహన యానంలో
సామాన్యుడు సైంటిస్టు భోగి త్యాగి
పాలకులు హంతకులు సంసారి సన్యాసి
పక్కన ఎవరైనా! ఉండవచ్చు, ఒక బెగ్గర్ తప్ప!

# 7. హితకరం గతం

ప్రకృతి లోని రూపాల్నీ ప్రాణి లోని భేదాల్నీ
గుర్తిస్తూ మన్నిస్తూ విశ్వంలో భాగమైన మనిషి
తనతో మాట్లాడే మనిషి కయి ఆరాటం
తనలో పూర్ణత నిచ్చే మానవత కయి నిరీక్షణం

మనసు కదలి తేనే ఊహలు తరలుతాయి
పెదవి విప్పితేనే మాటలు వెడలుతాయి

ఊహతో మాట కలిసీ నిజ వర్తనం
మనిషిలో అస్తితకు రేఖల నిస్తుంది

భావనలో దర్శించే ఆదర్శ బింబం
వాస్తవంలో పొందే అనుభవ రూపం,
రెండూ రైలు పట్టాలవలె సమాంతరంగా
రెండూ కలిసిన స్థానం ఎక్కడో క్వాచిత్కం

జనని గర్భం నుండి శిశు రూపం
తన  కందిన క్షణం నుండి సర్వం సహ
వీడదు ఎవరినీ; వీడ లేదు ఎప్పటికీ
తనలో అణువణువూ కలుపుకొనీ

అమాయకంతో సుందరమైన బాల్యం
వయసు పెరిగే కొద్దీ పూల తోట అవుతుంది

గడ్డ కట్టిన వర్తమాన సారం గతం
కరుగుతూ కాస్త కాస్త కాలాంతరాన
తాపంలో దాహంలో హిత కరమవుతుంది
పరంపరా ప్రవాహంగా మారుతుంది రూపం

# 8. ఆరోహణలో

మలిన మెరగని అహకారం సృజనకు మూలం
ప్రకటించిన జీవన కావ్యం మరల చదివితే
కవిలో విమర్శ పాత్ర! చర్యలు మొదలవుతాయి
అద్దంలో బింబంలా! విమర్శినీ ప్రకాశంలో

పూచిన మల్లె తీగ మూలంలో రాత్రి
సర్పం చుట్టు కొనీ విశ్రమిస్తుంది
తొలి రవి కిరణంతో తొలగిపోతుంది
లో నుండి చీమలు బారులుగా కదలుతాయి

పగలు నుండి రాత్రికీ
రాత్రి నుండి పగలుకూ
సమయంలో మార్పులతో
జీవన దృశ్యం వేరవుతుంది

ముంగిలిలో పూల వనం
పెరడులో పండ్ల చెట్లు
మధ్యలో నివాస నిలయం
కల్పనలోనూ వీడదు వాస్తవం

మెరపుల్ని తలచీ పిడుగుల్ని మరచీ
జలకణాలకై నిరీక్షణం
ప్రకృతితో ప్రాణితో! మనిషీ!

శిఖరం చేరే ఆరోహణలో
తలపై గొడుగులా జలదం
మండే సూర్యుని కళ్ళకు
కూలింగ్ గ్లాస్ అవుతుంది
సంతోషపు జల్లులో చిందులు వేయిస్తుంది

# 9. ప్లాస్టిక్ బొకేలా

ఒక సమయం అందంగా కదలుతుంది
పచ్చికపై తిరిగే హరిణంలా
ఒక సమయం భయదంగా చరిస్తుంది
కొండ నుండి దిగే సింహంలా

జీవన యానంలో అపాయకరాలెన్నో
అనల గండం! అనిల గండం
నీటి గండం! ఎన్నిటి నుండో
క్షేమంగా బయట పడిన మనిషిలో

మెరపు భ్రమలు తొలగీ
పిడుగు పాటు మరచీ
మనిషి నుండి మాత్రం! మనిషికి భయం!
సందేహం! సంవేదన! జీవితమంతా
"మనుషులంతా ఒకటే" అన్నది ఎంత నిజమో
వారి వారి పాత్రల్లో విభేదాలూ వాస్తవం

మనిషిలో మానవతా మధుర స్వరం
హృదయ తంత్రిని మీటితేనే వినిపిస్తుంది

వర్తమానం తోటలో అనుభవాల మొక్కలు
అందంగా ఎదిగీ మోదంగా పూచీ
పచ్చని కళతో! మనిషి ముందు ఆశా రూపం
వాడిందీ, రాలిందీ గతమవుతుంది

స్మృతిలో ఒక కార్నర్‌లో నిశ్శబ్దంగా
ప్లాస్టిక్ బొకేలా మిగులుతుంది గతం

# 10. రేస్ నుండి

పలచని మంచు తెరను చీల్చుకొనీ
దేశం సరిహద్దు రేఖపై బులెట్ దూసుకుపోతుంది
వెనక నుండి ఉత్సాహ బింబం! దారి చూపిస్తుంది
తెలిసిన గమనంలో తెలియని విజయానికి

జనవాసం లేని కఠిన ప్రదేశాలలో
రణావేశం నిలుపుతుంది మనిషి ఉనికికయి

మహావీరుడయినా నర హంతకుడయినా
అనుక్షణం ట్రిగ్గరపై వేళ్ళతో బతకలేడు

సామాన్యుల కీ వివాద విషయం అసలే పట్టదు
మనిషిలో వివేకం మౌనంగా నియంత్రిస్తుంది!

శిక్షణ పొందిన బలవంతులకే
రణ రంగంలోకి ప్రవేశం
ప్రజల కోర్కెల పూల గుత్తియై నడచేరు
దేశ భవితకు నిర్ణయ శక్తియై తరలేరు

సర్వం తన వశం కోరే మతిలో
ఇంత చిన్న మానవ రూపానికి
అంత పెద్ద అవని స్వాగతమిస్తుంది

కాల గతిలో వేగం అందని
ఎంతటి జీవితమయినా
రేస్ నుండి వెనక బడినట్లే

# 11. ఫిల్మ్‌లో దృశ్యంలా

ఎట్లా ఉంది జీవితం? అంటే ఏం చెప్పను!
కలలో దృశ్యం ఎదుట నిలిచి చెప్పిస్తుంది

ప్లాట్ ఫార్మ్ పైనో పార్కులోనో సత్రం ముంగిలిలోనో
చెట్టు కిందనో రాత్రులు గడచే బ్రతుక్కి
ఒక టికానా; దొరకిన సంతోషంలో
పచ్చని లాన్‌పై మనసు గంతులేస్తుంది
కాళ్ళకు పాదరక్షలతో పాటు
నడకలో స్ప్రింగ్ యాక్షన్ వచ్చినట్లుంది
ఆ రోజున అరచేతిలో భాగ్యం
పై నుండి జారిన నక్షత్రంలా మెరుస్తూంది

కాలం అలసంగా లేదు, వేగాన్ని అందుకుంది
జేబును తాకితే సార్థంగానే ఉంది
చుట్టూ మనుషులే మనుషులు
భయాన్ని దగ్గరికి రానీయకుండా

శబ్దం వినిపిస్తే భయ భావం పోయి
బ్రతుకొక యంత్రమై! ధ్వనిస్తుంది
ఉత్సాహం పెదవులపై రాగాన్ని వదలుతూంది
సమ లయలో గుండె శబ్దిస్తూంది

ఫాన్ గాలికి టేబుల్ పై రెపరెపలాడే
ఆ రోజు వార్తా పత్రికలో అక్షర సేన
సమాజ రణ సన్నాహంలో ఉన్నట్లుంది
కష్టం నుండి సుఖానికి మాస్టర్ ప్లాన్‌లోనూ
స్మృతి రూపం మాత్రం! ఫిల్మ్‌లో దృశ్యంలా
మెలకువలో నిలుస్తుంది, వదలని మిత్రంలా!

# 12. పోర్టు నుండి పోర్టుకు

ఊరు వదలి నగరానికి ఎందరెందరో
తెలిసిన వైపుల నుండీ తెలియని దారులలో
ఎదురు పడే చూపులలో ఆర్ద్ర స్పర్శకై
పోవలసిన బాటలలో వెలుగు జాడకై

జీవన నవ యోజనలో
గమనంలో వేగంతో
నాగర దృశ్యంలో కొత్త పాత్ర ప్రవేశం
నవ సమాజ నిర్మితిలో అవసర భూమికతో

జల సంపదతో కళ కళలాడే
చెరువులూ బావులూ తవ్విన చేతులు
తుడిచిన కన్నీటి చారల గుర్తులతో
అనాథ వికల చిత్రం! చూపకూడదు

పైరు! పంట! తోటలతో పచ్చని పరిసరాల నుండి
కార్యాలయ కర్మాగార నిలయ నివాసాలలోకి

విపణి వీథి విలువల్ని అలంకరించుకొనీ
పల్లెను! మరపించే పట్టణమయినా
ఆకలిలో వేదనలో భావ వర్ణమొకటే
తాపంలో కోపంలో పదును అంచు ఒకటే

అనుక్షణం సమాజ భాగ్య రచనలో
జీవన యోజన సూత్రంపై శ్రమ చలనం
కదలే సమాజ సముద్రం అలలపై
పోర్టు నుండి పోర్టుకు జీవికకై పయనం

# 13. నీతితో సంబంధం

మనిషి మనః ప్రపంచంలో సగానికి పైగా
వాస్తవం వదలీ కల్పనలో ఆలోచన
ఇంద్ర ధనుసు కిరు వైపుల దార్శనికం ఆదర్శం
రెండూ ఆకర్షించే అందని శిఖరాలు!

హృదయ జలద శోభ లేని
ఆలోచన! యంత్ర సమం!

దేవతలూ స్వర్గం విధి పేరుతో
బరువు లొక టొకటీ చేరుతాయి
మనసులో తిష్ఠ వేసి కదలనివీ
పయనంలో దారిని మరలించేవీ

మనిషి వెనకనే బొమ్మలు! బొగ్గువి
నేర మయంలోనో
దోష యుతంలోనో
ఎపుడు మలిన పరచేదీ తెలియదు
ఎపుడు నిప్పు అంటేదీ తెలియదు
ఎపుడు బూది అయ్యేదీ తెలియదు
నేతల చుట్టూ ఎటు చూచినా
స్కాంల పొగలూ, మాఫియా సెగలూ

ఏ బ్రతుకూ! నీతి నుండి వేరు కాదు
ఏ వెలుగూ! పెట్టెలో దాచబడదు

అలలపై పయనించే పడవకు
నీటితో సంబంధం తప్పదు

# 14. శ్వేతాశ్వం

పయనం అనుకున్న నిమిషంలో
శ్వేతాశ్వం ముంగిట్లో నిలుస్తుంది
చీకటి జలాల్ని దాటించాలనీ
వెలుగు గట్టు పైకి చేర్చాలనీ

కన్నీటి చుక్కలతో తడిసిన దారిన
అడుగు వేసేందుకు భయపడే వేళ
చకితంగా దాటిస్తుంది! సాహస మతితో
మానవ సంకల్పానికి రెక్కల నిస్తుంది

కాల ప్రవాహంలో పడవల్లా తేదీలు
ఒకటొకటీ ఆ రోజు అనుభవంలో

అల కదలేందుకు గాలి అవసరం
పడవ సాగేందుకు ఉత్సాహ మవసరం

చివరి కిరణం అంటుకొనీ మొదలయ్యే
చీకటి ప్రశ్న! ఒకటే ఒకటి
తొలి కిరణం అంటుకొనీ మొదలయ్యే
వెలుగు ప్రశ్నలు! ఎన్నెన్నో!

గులాబి పూవును కోరే మనస్వి
చుట్టూ ఉన్న ముళ్ళను లెక్క చేయడు
చేయి చాచి అందుకొనీ నిర్భయంగా
గుండెకు హత్తుకొనీ! ముందుకు సాగేను

ముళ్ళను మరచిన హృదయంలో
మిగిలే దొకటే! అనుభవ సౌందర్యం
ఎన్ని విధాల వాహనాలున్నా
మనసును వీడని పురా శక్తి ఈ శ్వేతాశ్వం

# 15. ఛాలెంజ్

ఎదురుగా సముద్ర మంత చీకటి
చేతిలో వెలిగించిన చిరు దీపం
వెలుగు పడవను వదలుతుంది
పొద్దు పొడిచే వరకూ సమస్య తీరి నట్లే

చీకటికి భయపడకుండా చరణ యుగం
ముందుకు వెళ్ళడ మొకటే కర్తవ్యం!

ఉదయ మవుతుంది అద్భుత దృశ్యంతో
ముఖ మెత్తి కళ్ళతో చూడలేని తేజం!
ఎంతటి మనీషి అయినా మనస్వి అయినా
తనలో ఆవాహన చేసుకోవలసిందే

కూలింగ్ గ్లాసెస్‌లో కన్పించేది! హ్లాదంగా
సువర్ణ రూపం కోల్పోయిన ఛాయా బింబం మాత్రమే

తాను చూడని నిజాన్ని చూచినట్లుగా
తాను పొందని అనుభవాన్ని పొందినట్లుగా
డైరి పుటలో బంధించిన అక్షరాలలో
స్మృతిలో ప్రకాశాన్ని మరొకరికి చూపాలనీ!

మనిషిలో ఊహలు! కొత్తగా
బ్రతుకలో చూడని! చర్యలూ

ప్రతి ఒకరిలో కూలింగ్ గ్లాసెస్‌లా
కల్పన అవసరమవుతుంది! బ్రతుకులో

వాస్తవ తేజాన్ని చూడలేని కళ్ళకు
నిజాన్ని గ్రహించడం ఎప్పటికీ ఒక ఛాలెంజ్

# 16. జీవనం ప్రేరణం

ఎన్ని ధ్వనులు వినబడినా మెత్తనివీ తీయనివీ
మనిషి స్వరం వినబడితేనే చెవులకు ప్రియం

ఎన్ని ప్రాణులు కనబడినా విచిత్ర రూపాలలో
మనిషి రూపు కనబడితేనే కంటికి హ్లాదం

ఒక మనిషితో పరిచయానికీ స్నేహానికీ
మనసు ఎన్ని బరువు లయినా సహిస్తుంది

కలిసిన ప్రతి మనిషి నుండి అంతో ఇంతో
మానవీయ భవితకు చేరుతుంది కొత్త పుట
అది కొత్త బంధం పెంచేది కావచ్చు
అది మరో గమ్యం చూపేది కావచ్చు

దృశ్యం తెర దించే దయినా
దృశ్యం తెర ఎత్తే దయినా
తన జీవన యానంలో భాగమై
ఏదీ వీడదు! వీడాలనిపించదు

అద్దం ముక్కలయి నందుకు విచారం కన్నా
ముక్కలలో తన ముఖ బింబంతో సంతోషం

బాధ నుండి సంతోషం వరకూ
అన్నిటికీ సిద్ధంగా మనిషి
ఆ సమయం తనదై పోవాలనీ
తన గమనం ఆగి పోకూడదనీ

చుట్టూ సమాజం! కవితకు జీవనం
లోపల మానవత! నవతకు ప్రేరణం

# 17. వెనుక నున్న దృశ్యం

అక్షర పంక్తిలో క్షరం కాని కవిత
మౌన ముద్ర లోని శిలకు మాట నేర్పుతుంది
శుష్కమైన స్థితికి చివురు రుచి నిస్తుంది
చీకటిలో మనిషికి వెలుగు చూపుతుంది

ఒక చోట జలద భాష వినిపిస్తుంది
ఒక చోట కుసుమ భాష వినిపిస్తుంది
ఒక చోట ఆయుధ భాష వినిపిస్తుంది
అంతటా వినిపించేది హృదయ భాష ఒకటే

తెల్లని కాగితంపై అక్షర పంక్తి
లోపలి కెళ్ళే స్కూలు పిల్లల బారులా
రణ భూమికి కదలి పోయే వీరుల్లా
ఉల్లాసం ఉత్సాహం బెలూన్‌లు వదలుతూ

రోజూ ఒక కవిత వ్రాసిన కాగితం
సముద్రంలో వదలబడీ, అది పడవై
తీరం నుండి తీరానికి చేరుతుంది
స్నేహ సుందర యానంలో శాంతి దూతగా

మేధ ఉన్నది! ఆలోచనకూ
హృదయ మున్నది స్పందనకూ
మనీషిగా మనస్విగా మనిషిలో మనిషి
వర్తమాన పీఠానికి పోటీలో ప్రతి కవీ
అద్దం ముందు తన ముఖ మొకటే కాదు
వెనుక నున్న దృశ్యమూ, చూడక తప్పదు

# 18. ముఖ్యమూ అవసరమూ

కిటికీ అయినా తలుపు అయినా లేకుండా
సమాధిలా ఉండ లేదు ఏ బ్రతుకూ
అనుక్షణం ప్రవాహమై కదలాలిసిందే
మందంగానో తీవ్రంగానో వేగంగానో

ఎక్కడో ఒక మలుపులో కాస్త అలసత
నిష్క్రియతకు నిశ్చలతకు సూచన కాదు

శిల్పంలా ఉండ లేదు ఏ బ్రతుకూ
ప్రతి క్షణం కదలికలో స్పందన మరచీ

హృదయ తంత్రిని మీటితేనే నేర్పుగా
సుఖద నాదం వినిపిస్తుంది; అంతటా

నిర్వచనాల దండలు మెడలో వేసుకొనీ
అలంకార సుందరతకు మురుస్తూ
ప్రదర్శనలో భాగంగా బ్రతికే విమర్శకులు
టెంకాయ కొండలూ! దూది నింపిన బొమ్మలూ
సృజన చేతనతో ఛాలెంజ్
ఒక విచిత్ర పరీహాసం

కాలానికి సమాప్తి లేదు
కవితకు ఏ ఓటమి లేదు

దు:ఖాన్నీ వేదననూ తాపాన్నీ అశాంతినీ
అవలీలగ దాటే మానస చేతనతో మనిషిలో,
సృజనకు స్పందన ముఖ్యం
మనసుకు ఆర్ద్రత అవసరం

# 19. స్క్రీన్‌పై

మనో వేదిక పై స్క్రీన్ ఎప్పటికీ
ఏదో ఒక దృశ్యంతో నిండీ
బంధు మిత్ర పరిచయ రూపాలెన్నో
పాత వాటితో పాటు కొత్తవి చేరుతూ

ఏదో ఒక స్థితిలో గాయపడని మనసు లేదు
ఏదో ఒక గతిలో భేదించని మతం లేదు

ఒక పక్క సైన్ బోర్డుల వలె పెద్దలు
ఒక్క పక్క మెరసే బింబాల వలె యువత!
ఎవరి ప్రయత్నంలో వారు ఎప్పటికీ
అగ్ని శిఖను ఖైదు చేయ గోరే వారూ
సూర్యుని జల గుండంలో నిలపాలని చూచే వారూ
ఇది సాధ్యమా? అన్న ప్రశ్న ఆలోచనకు రాదు

ఎవరి యోచనలో వారు! ఎప్పటికీ
అరచేయిలో అప్సరో నృత్యం చూడాలనీ
కనుబొమల కదలికలో ప్రజను శాసించాలనీ
ఇది సాధ్యమా అన్న ప్రశ్న ఆలోచనకు రాదు

మోయ రాని బరు వంటూలేని మనసుకు
తప్పదు! ప్రతి నిమిషం ఏదో ఒక మోసే పని!
విరామ సమయంలో ఆయుధం వలె
శాంత సహన రూపంతో మనుషులు!

ఇంటి ముందు గేటు కమాన్‌కు
అల్లుకున్న తీగెకు పూచిన పూవు!
ఇంటి నుండి బయటికి వెళ్ళే
మనిషి నొసలు స్పృశిస్తుంది ప్రేమగా!

# 20. బయటికి వచ్చిన మృగం

ఇంటికి ఇంకా చేరని పిల్లలకై వేచీ
చెదరని ఓపికతో అటూ ఇటూ తిరుగుతూ
తల్లి ఘోష! తండ్రి బాధ! మిత్రుల దు:ఖం
బంధు గణం వేదనతో విచార ప్రపంచం

ఇన్నీ ఒకచోట కలిసిన సంపుటి
వర్తమాన గతిలో చూడక తప్పని దృశ్యం

నేలపై అపుడపుడూ నెత్తురు చుక్కల చిత్రం
మానవీయ మూలాలను క్షుభిత పరుస్తూంది
హింసలో ఛిద్రమై శీర్ణమై మానవతా రూపం
వీధిలో నిలిపిన దిష్టి బొమ్మను తలపిస్తుంది

వస్తూ పోయే జన సమూహ స్థానంలో విస్ఫోటం
శోకాన్ని చిమ్ముతూంది, బాధల్ని పంచుతూంది

నడుస్తూన్న కాళ్ళు తెగీ
చూస్తున్న కళ్ళు చెదరీ
ఎగిరిపడే ఇనుప గుండ్లూ మేకులూ
ఏ శరీరాన్ని రక్త మయం చేసేదీ తెలియదు

ఏదో పనిపై నగరం వచ్చిన మనుషులు
తమ కేమీ తెలియని షాక్‌లో
స్పృహ తప్పిన స్థితిలో బొమ్మల్లా
అంబులెన్స్‌లో హాస్పిటల్ పాలయ్యేరు

వెలిగే వీధి దీపాల ముఖాలపై
చీకటి ముద్దలు విసరి నట్లుంది

పొగలతో కప్పబడీ, నిశి ఆగమనంలా
సెగలతో చుట్టబడీ, మనిషి యశ్శశ్శిఖరం

నిండా మునిగిన శోకంతో ఆశ్చర్యంగా
జడ భావం పొందుతూంది! ఈ సమయం

ఎవరూ చూడరాని చూడలేని సమాజ విషాదాలు
దాటేందుకు సాధ్యం కాని గోతులూ మంటలూ,
ఏ భయ సూచన లేకుండా మనిషి శక్తి వృథాగా
ఎక్కడ బడితే అక్కడ! మారణ ధ్వని చిత్రాలు

ఆటవిక చర్యలతో గాయాల గుహలతో సమాజం
కూలుతూన్న అస్తిత్వం! ముక్కలుగా చెదరిన విలువలు

సమయ సమయం జడత నుండి చేతనతో
జీవన లయ వీడని సుగమ స్వరంపై కోరిక,
సాధారణ మానుష విజయానికి కావలసిన భూమిక!
ఇది ఏ దేశం మతం జాతి ప్రాంత మితం కాదు

సగం మృగం సగం మనిషి మానసికంగా
ఎప్పుడెవరు బయటికి వచ్చేదీ తెలియదు

ఏ లేబిల్‌తో నయితేనేం?
బయట పడిన మృగం!
నగరంలో జన సమూహ శ్రేణుల్లో
బీభత్స ముద్ర వదలిపోతుంది

ప్రతి వాదంలోని సమస్యను గుర్తించడ మవసరం
హేతువుతో పరిష్కార సంస్కృతి! ప్రజాస్వామ్య చిహ్నం.

# 21. అందని అంతరంగం

నిరాశలో అశాంతిలో ఉరి చర్యకు తలపడీ
ఆత్మ హత్య క్రింద నేరం నమోదవుతుంది

అతి పెద్ద నేరానికి శిక్షలో చివరిది, ఉరి
ఆ ఉరి తీసే నియతమైన వ్యక్తికి బహుమానం

చట్టం పని ముగించిన పాలకుల్లో తృప్తి
అంతా పైపై జరిగే ఒక క్రియాకలాపం

నేరానికి మెడకు పడే ఉరిత్రాడు
క్షమలో రక్ష మాల అవడమేమో కానీ,
నిన్న పూల మాల పొందిన నేతకు
నేడు ఉరితాడు పడే అనుమానం కూడా

బ్రతుకులో గెలుపు అంటే
బులెట్ పేల్చి ముగించడం కాదు
మనిషిలో న్యాయ మంటే
ఉరి తీసి తెర దించడం కాదు

నేరానికీ శిక్షకూ మధ్య దశ లెన్నో
హిత వాక్యం సంస్కరణం పరివర్తనం
మనో వికాస రూపాలన్నిటినీ వదలి
చట్టం పని అవజేయడం ఎవరికి సమ్మతం?

మానవీయ సూత్ర బంధం ఛిన్నమై
మానవతా గంధ లహరి కలుషితమై
సరసిలో సూర్య బింబంలా అంతరంగం
అందని శిఖరాలకై భ్రమిస్తూంది మానుషం

# 22. కార్డు లాగ

జాలరి జలధి లోకి వెళ్ళేందుకు
కవి సమాజం లోకి వెళ్ళేందుకు
భయపడ రెపుడూ సందేహించరు
ఇష్టమైన పనిలో అంతా తమ మంచి కనీ

ఒకరు వలను పన్నీ
ఒకరు ఊహ చేసీ
ఇరువురిలో అన్వేషణ ప్రవృత్తి ఒకటే
పనికి అవసరమైన సాహస మొకటే

అనుభవ వాస్తవంలో సుందర క్రియా రూపాన్ని
అనుకోని తుపాను ఏ తీరానో వదలుతుంది
ఏ మేఘమో అందుకొనీ
ఏ మైదానంలోనో విడుస్తుంది

మైదానంలో చెట్టు తలపై పూల గుత్తి అవుతుంది
చెట్టు నీడ ప్రియంగా ఉన్న చోట నుండీ స్వాగతమిస్తుంది

నిశా కాల ప్రవాహంలో పరిశుభ్రమై
మరునాటికి నిదుర నుండి లేచిన రూపం
వేణువై మ్రోగుతుంది హార్మనీ అవుతుంది

పేకాటలో ఆడ బడే ఒక్కొక్క కార్డులాగ
వివిధ పాత్రలలో కవి మనోరూపం
అందుకే కవిత ఆల్ ఇన్ వన్

# 23. ఆయుధం చేతిలో

మనిషి చేతిలో ఆయుధం బదులు
ఆయుధం చేతిలో మనిషి! ఇపుడు
ద్వేషంలో ప్రేలుడుతో ఏర్పడిన లోయను
ఏది నింపగలదు? కరుణ జలం తప్ప

కరుణం మనుషుల్ని దగ్గర చేరుస్తుంది
వీరం మనుషుల్ని పైకి ఎదగ జేస్తుంది
కోపంలో చెలరేగిన మంటల్ని ఆర్పే
యత్నంలో జలసేచనతో, శాంతికై తపన!

ఒక సమయంలో ఆయుధం జవాబు నిస్తుంది
చీకటిని చీలుస్తుంది వెలుగు దారి చూపిస్తుంది
ప్రవాహంలో సూర్యుడు కొట్టుకొని పోడు
అలల మధ్య ఊగుతూ కాలం గడుస్తుంది

వెలిగే వత్తికి చావు భయం ఉండదు
ప్రేలే ఆయుధానికి శత్రు భయం ఉండదు
మ్రోగే గంటకు శబ్ద భయం ఉండదు
అన్నీ తమ తమ పనిలో లోతుగా విలీనమై

చంద్రునికి దగ్గరగా వెళ్ళితేనే
హ్లాద రూప మేమిటో తెలుస్తుంది
సూర్యునికి దగ్గరగా వెళ్ళితేనే
వీర తేజ మేమిటో తెలుస్తుంది

నిద్ర లేచే సరికి విషాదం తరలి పోతుంది
అంతా సువర్ణమయమై! ఉత్సాహ శక్తి నిస్తుంది

# 24. నిత్య దశ

వర్తమాన సమాజంలో భాగమై రాజకీయం
కవిలో అంతో ఇంతో తప్పదు ప్రతిఫలనం

అంతరంగ బింబ ప్రకాశం! కవితలో
రాజకీయ వర్ణ ప్రభావం! బ్రతుకులో

ప్రతి జాతికీ ఒక ఆలోచనా సరణి
ప్రతి మనిషిలో ఒక ప్రవర్తనా సరళి

మంచినీ చెడునూ స్పృశిస్తూ జీవితం
ఇరు వైపుల రాక పోకలతో యానం

రైలు బోగీలో పక్కన ఎవరెవరో?
దీని కెవరి ఇష్టంతో పని లేదు!

పుట్టుకతో లభించిన మహా కాల రూపాన్ని
పూర్తిగ సద్వినియోగం చేసుకునే దెవరు?

ఆరోహణను అరికట్టే అవరోహణతో
అవరోహణను అరికట్టే ఆరోహణతో
సమాజ గతులతో మానవ వికాస చరిత్ర!
పేర్చిన తర తరాల ప్రతిమల వరస కాదు
సంస్కృతి గుర్తుల సందర్శన శాల కాదు

రేకులు తొలగిస్తే, కుసుమ రూప మెక్కడుంది?
అలలు వేరు అయితే, జలధి రూప మెక్కడుంది?
రోజు వేరు చేస్తే, కాల రూప మెక్కడుంది?

ప్రశ్న కదలితేనే గవేషణలో
సమస్యకు పరిష్కారం సాధ్యం

చరమ దశ అంటూ లేదు కవితకు
ఉన్నది ఒకే ఒక దశ, అది నిత్యదశ

# 25. దూరంగా మృత్యువు

అంతరాత్మ అందుబాటులో లేని అమూల్యం
మనిషి దృష్టి కందని పెట్టెలో భద్రంగా
దీని నెందరో! తమ అవసరాలకు
ఏదో ఒక రూపంలో కొనడానికి సిద్ధంగా

భ్రమలో అంతరాత్మ బింబంతో సరిపోతుంది
తెలిసీ తెలియని రేఖల్ని అంటుకొనీ జీవితం
పట్టాలపై రైలులా సాగిపోతుంది
ప్రయోజన దిశలలో కదలని మనసు లేదు

ఎవరెస్టు అధిరోహణం ఒక సాహస కార్యం
ఇంటరెస్టు కాపాడు కోవడ మొక లౌక్యం

శిఖరంపై నుండి క్రిందికి ధార జారక తప్పదు
తనలో అభిలాష జారి పోవడమూ జరుగుతుంది

అనుభవ రూపాలెన్నో పోత పోసిన బొమ్మల్లా
జీవిత చరితకు సుందర శాలా రూపాన్ని ఇస్తూ

జీవవంతమైన వాస్తవాల చలనంతో
గతం కన్న వర్తమాన మెప్పటికీ నిజం

కాలగతి కతీతమై గుప్తంగా అంతరాత్మ
ఎప్పటికపుడు మనసుకు శాంతి కవచ మందిస్తుంది

శుభ్రమైన యశో రూపానికి ఎదురు పడీ
దూరంగా జరుగుతుంది! మృత్యువు నిశ్శబ్దంగా

# 26. గుడ్ బై చెప్పిపోతుంది

పొద్దు పొడిచే సరికి
ఆ నోట ఆ నోట వార్త
అడవి నుండి పులి వచ్చిందనీ
ఊరు బయట జనావాసాల్లో! తిరుగుతూందనీ

ఆకలికి తాళలేక రావచ్చు
  దారి తప్పి ఇటు రావచ్చు

ఆ పులిని చూచిన వారెవరో తెలియదు
విన్న వారి నుండి వినిపించే వారే అంతా
ఆ వార్తలో నిజమెంతో తెలియదు
ఖండించే అవసరమూ లేదెవరికీ

మాటకు మాట జోడింపబడీ
ఒకరి నోటి నుండి మరొకరి చెవికి
చేరుస్తూ గాలి కదలుతూంది మెల్లగా
వార్తను హత్తుకొనీ శిశువులా భద్రంగా

ఎవరి వార్త వారికి వాస్తవం
ఇది కల్పనలో పెరిగే గ్రంథం కావచ్చు
కథలేంది మనిషి బ్రతుకు లేదు
కథ పట్ల రక్తి లేని మనిషి లేదు

ఏదో ఒక వైపు నుండి అనుమానం పెరుగుతూ
బ్రతుకులో వైపు లెన్నో అన్ని దారుల నుండీ

మనిషిలో తీరు లెన్నో అన్ని ఊహల నుండీ
పులి వార్తతో వాతావరణం మృత్యు భావ చిత్ర మవుతుంది

ఎంతటి భయ వాతావరణంలోనూ
పులి గురించి చర్చ! జరుగుతుంది, అమితోత్సాహంగా

అంతలో ఉపాయం మెరుపులా మెరుస్తుంది
రక్షణ కయి ఆలోచన లెన్నో! కదలుతాయి

గురి పెట్టిన బులెట్‌తో అంతం చేయవచ్చు
భద్రంగా బోనులోకి తరలింపబడవచ్చు
ప్రాణిపై ప్రేమతో జంతు శాల చేరవచ్చు
ఏ బ్రతుకు తెరువుకో సర్కస్ లోకి రావచ్చు
మనిషితో బంధంతో
స్నేహ సుందరంగా శిక్షణలో గడపవచ్చు
అన్నింటినీ తప్పించుకొనీ పారి పోవచ్చు

రోడ్‌పై ఏ వాహనమో ఢీకొనీ
గాయపడిన ప్రాణి నెత్తురు మరకల
దృశ్యం! సమయాంతరాన నేలపై
పులి పంజా ముద్రను తలపించవచ్చు

ఒక కార్నర్ నుండి హెచ్చరిక
మనిషిని జాగత్త పరుస్తుంది
పయనంలో దుర్గమ మార్గాన్ని వదలి
వెళ్ళే మరో దారికి కారణమవుతుంది

పులి అనగానే మనిషిలో భయ భావం
మబ్బులా కమ్ముతుంది! సమాజంలో
మనిషి నుండి మనిషికి కథ విస్తరిస్తుంది
కాలం కలిసి రాని సమయంలో
భయ రూపం ఆవరించి హఠాత్తుగా
ఎదురైన మృత్యువు
గుడ్ బై చెప్పి పోతుంది.

# 27. వాస్తవ తీరానికి

నడుస్తూన్న నా ముందు
పరచిన రెడ్ కార్పెట్‌లా వర్తమానం
కాలం నడిపిస్తుంది
మూసిన దిశ తలుపు తెరుస్తూ

మేథలో ఆలోచనా మేఘంతో
సమాజ క్షేత్రంలో జీవన కళ!
మనిషి మాటకై పాటకై వేచీ
మనిషితో మనిషి పరిచయ మొక భాగ్యం

ఇసుక బొమ్మల క్రీడ కాదు జీవితం
ఎవరి శ్రమ రాగం వారికి ప్రియం
కష్ట పడని మనిషి లేడు
బాధ పడని మనసు లేదు

ప్రవాహ తీరాన శిలలా నిలబడే కన్నా
ద్రుత గతిలో పడవలా తరలడం మంచిది

ఆయుధం అవసరం లేని సమాజంలో
శ్రమ దృశ్యంలో మానస సుందర రూపం!

తీవ్ర వాద హింసలో రక్త తర్పణంతో
చివురించే తరం కాదు కావలసిందీ
ద్వేషంలో జ్వలించే క్రూర వర్తనంతో
రణమయ సమూహం కాదు కావలసిందీ

ఎగసే మంటలకు బదులు
విరిసిన పూల తీగె కదలనీ
స్వప్న పంజరం నుండి హంస
చేరనీ జీవన వాస్తవ తీరానికి

# 28. ముఖానికెదురుగా

ఒకరి ముఖాని కెదురుగా మరొకరి ముఖం
గ్రీన్ బల్బు గానో రెడ్ బల్బు గానో ఎల్లో బల్బు గానో
తెలుపు బల్బు మాత్రం! లోలోపల ఎక్కడో
అంతరంగ రహస్యం మరొకరికి తెలియనిదీ

ఒకరి దోయిలి కెదురుగా మరొకరి దోయిలి
పూల తోనూ పండ్ల తోనే కాదు, దుమ్ము తోనూ రాళ్ళ తోనూ
విప్పిన మనసు నుండి ఏదో ఒకటి ప్రియంగా
శూన్యంగా మాత్రం! ఎదురు పడ కూడదనీ

కళ్ళు విప్పిన కుసుమం
కనులు తిరిగి మూత బడవు
దారి దొరకిన ప్రవాహం
అడుగు వెనక్కి వేయ లేదు

చుట్టూ అవతారా లెన్ని వెలసి ఉన్నా
మరో అవతారం కై మనిషి నిరీక్షణం

వెలుగును తిరగేస్తే చీకటి
చీకటిని తిరగేస్తే వెలుగు

కనిపించే మనిషిలో కోరే రూపం కయి
ఎదురు పడే మనిషిలో ఆలోచన! అన్వేషణ

కొలతలతో చేసిన రూపం కాదు
ఏ కొలతలకూ సరిపడని శిఖరాలతో
తెలియని గభీరత తో మనిషి అస్తిత్వం
పరచిన విశాలత తో మానవ జీవితం

కాలం కదలుతుంది అనుభవంలో
రహస్యంలో మరో రహస్యం దాగీ

# 29. ఉగాది కవిత

## (1)

ఈ రోజు ఉగాది
ఉదయం ఎపుడో విచ్చేసింది
ఇంతకూ ఏ వైపు నుండీ
కోకిల స్వరం వినిపించడం లేదు

ఒక మర బొమ్మ నుండో
ఒక రింగ్ టోన్ నుండో
ఒక కాలింగ్ బెల్ మ్రోగీ
అచ్చంగా కోకిల స్వరం! వినిపిస్తుంది

అసలు కోకిల పేరెత్తడానికి
కవి గొంతు వెనకాడుతూంది
స్వర పేటికను సవరించుకోవలసి వస్తూంది
లోపలి తలుపులు తెరచుకోవలసీ ఉంది

కాలానికి ప్రకృతి నుండి సన్మానం ఈ ఉగాది
నవం నవమైన ఊహకు సంకేతం
సృజన రుచులు తెలిసిన మనసుకు బహుమానం
దీన్ని ఎవరు వదులు కుంటారు?

ఇది ఎవరికి ప్రియం కాదు?
గుడిసె ముందు మేడ ముందు
పూచే పూవు ఒకటే, వీచే పరిమళం ఒకటే

ఎటు చూచినా పరిచయ రూపాలే
వసంత స్పర్శతో రాగానికి బదులుగా
ఇపుడు ముఖాలలో అద్దంలో బింబాల్లా
అనల చిత్ర రూపాలో కటొకటీ దాగీ

లోపలి హృది మండే కుంపటితో
బయటికి పెదవులపై సుమ హాసంతో

జారే కన్నీటి కణంలో సూర్య కిరణ తాపం
బాధా రవంలో దూసే పదును కత్తి వేగం

కాలం కదలుతూంది
ముక్కలు ముక్కలుగా చెదరీ అనుభవంలో
వీటిని ఒకటిగా చేసి
చూడాలని! విజ్ఞుల కోరిక! ఎప్పటిదో

బడుగు గుడిసెను చుట్టీ
పేద బ్రతుకులు చూచీ
దళిత గళిత స్థితుల నుండీ
మనిషి గెలుపు జాడలు తెలిసీ
కాస్త ఆలస్యంగా దయచేసే
కోకిల స్వరం వినిపించవచ్చు

చర్యతో అనుచర్యల ప్రతిచర్యల చలనంతో
ఎవరికి నచ్చిన విషయం వారికి ప్రియం

ఎప్పుడు బడితే అప్పుడు
దిశలో ఇంద్ర ధనుసు అలంకరించదు
ఎప్పుడు బడితే అప్పుడు
ఇలపై పుష్ప ధనుసు అవతరించదు

ఈ రోజున మనో భవ స్థానాల్లో
ఉగాది సమయంలో వసంత హృదయంతో
మనిషి మనిషిలో వేరు వేరు అవసరాలు
కోకిలకు జతగా ఒకే మానవతా స్వరం

ఆలోచన స్వర్గానికి నిచ్చెన వేస్తే
అనుభవం అవని పైన తిప్పుతుంది

అన్వేషణలో కోకిల! అంతరంగ శాఖపై
స్పందనలో రస రమ్యంగా! మధుర స్వరంతో

ప్రకృతి నుండి సమాజానికి తిన్నగా
హృదయాశయ రాగంతో కలిసీ ఒకటై
లోపలి తలుపులు తెరచుకొనీ
భయం లేని నిజం దారిలో ఉగాది!

## ఉగాది కవిత - 2

ఈ ఉదయం ఉగాది! ఉల్లాస కళతో
కవితకు స్వాగతం చెబుతూంది
ఉల్లోల జీవన బాధల లోనూ
ఉదార చరితుని హృదయంలా

చిర కాలపు బంధువు ఉదయం!
కవితకు స్వాగతం చెబుతుంది
జీవన రణ తంత్రంలో నిజ గుణ నీతిలో
ఆశా పటంపై సమాజ వర్ణ చిత్రంతో

అందరికీ అబ్బేది కాదు కవిత!
అందరికీ తనపై మాట్లాడే వీలయింది!

ఊహకు సృజన రూప మిస్తుంది
మాటకు పదును అంచు నిస్తుంది
అనల కణాల్ని చిమ్మ వచ్చు
నీటి కణాల్ని రాల్చ వచ్చు

ఈ ఉగాదిపై ఆశ! అందరిలో
సుమ పరాగ రాగ దృశ్యంపైనే

స్పందనకు భేదాలు లేవు! హద్దులు లేవు
పరిమళానికి వర్గ వర్ణ స్థల భేదం లేదు

తొలి దశలో పూవులా అలరిస్తుంది
మలి దశలో పండులా రుచి నిస్తుంది

పదాల మధ్య దూరం తగ్గీ అర్థంలో
వాక్యాల మధ్య దూరం హెచ్చీ ఆలోచనలో
శబ్దం వెనక నుండి వ్యక్తీ – సమాజ చింతనతో
వెలుగు వలె వెన్నెల వలె పరచుకొనీ

ఈ ఉగాది కవిత చదవగనే వినగానే
తటిల్లేఖా సుందరమయి అనుభవం
ఎండకూ వానకూ చలికీ అతీతమైన
మానవతా రేఖల బొమ్మలతో కాలం

కవి ఒకడే! వెలుగు రచన ఒకటే
శ్రోతలెందరో! పాఠకులెందరో
వివిధ స్థాయిల్లో గ్రహణ రీతుల్లో

ఎవరి దృష్టి కోణం వారిది
ఎవరి రుచి భేదం వారిది

ఈ ఉగాది సృజన రూపం
సుమ ఫల భరమై నవతకు సంకేతం

కవిత ముందు, ఈ రోజు
మృత్యువు ఎదురు పడితే
“సారీ” చెప్పి వెళ్ళి పోతుంది

# 30. చార్‌మీనార్ -1

నాలుగు వైపుల మీనార్‌ల కట్టడం
నేల నుండి నింగి వైపు
ఆశలు పెంచుతూ పైకి సూటిగా

నాలుగు దారుల మధ్య ప్రౌఢంగా
ఛాతీ విరుచుకొని నిలిచీ
నయన పటంపై వస్తాదు బొమ్మ దింపుతుంది

అందరికీ కావలసిన పెద్ద మనిషిలా
ఎన్నిటికో సాక్షిగా, ఇన్ని ఏండ్లుగా
తెల్లని దుస్తులు ధరించిన సన్యాసిలా
ప్రజ కోసం ప్రార్థన చేస్తూ ఉన్నట్లు ఉంది

వరసలుగా వివిధ వస్తు సంచయ శ్రేణులు
మెరసే పలు రంగుల గాజుల తళతళలూ
వేలాడే చమ్కీ దుస్తుల నిగనిగలూ

ఉండి ఉండి సప్రియంగా మనసును లాగే
పూలు! అత్తరు! స్వీట్సు! సువాసనా లహరులు
కావలసిన అన్ని హంగులతో! విపణి వీధి

షేర్వాణీ బుజాన్ని ఆనుకొనీ
మరో బుజం! శాలువా వేసుకొనీ
నవ రత్నాలు కలిసి రాలినట్లు
వివిధ వేష భూషా భాషా సంశ్లేషం

చార్మినార్ చారిత్రక నిర్మాణం ప్రక్కనే
వెలసిన భాగ్య దేవత! గుడి ఎప్పటి నుండో

ప్రతి ఏడూ ఒక కొత్త అందం చేరుతుంది
కొత్త ఆశలు తొడుగుతుంది ఈ చిన్ని ప్రతిమ!

చార్‌మీనార్ నుండి ఆలయానికి
ఆలయం నుండి చార్‌మీనార్ కు
స్వేచ్ఛగా పావురాళ్ళు! వస్తూ పోతూ!

స్నేహ సుందరంగా ఉన్న వాతావరణం
చకితంగా అగ్గి పుల్ల గీసినంత సులభంగా
వేడెక్కుతుంది! కారణ మేదయినా కావచ్చు

దుమ్ము ఎగసీ, పొగలు కమ్మీ, అగ్ని చిమ్మీ
మండుతూ, కను రెప్పలు మూత పడతాయి

శిలలా నమ్మకం! తెరలా అనుమానం
ఒకరొకరిలో ఎంతటి పని నయినా చేయిస్తుంది

చీకటి చుట్టుకొనీ
లిప్తలు ఉక్కిరి బిక్కిరి అవుతాయి

అపుడపుడూ ఏదో మిషతో అశాంతి సంచలనం
ఉద్యమాల సంరంభం! ప్రమాదాల బీభత్సం

అలజడిలో నినాదాలు! కేకలు! నిప్పు సెగలతో
చండ గ్రీష్మం అతిథిగా విచ్చేసినట్లు ఉంటుంది

ఘర్షణలో వికార చర్యలు, రహస్య ఎజెండాలో
జారిన గులాబి మొగ్గల్లా! రాలిన నెత్తురు చుక్కలు
ఏ కత్తి పోట్లవో
ఏ లాఠి దెబ్బలవో!

నిశ్శబ్ద ముద్రలతో చుట్టూ కర్ఫ్యూ
మౌన బంధంలో పరిసర ప్రాంతం

రాజకీయ చదరంగంలో ఎత్తులపై ఎత్తులు
గెలుపూ! ఓటమి! దోబూచులాడుతూ

మనిషిలో బలంతో పాటుగా, దుర్బలతను చూపుతూ
వచ్చే కాలానికి! ఏ విజయ హస్తమందేను?

పై పైకి ఎత్తుగా చార్మినార్
కల్పనలో కళతో ఆదర్శం రూపం
నేలపై సంక్షుబ్ధ సమాజ దృశ్యం
ఒక సమయం జీవన కటు వాస్తవం!

దుమ్ము నుండి పొగల నుండి సెగల నుండి బ్రతికీ
నింగినీ నేలనూ కలుపుతూ పోయే పావురాళ్ళు!
చార్మీనార్ నుండి ఆలయానికీ
ఆలయం నుండి చార్మీనార్కూ
ఎప్పటికీ స్వేచ్ఛా ప్రియంగా
మనిషి మనిషికీ స్నేహ సందేశంతో

## చార్మీనార్ - 2

పీఠ భూమి తలాన ఒక సంస్కృతి చిహ్నం
వ్యక్తిలో మేల్కొన్న కళా భావ ప్రకటనం
కల్పనకు దూరంగా వాస్తవానికి దగ్గరగా
సమాజ శ్రేయానికి ప్రేరణ నిర్మాణం

ప్లేగ్ నుండి బతుకులు గట్టెక్కిన సందర్భం
మదర్సాకో నమాజ్కో అంతస్తుల నిలయం
అవసరమూ సంతోషం కలిగిన వాస్తు శిఖరం
జన దృష్టిని నిలువుతుంది తెలిసిన హద్దుల్లో

నాలుగు దిశల నుండి రహదారుల్ని
కలుపుతుంది గుండెలా ఒకే చోట!

మరో కొత్త బాట చూపుతుంది మధ్యలో
ఈ విభవం ఎవరిది? కళా హృదయానిది!

మత భావన కళా దృష్టి రెండూ
చెరొక వైపు నుండీ పాగి
ఒకరి చేయి ఒకరు పట్టుకొనీ
స్నేహంగా నిలిచి నట్లుంది

జనం మేలు తలచే కోరిక కాకృతియై
శాంత భావ రమణీయం! ఈ ఉన్నత రూపం!
స్వప్న శకలం స్వర్గ ఖండం దూర దూరమై
మానవంతో జీవితానికి దగ్గరవుతూంది

అపుడపుడూ అల్లరి మూకల పనిలో
కొన్ని లిప్తలు నిప్పు మొగ్గలవుతాయి

నిశ్శబ్దం నుండి కోలాహల జగం లోకి
కోలాహలం నుండి నిశ్శబ్ద ప్రపంచం లోకి
నిరంతరం తిరిగే నగర భావ చక్రానికి
నాలుగు అరలకు కేంద్రం! ఈ వాస్తు విశేషం!

అలల మధ్య నాలుగు రేకుల పద్మంలా
ప్రజల మధ్య కాలం మెచ్చిన, పతకంలా
ఆశల విపణిలో ఎప్పటికీ చెల్లే నాణెంలా
చలన సమాజంలో శ్రమ జీవన సాక్షిగా

నాలుగు వైపుల పై కెగసే కోర్కెల కళా రూపం
చరిత్ర అద్దాల కేస్‌లో భద్రంగా! చార్‌మీనార్!

తెరచిన పాత పుస్తకం పుటలో
మాసిన అక్షర పంక్తిలా మూసీ! దగ్గరలో

# చార్మీనార్ - 3

ఉన్నట్లుండి ఒక చిన్న గలాటాలో
తెల్లని చార్మీనార్ శాంతి కవచంపై
నిప్పు రవ్వల మసి అంటుతుంది

మత కలహం లేని, జన భాగ్యం కోరీ
ప్రార్థనా స్వరాలు! విశ్వ హృదయ స్పందనతో
అంతా పాత బడీ కనుమరుగవుతుంది
మలిన మెరుగని చార్మీనార్! చేతులెత్తి దీవిస్తుంది

వీధిలో ఇరువైపుల శ్రేణులుగా వస్తువులు వరసల్లో
హస్త కళల నుండీ! యంత్ర మయం వరకూ

ఒకరి మాట మరొకరికి వినబడని
ధ్వనుల పొరల్ని చీల్చుకొనీ సూటిగా
“అల్లాకే కరమ్” దేవుని దయ అంటూ
చాచిన చేతులతో నడుస్తూ మెల్లగా
మనిషికీ మనిషికీ మధ్య సందు చేసుకొనీ
యాచకులు! శూన్య గగన ముఖాలతో

ఎండలోనూ ‘గరమ్ చాయ్’ కోరే రసనతో
పెదవులు తడుముకుంటూ కదలే ఆగంతకులు

“రెక్క ఆడితేగానీ పొట్ట నిండదు” అన్నమాటకు
వివరణగా శ్రమాలోల జన సమూహాలు!

కదలీ కదలని కాలంలా ఒంటెద్దు బండీ
ఆగని వర్తమానంలా యంత్ర వాహనం
రెండూ పక్క పక్కనే వీడని యాన బంధంతో
భవిష్యత్తు అంచుల్లో జీవన రూపాలతో

మార్పు లేని ఓర్పులో
నెల వంక వెలుగు జాడతో
కళ్ళు మాత్రం మెరుస్తూ చుక్కల్లా
నీలి ముసుగులతో కదలే చీకటి శిల్పాలు!
అడుగులో అడుగు వేస్తూ నడచే జనానాలు

కఠినమైన వాస్తవం నుండి ఎదిగే భౌతికంతో
నిటారుగా నిలిచిన ఆదర్శ రూపం! చార్‌మీనార్

అంతా! జన భాగ్య ఫలం అన్నట్లుగా
మనిషిని ఉన్ముఖం చేస్తుంది, నిర్మాణ కళతో

అరిగిన పాత నాణాల్లా అరుగులపై పాత తరం
పదును తేలిన చాకుల్లా! వీధుల్లో కొత్త తరం

వనం నుండి తనలో లేనిది ఏదో
పొందేందుకు వస్తుంది వసంతం,
సాయం సమయంలో!
ఒక చక్కర్ కొట్టిపోతుంది,
చార్‌మీనార్ పరిసరాల్లో స్నేహ సుందరంగా
తాకే మానవతా గంధాన్ని హత్తుకొనీ

# 31. ఇరువైపుల శాంతి కోసం

ఇరు పక్షాలూ చెప్పే మాట ఒకటే
తమ లక్ష్యం సమాజ సౌభాగ్యం శాంతి అనీ
ఒకరి నొకరు చంపుకొనే చర్య గుప్తమై
ఎరుపు నలుపు గుర్తులతో జీవన మార్గం

ఒకరిని చంపి తాము బ్రతకాలనీ
ఒక్కరి నయినా చంపి తాము పోవాలనీ

ఏ బ్రతుకూ తీర్చిన బొమ్మల కొలువు కాదు
అనుకున్న విధంగా అన్నీ అమరడానికి

శాంతికై సమాధానం! ఎక్కడి కక్కడ మితమై
ఎవరి దారి వారిది! దిశల వలె బహువిధాలు
అడవి చేయి పట్టుకొనీ దూరమై
చెట్ల మధ్య కొండలలో పరిమిత గణంతో
విశాల సమాజ హిత చింతనలో
ఉగ్రవాద బీభత్స ముద్రలతో!

వ్యతిరేకిని హత మార్చడమా?
బ్రతుకు గడపనీయడమా?
సమాధాన మెప్పటికీ!
చిర మానవ సంస్కృతిలోనే!

ఆకురాలిన ధ్వనికి భయ గుండంలో చిక్కీ
అనుమానం వస్తే రహస్య వలయంలో కెళ్ళీ
ఒక మారణ గుణంతో తప్పు సమాజంలో
జటిల సమస్యకు పరిష్కారం లేదనీ
నిప్పు కణాలెగిరే ఆలోచనతో

ఇనుపు రేకుల గుండె బలంతో
సామాజిక క్రియలో ఉగ్రవాద రూపాలు

తీవ్ర తీవ్ర చర్యలతో పదు నెక్కిన ఖడ్గాలు
తీవ్ర వాద శబ్దంలో పద మెత్తిన దళాలు

రాగంతో ప్రకాశించే హృదయం
ద్వేషంతో మంటల్ని అంటుకుంటూంది
కరుణతో ఆర్ద్రమయ్యే సన్నివేశం
హింసతో రక్త చిత్రమవుతూంది

## 2

విద్యుత్ షాక్ పిడుగుపాటు
మందు పాత్ర గన్ పేలీ
మారణ కారణ గుణ మేదయినా
పోయిన మానుష రూపం కనిపించేనా?

ఊడి జారే కొండ చరియ
పై బడి అణచి వేయొచ్చు
పెను తుపాను గాలి కెరటం
దూకి వచ్చి ఎత్తుక పోవచ్చు

ఒక మనిషి చావుకు మరో మనిషి
బలమైన కారణ మవడం
మానవీయ సంస్కృతి విధ్వంసంలో
ఒక విషాద ఘట్టం

అంతా పెను నిదురలో కలలో ఉన్నారనీ
తామొకరే మేల్కొని ఉన్న దీపాలనీ
చుట్టు ఉన్న సమాజం సంక్షుబ్ధ సముద్రమనీ
తమ సమూహ మొకటే నిర్మల కాసారమనీ
తమ వాదం గట్టుకు చేర్చే

భద్రమయిన సాధనమనీ
ఆలోచనా మేఘాలమై క్రియాశీల బృందాలు
విషాద పర్యవసానం తెలిసీ తిరిగే వారూ

నేలపైన జీవన వాస్తవ గతులను మరచీ
ఆగని హింసతో శాంతి లభించేనా?
నిప్పుల కుంపటితో చీకటి పోయేనా?

మనిషి ముఖం నుండి కన్నీటికి బదులుగా
జారే నిప్పు కణా లొకటొకటీ
సాధించే ఏ సమాజ లక్ష్యానికి గుర్తులు

అడవిలోకి వెళ్ళిన ఒక్కొక్కరి గురించి
ఇంట్లో బయటా ఎందరివో చింతలు
పెరిగి పెరిగి సమస్యల సమాజ మవుతుంది

అడవిలో దారి తప్పాలని ఎవరికి ఉంటుంది?
మృత్యువును తలపై వహించి తిరగాలని చూచేదెవరు?

ఒక మనిషి మనుషుల కోసం మనుషుల నుండి దూరమై
మనిషిని హత మార్చే పనిలో చేరీ
ఒక పక్షానికి వర మయితే
ఒక పక్షానికి శాప సమం

మానవతా స్పందనతో మానవీయ దార్శనికంలో
వర్తమాన వివేచనతో పురోగమన మొకటే కావలసిందీ

ఇరుపక్షాలు చెప్పే మాట ఒకటే నిజ కర్తవ్యం
తమ లక్ష్యం, సమాజ సౌభాగ్యం శాంతి అనీ

# 32. స్వేచ్ఛ ఉంది నిజమే

స్వేచ్ఛ ఉంది నిజమే! సందేహం లేదు
కానీ చీకటి వలయా లెన్నో దారిలో

గీసిన అగ్గి పుల్ల వెలుగుతో
కాలే సిగరెట్ వెలుగులో
దారి చూచుకొనీ నడవాలిసిందే
ఎక్కడా ఆగి పోవడం కుదరదు

స్వేచ్ఛ ఉంది నిజమే! సందేహం లేదు
కానీ పరచిన వల లౌక టొకటీ దారిలో

మెరపు లాంటి అదను నేర్పు తోనో
చాకు లాంటి పదును తెలివి తోనో
సమస్య నుండి బయటికి రావలసిందే
అచటే నిలిచి పోవడం కుదరదు

స్వేచ్ఛ ఉంది నిజమే! సందేహం లేదు
అపుడపుడూ ఊహ కందని తీరుతో
రక్షణకై వరించిన ఆయుధం వ్రేలుతుంది
బడిలో పిల్లలపైనో; బయట సమూహంపైనో!
ఇది నాగరక సమాజంలో సహింపరాని విపరీతం
ఇది చూస్తూ ఊరక ఉండడం సాధ్యమా?

స్వేచ్ఛ ఉంది నిజమే సందేహం లేదు
పూవు తెంపితే కొమ్మకు బాధ
కొమ్మ తొలగితే చెట్టుకు బాధ
బహు బాధల బంధాలతో జీవితం
పలు సమస్యల నిలయం! ఆల్ ఇన్ వన్

# గీతికలు

## 1

*మంచు లాగ మల్లె లాగ తెల్లనిదీ కాలం*
*సమయ సమయ వర్ణ భావ రేఖలతో దృశ్యం*

*సరసి లాగ ధార లాగ నిలచి సాగి పోతూ*
*మనిషి మనిషిలో విశేష గాథలతో పయనం*

*పగలు రాత్రి వెలుగు నీడ ఒకటిగ గడియారం*
*గుర్తులతో కాల గతిని చూపుతుంది రోజూ*

*కాల రయంతో సమాన చలన సూచి యంత్రం*
*కంటికి కనిపించని, నిజ కాల రూప చిహ్నం*

*సూర్యునికీ చంద్రునికీ దారులవే పాతవి*
*మనిషి కెన్ని అవసరాలో! దారులన్ని కొత్తవి*

## 2

*సృజన విలయ చరణ యుగం నిమిష నిమిష గతిలో*
*బ్రతుకు దారి కొత్త ముద్ర వదలుతుంది కాలం*

*ప్రకృతి నుండి మనిషి నుండి ప్రశ్నలవే పాతవి*
*పలు జవాబు లొక టొకటీ వేటి కవే కొత్తవి!*

*నింగి లోని గాలి పటం విలాస భవితవ్యం*
*కింది నుండి నిభాయించు చేతి ఆట తోనే*

*కదలికలో నిరంతరం అంచెలుగా కెరటం*
*తీర భూమి అంచు తాకి చెదరి జారుతుందీ*

*కనుల నుండి జారి పడే వెచ్చని బాష్ప కణం*
*అగ్ని లోకి మారుతుంది! ఉద్యమ చలనంలో*

### 3

దీపానికి చివరి మెట్టు చీకటి
ప్రాణానికి మొదటి మెట్టు ఏడుపు

యుద్ధానికి మొదటి మెట్టు కలహం
విజయానికి చివరి మెట్టు స్నేహం

సమస్యలో చివరి మెట్టు మానవం
యత్నంలో మొదటి మెట్టు శ్రామికం

హక్కుల కై మొదటి మెట్టు నిరసనం
ఘర్షణ లో చివరి మెట్టు విప్లవం

ప్రతి కవితకు మొదటి మెట్టు తపనం
ప్రతి బ్రతుకున చివరి మెట్టు త్యాగం!

### 4

చలి కాచు కొనే మనిషిని అనలం
చలిని వదలి, మ్రింగేసే కీలలతో

దాహం వేసే మనిషిని వాహిని
ఆకలితో మ్రింగేసే కెరటంతో

నిన్న అలలు! ఎత్తిన చుర కత్తులు
నేడు అవే! కొసుమ దళ పంక్తులు

నిన్న అలలు! మారణ గుణ శక్తులు
నేడు అవే! పై కెగసే! గువ్వలు

సంశయ భావంలో రాదు కవిత
నిర్ణయ రూపం తోనే విజయం!

## 5

చేతులు చాచీ ఆశలు పుట్టుక తోనే!
ఎటు పోయేదీ ముందుగ తెలియ దెవరికీ

ఆశలలో లేచిన గోడలు! తలుపులతో
ఎక్కడి కక్కడ పరిమితిలో తలపులతో

దారులు చీలిన బాటలలో ఒక రొకరూ
ఏ రోజూ గొప్పగ తామే వెలగాలనీ

రోజులు పేరుకొనీ వరసగ ఒకటొకటీ
చేసిన పనులకు మానుష యశసే చిహ్నం

ఎంతటి అవసర మయినా కానీ! అశ్వం
హద్దులలో ఉంటేనే! గమనం అందం!

## 6

అద్దంలో తన బింబం చూచే కొలదీ
రోజొక సరికొత్త ముఖం ఆలోచనలో

పోయే కొలదీ వేగం పెరిగీ కెరటం
పడవను ఎచటో! వదలేసీ పోకూడదు

ఎప్పటికీ ఒరలోనే అసి! బహు భద్రంగా
బయటికి తీసే సమయం! ఎపుడో? ఎచటో?

కత్తిని వీడదు వీరం! జీవన సమరంలో
వత్తిని వీడదు దీపం! చీకటి నిలయంలో

ప్రతి మనిషీ! తానొక కీలక పాత్రను పూనీ
అభినందన సంచికయై అద్దంలో! ఒకడే!

## 7

*పేదరికం! కింది అడుగు జారి జారి పోయేదీ*
*భోగపదం! పైని కప్పు ఎదిగి ఎదిగి పోయేదీ*

*అంతరాల వెనక నున్న చరిత్ర ఒక ఆరణ్యం*
*విభేదాల మధ్య నున్న వాస్తవ మొక శిలామయం*

*జీవన రూపానికి పలు భూమిక లయి ఎపుడో*
*వనం లేని శిలలు లేని కాలి బాట ఎక్కడిది?*

*ఉదాహరణ ననుసరించి సాగదు ఏ జీవితం*
*దేని కదే ఒక అనుభవ మానస మీ ప్రపంచం*

*ఆకు కాదు పూవు కాదు ఫలం కాదు ప్రాణం*
*రాలి పోవు దాని వెనక, రాదు మరో ప్రాణం*

## 8

*మనిషి నుండి వెడలే ఆర్త రవం ఎన్నటికీ*
*అరణ్యాన వీచే పవన విధం కాకూడదు*

*మనిషి లోన ఎగసే వేదన శిఖ లెన్నటికీ*
*ఇసుకు తిన్నె పయి పరితాప సమం కాకూడదు*

*మనిషి శక్తు లెన్నో! అన్ని కావు! ఇన్ని కావు*
*శాపమై వరమై! శాసన పాలన గతిలో*

*అయిన వారు కలిసీ, కాని వారు వీడీ*
*ఎచటి కచట చీలీ నాల్గు దిశల సాగే*

*కొమ్మల వలె వేరై, ఎదిగి పోవు బ్రతుకులు*
*చెట్టు మాత్ర మొకటే! మూల రూప మొకటే*

## 9

మృత్యు భయం! జనన క్షణం నుండి బ్రతుకులో
పడగ విప్పి లేచి ఆడు సర్ప సమంగా

హృదయ ప్రియం! జనన క్షణం నుండి వెలుగులో
పురులు విప్పి కదలి యాడు నెమలి విధంగా

చివురు వంటి మాటలో, ఒక సుందర నవం
పూల వంటి ఊహలో, ఒక పరిమళ వనం

ఎన్ని గిరులు బరువయినా అవని భరిస్తూ
నిరంకుశుల అడుగు కింద అణగి మణగుతూ

ఆలయాన గంటల ధ్వని! లహరులపై
తమ వేదన! దేవతలు వినాలనీ

## 10

తనలో బరువును, వదలే భావనతో జలదం
బహు దూరం! ఉరుములతో మెరపులతో పయనం

తనపై బరువులు పెరిగే కోర్కెలతో మనిషీ
బహు కాలం! బాధలతో గాధలతో నిలిచీ

నెరియలు పడి ఎండిన ధరణికి! నీరు అవసరం
బాధలతో నలిగిన మనసుకు, కరుణ అవసరం

జీవన నది అలలు దాటి పోవలసిన వేళలో
ఏదో ఒక తరణ సాధనం మనిషికి అవసరం

ప్రతి రోజూ నిశి! విరామ రూపంలో మనుషులు
ఉదయం మెలకువ తోనే! ఆరాటం మదిలో!

స్వేచ్ఛా కవిత్వం-57

ఉద్యమ కవిత

# ఉద్యమ పథం

## దీర్ఘ కావ్యం

మాదిరాజు రంగారావు

2014

రసధుని - సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

# UDYAMA PATHAM

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2014

Price : Rs. **50/-**

*Presented*
*to my daughter*
***Dr. M. Charitha***
California, USA
*with affection and blessings*
*on* **June 11th**
*on the occasion of her*
*Birthday*

# కావ్య పరిచయం

ఈ దీర్ఘ కావ్యం "ఉద్యమ పథం" – వర్తమాన సమాజంలో సమస్యాత్మక మయిన విషయం కేంద్రంగా ఉంది. ఇది లోకంలో సంభవించేదీ, మానవ సహజమైందీ, సమాజ రూపితమైందీ. దీన్ని కావ్య శాస్త్ర దృష్టితో "స్వతస్సంభవి"గా పేర్కోవచ్చు. సామాజిక గుణంతో లౌకికమైన వ్యవహారంతో ఏర్పడేది అన్న మాట.

మనిషిలో కనిపించేవి 1) ఒకటి మూల స్వభావం 2) రెండు ప్రాప్త స్వభావం. ప్రాప్తమైంది అంటే వివిధ కారణాల వల్ల అనేక సందర్భాల్ని పురస్కరించుకొని జరిగే మనిషిలో ఆలోచనలూ ప్రవర్తనలూ వల్ల సంభవించేది. ఇపుడున్న సమాజ స్థితి గతులకు చెందిన వాతావరణంలో, ఈ కావ్యంలో విషయం బాగా నప్పుతుంది. దీనితో పాటు మానవ మూల స్వభావ రూపాలూ ఆయా సందర్భాల్లో తగిన విధంగా స్పృశించడం జరిగింది. అందువల్ల ఈ రచనలో వాస్తవానికి దగ్గరగా వ్యక్తి వికాసానికీ స్థితికీ కారణమయిన సామాజిక కోణమూ తప్పని సరి అవుతూంది.

ఇక కావ్య రచనా విశేషం గురించి ఉత్తమ కావ్యంలో ఆత్మ స్థానాన్ని పొందిన ధ్వని "కావ్యస్యాత్మా ధ్వనిః" స్ఫూర్తికి వస్తుంది. ధ్వన్యాలోకంలో ప్రతిపాదితమైన ఆనంద వర్ధనుని ధ్వని సిద్ధాంతానికి చక్కని ఉదాహరణగా ఈ కవిత్వం నిలుస్తుంది. ఈ దర్శనాన్ని గురించి ఇక్కడ అప్రస్తుతం.

ఈ కృతిలో వాచ్యాన్ని అతిశయించిన అర్థ విశేషంతో ప్రతీయమానత్వాన్ని పొందిన రామణీయకత గోచరిస్తుంది. ఇది బాహ్యం నుండి ఆంతరానికి సహృదయులైన పాఠకుల ఆలోచనను పయనింప చేస్తూంది. వివిధ సందర్భాల్లో భావాను భూతి ప్రకటనంలో వ్యంజనా శక్తి చేత అర్థాంతరాన్ని భావింప జేయడం వివేచన కందుతుంది.

టి.ఎస్. ఇలియట్ వేస్ట్‌లాండ్ కావ్యం లోనూ భావ రూపాల ప్రతీకల సహాయంతో సాధించిన ఈ విధాన్ని ఆ కవిత్వంలో ముఖ్యంగా చివరలో గమనించవచ్చు.

ఈ సూచన – ఈ కావ్య సమాలోచనానికి ఎంతో కొంత ఉపకరిస్తుందనీ, ఏ కావ్య మయినా చివరకు సాహిత్య సహృదయుల స్పందన నిర్ణయమే గీటురాయిగా నిలిచిందీ, నిలుస్తుందీ.

**– మాదిరాజు రంగారావు**

# ఉద్యమ పథం

## 1. ఊపిరిలో ఉద్యమం

ఇది దుర్గమ కంటక మార్గం తప్పనిదీ
జన హిత చింతన పయనంలో భాగం
ఉద్యమ మొక ఊపిరిగా ఏండ్లు సాగవచ్చు
కొరే స్వేచ్ఛకు ఇది శాశ్వత చిరునామా

కోల్పోయిన మానవ హక్కుల కోసమో
రావలసిన పాలనలో న్యాయం కోసమో
కాలి బాట లో మొదలయి నడచి నడచి
రాజ పథం చేరుతుంది దీక్షా కవచంతో

జీవన చలనంలో వేరు వేరు స్థితులతో
ఆశయ దిశలో సామాజిక పాత్రతో
చరిత్రకు రూపం ఇస్తుందీ ఉద్యమ చైతన్యం
కొత్త పుటలు తెరుస్తుంది యుగ గ్రంథంలో

అపుడపుడూ అనల శిఖల క్షణాలతో
ఎరుపు రంగులో అక్షర పంక్తు లేర్పడతాయి,
యోజనలో జన మత సమాజ రూపమై
వర్తనలో మానవ వికాస చలనమై

ఎత్తిన పిడికిలితో ఎరుపెక్కిన ముఖంతో
కాలాన్ని కొత్త యుగం లోకి దింపుతుంది

ఈ మార్గం బహు కఠినం అని తెలిసిందే
పయనంలో నేల పైన పూలు పరచి ఉండవు

ఈ యత్నం ఆగని అలల సముద్రం
ఈ పిపాసలో సమాజ దాహ ప్రపంచం
తరగలపై గట్టుకు చేరే కర్తవ్యంలో
దాహం తీరే దొక విజయ భావ జలాలతో!

❋

## 2. అభిమానం కేతనమై

పుటలు తెరిస్తేనే గ్రంథంలో ఏముందీ తెలుస్తుంది
అట్ట పేరు చూచి మాట్లాడే వారూ ఉన్నారు

ఉద్యమ భావనలో సంవిలగ్నమైన మనసు
ఉద్యమ లక్ష్యంతో ఉద్వికసిత మవుతుంది
ఎన్నో విషయ భావ సంకలనం ఈ మనస్సు
ఒక దాని ప్రభావం మరొక దానిపై తప్పదు

జన విశాల లహరుల పయి కదలే ఉత్సాహ శక్తులు
వర్తమాన శిఖరాల పయి మబ్బుల వలె ఆలోచనలు
స్థూల సూక్ష్మ స్థాయిలలో ఆశయ గుణ శీలంతో
వ్యక్తులలో అంకిత భావనతో ఉద్యమం!

కొరడా ఝుళిపించే చేయిని నిలిపేస్తుంది
నిరసన గళ రవంతో జనతను మేల్కొల్పుతుంది

ఎండిన చెరువులా మూర్తి గొన్న దరిద్రంతో
దీనంగా ఉండలేదు! సమాజ మెప్పటికీ
ఉద్యమ వేగంలో ఊగే వర్తమాన సమయం
కలలు కనే అవకాశం! ఎక్కడిదీ మనసుకు!

అవసరమౌ త్యాగాలకు సిద్ధంగా జీవితాలు
బెదరని చెదరని లక్ష్యం వైపుకు పరుగులు తీస్తాయి

ఎప్పటి నుండో తమ భాగం కయి ఒక ప్రాంత ప్రజ
సమస్యల వలలో చిక్కి సతమతమై పోయేరు
న్యాయం కయి సమపాలన కయి సాగిన పోరాటాలు
జీవన భాగ్యం కోరీ! దశలు దశలుగా చరిత్రలో

ఉద్యమ యానం ఆగదు, ఆగలేదు సాగుతూంది
బాధలు ఎదురయినా అభిమానం కేతనమై!

❈

# 3. తొలి కిరణ స్పర్శతో

ఆశయ సాధనలో ఉద్యమ కాలం సర్వం
జన తతి ప్రయోజనాల బరువులతో నిండీ

అమరుల స్మృతి చిహ్నం చుట్టూ నిశ్శబ్దంలో
విషాద స్వరం వెడలి తిరుగుతుంది! సన్నగా
మసక మసక తెరలపై బాధా చిత్రా లొకటొకటీ
చేతి వేళ్ళు తాకితే విద్యుత్ తరంగం సరిస్తుంది

ఉద్యమ పరిణామంలో శిలాకృతులు అలలై
కష్టాలను భరిస్తూ నష్టాలను సహిస్తూ కదలీ
శకలాలు సకలాలుగా మారిన మహా దృశ్యం!
పూర్ణ శక్తి తో ప్రజా సమూహం ముందుకు అడుగేస్తూంది

మండుతూన్న వత్తి నుండి, వెలుగు రేక దూకుతూంది
బిగిసి ఉన్న మంచు నుండి, నీటి పాయ జారుతూంది

పాడుతూన్న పాట నుండి, పూలు రాలతాయి
మేలు కొన్న మనసు నుండి, బ్రతుకు కదలుతుంది

ధూళి కణం సోకని, మనిషి ముఖం లేదు
కోష్ణ స్పర్శ ఎరగని, జీవన రుచి లేదు
వివిధ వర్ణ శోభ లేంది, మానస క్షితిజం లేదు
రహస్య ఎజెండా లేంది, ఉద్యమ చరిత్ర లేదు

పిడికిలిలో రహస్యమూలం తన వరకే పరిమితం
పిడికిలితో రణ తంత్రం! మరొకరికి అందుతుంది
సూర్యుని తొలి కిరణంతో మనిషి కెంత ధైర్యమో!
అడ్డు ఉన్న నిశ తొలగి భయం మాయమవుతుంది

సూర్యుడు! ప్రతి ఉద్యమ జీవి గుండెలో
అరుణ కాంతి స్పర్శతో ఉద్యమ గమనంలో ధైర్యం!

❋

# 4. మనిషితో మనిషి

మనిషితో మనిషి వివిధ పరిచయ బంధాలతో
మనో జగం మారుతుంది ఎప్పటి కపుడు! కొత్తగా

ఉద్యమ తేజంపై తేలే మనుషుల రూపాలు
దైనందిన జీవన సరళిని మరచేరు,
ఆకలిపై దృష్టి ఉండదు
ఆర్జన పై ఆశ ఉండదు

ఉత్సాహం ఇనుమడించి ఉద్వేగం అతిశయించి
అభిమాన ఘనంగా బ్రతుకులో వెలగాలని

లిప్తల రెక్కలపై మోసు కొనీ కాలం
జీవితాల్ని ఎక్కడెక్కడో వదలేస్తుంది

ఒకరి నుండి ఒకరు అనుచిత లాభం పొందాలనీ
ఆర్థిక సామాజిక రాజకీయ స్థితులలో పడీ
స్వార్థంలో ఎత్తులకు అంతం ఎక్కడుంది?
ఒకటి తీరిపోతే, మరొకటి చేరుతుంది

అశ్రు నయనాలలో ఆర్త రవంలో విషాద చిత్రం
ఉద్యమ శక్తులకు! మరో అవకాశం కల్పిస్తుంది

మనిషిలో విలువల కన్నా బయటి హంగులకు ప్రాధాన్యం
జీవన భాగ్యంలో ఉన్న స్థానం కయి యత్నం
అవసరాలు తీరాక పై స్థాయికి ఆరాటం
ఆపై తానొక మేటి శిఖర మయ్యేందుకు! తొందర

ప్రపంచీకరణ మొక విశాల ప్రయోజన రూపం
విస్తరణ వైపు నడచే దేశాలెన్నో! ఉత్సాహంగా

ఉద్యమ తీవ్రత నరికట్టేందుకు! పాలనలో న్యాయం
జీవన భద్రత! ఆరక్షణ అవసరం

❊

## 5. ఆగని పయనం

ఎగసే ధూళి సుడుల నుండీ దారి చేసుకొనీ
కదలే పొగల సెగల నుండీ సందు చేసుకొనీ
బయట పడీ బ్రతికే వారూ
కనపించక పోయే వారూ

ఒకరు నిరాశా కరవాలానికి బలి అయ్యేవారూ
ఒకరు ప్రమాదాలకూ వినాశాలకూ గురి అయ్యేవారూ
తీరు! ఏదయినా, బాధా ముద్రలు ఒకటే!
మలుపు! ఏదయినా, సమాజ వేదన ఒకటే

కల్పనలో సుందర వన మవతరిస్తుంది
వాస్తవమై పరచిన దుర్గమ వన మెప్పటిదో
ఉద్యమ ఫలం! అందబోయి నట్లు ఉంటుంది
క్షితిజంలో బింబంలా ఆశను చూపిస్తుంది

చక్రంలా తిరిగే సంక్షోభం నుండీ
క్షేమంగా బయటపడే తొందరలో ఎగసీ
శాంతి పావురం! దూసుక పోతుంది
ప్రతి సారి! ఒక కొత్త ఉపాయంతో

ప్రమాద ఘడియ వస్తుంది ఏ సూచన లేకుండా
సంతాప సందేశాలతో నాయకులు 'క్యూ'లో

వెలిగే దివిటీ నుండి చీకటి గుహలో వెలుతురులా
అంతరంగం మనసులో బాధ్యతను గుర్తు చేస్తుంది

సూర్యునికి లేదు అలసట! వేదన!
శిశిర మయినా గ్రీష్మ మయినా ఒకటే
ఉద్యమానికి ఉండదు దీర్ఘ విరామం
ఆశయం సిద్ధించే దాకా సాగుతుంది పయనం!

❈

## 6. జవాబు అవసరం

ఉద్యమ గమనంలో అపుడపుడూ
తెలిసీ తెలియకుండా వెనక నుండి
పడగ విప్పి కదలుతాయి భుజంగాలు!
వాటిని గుర్తించడమూ అవసరం

చేతిలో అవసరానికి వెలిగే వత్తికి బదులు
కత్తిని పూనడం ప్రజాస్వామ్య యశసుకు కళంకం

దాహంతో తపించే విశాల సృజన భూమికి
కావలసింది నెత్తురు చుక్కలు కాదు,
ముందుగా పైలెట్ నీడతో సాదరంగా
వచ్చే మేఘం నుండి కరుణ జలం మాత్రమే

ఒక సమస్య వెనక నుండి ప్రశ్న తప్పదు
ముందు చూపులో! జవాబు మెరపులా మెరుస్తుంది
సర్ప బంధమై ప్రశ్నలు ఉక్కిరి బిక్కిరి చేయొచ్చు
విహగ రూపమై జవాబు అవతరించవలసి ఉంది

ఒక సంకల్పం సాకారానికి ఆటంకాలెన్నో!
ఒక ఉద్యమ చర్యలలో అవరోధాలెన్నో!

ఎండిన గంధానికి, జల స్పర్శ పరిమళాన్ని ఇస్తుంది
ఆగిన పయనానికి, ఉత్సాహం వేగాన్ని ఇస్తుంది

రత్నం వలె విలువయిన మేధతో పాటు
పుష్పం వలె అందంగా హృదయ మవసరం
కంటికి కనిపించని కార్య కారణ వశమై
చరిత్ర ఎవరి దిశా నిర్దేశంలో నడవదు

ఉద్యమ విజయానికి సంసిద్ధంగా ఎప్పటికీ
హేతువుతో తూణీరంలో జవాబు లవసరం

❃

# 7. సందేహంలో

చేయి కింద అణచ బడిన మస్తకం
పైకి ఎత్త గలిగి నపుడే యుగానికి స్వేచ్ఛ

అద్దంలో కనిపించని గాయం హృదిలో
ఉద్యమ ప్రభావ చిహ్నం! జ్ఞాపకంలో
అద్దంలో తన కెదురుగ కనిపించేదీ
తన ముఖం! ముఖంలో అందం! ఒకటే

ధూళి కమ్మి ముఖం వాలి ఉన్న మనిషిలో
ఉద్యమ చర్యలలో నలిగిన మానుషం!

ఒక దశలో విరుద్ధ శక్తుల ఘర్షణ
ప్రకటితమయి! మార్పుకు దారులు తీస్తుంది
ఇది ప్రాంతం దేశం వ్యక్తి సమాజ రూపంలో
ఏదైనా కావచ్చు! ఉద్యమ లక్ష్యంలో

వ్యక్తిత్వం తీరులో పాయలుగా చీలుతూ
కలవని ఊహల దారులలో పయనం!

సూర్యుని అస్తమయంతో ఒక దశ అంతమై
చంద్రుని ఉద్గమనంతో మరో దశ మొదలవుతుంది
సామాజిక రాజకీయ చర్యల క్రమంలో
ఎవరి కోసమూ ఆగదు, చరిత్ర చక్ర భ్రమణం

వెలిగే దీపాలతో నిశ లెన్నో గడచీ
మరో మరో విభాతంకై ఎదురు చూస్తూ
విజయానికి మెట్లుగా మలచుకొనీ జీవితాలు
దశాబ్దాల ఉద్యమంలో! రాలిన ప్రాణాలెన్నో

గూటి లోనే అణగి ఉన్న శాంతి పావురం
బయటి వచ్చేందుకు ఇంకా సందేహంలో!

❃

## 8. అనుభవాల బరువుతో

దశ దిశల నినాదాలతో ఉద్యమ సందర్భం
విషమ దశలలో శాంతి అవసరాన్ని స్వప్నిస్తుంది

ఒక రోజున శరీరాలపై నర్తించిన లాఠీ
ఇంకో రోజున పొయిలో కట్టె ముక్క కావచ్చు

చేతి కందబోయే విజయావకాశం
మరో మారు! పక్షిలాపై కెగసి పోతూంది
కోరిక తీరి పూల గుత్తి హత్తుకునే దాక
గుండెపై నిప్పుల కుంపటి బరువు అట్లాగే!

చీకటి ఏడుపు పోయి, వెలుతురు నవ్వు చూడాలనీ
విధ్వంసం వదలి పోయి, సృజన ప్రతిభ చూపాలనీ

ఏ గిరి శిఖరం నుండైనా రానీ రస ధారలు
నేలపై ఎక్కడో ఒక చోట కలిసే అవకాశం ఉంది
మట్టిపై రాళ్ళపై చెట్లపై గుట్టపై గుడిసెపై మేడపై
చినుకులు! ఒకే విధం! ఆర్ద్రతలో సమతకు భంగం లేదు

ఏ దిశలో నయినా రవి వెలుగులు అవే!
మనిషిలో సమ ప్రకాశ న్యాయాన్ని జ్ఞాపకం చేస్తాయి

వ్యక్తి నుండి సమాజానికి, అనుక్షణం పయనం
నడచే అడుగులు ముందుకే, ఉద్యమ పథంలో
ఎవరి బ్రతుకు వారికి బహు ప్రియమయినా
అవసరాలు చేరుస్తాయి! ఒక చోటికి సులభంగా

అభిమానం స్వాతంత్ర్యం స్వేచ్ఛ సమానత న్యాయంతో
ప్రతి ఉద్యమ కర్తవ్యం! సమాజావసరాలకే

నిజం! ఎప్పటికీ సజీవ వాస్తవం! లోలోపల గుప్తంగా
అనుభవాల బరువుతో, వర్తమానం వెనక్కి వెళుతుంది

❄

# 9. గమ్యం ఒకటే

ఒక పూవు ఒక అల ఒక చిరు నవ్వు ఎదురయి
మనసును ఉల్లాసంలో తిప్పుతాయి, సుఖదంగా
ఒక ముల్లు ఒక రాయి ఒక జ్వాల ఎదురయి
మనసును ఉద్వేగంలో తిప్పుతాయి భయదంగా

మనిషికి దగ్గరి బంధువుగా, విశాల భూమి
మనిషికి ఎంతో ఆప్తంగా, ధారాజలం
మనిషికి అవసరమై ప్రాణం పోసే గాలి!
త్రిభుజాకార రేఖల నిలయం! జీవితం!

మనిషితో మనిషి! ఉద్యమ ధ్యేయంలో ఒకటయి
మనిషిలో మనిషి! మిత్రత శత్రుతతో వేరై
దేని కదే! పాయలు గానో శిఖలు గానో చీలి మనసులో
ప్రాంతమో! సంపదో! మరొకటో జీవన వాస్తవం!

ఇష్టం లేక పోయినా మాట వినబడుతుంది
కష్టంలో నష్టంలో, దృశ్యం! కనబడుతుంది
రాళ్ళను తప్పుకొంటూ కలల్ని మరచిపోతూ
ఉన్న స్థితిని! జీవితం వీడలేదు! మరవలేదు!

ఎండి పోయి చేవ లేని చెట్టు
ఏ కలపకో కట్టెకో పనికి వస్తుంది
మానవీయ ముఖం లేని ఉద్యమం
ఏ కాల క్షేపానికో! పనికి వస్తుంది

ఎవరి బ్రతుకు వారిదే వ్యక్తిత్వంతో, అయినా
సమాజ చింతనలో అందరి గమ్యం మాత్రం ఒకటే!

ఎవరి పాత్ర వారిదే నిర్వహణంలో అయినా
ఉద్యమ కేంద్రంగా సాగే ఆదర్శంలో ఒకటే!

❁

# 10. ఎరుపు సిరా సిగ్నేచర్

గడచిన రోజుల కన్న మంచి భవిష్యత్తు కయి
ఉద్యమ హృదయంలో ఆశాచిత్రం! ఒకటొకటీ!

మనిషి స్వరంలో సమాజ స్పందనల్ని
వినిపిస్తుంది కవిత! శబ్ద తరంగాలపై
బాధ ఎవరికి ఇష్టం! ఎటువంటి దయినా కానీ
అయినా పిలవని అతిథిలా విచ్చేస్తుంది

వ్యక్తుల గౌరవ శిఖరాలే సమాజ రూపం
ఎవరి అభిమతి పైనా బ్రతుకులు రూపొందవు
వ్యక్తుల మధ్య స్నిగ్ధమయిన భావ ప్రసారం
జీవన సుఖ గమనానికి అవసర సూత్రం!

తెలియని దారులలో నిర్వచన పంక్తి
ముందుకు సాగే పయనానికి సూచిక
అనుబంధం  సంబంధం ఒకటొకటీ
అవతలి గట్టుకు చేర్చే పడవలు!

మనిషిలో ఆలోచన నింగిలో మేఘంలా
తనదైన క్షేత్రాన్ని, దాటి పోవచ్చు
మరొకరి క్షేత్రంపై, చినుకులు రాల వచ్చు
ఇది మనిషి పరిధి కతీతమైన! పరిణామం

ఉద్యమ సూర్యుడు ఎక్కడో దూరంగా లేడు
చూస్తే! నీలో గుండెలో బహు దగ్గరగా!
అడ్డు పడే నిశ తొలగితేనే సూర్యుని ప్రకాశం
మనోభయం తొలగితేనే ఉద్యమ వికాసం రూపం

ప్రతి రోజు చివర ఉద్యమం
ఎరుపు సిరా సిగ్నేచర్ చేసి వెళ్ళిపోతుంది

❋

# 11. విజయ తిలకం

సమస్యతో బొమ్మలాగ ఆడుకొనీ మాటి మాటికీ
గాజు అల్మెరాలో చూచుకొనీ మురిసి పోయే నేతలు
సమస్యను ముక్కలు ముక్కలుగా చూచి తూచి
అపుడపుడూ దేని కదిగా ఒక పరిష్కారం చూపేరు!

కోట గోడతో సమాజం మితమై పోదు
ఇంటి హద్దుతో జీవితం మితమై పోదు
గోడలు లేని కంచెలు లేని ప్రపంచం ఉంది
సూర్యునిలా చంద్రులా ఎత్తులోనే కనిపిస్తుంది!

ఎండమావి అవని మలిన స్పర్శలేని స్థాన మొకటే
అది మానుష రాగంతో అంతరంగ రూపం

ఏ పరిమితులూ ఎరగదు
ఏ బంధనమూ ఎరగదు
ఏ అదుపు లోనూ లేనిది
ఏ ఆజ్ఞ లోనూ లేనిది

జీవనమయినా ఉద్యమమయినా వివిధ స్థాయిల్లో
అంతరంగ దీప్తితో వెలుగుతాయి, స్పర్శతో పుష్పిస్తాయి
వివేక దృష్టితో సమస్యకు పరిష్కారం సులభం
అది లోపిస్తే! సంక్షుబ్ధంలో మహా జన భవితవ్యం!

సూర్యుని వేయి చూపుల్ని! ఎవరు అడ్డగలరు?
ఒక నీలి మబ్బు తెరలు తప్ప! అదీ తాత్కాలికం
అంత రంగ కాంతి నెవరు మాపగలరు?
చూడ లేని దృష్టి తప్ప! నెపం తప్ప!

సజీవ ప్రవాహమై కదలే ఏ ఉద్యమమూ ఆగదు
ప్రయత్న పరంపరతోనే విజయ తిలకం సాధ్యం

❃

# 12. స్వర్ణ కవాటం తెరవబడీ

ఉద్యమ చలనంలో నిరంతర వేగంలో కార్యశూరుల
ప్రాణాలు గాలి కౌగిలిలో! మాయమైన సమయంలో
ఏ దైవం తలచ బడ లేదు
ఏ ప్రార్థన చేయ బడ లేదు
ఏ బంధువు దగ్గర లేడు
ఏ మిత్రుని ఊరట లేదు

మలి సంజ, సిగ్గుతో తలవంచుకుంటుంది
తెలి వెన్నెల, సానుభూతి ముఖం ప్రదర్శిస్తుంది
మనుషుల్లో కనిపించని సంస్పందన ప్రకృతిలో
సార్థంగా ఆర్ద్రంగా స్వచ్ఛంగా విశ్వమయమై

ఒక సమయం విలయ వేళ డమరుకంలా
కార్య దీక్షా పరుల గుండె ఒకటై కొట్టుకుంటుంది
నిరాశా సముద్రం అపుడపుడూ పొంగి పొరలుతుంది
అంతలో ధైర్యం నావయై అలలపై సాగుతుంది

హననాన్నీ హింసనూ బాధనూ గురించి ఇపుడు
ఎవరు నోరు విప్పగలరు? ఒక బుద్ధుడు తప్ప!
మౌన ముఖంతో నిలిచిన క్షితిజంలో! ఉత్సాహం
ఉదయ సంధ్య రూపంలో! చెంగున దూకుతుంది మనిషిలో

ఉద్రేకం ఉద్దేశం అభిమానం మూడూ ఒకటయి
ఉద్యమ శ్రేణుల్ని దారిన పెడుతున్నాయి

మనిషి ప్రాణం పోయేది! ఒకే ఒక మారు
చావుకు దగ్గరి స్థితులు! ఎన్ని మారులో!

ఉద్యమ వ్యక్తిత్వంతో నడచే చైతన్యంతో
భవిష్యత్తు స్వర్ణ కవాటం! తెరవబడుతుందనే!

❀

## 13. ఆయుధం అవసరం లేకుండా

పగలు వెలుగు ఎంత ఉంటే నేమి?
ఉద్యమ బాధితుల కంటికి ముని మాపు దృశ్యం
రాత్రి వెన్నెల ఎంత పరచి ఉంటేనేమి?
ఉద్యమ దు:ఖితుల కంటికి మంచు తెరలే!

కార్య సాధనలో సంకల్పం, తన రెక్కలపై
ఎక్కడెక్కడికో పయనింపజేస్తుంది

ఆశయాన్ని వినిపించే వారిలో కన్నా
వినే వారిలో ఉత్సేకం మిన్నుముట్టుతూంది
నినాదాన్ని శబ్దించే వారిలో కన్నా
వినే వారిలో సంప్రేరణ దిశలు తిప్పుతూంది

బంగరు తీగెలా ఆకులతో సాగుతున్న ఉద్యమం
పూచింది స్వేచ్ఛా ఫలం కయి నిరీక్షిస్తూంది

శరీరానికి గాలి తాకుతూంది చల్లగా
గుండెలో ఉదయం రగులుతూంది వెచ్చగా

ఒక సమయం క్షణాలు కదలిక ఆగి నట్లు ఉంటాయి
గోడకు నిలిపిన రాళ్ళలా కఠినంగా అచలంగా
తలుపులు లేని కారాగారంలా పరిసరాల ప్రపంచం
స్వేచ్ఛ పేరుతో వలయాలలో భ్రమణానికి అవకాశంతో

తెలవారితే ఏమవుతుందో నన్న
భయం! అలవాటుగా ఆ పై రోజు! మరోరోజు!
పుష్ప గుచ్ఛమై స్వాగత మిస్తుందనే! ఆశ!

ఎప్పటికీ కొత్తగా ఉద్యమం! వజ్రంలా
ప్రజలలో పాత బడని అభిమానంతో
ఆయుధం అవసరం లేకుండా! చేస్తూంది

❃

# 14. అన్నీ దిగ దుడుపే

ఉద్యమంలో ఒక పొరపాటు వెనక్కి లాగుతుంది
మనిషిలో ఒక లోపం కిందికి జారుస్తుంది

కళ్ళకు మిరిమిట్లు గొలిపే ఉద్యమ రూపంపై
ఇనుప కవచ పాదాలతో నడచే పాలనలో
అణచి వేత కార్య క్రమంలో
చీమకూ మనిషికీ లేదు భేదం

చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది
నిజమే! బలవంతుని హెచ్చరించి వదలుతుంది
ప్రీతి పాత్రుణ్ణి! కనికరించి మౌనం వహిస్తుంది

ప్రజ అడుగులు బరువెక్కి
గుండెలు శిఖలుగ మారీ
పగలంతా ఉద్రేకం నిండిన వేడి గాలులు
రాత్రికి మాత్రం సముద్రపు గాలుల ఉపశమనం

చీకటితో ఎవ్వరికీ లేదు దోస్తీ
పగలుతోనే అందరికీ స్నేహం
ఉపాయ వ్యూహంతో కదలే ఉద్యమకారులు
తేజో మయ మూర్తులై చీకటి శిలలను దాటేరు!

ఎదురుపడిన మృత్యువాహనాన్ని ధ్వంసం చేసేరు
దగ్గరయిన మృత్యు పాశాన్ని ముక్కలు చేసేరు
సాహస క్రియలో కనిపించని గోడలు కంపించేను

ఉద్యమ లక్ష్యానికి ఆవేశం తొందర పెడుతూంది
ఎంతయినా మనుషులతో మైత్రి నెవరు వదలుకుంటారు
ఉద్యమ హృదయం! ఏ బాధకు వెరవదు
అభిమాన ధనం ముందు, అన్నీ దిగ దుడుపే

❊

# 15. తెలియని వాస్తవం

చేతులకో కాళ్ళకో కాక, మనసుకు పంకెల రహస్యం
అందరికీ తెలియదు! ఎవరో కొందరికే తెలుస్తుంది

మంచులా గడ్డ కట్టిన జీవన వాస్తవాన్ని సరింపజేసే
ఆలోచన! ఎవరో కొందరిలోనే వేడిగా కదలుతుంది
కొందరిలో సమాజానికి ప్రతినిధి రూపం
సమస్యకు పరిష్కార పాత్రను వహిస్తుంది

నడిచే దారి పక్కనే ఒక రోజు! మంటల గుర్తులు!
పక్కన పచ్చదనంపై ఒక రోజు! నెత్తురు మరకలు!

భయంలో ఆయుధంతో బయటికి వచ్చే స్థితి రాకూడదు
ఏ మనిషీ! మరో మనిషిలో రణ భావం దింపకూడదు

బ్రతకడానికి ఒక్క గాలి మాత్రమే చాలదు
ఇంకా! ఎన్ని హంగులో! మనిషికీ తప్పనివీ!

భౌతిక మానస స్థాయిల్లో ఎదుర్కొనే అవసరాలు
తీరే ఉద్దేశంతో! ఉద్యమాలెన్ని విధాలో!
ఇవి అభిలాషకు పదును పెడతాయి
ఇవి పొందేందుకు దారి చూపుతాయి

అలసిన సాయం వేళ! దిశల నుండి పరిమళ పవనం
శ్రమను మరపిస్తుంది! గాయ పడిన ఎదను హ్లాద పరుస్తుంది

మరు భూమిని సస్యమయం చేసే ఊహతో
నిరాశ నుండి ఆశ! విత్తు నుండి తరువై!

పరంపరాగతిలో మేలు మార్పు కోసమై ఉద్యమం
ఏ దశ లోనూ ప్రమాద ఘంటిక వినిపించరాదు
వెనక నుండి అడుగు నుండి ఊహించని రీతిగా
తెలియని వాస్తవ మెపుడో బయటికి వచ్చి తీరుతుంది

❊

# 16. వీడని సందేహం

ఉద్యమ తీవ్రతలో గాయం కొత్త పాఠం నేర్పుతుంది
స్మృతిలో అనల కణం వలె జ్వాలకు కారణమవుతుంది

జూలు విదల్చి వెడలిన సింహం వలె ఉద్యమం
వీధులలో అడుగులు వేస్తూ ముందుకు సాగుతుంది

కొన్ని రోజులు కర్ఫ్యూలో నిశ్శబ్దం! నిట్టూర్పులతో
వ్యథల కథలతో విషాదమయ జీవితాలు
అశ్రువు ఆవిరి అయ్యే ఉష్ణ నయన గోళాలతో
సాహసాన్ని సానబట్టే మనః ఫలకంతో ఉద్యమకారులు

ఉఛ్వాసానికీ నిశ్వాసానికీ మధ్య అంతరాన్ని
సహించలేని స్థితిలో ఉద్యమ వేగంలో
మానవతా మందార గుచ్ఛానికి బదులుగా
రక్త చిత్రం ఎదురు కావడం! విచిత్రం!

ఆకు రాలుతుంది మరో ఆకు వస్తుంది
పూవు రాలుతుంది మరో పూవు వస్తుంది
రాలిన మనిషి స్థానంలో, మరో మనిషి వచ్చేనా?
ఆగని కాలం చక్రం అరలో చిక్కి, ఆపదలో మనిషీ!

అనుకున్న విధంగా ఉద్యమం నడవదు,
గాయాన్ని మరపించే మందారం విరిసేనా?
బాధా జగత్తులో కళ్ళ ముందు ఆశా చిత్రం వేలాడుతూంది
వెనక నుండి కాలాన్ని ప్రశ్నిస్తూ, చీకటి నవ్వుతూంది!

కన్నీటితో రక్త చిత్రం తుడవ బడదు! బాబూ
ఉదార హృదయం నుండి! కరుణ బిందువుతో తప్ప!
లక్ష్యానికి కట్టు వడిన ఉద్యమం! జవాబు కోరుతుంది
ఏది హింస? ఏది శాంతి? ఎప్పటికీ వీడని సందేహం!

❈

## 17. కర్తవ్యం - అవసరం

ప్రతి వ్యక్తీ మానవ సమాజ సంస్కృతికి వారసుడు
జన్మ భూమిపై మక్కువతో పాటు హక్కులతో
నిఖిల జగత్తుపై బాధ్యత కూడా ఉంది

బిందువు సింధువు సంబంధం అనివార్య మయింది
కిరణం సూర్యుని సంబంధం బహు సహజమయింది
ప్రాంతాల సమూహాల ప్రయోజనాల
పరిరక్షణలో ప్రయత్న శిఖరం! ఉద్యమం

చంద్ర కళలు తెగి దోసిలో జారవు
మబ్బు ముక్క తునిగి చేతిలో నిలవదు
సాధ్యమయిన హక్కులపై కోరిక సహజం
ఘనారణ్య భూమిపై! దారి ఏర్పడ వచ్చు!

నిశి నీడలతో పోరాడే సంకల్పంతో
కలల నుండి బయటపడే యోచనలో
వాస్తవాన్ని గుర్తించే హేతు దృష్టి
ఉద్యమ గమనానికి, కావలసిన నిజాలు!

కళ్ళు పూలకు బదులు నిప్పులు రాలుస్తున్నాయి
మనిషి మైత్రికి బదులు శత్రుత ప్రదర్శించేను

ఒక దశలో శ్మశాన ధూమంలా భేదం
ఒక మనిషి ముఖాన్నే కాదు, దిశనూ కప్పేస్తూంది
ఊపిరికీ ఊపిరికీ మధ్య చోటు చేసుకొనీ
విలయ చిహ్నం! సాటి మనిషిని దూరం చేస్తూంది

భేదాన్నీ కన్నీరునూ, శత్రుతనూ విలయాన్నీ మరపించి
గడ్డ కట్టిన కాలాన్ని నిర్భయంగా కదలించి
నదింప జేయడం! ఉద్యమ కర్తవ్యం! అవసరం

❊

## 18. మానుష సుందరతను

మానసిక స్థాయిలో వేరయిన భావ ప్రపంచాల
వైరుధ్యం! విడిపోయే ఊహకు కారణ మవుతూంది

ఒకే భాషా బంధం ఒకే సంస్కృతి ఛాయలు!
వేరు పడే అవసరాన్ని ఆపలేవు, మాపలేవు

ఆలోచనలో వెలుగు స్పర్శ లేని వేళలో
ఎన్ని ఏండ్లు గడచినా చీకటి అంచునే!
కలహ కారణం బరువయి బ్రతుక లణగి
కోరుతుంది! మనసు దుస్థితి నుండి విమోచనం!

ఆర్ద్రతలో మనోరూపాల కలయిక సహజం
పరిమళ భర మౌ ఊహల కలయిక సులభం
మూతబడిన ఎద తలుపులు తెరచే దెవ్వరు?
పిడికిలిలో దాచిన మణి రోచిని విడిచే దెప్పుడు?

ఎన్ని దశాబ్దా లయితేనేం? ఎవరికి వారే –
శిల్పంలో ఆకర్షణకన్నా, రూపంలో స్పందన ముఖ్యం

మ్రోగే ఆలయ ఘంటిక తరంగాలు ఒకే విధం
మానుష రాగం కదలికలో అలలు ఒకే విధం

ఉదయ కిరణంలో, ఉద్యమ రూపం కనిపిస్తుంది
చీకటి నిష్క్రమణంతో, విశ్వాసం కుదురుతుంది

అంతటా ఒకే మాట! గాలిలో తేలుతూ పయనిస్తూ
ఆదర్శంలో ఐక్యత కోసం! కానీ చరిత్ర ఆగదు

బ్రతుకులో కఠోర వాస్తవమే! శాసన రూపం
ఇనుప సంకెల వదలింది కానీ రజ్జు బంధం చుట్టుకుంది
ప్రాంతీయ భేదం స్ఫులింగమై మాటి మాటికీ
మానుష సుందరతను వికార పరుస్తూంది

❃

## 19. క్రియాశక్తికి సంకేతం

ఉద్యమం చెలరేగుతుంది దావానల శిఖలతో
దీని ముందు ఏ దుస్తంత్రం పనికి రాదు
ఒకే ఒక అంతరంగ క్షేత్రంలో వివేక పథంలో
శాంతి జలాలతో ఉదార మేఘం తప్ప!

ఆకులు వాడి, మాడి పోయి
పూలు కమలి, రాలి పోయి
కొమ్మ వంగి, విరిగి పోయి
చెట్టు శిథిల మవక ముందే

తిరిగి వసంత స్పర్శ పొందవలసి ఉంది!
పగలు రవి ప్రకాశం బయటికి రావలసి ఉంది

జేబులో చేతులతో, యువత నిర్భయంగా నడచే
రోజులు! చూచేది, ఉద్యమ విజయం తరువాతే

ఉద్యమ చేతనతో సంరంభం! ఒక అవసరం
సమస్య పరిష్కారం, పాలనా వ్యవహర్తల విధి

నిశీథి విరామ దశల నుండి కదలి
మరునాడు ప్రదర్శనం! నిబద్ధతకు నిదర్శనం

ఎవరి మజిలీ వారికి ఇష్టం
ఎవరి స్వార్థం వారికి సత్యం

గాజు బొమ్మ కాదు మనిషి, మట్టి బొమ్మ కాదు
ప్రజాస్వామ్య యుగ చేతనతో, ఆరని బింబం
స్వయం పాలనా కాంక్షకు రాజకీయ చతురత తోడై
పౌరుల పాత్ర! సామాజిక పరిణత రూపం

ఆశయాల సాధనలో ఉద్యమ మొక సాధనం
మౌన ముద్ర వదలిన క్రియా శక్తికి సంకేతం

❋

## 20. జన సంస్కృతిలో తేజం

ఏదో ఒక కోరికకు వేలాడుతూ మనసు
చివరి దాక నిలవడం లోనే, ఉంది అస్తిత్వం

మనిషిలో మానవత ఎప్పటికీ, అవసరమౌ నిధి
మనసులో తాత్వికత ఎన్నటికీ, తరగని గని
మానసిక వికారదశలో జీవన సుందరత నశించి
మనిషికి మనిషిపై అనుమానం! స్వార్థంలో ద్వేషం! వైరం

అఖండమైన కాలంలో ఖండ ఖండంగా జీవితాలు
సామాజిక సమస్యలతో అల్లుకొనీ రాజకీయం!
స్వతంత్రమో విమోచనమో! గెలుపులో ఓటమిలో
ప్రజలు వేరై! వీడడమూ ఉన్నదే! ప్రాంతం రాష్ట్రం

పచ్చని చెట్టును చూస్తే, మనసు కెంత హ్లాదమో
కొమ్మలపై ఆకులలో తిరిగే, సర్పం అంత భయం
భయం నుండి కరుణకు కరుణ నుండి వీరానికి
వీరం నుండి శాంతికి, ఎప్పటికీ రాగమయం జీవితం

పోరాటం ముగిసీ విజయంతో ఉద్యమం
స్మృతుల మ్యూజియంలో నిలుస్తుంది చరిత్రలో

నీరు అమ్మకానికి వచ్చేసింది, ఇపుడు! కానీ
గాలి మాత్రం అమ్మకానికి రాకూడదనీ!
మనిషి అమ్మకానికి వస్తే రావచ్చు! ఆశ్చర్యం లేదు
అంతరంగ మెప్పటికీ అమూల్యంగానే ఉంటుంది

చరిత్రను శాసించ లేకపోయినా మనస్సు
ప్రజల ఉద్యమంపై అభిలాషను వదల లేదు
ఉద్యమంతో జడ జీవితంలో కదలిక
విజయ గాథతో జన సంస్కృతిలో తేజం!

❄

## 21. ఎదురు చూస్తోంది

ఉద్యమ ముఖం ఎదురు చూస్తోంది
చిట్ట చివరి అడుగు కయి
సమాజం అస్తితలో భాగమై
జన శక్తికి సూచకమై

ఉద్యమ హృదయ మెదురు చూస్తోంది
ప్రశ్నకు జవాబు దొరకే ప్రజ్ఞ కయి
సమస్యకు పరిష్కార మిచ్చే చర్య కయి
వికారాల్ని అదుపు చేసే వివేకం కయి

ఉద్యమ రూప మెదురు చూస్తోంది
మౌన క్షితిజంలో అర్థవంతమైన చిత్రం చూడాలనీ
శాంతి వచనంలో ప్రయోజన రూపం పొందాలనీ
మజిలీ మజిలీలో విజయ చిహ్నం వెలయాలనీ

ఉద్యమ భావ మెదురు చూస్తోంది
ఉద్యమంలో చిట్ట చివరి మాటకై
శిల నుండి అవతరించే శిల్పంకై
తాపంలో సాదర జలదాగమానంకై

మాటను నిలబెట్టుకొనే గొప్ప గుణంతో
కర్తవ్యం పాలించే రాజనీతి విభవంతో
గాలి కదలికలో దూకే ఉత్సాహంతో
ఉద్యమ భావం వాస్తవ రూపం పొందాలనీ

ప్రతి అడుగు ముందు అలల వలె యువ గణాలు
ప్రతి అడుగు వెనక అలల వలె పెద్దతరం
నడకలో ఉద్వేగంతో గుండెలో ఉత్తేజంతో
లక్ష్యం చేరే మనో జవంతో వర్తమానం

❋

## 22. గమ్యం చేరే దాకా

అశాంతికి దారి తీసే ఉద్యమం! ఒక సమయంలో
లోపలి సుడిగుండాలను బయటికి పంపిస్తుంది
గాయ పడిన హృదయం అడుగును నిలిపేస్తుంది
బాధ పడే హృదయం మనిషిని కదలిస్తుంది

మృత్యువును లెక్క చేయని, మొన తేలిన గుణం
శూన్యాన్ని తీవ్ర మయం చేస్తుంది ఆలోచనతో
సూర్యుని వెలుగులో వీథి స్తంభం నీడ పొడవుగా
రాత్రి పడిన ఉరితో! వేలాడే ఆశాహత రూపం

వ్యక్తి జీవితం ఎప్పటికీ ఒక అసంపూర్ణ గ్రంథం
ఏ గ్రంథమూ మరో దానికి డిటో అయ్యే వీలు లేదు

ఏ దేశం ప్రాంతం జాతి ఎరయినా కానీ
మనిషిలో కనిపించే దానికన్నా కనిపించనిదే ఎంతో
నిన్నటి మనిషి వేరు నేటి మనిషి వేరు! సమస్యలు వేరు
వేరు వేరు అవసరాలలో, విడిపోయే స్థితి అనుభవ వాస్తవం

ఆలోచనా రూపంలో, మస్తిష్క శిఖరమూ
ప్రవాహ ప్రసారాలతో, అనుభవ రూపమూ
మనిషిని నడిపిస్తాయి! అందని వేగంలో
క్లిష్టమైన యానంలో వివేచన ఎక్కడిదీ?

శిశువు పెరుగుతూ పెరుగుతూ పెద్ద అవుతూ
తిరిగి అమాయక శిశు దశకు వెళ్ళడం కుదరదు!

మానవ ప్రకృతి వికృతి రూపంలో ప్రత్యేకతతో
సమాజ పరిణామంలో తప్పనిదీ! ఉద్యమం
సమస్యల చిక్కుల నుండీ, విరోధాల నుండీ నిరోధాల నుండీ
పద యుగం! నడుస్తుంది, ముందుకు గమ్యం చేరేందుకు

❃

# 23. భేదం - విషమత

ఉద్యమ కేంద్రంగా ఉద్వేజిత హృదయం నుండి
కవిత వెడలుతుంది బయటికి ఉషస్సులా
భావన కదలుతుంది అలలుగా వెలుగులా
స్వేచ్ఛను కోరే విషయమై జన మహా దృశ్యం

వర్తమాన సమాజ స్పందన లయ అందుకొనీ
ప్రగతికి ప్రేరణం అయిందీ జీవన బింబం అయిందీ

సమాజంలో మనిషీ, మనిషిలో సమాజం
బహు విధ శక్తులకు వికాస కేంద్రమై
చూపే వెలుగు చూపుడు వేలుతో
పోవలసిన దిశ చూపిస్తుంది

ఉన్న చోటునే ఎవరూ చెట్టులా ఉండలేరు
ఉన్న తీరునే ఎవరూ రాయిలా ఉండలేరు
చేతనతో కొత్తదనం! సమాజ పరిణామంతో
రాజకీయమైన అస్తితపై కోరిక సహజం!

ఇది నియతమైన సమయంలో సమాప్తి కాని నాటకం
ఎప్పటి కప్పుడు చివరి దశకు చేరనున్న దశలెన్నో
కొత్త సన్నివేశంతో పలు మలుపులు తిరుగుతుంది
ఎక్కడి కక్కడ ఎవరికి వారు తమ విజయంగా భావించేరు

మనిషికి మనిషే ముల్లూ బల్లెం దారిలో
గుచ్చబడీ బాధకు గురి కావచ్చు
ఆదర్శంలో సోదర భావం! ఒక గగన సుమం
స్వార్థంలో మాత్రం, అనల శిఖల నృత్య వేది

మానసికంగా ఏర్పడే భేదం విషమత
వ్యక్తిని అనుచిత చర్యకు సిద్ధం చేస్తోంది

❊

## 24. దేనికి చిహ్నం?

సందర్భానికి చెల్లే ముఖాలు, ఉద్యమం లోకి
సందర్భానికి చెల్లని ముఖాలు, మ్యూజియంలోకి
సన్నివేశ రమణీయంగా, అలంకార ముఖాలు కొన్ని
తటస్థ స్థితిలో కొన్నీ, పరోక్ష బంధంతో కొన్నీ

ఉద్యమానికి పాత లేదు ఎప్పటికీ కొత్తే
దశ దశలో లక్ష్యానికి పునర్నవ దీప్తితో,
ఏ షరతులూ లేవు! ఎవరయినా చేరవచ్చు
ఏండ్లు గడచినా, అదే! మార్పులేని ఆదర్శం
చూచే ప్రతి వ్యక్తిలో కొత్త అనుభవ జీవనం

దాహం తో నింగి వైపు చూస్తూ జలదంకై
నోరు తెరచి నిలిచి నట్లు నిరీక్షణలో
ఉద్యమం గ్రాఫ్ అదే! ఎప్పటిదే
మారని పర్యవసానంతో!

బయటి తలుపులు కిటికీలు మూసి
లోపల శాంతి జపంతో ఉద్యమం! ఫలించదు

ముందు పరచిన మౌన దీపం వెలుగులో
చూపులో తాను వెళ్ళే దిశా రూపం నింపుకొనీ
రాత్రులూ సాగుతూంది! ఉద్యమ పయనం

భాష ఒకటే, సంస్కృతి ఛాయ ఒకటే, అయినా
ఇరు ప్రాంతాల మధ్య మానసిక స్థాయిలో అఖాతాలూ
సులభంగా కలవనీయని అవసరాల కొండలూ!

స్నేహ సుందరయిమన చిరు నవ్వుకు బదులుగా
వైర బంధుర మయిన పెను కోపం ముఖంలో
భావనలో కళపెళలు! ఏ ఐక్యతకు చిహ్నం
మాటలలో చిటపటలు! ఏ సఖ్యతకు గుర్తులు

❊

## 25. నిర్ణయ రూపం

ఉద్యమ క్రియలో నిజం తలుపులు తెరవబడీ
మనిషిలో అతృప్తికి వాస్తవాకృతి ఏర్పడుతూంది

ఎపుడో మొదలయిన నాటకం ఎప్పటికి ముగిసేదీ తెలియదు
ఇక ముగుస్తుందనుకున్నది! అనుకోని దృశ్యంతో సాగుతూంది

ఒక చోట ఎడారులు! మరో చోట ప్రవాహాలు పాయలుగా
ఒక చోట కొండలు! మరో చోట మైదానాలు!
అన్నీ సువిశాలమైన భూమిలో భాగాలే! ఎప్పటికీ కానీ
జీవన భేదాలతో, బ్రతుకు బరువులో, తారతమ్యం సహజం

నేలనూ నింగినీ కలుపుతుంది వెలుగు వంతెన
మనసునూ మనసునూ కలుపుతుంది భావ గంధం
బంధం చెదరిపోతే! భావన మలినమయితే
జరిగే పర్యవసానం మాత్రం విపరీతం! దుర్భరం!

స్వార్థం, ఉద్యమ రూపానికి బీజ భూతమవుతూంది
వికలత, ఒక పక్షంలో శూన్య మావహింపజేస్తూంది
భేద రూప మవతరించి, కలహ పర్వం మొదలవుతూంది
విజయం ఎవరిది? ఓటమి ఎవరిది?

దెబ్బ తీసిన చేయిదా?
దెబ్బ తగిలిన చేయికా?

కలహ కారణ మేదయినా, ప్రభావాన్ని భరించక తప్పదు
కలహ గుణ క్రియలతో, ప్రయోజన దిశలు మారతాయి!

తీర్చిన ఇరు వైపుల నుండీ విషమ స్థితులలో
ఎవరి అభిమాన శిఖరాలు వారివి! ఎవరి మర్యాద వారిది
కనిపించినా కనిపించక పోయినా హేతు కోణంలో
చరిత్ర గతిలో నిర్ణయ రూపం తప్పదు పరిణామంలో

❃

## 26. కళ్ళ ముందు వాస్తవం

సుడి గుండం లానో వరదలానో ఉద్యమం ప్రబలుతుంది
చిన్న పాటి కలహంతో ప్రతి చర్యలు మొదలు!
సోదర భావం స్నేహం, వెనక సీటులోకి
ఉద్రేకం వైషమ్యం, ముందు సీటులోకి

మనిషితో పాటు నీడలు! ఎంత దూర మయినా
వెలుగులో బాడి గార్డుల్లా! ఎక్కడి కయినా
మనిషిలో చెలగే ఆవేశ నృత్యం దృశ్యాలు
ఆఫీసులో వీధిలో పత్రికలో టెలివిజన్‌లో

ఆకాశం అడవిలో రాత్రి గుహ నుండి
బయట పడిన సింహం లా ఉద్యమం! సమాజంలో

ఆకాంక్షకు తోడుగా అహం కారం
కను రెప్పల చివర వేలాడుతూ,
చూపుకు కొత్త రంగు నిస్తూంది
చర్యకు కొత్త రీతి నిస్తూంది

వాగ్దానాలూ ఆశ్వాసాలూ ఒప్పందాలూ ఒకటొకటీ
కాలం గడచే కొద్దీ తెర వెనక్కి! సాధారణమవుతూంది

ఏ రోజూ! ప్రతి చోట, అపస్వరాలు! కటు ధ్వనులు
సామాన్యుల బ్రతుకులు, అశాంతికి గురి అవుతూ "బంద్"లు

అలసిన కాలం, నిశా నిలయంలోకి చేరుతూంది
అలసట ఎరగని ఉద్యమం, దివిటియై వెలుగుతూంది

తెల్లవారితే స్వర్ణ కవాటం తెరచిన ఆశ వెనక నుండి
ఆటంకంగా మేఘం, ఉదయ దిశను క్రమ్మేస్తూంది

మస్తిష్కంలో ఆలోచనా బింబం సూర్యునిలా
కళ్ళ ముందు వాస్తవం! ఉద్యమ ప్రభావ చిత్రంతో

❉

# 27. సంస్కృతిలో భాగం

ఉద్యమం అవతరిస్తుంది
శూన్యమైన శుష్కమైన స్థితిగతుల్ని
చిత్రశాలగానూ హరిత పంక్తిగానూ మార్చాలనీ
చలి భయంతో వణకే శరీరాలకు
కోష్ణ రూపాలతో అలంకరించాలనీ
దాహంతో అలమటించే ఎడారి మనసులను
రసమయ నవ జీవన యుతం చేయాలనీ

సమాజంలో శిథిల మయిన అణగిన జీవితాలు
సరికొత్త నిర్మాణాలతో తలలెత్తాలనీ
స్థానిక ప్రాంతంలో అభిమాన శిఖరాలతో
నవ సమాజం విశ్వమయం కావాలనీ!

అణు వణువున సృజన కీర్తిపై కోరిక సహజం
క్షోభ నుండి సంతృప్తికి, విమోచన మహోద్యమం

సంయమనంలో మానవ సంస్కార గుణం
విశేష పరిణామాల్లో సడలుతూంది, జారుతూంది
మనిషి యశోరూపానికి చిహ్నం విగ్రహం
కోపంలో విధ్వంసం! వికార చర్యకు పరాకాష్ఠ

అలంకారం పేరుతో ఆకర్షణ మిషతో
చేతులకూ కాళ్ళకూ పూల దండల గొలుసులతో,
పరుగు పందెంలో గెలవడం ఒక స్వప్నం
సహనంలో బ్రతుకులు! సమాధి రూపం పొందరాదు

బాధలలో భయాలలో బ్రతుకులు గడవడం పరిపాటి అయి
దైనందిన చర్యలో భాగం కావడం! ఒక దౌర్భాగ్యం!

మనిషి మనిషి తో సహభావం సహకారం!
హృదయ గతం! విశ్వమయం! సంస్కృతిలో భాగం!

❊

## 28. రహస్య ఎజెండా

ఉద్యమ మూలం నుండి క్రియా శాఖ లెన్నో
కొందరిలో అభిమానంతో, కొందరిలో తద్భావంతో
కొందరిలో తాటస్థ్యంలో, కొందరిలో సక్రియలో

సంరంభం సంఘర్షణ! నిరసనలూ సమ్మెలూ!
అపుడపుడూ, సాధారణ జీవన లయ చెదరుతూంది
బాధలు పంచబడవు! దుఃఖం ఆపబడదు
ఒత్తిడిలో బ్రతుకులు! రాళ్ళ నుండి ప్రవాహంలా

వాస్తవ మందరిదీ, కల్పన ఒక్కరిదీ
ఉద్యమ మందరిదీ, విభేద మొక్కరిదీ

జీవన శక్తుల ఉత్సేకం, ఉద్యమం
సమాజ శ్రేయో రూపానికి ప్రేరణం

సమస్యలో జటిలత, మరణానికి దారి తీయరాదు
నిర్ణయ భూమికలో అలసత! నష్టం కలిగించరాదు

ఉచితం అనుచితం, న్యాయం అన్యాయం, లాభం నష్టం
జంటలుగా సమస్యను పెనవేసుకొనీ దృఢంగా
అసంపూర్ణ పరిష్కార మార్గంలో యంత్రాంగం
హేతువు కందని పాలన పర్యవసానం! విపరీతం

మనిషిని మర బొమ్మను చేస్తూంది
నిష్క్రియతకు హారతి పడుతూంది

మానసిక బంధం తెగి, సమైక్యమన్నమాట
స్వార్థంలో, వ్యాపారానికో వినోదానికో పనికి రావచ్చు

భావనలో అంతా విశ్వమయం! సుందరతరం
అనుభవ దశలో సొంత లాభానికి రహస్య ఎజెండా!
ముఖ్యంగా రాజకీయ తంత్రంలో భాగం.

❋

# 29. తెల్లని కాగితంపై

చిలుక పలుకుల్లో మానవీయం చిందులు వేస్తుంది
స్వార్థ చర్యలు తుమ్మెదల కాటులా బాధిస్తాయి

బ్రతుకు నుండి నిష్క్రమించి అడవి దారి పట్టిన
వసంతం! పంచాంగంలో కాలెండర్‌లో తొంగి చూస్తుంది
జన హృదయాల లోకి ఎపుడు వచ్చేదీ తెలియదు
వ్యక్తి నుండి సమాజంలో వ్యధ ఉద్యమాకృతి పొందుతూంది

చలనంలో తగిలిన గాయాలతోనూ
జన హిత చింతనతో ఉద్యమం! సాగుతుంది

పూర్తి నిజం జీవితంలో బయటికి రాదెన్నటికీ
కొంతలో కొంతకు పూర్తి ఫలం రాదెన్నటికీ

కవిత పూర్తి నిజాన్ని బింబించే అద్దం
ఎవరి మాట చేతల లోనూ లేని స్వతంత్ర రూపం

ఉద్యమ భావనలో ఆరుణ బింబంతో పాటు
ఉద్యమ సాధనలో వివిధ వర్ణ కాంతి బింబాలూ

గెలుపు దశలో వెనక నుండి వెనక్కి లాగే చేతులూ
కంటకప్రాయమైన చీకటికి వ్యతిరేకతలూ తప్పవు!

ముందుకు సాగే చర్యలు! వెనక్కి రావనీ తెలుసు!
అయినా దృశ్యాన్ని! మరో విధంగా మార్చాలనీ
గమ్య మొకటే మార్గమొకటే! పయనంలో
శత్రుతకు సమాధానం శత్రుత తప్పనట్లుంది

కాళ్ళు ఉన్నాయి కదా! అని ఎటుబడితే అటు నడవ్వ
తెల్లని కాగితంలా ఉదయం పరచుకొన్న మనసుపై
ఏది బడితే అది వ్రాసే వీలు లేదు, కుదరదు
అక్షర శక్తిలో ఉద్యమ గాథా చిత్రా లొకటొకటీ!

❈

# 30. మానవీయ కోణంలో

సమాజ సంహితలో ఉద్యమ మొక పరివర్తనలో భాగం
దశాబ్దాల పోరాట చరిత్రలో, ఎన్ని విపరీత దృశ్యాలో!
సంస్కరణం ప్రగతి పథం స్వాతంత్ర్యం విమోచనం ఎన్నో
పొగలు కమ్మిన పూల వనం, సుందరతకయి ఆరాటం!

అనల శేషం కలహ శేషం బ్రతుకులో ప్రమాదకరం
దహన కాండతోనో చిక్కు ముళ్ళతోనో, ఉక్కిరి బిక్కిరి చేస్తాయి
ఆపదలో ఆర్త స్వరం, ఏ దిశ నుండి అయినా ఒకటే
ఎంతటి ఉద్యమ తీవ్రతలోనూ, రోజు! జ్వాలా గుచ్ఛం కారాదు

తప్పుడు బటన్ నొక్కితే ఆ పొరపాటుకూ జరిగేది ఆగదు
పైకి ఎగిరే విమానం, నేలపై కుప్పగా కూలుతుంది

రెప్పలు వాలని దీపం, మనిషిలో అంతరంగం
తెరచిన కళ్ళకు, చీకటిలో వెలుగు దారి చూపుతుంది

ప్రకృతిలో పరివర్తన ప్రభావమెంత అవసరమో
సమాజ గతితో జీవన చలనమూ అనివార్యం!

కిటికి నుండి చూస్తే, సమాజ మెక్కడ కనిపిస్తుంది?
బయటికి వచ్చి చూస్తే, తెలుస్తుంది జనం కోర్కెల నృత్యం

అందరిలో ఒకడయినా! ఆ ఒకరికి చుట్టూ ఎందరో
ఉద్యమ దశలు ఏవయినా! జన చేతన తోనే విజయం

ఒడ్డు నుండి చూస్తే భయద మైన ప్రవాహం
పడవలో ఈతతో పయన మెంత హ్లాదమో!

క్షణాల బొగ్గు ముక్కలు! నిప్పు కణాలవడం సహజం!
దేనికి? అన్న ప్రశ్న ఎప్పటికీ ఉండేదీ! ఎవరినీ వీడనిదీ!

ఉద్యమ గమనంలో కవిత! విశ్వమయ విశాలతతో
మానవీయ కోణంలో సూర్యకాంతి సమం! ఉదారం

❋

# 31.ఉద్యమాన్ని మోస్తూ

ఉద్యమాన్ని మోస్తూ మోస్తూ నడుస్తూంది కాలం
విజయంతో తేలిక పడి యుగానికి కొత్త ముఖం కోసం
శుభ్ర మయిన కీర్తి శిఖరం! దేశ రాజ నీతి నైపుణి
మాట మారి దారి వెదకడం, ఒక నైతిక విషాదం.

రోజు ఎంత కలత చెందేదీ, తెలిసి పోతూనే ఉంది
వేదనా సంధ్యలో సాయం సంక్షుబ్ధ దృశ్యం!
సమాజంలో పార్టీల శ్రేణులు! నిలువునా ముక్కలుగా
దేని కదే! స్వార్థంలో మాటల తూటాలు వదలుతూ

బయటి రూపాన్ని కనిపింప చేస్తుంది! వెలుతురు
లోని దీపాన్ని ఊహింప చేస్తుంది! చీకటి
తలపులు మూస్తే! పరిమితిలో సంకుచిత ప్రపంచం
తలపులు తెరిస్తే! విప్పారీ ఉదార మనో లోకం!

ఉద్యమ ప్రవాహం! ఎప్పటికీ అగ్నికి భయపడదు
కదల లేని చెట్లలో భయ సందేహం! సహజం.
ఎప్పటి కయినా ఆగని ప్రవాహంలో పడవలా
సమస్యకు పరిష్కారం! హేతువుతో వివేక రూపం.

దాహంలో నీరు నిండిన దోసిలి ముందు
తరగలతో దూకే జలధి తల వంచుతుంది.
మెరపులతో నీలి మబ్బులా అల్లుకొనీ ఆలోచన
జన దాహం చింతనలో దిశ దిశ కదలుతుంది.

పప్పుగానో ఉప్పుగానో కొనేది కాదు ఉద్యమం
అంకితం స్పందనం త్యాగంతో పొందేది, అనన్యం.

అశ్రువులో బింబం! కరుణమో! వీరమో! కావచ్చు
సప్రియంగా వదలిన పావురం! ఎద పైనే వాలుతుంది

❀

## 32. లిఫ్టుల మెట్లపై

పగలు గడుస్తుంది రాత్రిలా చిత్రంగా
ప్రాంతాల మధ్య ద్వేషం ఘర్షణ వ్యతిరేకంలో
రాత్రి నాశ్రయించ వలసి వస్తుంది శాంతి కై
ఎవరూ కాదన లేని ఒక అవసరంలా ఉంది

నిద్రలో కలవరింతలు! దుఃఖపు తెరలతో
సాధారణ చికిత్స కందని మనోమయ జాడ్యంతో
సమస్యల అడవిలో దారి తప్పిన పాలకులు
కొండల చుట్టూ పరిభ్రమించేరు! ఒకరొకరూ

ఇది ఉద్యమ దశలలో ఒక అనిశ్చిత వ్యవహారం
నేతల ఆదర్శానికి నైతిక పరీక్షా సమయం
ఆలోచన వలతో వేటకు సిద్ధంగా
వ్యాపారం పదవి కాంక్ష రెక్కలపై స్వార్థమూ

ఒకరిని మించి మరొకరు! నేతల్లో కాంక్షా రూపం
మ్యూజికల్ చైర్ ఆటలో! అదృష్టం కయి ఆరాటం!

కాలం ఈదుతూంది అగ్ని ప్రవాహంలో
చల్లని గట్టుకు చేరే తీరని కోరికతో
మలినాన్ని శుభ్రం చేసే బదులు కన్నీరు
ప్రతీకార కణాల్ని విసరుతూంది! నిప్పులుగా

కాలం ఎంతో ముందు పరచి ఉన్న మాట నిజమే! అయినా
నిరీక్షణంలో గడపాలిసి రావడం! ఒక మానసిక దారుణం
ఆరోహణలో ప్రతి లిఫ్టు మెట్టు పై అశాంతిలో
సందేహంలో ఊగాలిసి రావడం! ఒక సామాజిక విషాదం

రావలసిన వసంత శోభకయి, కావలసిన జలద శాంతి కయి
ఇచ్చిన మాట! ఇక పాటగా మారాలిసి ఉందీ, వాతావరణం!

❉

# 33. ఆశయ తేజం

ఉద్యమం వెనక ఆశయం! ఒకే ఒక నిజ తేజం
దిశ దిశలో ప్రసారాలతో వర్ణ రేఖ లెన్నో! చర్యలతో
ఒక దానితో మరొకటి కలిసీ మధ్య మధ్యలో
ఒకటవు తాయి! విజయం గమ్యానికి దారులు తీస్తూ

సూర్య బింబం ఒకటే! రోజూ వచ్చేదీ చూచేదీ
అంత రంగం ఒకటే! ఏ స్థాయి మనిషి లోనూ లోపల
అంత రంగ స్పర్శలేని సమస్యల జటిలతలో
జీవన దృశ్యాలు భిన్నం, అనుభవ రూపాలు విషమం

మారే రాజకీయ అద్దాల రంగులో దృశ్యంతో పాటు
మారదు! చూచే విషయంలో నిజ రూపం!
వెలుతురు తో పాటు పొగలూ! బహు రూపాలలో
సన్మానం తో అవమానమూ! చర్యలలో విపరీతాలు!

ప్రతిమలో రూపం దివ్యం దర్శించ గల కళ్ళకు
మనిషిలో మానవీయ శోభా చిత్రం! కనిపించదు

బ్రతుక్కి వాహనమై వర్తమాన కాలంలో ఉద్యమం
ఏ దారులు పట్టేనో! తప్పని కర్తవ్యం నియంత్రణం
అభిమానం విశ్వాసం ఆచరణం ఆవేగం లేని ఆశయం
చక్రాలు పని చేయని వాహనం! ఆకర్షణ యంత్రం మాత్రమే

జనం మనసు లో నుండి బయటికి రాలేని వెలుగు!
కవితలో! హరిణంలా కదలుతుంది, ఎద పచ్చికపై.

అక్షరాల జీవ కణాలతో అపూర్వం
ఈ స్వేచ్ఛా ఉద్యమ కవితా రూపం,
చరిత్రకు కావలసిన ఆకరం
తరంతరం సంఘానికి ప్రేరణం.

## 34. పరివర్తనం

ఎదలో జలదం, అనిలో అశ్వం
ముంగిట హరిణం, వనిలో సింహం
కలిసిన ఉద్యమ రూపం
జన చేతన తెలంగాణ!

ఒక అతిశయ భావ ప్రభావంతో చెలగే ప్రశ్నకు
జరిగిన అసమతపై సంఘానికి జవాబు తప్పదు

విశ్రామం లేని ప్రవాహం ప్రాణం పోసే పవమానం
ఉద్యమ ప్రియులకు తమ విధి జ్ఞప్తికి తెస్తూ పోతాయి

సంకెల తగిలించే యోజనలో అతిశయం
సంకెల తెంచేసే యత్నంలో జవాబు
వర్షం కయి చూచే జన హృదయం
పిడుగు పాటు ధ్వనికి కలవరపడిపోదు

ఏ దేశం విభజన అయినా భాషా రాష్ట్రం అయినా
ప్రాదేశిక ఖండం అయినా మనో మూల మొకటే
భావ క్రియల వికృతిలో శాఖలుగా
జీవ శక్తి నుండి పై కెదిగినవీ
నష్ట పడిన బ్రతుకులకు అవసరమై
ఇష్ట మయిన మనసులకు సుందరమై

తరువు ఒకటే! హరువు ఒకటే
పరువు ఒకటే! పలుకు ఒకటే
మానుష స్పందన ఒకటే
సంస్కృతి స్రవంతి ఒకటే
అయినా పాయలుగా వేరయ్యే సందర్భం
ఉద్యమ చరిత్రలో తప్పనిదీ పరిణామం

❊

స్వేచ్ఛా కవిత్వం - 58

# అడవిలో ఆయుధం

## దీర్ఘ కావ్యం

మాదిరాజు రంగారావు

2014

రసధుని - సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Free Verse - 58

# ADAVILO AYUDHAM

(Long Poem)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2014

*Presented*

*to my daughter*

***Haritha*** M.A. (Lit.)

Detroit, MI. U.S.A

*with affection and blessings*

*on*

*her Birthday*

3rd January

# ప్రవేశిక

ఈ కావ్యం 'అడవిలో ఆయుధం' పేరును బట్టి సహృదయుల మనస్సులో వస్తువు సులభంగా స్ఫూర్తికి రావడం సహజం.

ఇపుడున్న వ్యవస్థ కన్నా మేలైందీ, భవిష్యత్తును ఇంతకన్నా శుభ్రంగా తీర్చిదిద్దే సక్రియలో ఆయుధాన్ని చేపట్టే దార్శనిక సిద్ధాంత వాద ప్రభావ రూపంతో వాస్తవికతను భావింపచేస్తూంది.

ఇది అడవి కేంద్రంగా సాగిన కావ్యం.

మానుష చింతనం. సమాజ సంస్కరణం పరివర్తనంతో జనహిత లక్షణాలతో ఇపుడున్న పరిస్థితులలో నాకు అభిమతమైందీ, ప్రజాస్వామ్య దార్శనికం.

ఈ కృతిలో అడవి – ఆయుధం – పోరాటం – ఉద్యమం – మానవత – జనహితం – ప్రగతి – భవిష్యద్దర్శనం మొదలుగా ఆలోచనా ప్రపంచం, 'అడవి' వాతావరణంలో కలిసి పోయిన మానుష రూపంతో దృష్టికి వస్తుంది.

ఈ దీర్ఘ కావ్యంలో కవితలు అపుడపుడూ పత్రికలలో టెలివిజన్‌లో వెలువడిన వార్తలకు స్పందిస్తూ, వెంటనే నేను నమ్మే ప్రజాస్వామ్య భావనతో వెలువడినవి. ఒకే విషయ సూత్రం కలిగినవి. ఈ వార్తా కవిత్వ రచన వర్తమాన స్థితిగతులతో రూపొందింది.

ఇందులో వాస్తవికత భావరూపం ప్రతీక వ్యంజకతతో స్వేచ్ఛా కవిత్వానికి నవ్యతనూ ఉన్నతినీ గభీరతనూ విశ్వ హృదయాన్నీ సిద్ధింప జేసే ప్రయత్నం జరిగింది.

చివరలో సామాజికంగా రాజకీయంగా ఎంతటి సమస్యకయినా ఉదారమయిన ప్రజాస్వామ్య వివేకంతో తృప్తికరమయిన పరిష్కారం చూపవచ్చుననే అభిప్రాయంతో ఈ దార్శనికత అవసరమూ సూచితమయింది.

**– మాదిరాజు రంగారావు**

# అడవిలో ఆయుధం

## దీర్ఘకావ్యం

### 1.

ఒకపుడు వేటకు మితమయిన ఆయుధం
ఇపుడు అడవి లోకి, ఉగ్ర వాద సాధనం

ఒకపుడు క్షుధలో పక్షి పయి దూసిన బాణం
స్థానంలో ఇపుడు కోరే మార్పుకు బులెట్!

ప్రాణ రక్షణకో దేశ రక్షణకో
విజయంలో విభవంలో పై చేయికీ
మనిషి నుండి మరో మనిషి పై ప్రయోగం
మృత్యు ముద్ర వదలుతూంది ఆయుధం

వర్ణ భేద నిర్మూలనలో వర్గ భావ నాశన గతిలో
విలయ జగం దింపుతూంది వర్తమాన సమాజంలో

ఆర్ద్ర భావ స్పందన గల మానవతా రూపం
శిలా స్థితిని పొంది సంఘానికి దూర మవుతూంది

పొరలి వచ్చే జన బాధా తరంగాల్ని
అడ్డు కట్ట వేసి నిలిపేయాలనీ
హృదిలో ఎగసే బడబానల కీలల్ని
అదుపు చేసి శాంతి మయం చేయాలనీ

కనిపించని భావ ప్రకారంలో కనిపించే కార్య రూపం
జీవన కటు వాస్తవాన్ని నిలుపుతూంది ఎదురుగా
ఏ పుణ్య భావ సూచనలూ పని చేయవు,
అవి ప్రశ్నల చుట్టూ తిరిగే రంగుల బొమ్మలు!

సమ సమాజ నవ దర్శన భావనలో
ఒక భవిష్య దృశ్యం! చూపే మాట నిజం
అది జీవిత వాస్తవం లోకి మారాలిసి ఉంది
స్వేచ్ఛలో ప్రజాస్వామ్య స్పందన హృదయంతో

## 2.

అడవిలో చెట్లలో కలిసి పోయి ఒకటయి
ఆయుధ సహచర గణం! తీవ్ర వాద మతితో

అనల రహస్యం దాగిన ముఖాలతో
పొదల చాటున ఒదిగిన దేహాలతో

త్యాగ పూర్ణ రూపంతో సమాజ భవిత చింతనతో
కొలిమిలో తప్తమైన ఇనుప రేకుల ఊహాలతో
విప్లవాశయ నిలయాల నుండి అపుడపుడూ
విడుదలవుతుంది, చర్యల ఉదగ్ర దృశ్యం!

అనల శిఖల శ్వాసలతో యుద్ధ భావ చలనంతో
ప్రతి క్రియల పథకంలో అనుక్షణం గడుపుతూ పొయేరు

కాల చక్ర భ్రమణంలో విచ్చేసే వసంతం
వీరి జీవితానికి వచ్చీ రానట్లే ఉంటుంది

క్షితిజంలో కనిపించే ఇంద్ర ధనుసులా
భాగ్య సుఖం ఎంత సేపు నిలిచేదీ తెలియదు!

నిరాశా జగం లోనూ మనుషుల ఆశా చిహ్నాలు
గగనంలో రవి శశి చుక్కలు మబ్బులు!
మార్పుకు ప్రేరేపిస్తాయి, అడుగులు ముందుకు వేయిస్తాయి

జన హిత లక్ష్యంతో చేసే వాద విధంలో
రంగు అద్దాల నుండి చూపుకు తెలిసేదీ
నిజం నుండి మారిన కొంత నిజం మాత్రమే

నమ్మే వాదం కోసం పోరాట పటిమతో
ఎన్ను కొన్న పథంలో సవేగ ప్రయాణంలో
నరాలలో స్రవించే కవోష్ణ రుధిరంతో పాటు
హృదిలో కరుణ రసావిష్కారం కూడా అవసరం

# 3.

జీవన గతిలో తప్పని బాధలు భరించలేక
అండ లేని సమాజం నుండి బయట పడీ
కనబడకుండా పొలి మేరలు దాటి మార్పుకై
అడవిలో తేలేరు! ఉగ్ర పథాన ఆయుధంతో

అజ్ఞాతంలో రహస్య స్థావరాల శరణంలో
జటిలమయిన సమస్యలకు పరిష్కార ప్రయోగాలు.

ఇక్కడికి ఎందుకు వచ్చిందీ? నీటిలో బింబంలా జవాబు
మబ్బు నుండి మెరపులా మనసులో రహస్య వాక్యం

తమ క్షేమం  ఎవరికీ తెలపాలని లేదు
తెలియాలని అనుకునే వారికి తెలిసే వీలులేదు

మౌన రూపాలలో చెట్లు! చేతులు ఊపుతూ
చెరువులూ వాగులూ రస హృదయం చూపిస్తూ

తమ జీవన స్థాయికి సాక్ష్యం గూన గుడిసె
ఇంటికి వంకర టింకర మెలికల పాము బాట!
అక్కడక్కడా దారి పక్కన, దీన హీన జీవితాలు
అపుడపుడూ జ్ఞాపక చక్రం పయి తిరుగుతాయి

ప్రధానమయిన సమాజ ప్రవాహం నుండి
దూరంగా అడవిలో సమాజ చింతన క్రియలో
వదలిన ఊరులో, ఏ వీడ్కోలూ లేదు
చేరిన అడవిలో, ఏ స్వాగతమూ లేదు

ఏ కొలతలకూ అందనిదీ ఆదర్శం
విలువలు కాపాడే ఆలోచనతో జీవితం
పోరాటానికి అంకిత మయిన బ్రతుకులు
హింస నుండి హంసలై ఎగిరే కోరికతో

## 4.

పెను తుపానును లెక్క చేయని సాహసం
సమాజ సన్నివేశ దృశ్యాన్ని మారుస్తోంది
ఎక్కడ చూచినా భగ్నమైన స్థితి గతులే
ఆయుధం హెచ్చరికలతో మలుపులు తిరుగుతూ

దూసిన బాణ మయి, అడవికి చేరి
రక్షణలో రైఫిల్‌గా, నిలిచిన మనిషికి

వెనక్కి వెళ్ళే ఆలోచన, అసలు రాదు
లక్ష్యం పొందే దాకా! నివాస మక్కడే

ప్రవహించే నదిలో చేపలా రహస్య తంత్రం
ఎంతటి వలకూ చిక్కని ఉపాయ చలనంతో

దశల దశలలో చరిత్ర! ప్రతి యుగంలో
వెలుగూ చీకటి కమ్ముకొనీ పలు పాళ్ళలో

పాత బడిన వ్యవస్థ అయినా జీర్ణమయిన నిలయమయినా
పరివర్తనకయి ఎవరూ దగ్ధం చేయరు.
నమ్మిన నిజం కోసం పోరాటంలో,
ఎన్ను కొన్న మార్గం అనల పథం కావచ్చు

వర్తమాన దీన హీన దృశ్యాల్ని తుడిచేసి
భవిష్యత్తులో భాగ్యం వశమయ్యేందుకు
కంటి చివర నుండి, విడుదలయిన అనల కణం
నిప్పులు చిమ్ముతూంది విప్లవ సంకేతంగా

ఎప్పటి కపుడు ఎక్కడి కక్కడ
కొత్త గాలి తోనే ప్రాణానికి సుఖం
ఆలోచనలో స్వచ్ఛత సమగతిలో మనస్సు
అందరూ కోరేదీ, ఎవరికీ అందనిదీ

## 5.

మూసిన సమాజ నిలయం కిటికి
తెరవబడీ! వింతలు చూపిస్తుంది
కల్పనలో భవిష్యత్తు! మనిషిని
ఆకాశ మెత్తుగా నిలుపుతుంది

చీకటి కృష్ణ సర్పమై దారిలో రాత్రి వేళ
మనసును భయ జలధి లోకి దింపుతూంది

చీకటి బురదలో మునిగిన  చంద్రుడు
మెల్లగా పైకి లేచి బయట పడే యత్నం
కిటికి నుండి కనిపించే ఆశా రూపం
ప్రేరణయై అడవిలో బతుకును బతికిస్తూంది

పక్షుల కల రవాలతో కలకలలాడే అడవి
బలగాల బూట్ల చప్పుడుతో చిట చిట లాడుతుంది

ప్రకృతిలో  గ్రీష్మం ఎపుడో! ఆ రుతువు కాలంలో
మనిషిలో గ్రీష్మ తాండవానికి ఒక కాలం లేదు

ఆయుధానికి బలి అయి పోయిన మానుష రూపానికి
చితిలో మంటలా! పగలు ఎండ! తీవ్ర తీవ్రంగా

టీ  కప్పు నుండి వేడి వేడి పొగలా క్షణాలు
వాడిన మొగలి పట్టలా ఆ సమయంలో
చెట్టు నీడ ఒకటే! తాప హరంగా ఉంది
చెట్టు పై పచ్చని ఆకుల్లో మాత్రం! శాంతి! క్షేమంగా

అడవిలో ఉగ్ర యోధుల ఉనికిలో రహస్య వ్యూహం
జవాబు దొరకని జటిల మయిన ప్రశ్నలా ఉంది

జేబులో మొబైల్ రింగ్ టోన్ మాత్రం
అపుడపుడూ గడ్డ కట్టిన మౌనాన్ని స్రవింప చేస్తూంది

# 6.

ఉదయ కిరణం బాల్యం లోకి తీసుక వెళుతుంది
సాయం వెలుగు పరిణత స్థితిని సూచిస్తుంది
రాత్రి వెన్నెల జీవన సుఖాన్ని తలపిస్తుంది
చంద్ర కిరణం ఆపద దాటే ఉపాయం తెలుపుతుంది

అడవిలో ఎదురుగా మరో వ్యక్తి అదృశ్యంగా
తనతో మాట్లాడుతూ ఉన్నట్లు ఉంటుంది
మాటల వెనక నుండి స్మృతి శకలా లొక టొకటీ
సరస్సులో ప్రతిఫలించే గగనంలో మెరసే చుక్కల్లా

రాత్రి తేలికగా గడుస్తుంది తరలే మబ్బులా
పగలు బరువుగా నడుస్తుంది కదలే వాహనంలా

నీలి మబ్బుకు ముందు విరిసిన ఇంద్ర చాపంలా
తనలో ఎపుడో వీడిన సమాజంపై ఆకర్షణ!

పగలు నిలువునా చీలిన సమాజ సమూహాలు
రాత్రి ఒకటిగా మారతాయి! చీకటి కష్టంలో

ఎవరి కోట వారిది తమ తమ రక్షణ కయి
ఎవరి కయినా చేరే కోరిక మాత్రం ఒకటే!

ఇప్పటికీ మనిషిని వేటాడే మనిషి మనో రూపం
ఆపై దాడులు చాటుగా; అపాయకర రీతులలో

మలుపు లోనో ఎదురుబడో అనుకోకుండా
తారస పడి, కాల్పులు మొదలవుతాయి

నిరాశలో ఆశను తీసి అందల మెక్కించే
ఊహలలో, ఎవరి భూమికలో వారు అరణ్యంలో

రహస్య వ్యూహం భగ్నమై, ఉపాయ చక్రం బెడిసీ
అడవికి నిప్పంటిన ప్రమాదం! విధ్వంస చణం

# 7.

దూరాన మండే చితిలా సంధ్యారుణ శకలం
దగ్గరలో లేచే సమాధిలా నిశీథి ఖండం

ఇక్కడ వెన్నెల కూడా అపుడపుడూ మనిషిలో
అనుమానం పెను భూతం ఆవహించి కనిపిస్తుంది
మరణాన్ని సైతం ఎదిరించే శక్తి నింపుకొనీ
చాటు చాటుగా అడుగులు వేస్తూ ఇరు పక్షాలు

క్రుంగిన రథ చక్రాన్ని పైకి ఎత్తుతూ
అభిమానం పట్టుదల వీడని వ్యక్తిత్వంతో
శత్రువు చేతిలో గాయ పడే దృశ్యం
వర్తమాన విషాద సమాజ చలనంలో భాగం

ఈ దుస్సహ దశల్ని దాటితేనే
జన సౌభాగ్యం లక్ష్యానికి చేరేదీ
ఇప్పట్లో జరిగే సూచన లేక పోయినా
పట్టు వీడని ఉదగ్ర సంకల్పంతో యోధులు

వ్యక్తిలో పేరాశకు నిశా శిఖరం తల వంచుతూంది
ఉదయ కిరణం ఫక్కున నవ్వు వెలుగు చిమ్ముతూంది

అరణ్యంలో తెరచిన కొత్త దారులతో
సమస్యను ఎదుర్కొనే ప్రణాళికలో పాలకులు

ఒక ఆట లేదు, పాట లేదు, ఉంది ఒకటే
జీవన బాధాలాపంతో ఎగసే మాట! కవిత!

ఊహకు  సాధ్యం కాని దార్శనికం లేదు
చర్యకు సిద్ధం కాని ఆలోచన లేదు
సమాజ భాగ్యానికి దూరమయిన బ్రతుకులో
జారే కన్నీటిని, గాలి! తుడుస్తూ పోతూంది

## 8.

శిలలో అణువుల్ని కదిలించి చెక్కిన శిల్పంతో
ఇనుప తీగెల్ని సవరించి శబ్దించే రాగంతో
ఎదను తాకి ఆర్ద్రాకృతి నిచ్చే మతి ప్రభ
చిత్రంగా విస్ఫోటంలో మృత్యువును స్వాగతిస్తూంది

నిశా వేళ కాలం కను రెప్పలు వాలినా
అడవిలో సెంట్రి, రవి శశి కళ్ళను తెరచీ

వ్యక్తి తల తీయడమంటే ఇపుడు
చదరంగంలో పావును తొలగించి నట్లు ఉంది
అదే పావు, మరో ఆటలో పాల్గొంటుంది
ఆ వ్యక్తి తిరిగి వచ్చి, మరో చోట కనిపించేనా?

ఆశ అంచు నుండి నిరాశ అంచు వరకు
ఊగే ఊయల మనస్సు పై సాగే జీవితం
ఒక విషమ వేళ జారి పడుతూంది
ఆలోచన భయదాకృతి పొందుతూంది

మనిషి పట్ల స్నేహ సుందర సుమం బదులు
వర్తనలో కంటక రూపం కనిపిస్తూంది

ఏ శిల చాటు నుండో, ఏ పొద మాటు నుండో
పొగలు క్రమ్మిన అనల ముఖం గ్రహణ బింబం
నిప్పంటిన సంస్కృతి రేఖల చిత్రంతో కాలం
క్షణాలలో బూది రాశి, సమాధిని తలపిస్తూంది

పదు నెక్కిన సంకల్పం ఆయుధ మవుతూంది
ఆయుధం మొనపై  చూపు! నిలుస్తూంది

మంచు ముద్దల్లా మారిన క్షణాలు
కరిగి తేనే జీవితం సహజ స్థితికి వస్తుంది

## 9.

బాధల్ని సహిస్తూ సహిస్తూ, విసిగి విసిగి
బరువుల్ని వహిస్తూ వహిస్తూ, నలిగి నలిగి
పాలనా బలం నుండి ప్రబలిన ఆయుధ ప్రభావం
ఈ అడవిని అనల సర్పంతో బంధిస్తూంది

చివురులో పూవులో మాత్రం మిగిలీ
మనిషిలో మెత్తదనం తగ్గి పోతూంది

ఎగుడు దిగుడు కాలి బాటలో
ఆయుధ శబ్దం! ఉలికి పాటుతో
అరణ్యాన్ని చీలుస్తూ ఉగ్ర చరణ బృందం
ఆదర్శ చరణంతో ప్రమాదం అంచులో

నేలపై రాలి! మట్టిలో కలిసి పోయే
సాధారణ రూపం కాదు! మానవ జీవితం.
గెలుపూ ఓటమి దశల్ని చవి చూస్తూనే
మనిషి మూల రూపం బ్రతకడ మవసరం

కుంపటిలో మొక్కల్ని ఎవరు పెంచగలరు?
అలజడిలో భాగ్యాన్ని ఎవరు చూపగలరు?

హతు లెవరు? హంతకు లెవరు? అన్న ప్రశ్న
చరిత్రలో ఎప్పటికీ సజీవ చర్యకు కేంద్రం.

తాము చూచే దిశా ఫాల తలంపై
తాము కోరే జవాబును చూడాలనీ

ఎవరి దార్శనికం వారికి అనన్యం!
ఎవరి ఆచరణం వారికి సమంజసం

అవమానమో? సన్మానమో? కారణ మేదయినా
మనిషి విలువ కాపాడే బాధ్యత మనిషిదే

## 10.

రాజ్యానికి మూల బలంలో ఆయుధ మొకటి
వ్యక్తులకూ సమూహాలకూ అవకాశం తక్కువయి,
దార్శనిక పథంలో జన విశాల హిత స్పందనతో
ఒకనాటికి విజయ లక్ష్యంతో పురోగమన సాధనం

ఉగ్ర వాద చర్యలతో వర్తమాన కాలం
మండే కొలిమిలా ధగ ధగ లాడుతుంది, బయటికి
నిప్పుల కుంపటిలా కణ కణ లాడుతూంది, లోన
చల్లార్చే యోచనలో జలద చలనంకై, యంత్రాంగం

అడవిలో పేలిన ఆయుధం! ప్రతి ధ్వనిస్తూంది
నగరంలో ఎ.సి. గదిలో ఉన్న నేతల గుండెలలో
దీర్ఘమైన సమస్యకు స్థిర మయిన పరిష్కారంలో
ఆయుధ మెన్నటి కైనా వెలుగు దారి చూపుతుందనే!

చెల రేగిన  ఉగ్ర వాద బృందం ఒక మూల నుండి
జల్లెడ పట్టే పనిలో సాయుధ బలా లొక వైపు నుండి
వ్యూహ రచన తల క్రిందయి, ప్రణాళికలు ముక్కలై
పేలిన మందు పాత్ర, బీభత్స దృశ్యం వదలుతూంది

సహింప రాని పీడనలో, భరింపరాని బాధలలో
నిశితమై ఆలోచన, తీవ్రమై క్రియా శక్తి
చర్యలతో సమాజం! శిశిరా కృతి పొందుతూంది
దేశాల కతీతంగా, బంధాలకు దూరంగా

ఎవరయినా మానవ జీవ స్పందనం ఒకటే
గాజు తోనో ప్లాస్టిక్ తోనో, వస్తువు కాదు మేధ!
జీవ శక్తి చేతనతో సామాజిక వ్యక్తిత్వంతో
ఇది మానవ అస్తిత్వంలో! అవసర గతి విశేషం

# 11.

ఇచట బ్రతుకు ఒక దశలో నిలిచినట్లు ఉంటుంది
విప్పారిన మొగలి రేకుల ఘడియలు
అంతలో వాడి పోయి మాడి పోయి, ముళ్ళు తేలతాయి

తగిలిన గాయాల్ని ఆకాశం కప్పేయ చూస్తుంది
గాయాల స్మృతుల్ని, కాలం జేబులో వేసుకుంటుంది
వికాసం కోరే మనసుకు, వినాశంపై దృష్టిపోదు
ముఖంలో చిరునవ్వు హఠాత్తుగా ఎగిరిపోతుంది
చూస్తే చెట్టు కొమ్మన పూవులో కనిపిస్తుంది

ఎవరికీ ఛేదింప రాని రహస్య తంత్రం
మనసుకు ముసుగయి దాచేయ చూస్తుంది

చర్యతో ప్రతి చర్యకు దారి తీసే ప్రకారం
అడవిలో ఆయుధం చుట్టూ పరిభ్రమిస్తూంది

శిశిర రూపంతో మంచు కవచంతో
గ్రీష్మ మస్తిష్కంతో సమూహాలు! కాల రూపాలై

వసంతం మాట లేదు! నిషేధమూ లేదు
ఆయుధ బహు మానంతో, తీవ్రవాదం ఏలుతూంది

వ్యక్తిలో చీకటి పాత్ర
విషాద నాటకానికి చక్కని విషయ మిస్తూంది
వ్యక్తిలో వెలుగు పాత్ర
మసి బట్టిన మనసులో! అదృశ్యంగా ఉంది

చరిత్రలో తిరిగే యుగాల రణ చక్రం
తరాలుగా విషాద స్మృతి చిహ్నాలతో
మధ్య మధ్య శాంతి వనంలో పూల .......
మనిషి యశో రూపానికి! సృజన రూప మిస్తూంది

# 12.

పూర్వం పరిచయ మున్న బంధువులూ మిత్రులూ
ఎవరూ ఆనవాలు పట్ట లేని మార్పుతో వ్యక్తిత్వంలో
సామాజిక రుగ్మతల్నీ మానసిక వికారాల్నీ
చెరపేసే తుడిచేసే బలమైన కోరికతో

కలల్ని తొలగించీ వాస్తవ జీవితాన్ని నింపీ
వైఫల్యాల్ని సాఫల్యాలుగా మారే సక్రియతో
ఆలోచనతో అనుభవ పథలో అడుగులు తేసే
అడవిని నమ్ముకొనీ! ఆకులలో అగ్నులు

ఆకాశం! హాహారవం! బయటి నుండి వినబడీ
వినబడనట్లుగా కదలని వారెందరో!

అనల రేఖలతో తీర్చిన రాజ శాసనం హద్దులు
దాట రాని స్థితిలో, జాలి పడే దశలో
సమాజానికి దూరమయి, అడవిని ఎన్నుకొనీ
మానవ విజయంపై ఆశ, సుళ్ళు తిరుగుతూ లోపల

రాగం వినాలనుకునే హృదయం
తెగిన తీగెను సవరించు కుంటుంది
గమ్యం చేరాలనుకునే సంకల్పం
వెళ్ళే రూపాన్ని సమకూర్చు కుంటుంది
భయ లయ వినిపించే బూట్ల ధ్వనికి
స్థలం నుండి స్థలానికి చకితంగా మారుతూ
కొండల్ని చుట్టీ, వాగుల్ని దాటీ
చెట్ల సందులలో నుండి బయట పడేరు
ఎక్కడో నేలపై చిందిన రక్త చిత్ర రహస్యం!
రాజధాని చౌరస్తాలో నిరసనలో మ్రోగుతూంది

## 13.

చీకటిలో కొరకంచుల వలె కదలే మూర్తుల్ని
చుక్కలు వెల వెల బోయి చూస్తూ ఉంటాయి
చుట్టూ! చెట్లు అమాయకంగా నిలిచీ
స్థావరాల చుట్టూ మనుషుల జాడలు అంతంత మాత్రమే

ఎగసిన మంటలు అణగి, క్రమ్మిన పొగలు తొలగి
నేలపై పడి ఉన్న మానవ శరీరాలు!
ఏ వన్య ప్రాణి క్రూర చర్య కాదు
మనిషి కెదు తీర్చిన, మరో మనిషి! శత్రుతా పర్యవసానం

మిద్దెల్ని కూలిస్తే, సమస్య తీరేనా?
పెద్దల్ని తొలగిస్తే, జవాబు దొరకేనా?
ప్రేమతో త్యాగంతో సమానత ఉదారతతో
మార్పుకు వ్యూహంలో మనో రూప మవసరం

ఒక సమస్య నుండి బయట పడితే
మరొకటి పీట ముడితో రాజకీయమై
మానవ జీవిత మంతా చిన్నదో పెద్దదో
సమస్యతో అలంకృతం కాని రోజు లేదు!

మంచు తెరల చాటున పూల మొగ్గలు
విప్పారేది! ఆ మంచు తొలగి పోయి నపుడే
ఏ ఆయుధమూ విప్పార జేయ లేదు
ఏ శాసనమూ పుష్పంగా మార్చలేదు

మమత లేని మనసు ఉండనే ఉండదు
ఒక సమయంలో బిగిసి శిలామయం కావచ్చు
సాయం సంధ్యా దృశ్యంలో అరుణ చిత్ర శకలాల
గాయాల ముందు! మోదుగ పూవు చిన్నబోతూంది!

# 14.

భూమి తలం ఎప్పటికీ అదే! ఒకటే
గగన తలం ఎప్పటికీ అదే! ఒకటే
దశ దిశలూ అవే! చూపులు వేరు! వేరు!
కోణాలు వేరు, మనుషులూ వేరు! వేరు!
గమ్యాలు వేరు, ప్రయోజనాలు వేరు! వేరు!
ఊహా లోకాలు వేరు! అనుభవ ప్రపంచాలు వేరు!

ఎక్కడి కక్కడ వేరు వేరు సమాజ క్షేత్రాలు
సమాకలనంలో అపుడపుడూ ఘర్షణ, హింస!

ఒక్కొక్క వాస్తవం వెనక ఒక రహస్యంతో ముడి వడీ
కథలకు కొదవ లేదు, అనుభవాలకు మితం లేదు
ఆలోచనలో, ఎప్పటి కపుడు కొత్త కొత్త మార్గాలు
జీవితాన్ని తీరుస్తాయి; సమాజాన్ని నిర్మిస్తాయి

వేరు వేరు ప్రభావ ప్రత్యేకతలతో రుతువులు
మనసులో జీవితాన్ని వైవిధ్యంతో తీరుస్తాయి
ఘర్షణ నుండి హింస నుండి సహనానికీ శాంతానికీ
రాగంతో త్యాగంతో, మానవ విజయం సాధ్యం

మృత్యువు ఎప్పటికీ వీడని మిత్రంలా వెనకనే
భయ బీజం నాటి, మనిషిని జాగ్రత్త పరుస్తుంది
ఊపిరి అలలపై తేలుతూ మనిషి ననుసరిస్తుంది
సృజన రూపం అంటుకొనీ, విలయ రూపం కదలుతుంది

కాలం వినిపిస్తుంది ప్రతి తరంలో ఆయుధ కథ
సిద్ధంగా లేకున్నా, మనిషి చెవిని వేసి పోతుంది
అనుభవం నుండి అక్షర పంక్తికి తరలీ
బిందువుతో మొదలై, బింబమై ఆకర్షిస్తుంది

## 15.

ప్రకృతి ప్రపంచంలో భూకంపం పెను తుపానులా
సమాజ స్థితి గతిలో ఘర్షణ రణ చక్ర పరిభ్రమణం!

కృత్రిమ వేషాలకు వ్యతిరేకంగా దూరంగా
అసమానత అన్యాయం అంతరింపజేయాలనీ
ప్రవాహతను కోల్పోయిన సమాజాన్ని సరింపజేయాలనీ
జీవ శక్తితో వేగం పెంచేందుకు సిద్ధమై
వరదల వలె వచ్చే బాధా స్థితుల కెదురుగా
కర కట్టల వలె ధైర్యంగా నిలిచేరు

ప్రతి మజిలీలో, జన కథా సముచ్చయం
ప్రతి మలుపులో, జన వ్యథా సంకలనం
హృదయంలో అలలపై నావలా కదలేరు
ఆలోచనలో గాలిలో ప్లేన్‌లా సాగేరు

దైవం స్వర్గం పుణ్య పాపం గురించి ఊహల్ని
పైన మెరసే నక్షత్రాలకు తగిలించీ

చర్యకు ప్రతి చర్యతో ఎదురుపడే కాలంలో
శాంతికి సూచనగా మధ్య మధ్య విరామం ఒక ఊరట

ఎవరి దేశం వారిది, సహజంగా ప్రియం
ఎవరి ఊరు వారికి మానసికంగా ఆప్తం

ఒక స్థాయిని దాటిన పై మనోరూపం
విశ్వమయ మవుతుంది జీవితంలో

వివిధ స్థాయిల్లో శ్రేణులతో సమాజం
ఒకే ఒక స్థాయిలో శ్రేణిలో అసహజం అసంభవం

రైలు అంద లేదనో, సీటు దొరక లేదనో
పట్టాలను తొలగించరు, రైలును ఆపేయరు

## 16.

ఆయుధం ఆయుధమే, మారణ గుణ క్రియలో
కత్తీ బాణం పిస్టల్ రైఫిల్ ఆపై మిసైల్

అడవిలో ఆయుధం సమాజ పరివర్తన లక్ష్యంలో
గుండెను మీటు తుంది, రణ స్వరం! వినిపిస్తుంది

శత్రువు నీడలపై అనుమానంతో
చూచే చూపులు అగ్ని శిఖలై పోతాయి
పరిసరాల చెట్ల వెనక కదలికతో
ఆయుధాన్ని స్పృశిస్తాయి, చేతి వేళ్ళు!

పొదలపై  మరు క్షణం విరిసిన పూలకు బదులు
నిప్పు రవ్వల బూది పొరలు కనిపించవచ్చు

పైన మిత్రులో! బంధువులో వలె మబ్బులు
చిరు జల్లులతో మెరపు చూపులు విసరిపోతాయి

బీడు భూమిలో, అక్కడక్కడ చిన్న చిన్న పడియల్లా
అడవిలో సక్రియలో, ఉన్న యోధులలో ఆశా రూపాలు
జేబు నుండి జారి పడిన చిల్లర నాణాల్లా
అక్కడక్కడా పురా వాసుల గుడిసెల గుంపులు!

బుట్టలో ఆణగి మణగిన పాముల్లా
మౌనం వహించిన ముఖాలలో రహస్యాలు
ఇది అందరికీ తెలియదు, తెలియాలనీ లేదు
ఎవరికయినా తెలిసినా! నోట మాట పెకలదు!

దూర దూరాన రక్షణ శ్రేణులు, కొండలు!
దగ్గర దగ్గరగా నిలిచిన సెంట్రీలు, తాటి చెట్లు
ప్రకృతి సహజమైన భద్రతలో మహా ధైర్యంగా
అడవిలో! ఉగ్ర వాద మినీ సూర్య బింబాలు

## 17.

ఏ వైపు నుండో చకితంగా అనుకోకుండా
చెట్లలో ఒకరై ఆడుకునే పిల్లల పైనో
నీటి కడవతో వెళ్ళే మహిళ పైనో
జీవిక కయి సాగే శ్రమ జీవిపైనో
పొరపాటున కావచ్చు, గురి తప్పే కావచ్చు
తూటా దూసే ప్రమాద క్షణం లో
ప్రాణం, నక్షత్రమై పోతుంది
ఆశలు, శిశిర శాఖ లవుతాయి

రైలు రాక లేని విరామ సమయంలో
రాత్రి వేళ ప్లాట్ ఫార్మ్ దృశ్యంలా పరిసరాలు

చెట్లలో కొండల మధ్య తిరుగుతూ యోధులు
ఒంటరి వారు కారు! లోన మనుషు లెందరెందరో!
వారితో సంభాషణతో కాలం గడిపేరు
సమాజ శక్తి నిధులు, ప్రతినిధులు

ఇక్కడ చుట్టూ ఉన్న ప్రకృతి రూపం
ఆశను బ్రతికిస్తూంది, కొత్త శక్తి నిస్తూంది

బయట అంతటా! ఏవేవో! తెరలు కమ్మి
నిజం మాత్రం అంతరంగ పేటిలో భద్రంగా
మానసిక క్షోభలో, జీవన నవ కాంక్షతో
సమస్యకు అడ్డ దారి వెదకుతుంది! బుద్ధి

జలధి నుండి తాపంతో ఎగసిన జలదం
తిరిగి వెనక్కి వెళ్ళదు, కిందికి దిగదు.
అనుభవ క్రమంలో ఆదర్శం మారుతుంది
గతాన్ని మరపించే వర్తమానం ఒత్తిడిలో.

# 18.

అడవిలో అసువులు గాలిలో కలిసి పోయే
మనిషిలో త్యాగ శక్తి అందరికీ తెలియదు
ఎపుడయినా ఎవరయినా మృత్యువు తప్పదనీ,
బలవన్మరణం మాత్రం ఆమోదం కానే కాదు

హతుడూ హంతకుడూ ఎదురెదురుగా ఒక సమయంలో
ఒకరి గురించి మరొకరికి తెలియక పోవచ్చు.
ఎవరయినా అందరితో మానవ బంధం ఒకటే
మనిషి గురించి మనిషి పూర్తిగ మరచి పోవడం దారుణం

అందరినీ నిశ్చేష్టుల్ని చేసే విషాదవార్త
సామాన్యుల హృదయాల్లో ఆగ్రహాన్ని సృజిస్తూంది
కొందరిలో ఉద్రేకం ఊయెలయై ఊపుతుంది
కొందరిలో ప్రశ్న! నేలకు విసరి కొడుతుంది

చనిపోయిన మనిషిని, ఏ శక్తీ తీసుక రాలేదు, కానీ
ఆ మనిషి దార్శనికం! సాగే బాధ్యత బ్రతికి ఉన్న వారిదీ
ప్రజల మధ్య నుండి అడవిలోకీ, ఆయుధంతో
ప్రజల కోసమై తనలో రూపొందే కొత్త సమాజంకై

ఊరు నుండి అడవికి, ఈ సమాజ చలనంలో బ్రతకలేక
సమాజ లక్ష్యంలో, రక్షణకయి ఆయుధ మతితో
గాలి స్పృశిస్తూ పోతుంది, ఏ భేద భావం లేకుండా
వెలుగు పలకరించి పోతుంది, ఏ రాగ ద్వేషం లేకుండా

మనిషి చూపు మాత్రం దగ్గరికి వచ్చే కొద్దీ
చాకై ముల్లై నిప్పై భయపెడుతుంది
పడగెత్తిన మనిషిలో, పగ తీరే, సంబరంతో
లోప లున్న సూర్యుడు క్రిందికి జారి పోయేను

## 19.

ఆయుధంతో పెన వేసుకున్న జీవితాలు
చెదరని ధైర్యంతో విప్లవ రూపానికి అంకితమై
ఆపద సమయంలో అభయ హస్త మందించే
పచ్చని తరు మిత్ర గణంతో కలిసీ, ఒకటై

మాడ్చే మంటల నుండి కాపాడే ఈ చోట
కాల్చే మంటల్ని ఎదుర్కోవలసి వస్తోంది

మానవ చరిత్ర శిఖరంపై విప్లవ కేతనంతో
నేలపై శరీరం పక్కకు ఒరిగిన ముఖంతో
ఆయుధ మిత్రంతో రక్తారుణ రూపం!
వన దేవత ఫాలంపై, తగిలిన గాయంలా

ఏ ముఖంలో బల్బు ఎపుడు ఆరి పోయేదీ తెలియదు
ఏ క్షణంలో బ్రతుకు ఫ్యూజ్ ఎగిరి పోయేదీ తెలియదు
ఏ లిప్తలో ఆయువు తెగి పోయేదీ తెలియదు
భయ సందేహాల మధ్య ఊగుతూంది! జీవితం

పాలనా స్వచ్ఛత పై విశ్వాసం తగ్గిపోయి
ఆయుధ మొకటే శరణ్యా మవడ మొక! విచిత్రం

తరం నుండి మరో తరం విచిత్రాలతో! నీడలు
కాల్చ రానివీ! వదల లేనివీ! మనిషిని అంటుకొనీ!

ఉత్సాహ లహరులపై కదలే జీవన నావలు
తీరం చేరే వరకూ ఎక్కడా ఆగని కార్యక్రమంతో

భద్రతలో భాగమయిన ఆయుధం ఆశ్రయంలో
అడవిలో మరణానికి హేతువు కావడమొక స్వప్నం

## 20.

ఇనుప పాదం కింది నుండి బయట పడీ
ఇనుప పిడికిలి లోకి చేరాలను కోరరు! ఎవరూ

వికసించే స్వేచ్ఛలో పరిమళ సుమ రూపాన్ని
తెంపే నలిపే పనిలో చేయి చాచే దృశ్యం!
జీవన చలనంలో మనిషిని ప్రశ్నకు గురి చేస్తూంది
కాల దర్పణానికి ప్రతిఫలనంలో ఏ రూప మయినా ఒకటే!

క్రాస్ ఫైరింగ్‌లో ఆయుధ శబ్దంతో కమురు వాసన
విషాద చిత్రాలతో చరిత్రలో కొత్త పేజీలు!

పగలయినా రాత్రి అయినా ఒకే విధంగా
సాయం సంధ్యా శకలాలు! జారి నట్లుంది

కళ్ళకు నీలి రిబ్బను కప్పబడీ
మనిషిలో ఏ జంతువో అడుగులు వేస్తూంది.
బ్రతుకులో ఆశలు మొక్కలోనే కొరికేయబడుతూ
గమ్యానికి దూరంలో, నిరాశా పర్వంలో సమస్తం!

మనిషిలో మరో మనిషి దార్శనిక తేజంతో
ఆశను నిలుపుతూ పయనం సాగించేను

ఇట్లా వచ్చి, అట్లా వెళ్ళే, నిండు వాగుల వలె
ఆవేశం పొంగులో తీవ్ర వాద బృందాలు

దూరం నుండి దిశలు, చేతులు చాచి స్వాగతిస్తాయి
దారిలో శిలలు! చూపే ఆటంక రూపా లెన్నో!

ఇది నిషేధ ప్రాంత వలయం లోది కాదు, కానీ
అంత కన్న ఎక్కువ ప్రమాదంలో ఉందీ
ఎక్కడి కక్కడ! అనుమానం! సందేహం! చెకింగ్‌లూ
ప్రాణ భయం! ఏ చెట్టు పైనో ఆకుల్లో చేరుస్తుంది

## 21.

కన్నీటి కథ గురించి చింతనలో,
అడవిలో కలలకు అవకాశం లేదు
ఇక్కడ కొమ్మపై పూవు అందుకునేందుకు భయం
ఆకుల్లో నుండి, ఏ సర్పమో పడగ ఎత్తేననీ

శిలలు కరగి కదలవనీ అందరికీ తెలుసు!
శిల్పంగా మారే అవకాశం ఏ కొన్నిటికో!
శిల్పాల కళా ప్రయోజనం వేరు, ఆనందం!
బ్రతుకులో వాస్తవ తలంపయి అవసరాలు వేరు

బిగించిన తీగెలా ఉన్న నిశ్శబ్దం, ఇక్కడ
ఉన్నట్లుండి అనల రాగం వినిపిస్తుంది
మారణ గుణ చలనంతో! ఆయుధం
సమయాన్ని భీకర దృశ్యంతో నింపుతుంది

ఎరుపు రంగులో కనిపించే ఆకలి ప్రభావాన్ని
పచ్చ పచ్చని రంగు వేసి మరపించాలని ఒకరూ
తెలుపు రంగులో శాంతి రూపం! ఎప్పటికీ
నిజ జీవన శక్తిలో స్వచ్ఛమై శుభ్రమై

పొరపాటు ప్రతి సారి జరిగితే అలవాటవుతుంది
నిర్ణీతమైన పట్టాలపై నడచే రైలు కాదు, జీవితం

దేశం పొలి మేరలలో తప్పని ఆయుధ బలం
అడవిలో ఉగ్ర భావ బృందం చేతిలో చేరి
సమాజ గతిలో మలుపును తెచ్చే యత్నంలో
కార్యాచరణ మెప్పటికీ శిలల పొదల వెనక నుండీ

ఆశయ సాధనలో యోధుడు! తన చర్యలో
ప్రాణం ఇవ్వడానికే కాదు, తీయడానికీ సిద్ధంగా

## 22.

అర్థ రాత్రి స్వాతంత్ర్యాన్ని, చీకటి శిశువు అనే వారూ
మరో సూర్యుని రూపం చూడాలని కోరే వారూ
రాబోయే కాలంలో, అవబోయే సమాజం కయి నిరీక్షణం
ఆయుధ బలంతో, మరో సూర్యుడు దయ చేసేనా?

తీవ్ర తీవ్ర చర్యలతో నెత్తురు రేఖలు జారీ
భయ జీవిత చిత్రాలను చూపే వర్తనతో
చర్చలు కోరే వారూ, చర్యకు పూనే వారూ
ఇది కొత్త సమాజానికి  అర్పణగా పొంగే వారూ

శాంతి కోరి రాజ్యం వదలి పెట్టే వారూ
క్రాంతి కోరి ఆయుధం చే పట్టే వారూ
దగ్ధమైన చీకటి బూది నుండి స్వచ్ఛంగా
స్వర్ణ ప్రతిమ వస్తుందని తలచే వారూ

నడుస్తూన్న ప్రజాస్వామ్యం, రుజా గ్రస్తమై
ప్రజా మతం స్వార్థంలో, గ్రహణ బింబమై
నీతి నియమం క్రుంగిన రథ చక్రాలయి
కదలని సమాజంలో బ్రతుకులు అశాంతిలో

ప్రజా పాలనా మతులు గర్వాధికార శిఖలై
నేతలు నీతి బీర కాయ లోని నీతి రుచి చూపించేరు

మానసిక వికార రూపాల కెన్ని రంగులు వేసినా
మాట లెన్ని పలికినా! అన్నీ! పంట రాని వ్యవసాయమే

కరుణ జలం గడ్డ కట్టి, స్కేటింగ్‌కు పనికి వస్తూంది
ఆదర్శం ప్రదర్శనలో, వేడుకకు పనికి వస్తూంది

కొండలూ  నదులూ పచ్చని తరు తతితో
జీవన రుచి వేరయిన అడవిలో ఎజెండాతో
అశాంతి జలధిలో నావను గట్టుకు చేర్చేనా?

## 23.

మరో సూర్యుని కయి వేచి ఉన్న మనసుకు
రాత్రి కలలో తేజో బింబం, అప్పటికి నిజం
మేల్కొన్న మనిషికి తృప్తిని కలిగించేనా?
కోరే ఉదయం పై ఆశను నిలిపేనా? పెంచేనా?

ఒర నుండి పైకి దూసిన కత్తిలా
చీకటి నుండి బయటికి వచ్చిన కిరణం
ధవళారుణ పీత లోహిత సమాకలనంతో
మనసులో ప్రజాస్వామ్య చిత్రం బింబిస్తూంది

పులి అడుగులు వినీ వినీ
సింహ గర్జనలు వినీ వినీ
పాతబడీ కొత్త భయం! పట్టుకుంటూంది,
మనిషి మనిషికీ మధ్య ఆయుధం చోటు చేసుకొనీ

ఇపుడు పులీ సింహం మనిషిలో అవతరించి
అడుగులు వేస్తూ మెల్లగా అడవిని తలపిస్తాయి.
పగటి వేళ మండే రవి తాప వేళలో
ఏ తరువు నీడనో ఏ గుహ లోనో చేరతాయి

పులులూ సింహాలూ! సంస్కరింప బడేనా?
బోనుకు అలవాటయి, సర్కస్‌లో కనిపించేనా?
ఇక్కడ స్లోగన్లు వ్రాసేందుకు గోడలు లేవు!
అవి చదివి ఉత్తేజం పొందే! ప్రజలూ లేరు

అడవిలో పైకి దూక నున్న పులి లానో సింహం లానో
జీవితంలో ఎదురయ్యే సమయాలూ లేకపోలేదు!

ప్రజల నుండి దూరమై ప్రజల బంధ విమోచనంకై
ఉగ్రవాది చేతిలోని ఆయుధం! సమాజ దిశను చూపేనా?

## 24.

ఎన్ని సూక్తులు వల్లించినా సమాజంలో అశాంతి
నిశ్శబ్ద రూపం పొందదు! మౌన పాత్రనూ వహించదు
నవ చేతనతో వెలిగే ఉజ్వలమైన ప్రజాభిమతం
గ్రీష్మాన్ని తపింప జేస్తూ, చరిత్ర దశను మారుస్తూంది

సమత లేని బ్రతుకులలో  అవనతమైన ముఖాలతో
చేతనతో ఆలోచన అనల చక్రమవుతూంది
పరివర్తన సాధించే ఉపాయ పథంలో
ఊరు వదలి అడవి చేరి, ఆయుధ మవసరమవుతూంది

వర్తమాన విమోచనంలో జీవితాల భద్రతకయి
రాజ్య శక్తి కెదురుగా, పనిచేసే విప్లవ శ్రేణులు!
ఎవరి వాదం వారిది వేరు వేరు సన్నాహాలతో
ఇల్లు వదల చేస్తూంది! దారి వేరు చేస్తూంది

ఒక్కొక్కరి మనో రూపం, ఒక్కొక వాద్య విశేషం
అన్నీ కలిసిన సమరస సార ప్రపంచం, అవసరం
ఆదర్శం అనుభవంలోకి రావడం సులభం కాదు
ఒక స్థితిలో సమాజ రూపం గురించి ఆలోచన సహజం

ఉత్సాహ దర్పణంలో, తమ ముఖం చూచుకొంటూ
కలిగే బాధల నుండి, మనసు ఊరట పొందుతూంది
నీలి మబ్బు ముక్కల నుండి, చంద్ర బింబంలా
ఎప్పటికపుడొక కొత్త భావ లోకం మనసులో

మనిషి మనిషి కొక రంగు ఇష్టమై హత్తుకొనీ
వెనక నున్న నిజం! తేట తెల్లం కాదు
చేతిలో ఆయుధం జడంలో చేతన స్ఫూర్తితో
కన్నీరు తెచ్చేనా? ఇంతకూ! కన్నీరు తుడిచేనా?

## 25.

కొత్త మనిషి ప్రవేశం! అడవిలోకి, ఆయుధంతో
వసంతానికి వారసత్వ చిహ్నం ప్రకృతి రూపంలో
ప్రతి చెట్టూ ఆయుధమై నిలచి నట్లు ఉంటుంది
ఒక సామాజిక లక్ష్యానికి నేపథ్యం వహిస్తూంది

లోన ఉన్న ఉగ్ర వాద సమూహాలకు రక్షణగా
బయట నున్న జన శక్తులకు ధైర్యాన్ని ఇస్తూంది
యోధుల్ని వెంటాడే వారికి హద్దులు చూపిస్తోంది
చరిత్రలో రాబోయే మలుపును సూచిస్తూంది

సహజ సుందర మయిన ప్రకృతిలో భాగమై
ఏ అట్టహాసం లేదు! ఇంద్ర జాలం లేదు
ఇక్కడి మూల వాసులు జీవన రూపం మాత్రం
బహు సాధారణ రేఖ క్రింద! అట్టడుగున

ఆధునిక మారణ యంత్రాల ప్రవేశం!
అడవిలో విషాద దృశ్యాలకు కారణ మవుతూంది
శిశు దశను దాటని అమాయక జన సంస్కృతిని
ధూమ రేఖ కమ్ముతూంది, రక్త చిత్రం కనిపిస్తూంది

వర్తమాన ఖండంలో ప్రతి సమస్య దేని కది
గత చరిత్రతో ముడి వడి సహనాన్ని కోరుతూంది
సమాజ చలనంలో భవిష్యత్తు యోజన
అనుకోని విధంగా కత్తిరింప బడుతూంది

తల ఎత్తిన ఆయుధం ఏ ప్రశ్నకు జవాబు.
తల తీసే ప్రయత్నం ఏ సమస్యకు పరిష్కారం.
సామాన్యుని మేలుకు, రక్త తర్పణ మవసరమా?
ప్రేమ జలం లేని చోట, సౌభాగ్యం పండేనా?

## 26.

ఇనుప మేకులు దిగిన భయ దృశ్యం మారి
మనిషిలో నిజ రూపం వెలుగుకు రావాలనీ కోరిక
ఆటవిక జీవనానికి సాధారణ స్థాయి పెరిగి
మానవతా చలనం కనిపించాలనీ కోరిక

అడపా దడపా ఇరు వైపుల నుండీ ఆయుధాలు
సంభాషణ జరుపుతాయి! చర్యకు దిగుతాయి
మానుష బంధానికి నిప్పు అంటవచ్చు
సమాజ రూపానికి చీలిక లేర్పడ వచ్చు

ఆకలిలో అగ్నికి ఆహుతి అవసరమైనట్లు
మనస్సులో అహం పరితృప్తిని కోరుతూంది

తన వాదం నెగ్గాలనీ తన విజయం చూడాలనీ
మంచికీ చెడుకూ మోదానికీ భేదానికీ
కొలమానం కవి మానస రూపం! సృజనలో
రణమూ శాంతి సమాజ పూర్ణతలో ఖాళీలను నింపుతాయి

ఒక రోజున పటంపై క్రియా చిత్రం
పీలికలై గాలిలో తేలి పోతుంది.
ఒక రోజున కొండపై శిల్ప రూపం
ముక్కలుగా నేలపై కూలి పోతుంది.

విప్లవ మనస్సులో సుందర సమాజ స్వప్నం
ఎన్ కౌంటర్ లో తునకలయి పోతుంది
ఏ పక్షం వారయినా హనన ఘటన తో
చెదరని కాలం ముక్కలై గుచ్చుకొనీ బాధిస్తుంది

చేసే పనిలో చివరి ఫలం కీర్తికి చిహ్నం
వికలమై గాయమై ఎక్కడ మనిషి అక్కడే శిలయై

## 27.

మూసిన ఇనుప పెట్టెల్లా రహస్య స్థావరాలు
ఎవరూ రాలేని దట్ట మయిన స్థానాల్లో
అడవిలో ఆయుధంతో సాహస గుణ రూపాలు

బరువెక్కిన అడుగులతో భయంగా బయటికి వస్తారు
రహస్యాన్ని దాచిన కవర్ మనోరూపాలతో
మనిషి కదలికతో పక్షులు సంతోషంతో ఎగురుతాయి

ఎన్నెన్ని యుద్ధాలతోనో కదలే సమాజం
మార్పులతో చేర్పులతో కొత్త కొత్త కూర్పులతో
సహనాన్నీ శాంతినీ ప్రేమనూ వల్లిస్తూంది
వెనుక నుండి కలహ స్వరం వినిపిస్తూనే ఉంటుంది

ఎవరి శ్రుతిలో వారు అపుడపుడూ సోలో!
తీవ్రమయిన వైరుధ్యాల్లో తప్పనిదీ పోరాటం

ఏ పొద ఎప్పుడు నిప్పు బొమ్మ అయ్యేదీ తెలియదు
ఏ తరం ఎప్పుడు అనల లహరి అయ్యేదీ తెలియదు
ఏ శిల! ఎప్పుడు సాక్షిగా నిలచేదీ తెలియదు
మృత్యు చరిత్రలో! తెలియని దుర్ఘటనలో మనుషులు

ఇక్కడా వసంతం ప్రతి ఏడూ వస్తుంది
మారణ భయ వాతావరణంలో! పిలవని అతిథిలా

ఇరువైపుల తుది విజయంపై ఎవరి ధీమా వారిది
రోజులు గడుస్తాయి, గడవక తప్పదు, నిరీక్షణలో

ఆయుధమే శరణ్యంగా విప్లవ యోధ గణం
నివురు కప్పిన నిప్పు కణాల వలె అరణ్యంలో
అపుడపుడూ బూది ఎగిరిపోయి మండినా
చిట్ట చివర కోరేదే! అయ్యేదీ! శాంతితోనే! సమాప్తి!

## 28.

అడవిలో ప్రతి రుతువు ప్రభావాన్నీ సహిస్తూ
ఒకే విధ పథ వర్తనలో ఉద్యమ మూర్తులు!
అపాయకర సమయాల్లో స్వయం రక్షణ శీలురు

రోజులు దొర్లుతూ గోలీ కాయల్లా వేగంగా
ఆయుధం పేలుతుంది, భయ చకితంగా
అనుకోని దిశ నుండీ, రణాహ్వాన భాషలో

ఎంతో భవిష్యత్తు పరచి ఉన్న జీవితాన్ని
మధ్యలోనే కత్తిరింప బడే దృశ్యం
అక్కడి మూల వాసులకిది కొత్త ప్రపంచం
బయటి వారికిది నర మారణ పర్వంలో భాగం

కాలం దూకుతుంది తుఫానులా
సమయం తరలుతుంది వరదలా
బీభత్సం శాంతించాక! మనుషుల ఆనవాళ్ళు
సమాచార పదాలతో చితికో! సమాధికో!

ఎవరెవరో వస్తారు, వివిధ స్థాయిల్లో ఉన్నవారు
విచారణ జరుపతారు! ఎవరి దృష్టి కోణంలో వారు
జాగ్రత్త పరుస్తారు, చర్యలు సూచిస్తారు! సమాప్తం!
ప్రసార మాధ్యమాల్లో పత్రికల్లో పలు రంగుల్లో చిత్రాలు

ఇక్కడ ఎక్కడా అడ్డు గోడలు లేవు
అంతా బయలే! స్వేచ్ఛకు అవకాశంతో

అపుడు ఊరు నుండి అడవిలోకి ఆయుధంతో
ఇపుడు అడవి నుండి ఊరులోకి శవ పేటితో
ఒక శ్రేణిలో చర్యల విజయ గర్వ శిఖరం
మరో శ్రేణిలో కూలిన మానవతా శిఖరం

## 29.

ఆకలి దప్పికల్ని లెక్క చేయకుండా
భవిష్య కల్పనలో పూల వన సమాజం కయి
శిలల మధ్య నుండి చోటు చేసుకొనీ
చొరవగా ముందుకు సాగే అలల వలె యోధులు

సందేహించే హృదయంతో మనుషులు
శిలతో తరు గిరి నదితో కలిసీ

సాధారణ యాన సౌకర్యాలు లేని అడవిలో
వ్యక్తి స్వేచ్ఛ నుండి సమాజ శ్రేయాని కంకితమై
మార్పుకు 'చిహ్నాలై, త్యాగానికి బింబాలై
నిర్భయ గతిలో ఎగిరే పక్షుల్ని తలపిస్తూ సాగేరు

ఘనమైన అరణ్యంలో సూదిలా సందు చేసుకొనీ
ముళ్ళ పొదల మధ్య నుండి నిశ్శబ్దంగా
నెత్తురు చారల గుర్తులతో మౌనంగా
వినబడే శబ్దాలను ఆలకిస్తూ వడపోస్తూ

రాత్రులు సహజమైన సుఖ నిద్రకు దూరమయిన కళ్ళతో
బుజాల పయి విప్పారిన ఆకాశం శాలువాతో
చెక్కిన శిలా ఫలకాల్లా, ఆజ్ఞా వర్తులై అడవిలో
ఆరని తేజంతో! భూమి పై మినుకుమనే చుక్కలు!

ఇక్కడి పరిసరాలు! చెట్టూ చెరువూ పొదలూ కొండలూ
బరువుగా ఉన్న మనసును తేలిక పరుస్తాయి
ఇవి అన్నీ కష్టాల్లో! తమ కోసమే అన్నట్లుగా
ఇన్నిటిలో తమ హృదయం తెలిసిన మిత్రం! ఆయుధం

పగలు రవి కిరణం ఆదర్శానికి తేజాన్ని ఇస్తుంది
రాత్రి శశి కిరణం కష్ట జీవికి హ్లాదాన్ని ఇస్తుంది

# 30.

ఈ అడవిలో ఏ దారి ఎటు పోయేదీ తెలియదు
రణ తంత్రంలో భాగ మయిన ఉపాయ చర్యల్లో
సాయుధ బలగాలపై పన్నిన వ్యూహాచరణంలో
దారులన్నీ ఊహకు మించిన పరిచయ రూపాలయి

ఆయుధం పని చేస్తే! వినిపించేది మారణ ధ్వనులే
నిశ్శబ్ద కవచంతో శాంతమై ఆపై వీరాన్ని తలపిస్తుంది

అడవిలో ఉన్నంత వరకు ఆశలో పచ్చదనం పోదు
లక్ష్యం ఏదయినా అనుబంధం మానవ సంబంధ సమం
శాంతి ద్వారం తలుపులు మూతబడీ
సీలు వేసిన పెట్టెలా! అడవిలో రహస్య స్థావరం

సమాజం గురించి చింతనలో రోజులు గడుస్తూ
చివరి శ్వాస వీడే వరకూ ప్రకృతి ఒడిలోనే!

వచ్చే సమయంలోనో, వెళ్ళే సమయంలోనో దారులలో
శత్రువుపై విస్ఫోటానికి అమరికలో! కాలం తెలియదు

దూళి క్రమ్మిన ఆలోచనా దర్పణంలో
ఎంత అందమైదైనా అసలు రూపం బింబించదు

ఎండి పోయి క్రుంగి పోయిన బ్రతుకులకు కలత చెంది
కూడని తప్పుడు చేతలకు నిరసనగా
ఏమీ చేయలేని స్థితిలో ఆయుధంతో అడవి లోకి
బరు వెక్కిన హృదయానికి! తేలిక నిస్తుంది అడవి

అడవిలో భద్రంగా రణ చర్యలో అభద్రంగా
భవిష్యత్తు యోజనలో భాగమైన వ్యక్తి బాధ్యతలో
అనల చర్య విరామంతో అపుడపుడూ ఆయుధ మౌనం?
మెరపులా, శాంతి ద్వారం తలుపులు తెరచుకొనే అవకాశం

## 31.

తరాల సమాజ సమస్య పరిష్కారంతో ఆయుధం
అడవి నుండి క్రియాత్మకం కావడ మొక విశేషం

అరాజకం ఏర్పడి ఆయుధ బల ప్రమేయంతో
రాజ్యం హస్త గతం కావడ మొక! రాజకీయ కోణం

ఉగ్రవాద సక్రియలో, ప్రమిదలో దీపాల్లా ప్రాణాలు
తీవ్రమైన గాలి కెపుడు ఆరి పోయేదీ తెలియదు
జలపాతం హోరులా నిండిన భయ భావం లోనూ
బ్రతికే హక్కును హరించడం ఎవరయినా దారుణం

ఒక వాదం వెనకనే మరొక సహచర వాదం!
సంఘంలో అవసర శక్తుల ఖాళీలను పూరిస్తుంది
ఉద్యమ సంరంభానికి రావలసిన వేగాన్ని ఇస్తుంది
ఆచరణ శీలానికి కావలసిన తేజాన్ని ఇస్తుంది

పాడి పంటల నుండి యంత్రమయ జీవితానికి
ఊరు నుండి నగరానికి కొత్త ఊహలో! పయనం,
సమస్యకు సమాధానం ఆయుధ బల మనుకొనీ
సాగే వాదం! మనిషి వివేకానికి పరీక్ష పెడుతుంది

చెట్టుపై ఆయుధంతో ఆకులలో కలిసీ
వెనకనే పొంచి ఉన్న అపాయకరం ఆపదలో
సమాజంలో జన హితకర భవిష్యత్తుకయి
అస్తమయం లేని వెలుగు బింబ మనుకునేవారూ!

తన అభిమతితో పని లేకుండా వాదాని కంకితమై
కఠిన వాస్తవాల్ని ఎదుర్కొంటూ బ్రతికే యోధులు!
అనుభవాల వంతెనపై ఆటంకాలు దాటుతూ
వర్తమానం అరణ్యం నుండి భవిష్య సమాజం లోకి

## 32.

భూ కంపం ఛేదిస్తుంది, పర్వతాల మౌనాన్ని
దొరలే రాళ్ళతో పెళ్ళలతో సర్వం వికలం చేస్తుంది
విలయానికి హేతువుగా ఉగ్ర చర్యను తలపిస్తుంది

ఉగ్రవాద మంటే ఒక భూకంపం ఒక తుఫాను
సామాజిక ప్రశ్నలతో అసాధారణ స్థితి కల్పిస్తుంది
ఆకలి తీరే స్థితి కోసం కోపంతో రావచ్చు
శ్రమ ఫలంలో న్యాయం మాయమై కావచ్చు
చేతులు నిశ్శబ్దంగా ఆయుధాన్ని స్పృశిస్తాయి

నిప్పు రవ్వల స్వాగతంతో కాలం ఎదురవుతుంది
నిప్పు రెక్కలపై సమయం ఎగ రేసుక పోజూస్తుంది

గాజు పాత్ర లాంటిది మర్యాదామయ వ్యక్తిత్వం
జారి పడీ నేలపై ముక్కలు ముక్కలయి బాధిస్తుంది

సమస్యకు పరిష్కారం ఆయుధం వినా, మరో విధం లేకపోలేదు
అది ఉదార చరితతో వర్తించే ప్రజాస్వామ్య సాధనం

చెరువులో వలె నదిలో అలలు ఉండవు
నదిలో వలె జలధిలో అలలు ఉండవు
ఏ సమస్య కదే! ఒక ప్రత్యేక రూపంతో
సమాధానమూ అంతే, దేని కదే వేరుగా

శ్రమ శక్తుల రూపాల్ని గుర్తించీ
ప్రజ బ్రతుకుల రీతుల్ని గమనించీ
కార్య సాధనంతో ఆయుధం పాత్ర
పరిమితమే కాదు, అవసరమూ కలగక పోవచ్చు!

ఎంతటి  విశేష స్థితిలోనూ విధ్వంసం కన్నా
నిర్మాణ వికాసాలే సంఘానికి శాంతికరాలు

## 33.

మనిషితో పోలిక పొందే అర్హత! ఒక మనిషికే ఉంది
మట్టితో మనిషి అనుబంధం! ప్రతి పదంలో
చుట్టూ ఉన్న సమాజం! ఎన్నిటికో ఎదురు చూస్తుంది
కోరిక తీర్చే చిట్ట చివరి సాధనం, ఆయుధ మవుతూంది

సుస్థిర ధైర్యంతో జన హిత లక్ష్యంతో ప్రయోజనం
అనుభవాల బరువుల్ని మోస్తూ ముందుకు పోవలసిందే
మొదలయిన విప్లవ యానం ఎక్కడా ఆగేది లేదు
ఉగ్రతా చర్యలో తన బతుకు అంత మయినా సరే!

కత్తి మొన చివర అంచున చెక్కిన 'శాంతి' పదం
ఖడ్గ చాలనంలో తగిలే గాయాన్ని ఆపగలదా?
జారి పడే నెత్తురు చుక్కల్ని నిలిపి వేయ గలదా?

ముంజేతి పై పావురంలా అందంగా శాంతి
గుండె పై గులాబిలా హ్లాదంగా ప్రేమ
అద్దంలో సూర్యునిలా మనసులో మనిషి సాక్షిగా

మనిషికి మనిషి శత్రు సమం సామాజిక వైరుధ్యాలలో
జీవన గతిలో హనన మొక భాగం కావడం దారుణం!
సౌమనస్యం తరిగీ, వైమనస్యం పెరిగీ అంతరంగం మరచీ
అరణ్యా మొక విధ్వంసక రహస్య కేంద్ర మవడం! విచిత్రం

ఎప్పటికీ అన్నిటా ఆయుధం ఆదర్శం కాదు
తత్కాలంలో పాత్ర పరిమితమై, జన హితకర చిహ్నం

శిఖర  తలం చేరిన అహంభావ స్థితిలో
ఎటు నుండో సమస్య! బంధనమై కదలనీయదు
బంధన ఛేదనలో ఆయుధం! మనిషిని హత మార్చేనా?
స్వేచ్ఛను పతాకయై నవ సమాజ శక్తిని నడిపించేనా?

# 34.

అడవి నుండి క్రోధ ఫలితం వార్త విడుదలవుతుంది
మంచు తెరపై అనల భావ రూపాల్లా యోధులు
అంతలో కను మరుగయి జారి పోయేరు
ఓటమిని ఒప్పుకోని గెలుపు కోరే క్రియా శీలురు

ఆర్తి హరం గానో కీర్తి కరంగానో ఉండే ఆయుధం
ప్రాణ హరం గానూ ఉగ్ర పదం గానూ మారి పోతూంది
ఆలోచనలోని దార్శనికం అనుభవ గతి పొందుతూంది
సమాజాని కిది ఒక విశేష సంచిక అవుతూంది

ఈ విచిత్ర సందర్భంలో ఆయుధమే కాదు
పలు సహాయకర సాధనాలూ కలిసేను

ఆయువును అవలీలగా కత్తిరించి విసరేసే
మరణం, రావలసింది కాదు, కోరసిందీ కాదు
ఇదొక బలవన్మరణంలో విపన్న విషాదం
మానవ చిర సంస్కృతి ముఖాన మాయని కళంకం

సమాజ నిలయానికి మూల మయిన మానవ ప్రేమపై
నమ్మకాన్ని వమ్ముచేసి కూల్చే స్థితి రాకూడదు, వస్తూంది
వ్యధలో బాధా హృదయం భావనలో ముక్కలుగా చెదరీ
స్మృతిలో విషాద స్వర చక్రం తిరుగుతూంది

కన్నీటి చుక్క ఎరగని బ్రతుకు లేదు
సంతోష రశ్మి కోరని మనసు లేదు

అడవిలో ఆయుధ భయానికి ఏ జీవ సంచారం ఆగదు
శత్రువు సృజించిన స్థితిలో తప్పు! వీర చరణం ఆగదు
నిరంతరం సృజన రూప నిలయమైన అరణ్యం నుండి
సమాజ భాగ్య రేఖను! మార్చాలని అడవిలో ఆయుధం!

## 35.

ప్రాణ ప్రియంగా చరించే గాలి దారిలో
బాధితుల కంటి నీరు తుడుస్తూ పోతుంది
విషాద రవాలకు బరు వెక్కిన హృదయంతో
ఆగి ఆగి చెట్ల మధ్య నుండి శూన్యాన్ని నింపుతుంది

చిరునామా అడవిగా మారిన కేడర్!
తీవ్ర వాద చలనంతో కాలాన్ని పరుగెత్తిస్తూ
అడవి అయినా నగర మయినా మానుష మొకటే!

ఇంటి గడప దాటాక సమస్య లెన్నో
బయటి నుండి ప్రశ్నకు గురి చేస్తూ
పొందే జవాబుతో ఎవరి వాదం వారిది!

ఆలోచన ఆచరణ స్థాయిలో విభేదాలు చర్చలు
స్వేచ్ఛా వాతావరణంలో పొందే మానవ హక్కులతో.
అక్కడక్కడా స్తబ్ధంగా పడి ఉన్న కాలాన్ని
వేగంగా నడిపించే ఆరాటంలో ఆవేదన నిండీ

ప్రవాహ సదృశ మయిన జీవితం
అపుడపుడూ గడ్డ కట్టి నిలిచిపోవడం ఉన్నదే.
ఇక్కడికి చేరిన యోధుల జీవితమంతా
ఆయుధ భాషలో శబ్దించే వర్తమాన పుస్తకం

అడవిలో ఆవాసం! ఎంత కాల మంటే
ఎరుపు నీలి దృశ్యాల నుండి సమాజం విముక్తి పొందే దాకా!

సముద్రం! విశ్రాంతి ఎరగదు
పోరాటం విరామం పొందదు

భావ స్వేచ్ఛ కెవరు ఏ నిర్దేశం ఇవ్వగలరు?
మనిషిలో మనీష నెవరు విధ్వంసం చేయగలరు?

# 36.

అడవిలో ఏ మూల నుండో అనుమానంతో అన్వేషణం
ఆ వెనకనే సాయుధ దళం! కదలడం! విపరీతం

స్వేచ్ఛ దేనికి? తల నరికే వాద బలానికా?
తల కాపాడే యత్నంలో వలసిన అవకాశానికా?
పై మానుష రూపం ఒకటే! శిల్పాలు వేరు వేరు
వస్తువు ఏదయితేనేం? దారు శిలా గాజు ప్లాస్టిక్

వ్యక్తి పై పడిన విద్రోహ చరిత్ర ముద్ర
తొలగి పోవడం! అంత సులభం కాదు.
దీనికి మానస పరివర్తన మవసరం!
ముద్ర ఏ రంగులో ఉన్నా! అర్థం ఒకటే

అలల వలె కదలే క్షణాల పై నుండి
దాటే వంతెన నిర్మాణ మంత సులభం కాదు
భయం నుండి ముక్త మయిన మనో బలంతో
సందేహం లేని సాహస చర్యల తోనే సాధ్యం

గాయాల పాలయ్యాక చికిత్సపై దృష్టి కన్నా
ప్రమాదాన్ని నివారించడం! పాలనా కర్తవ్యం

చీకటి పటంపై వెలుగు అక్షరాల సూచన
శాంతి నిలయానికి దారి తీస్తాయనే విశ్వాసం.

మింగేసే ఆపదలోనూ, వదలని అంకిత భావం
ప్రాణాన్ని హారతిగా అర్పణకు సిద్ధం చేస్తుంది

గెలుపు ఓటమి లో జీవన వాస్తవ రహస్యం
ఆ వెనక నుండి గెలుపు, ఓటమి స్థానాన్ని మారుస్తుంది

నడచే అడుగు జాడల్ని లెక్కిస్తూ పోవడం కాదు
గడచే కాలంతో మిగిలిన దూరంపై దృష్టి అవసరం

## 37.

రాజ్యంతో తలపడీ ఆయుధంతో చేరిన ప్రకృతిలో
పచ్చదనం, ఉదగ్రతను అదుపు పెడుతూంది

అన్నిటికీ సిద్ధమై తీవ్రంగా, ఆ అడవి తల్లి ఒడిలో
క్షణం కూడ తప్పని రణ చరణాలతో యోధులు!

కోరే మార్పు నందుకునే వరకూ యానం! బహు కఠోరం
జీవితం మండే చితి కాదు! నిశ్చల సమాధి కాదు

ఇనుప చువ్వ కాదు శరీరం సజీవ స్పందన రూపం,
ఎన్ని మార్పులో! అన్ని ప్రభావాలతో ఏర్పడీ
ఆశా నికేతనం! పునర్భవ వికాసాల్ని కోరుతూంది
స్వేచ్ఛా మూలం నుండీ! వాద వివాదాల శాఖలతో

పగలు చీకటి కెరటాలపై ఈదుతూ
ఎవరో వెన్నాడే ఫోకస్‌లో, సరి కొత్త దారులలో
అనుమానంతో ఒడ్డుకు చేరే సాహస యత్నం!

సమాజ చరిత్రలో చీకటి యుగం! అపుడపుడూ
మనిషిలో వివేక బింబం వెలుగులు అవసర మవుతాయి
మనసు మౌన శిల కాదు! ఏ రూపాన్ని అయిన చెక్కేందుకు

పది మంది కలిస్తే! సమూహ రాగ బంధం
పది విధాల ఆలోచనలు, పేనిన బల సూత్రం
పది మంది తోనూ ఎవరి కోట వారిది!
చూపే విభేదాలతో పలు దారులు! స్వేచ్ఛలో

కాలాన్ని గడ్డకట్ట నీయని తేజంతో రోజు!
మనిషికి సరి కొత్త సందేశంతో వస్తుంది.
లోపలున్న మనిషికి! వినే కోరిక అవసరం!
ఆదర్శాని కంకితమై, ఆచరణం ముఖ్యం!

# 38.

ఎడారి ఎదురు చూస్తుంది జలదం కయి
మరొకటి ఏది కన్పించినా! ఆశా వహం కాదు
ప్రక్కనే ఉన్న మోడు! ఎదురు చూస్తుంది
ఒకనాటికి నచ్చే వసంత స్పర్శ కయి! ఆశతో

జలదాగమనం వసంత స్పర్శ రెండూ తప్పనివీ భూమికి
ప్రకృతికీ మనిషి బ్రతుకు రూపానికీ అనుబంధం సహజం

ఇసుక రేణువులతో రూపొందిన బొమ్మలు!
అక్కడక్కడా ఎండలో ధగధగ లాడుతూ
ఈ ఎడారి! ఈ మ్రోడు! ఇప్పటివా? ఎప్పటి నుండో ఉన్నవి!

చమత్కార మేమంటే మబ్బులు వస్తాయి ముక్కలుగా
ఒకటొకటీ క్రిందికి చూస్తూ పోతాయి మెరపులతో
జాలి పడేనా? ఒరిగేది ఏమీ లేదు! శూన్యం!
ఎపుడో పడీ పడని చినుకులు! ముఖాన్ని తుడుస్తూ

కింద నున్న నీడ, పైకి మబ్బుగా మార లేదు
రెండు చినుకులతో విత్తు పెద్దదయి సుమ ఫల తరువు కాదు

ఎండకూ చలికీ మారని, చెదరని ధైర్యంతో
సంకల్పం లోతులలో, వీడని పేరాశతో
నిశ్శబ్దం అంచున! నిలిచీ! వీడని ఆయుధం!
ఇపుడు! సుందర ప్రకృతిలో భాగమై

ప్రతి ఉదయం ఎడారి పై వెలుగు కోతకు వచ్చిన పంటలా
చల్లగా మెత్తగా స్పృశిస్తూ ఏండ్లుగా! పరవశింప జేస్తుంది
కన్నీరుకూ అవకాశం లేదు! మంచు తడి గుర్తులు తప్ప.

ఎక్కడో ఒక ఒయాసిస్ ఉంటే ఉండవచ్చు
మనిషిలో ఆశ! తొట్టిలో చిన్న పూల మొక్కలా
జలదంకై వేచి వేచి మోడు ఆయుధంగా మారేనా?

# 39.

అడవిలో చెట్లు దాగే మనుషుల్ని దాచేస్తాయి
ఆ రహస్య నిలయాల్ని ఆకాశం కప్పేస్తుంది

అక్కడ ఊరు ఎదురు చూస్తూ ఉంటుంది
ఎప్పటి కయినా ఊరు వదలిన వ్యక్తి కనిపిస్తాడనీ

ఎపుడో ఆకాశం నుండి వార్త, ఊడి పడుతుంది
ఉదయం పత్రికలో ఎర్రని అక్షరాల్లో, బయట పడుతుంది

స్నేహ స్పర్శతో వెలిగే జీవన దీపాన్ని
ఆర కుండా చూడడం మానుష కర్తవ్యం.
ఏ పనిలో ఏ స్థానంలో ఉన్నా ఎవరయినా
నీలి రంగు బాక్సులోకి చేరడం అమానుషం

యుగాల చరిత్రను కొత్త పథానికి మార్చాలనీ
తరాల సంతతులకు కొత్త దిశను చూపాలనీ
అడవికి చేరిన రహస్య జీవన బృందాలు
అక్కడ దొరికే కాలి బాటే! మహాభాగ్య పథం

ఎవరి లోనూ ఏకాంతం లేదు! సమాజ శక్తితో
లోపల! ఉంది, నిరంతరం కదలే మహా సముద్రం!

గాలి లేని ఇరుకు నుండి, బయటికి రావడం
పొగల నుండి వెలుగుకు, ఆలోచన రావడం
ప్రాణానికి అవసరమూ! దార్శనికతకు తప్పనిదీ.
కాల దర్పణంలో మరో కొత్త ముఖం చూచేమా?

శిఖరాన్ని అదిరోహించే మహా సాహస క్రియలో
అంతరంగ దృష్టి చెదరి, లోయ లోకి జార వచ్చు
చేతిలో ఆయుధంతో ఉద్యమం, కత్తిపై నడక వంటిది
ప్రమాదం అంచులో! అపాయ శంకలో మునిగి తేలుతూ

# 40.

పుట్టుకతో ఎవరూ తమ సమాజాన్ని ఎన్నుకోరు
పెరిగే కొద్దీ మానవ బంధాలతో వ్యూహం ఏర్పడుతుంది
వ్యక్తిని సమాజం తన స్వంతం చేసుకుంటుంది
మానస ప్రపంచాన్ని వాస్తవ దృశ్యాలతో తీరుస్తుంది

విత్తు లాంటి ఊహకు విశ్వంభర అవుతుంది
కత్తి లాంటి మతికి ఒరలా పని చేస్తుంది
పక్షి లాంటి ఆలోచనకు, విశాల గగన మవుతుంది
పాము లాంటి వర్తనకు, వల్మీక నిలయ మవుతుంది

తన అస్తిత్వం పై అభిమానం లో లోపలి నుండీ
స్వతంత్ర మయిన క్రియతో లక్ష్యం చేరువ అవుతుంది
సమాజానికీ తనకూ భేద మంతరిస్తుంది
ఆయుధాన్ని వహించే సందర్భం, కొత్త పుస్తక మవుతుంది

అగ్ని శిఖలతో విలయ శక్తి చూపుతుంది
అంకిత భావంతో మనో రూపం తళతళ లాడుతుంది

ఉగ్రవాదమో  దేశ వాదమో విశ్వ శాంతి వచనమో
సమాజాన్ని మోస్తూ బుజాలపై దూరల బహు దూరం

దూసిన బులెట్! ఎవరి కయినా తగల వచ్చు, తప్ప వచ్చు
అనేక వికల్పాలతో జీవితం! సందేహ ప్రపంచంలో

విరామ దశలో ఆయుధం! అమాయక రూపంలో
తన చుట్టూ జరిగే ఎన్నిటికో సాక్షిగా! మనిషితో

తప్పి పోయిన వారినీ, చెప్పి పోని వారినీ
కనుగొనే అన్వేషణం! సాగుతుంది, తెలిసే దాకా!

ప్రతి వ్యక్తి మరో వ్యక్తి నుండి వీడ్కోలు పలుకుతూ
తిరిగి కలిసే ఉద్దేశంతో! ఆశా రుణ భావంతో

# 41.

కదలని చెట్లూ తిరిగే జంతువులూ మృగాలూ
జీవ ప్రపంచంతో పచ్చని అడవిలా
మిత్ర శత్రు పరిచయ కలనంతో సమాజం!

తీవ్ర వాద బృందాలకు ఆసరాగా
పూర్వం నుండీ పురా మూల వాసులూ
చెదరు చెదరుగా జన గణ పంక్తులు!

ఇక్కడ సంక్షేమం సంస్కరణ పథం మాటల కర్థం లేదు
మార్పు అన్న మాట! గగన పుష్ప సదృశం! అవుతూంది.

పై నుండి విమానాలు శబ్దిస్తూ, ఎపుడెపుడూ
భూమిపై వాహనాలు ధ్వనిస్తూ, అపుడపుడూ
ఇది అక్కడి స్థిర జీవన రూపాలకు అంతా కొత్తే
సమాజ పరివర్తనలో కొత్త తరం నిరీక్షణంలో

ఇక్కడ ఎవరి పాలనా శాసనం పని చేయదు
అవసరాల చలనంతో బ్రతుకులు! తీర్చబడీ
ఇక్కడ గడచే క్షణాలు విప్లవ యోధులకు సార్థకాలు
స్వార్థం తెలియని అచంచల విశ్వాసం నడిపిస్తూంది

మనిషికి మనిషి ఏమైనా కావచ్చు అవసరాల సంబంధంతో
బంధు మిత్ర శత్రు పరిచయ వ్యవహారాల చదరంగంలో
ఎక్కడెక్కడో కలిసీ, ఎక్కడి కక్కడ విడిపోతూ కలుస్తూ
విశ్వ హృదయ మొకపుడూ, కలహ దృశ్య మొకపుడూ

ఎక్కడో మూల నుండి అడవిలో కాలుతూన్న వాసన!
ఆయుధ నిశ్వాసమా? మారణ ప్రభావమా!

ఇక్కడికి అగ్ని నార్పే జల వాహనం వచ్చే ప్రసక్తి లేదు
ఆపదలో అవసరానికి జలదం విచ్చేసే ఆశ లేనే లేదు

# 42.

పథాన్ని ప్రేమించి నపుడే పయనం లక్ష్యానికి సుఖదం,
దారి పొడవునా ఎదలో పూల వనం స్వాగత మిస్తుంది
అక్కడక్కడా నిప్పు రవ్వ లెగసి పడుతూన్నా
గాయాల్ని లెక్క చేయకుండా నడక సాగుతుంది

విప్లవ క్రియకు ఆఖరి మజిలీ అంటూ లేదు
చిన్న చిన్న విరామాలతో, ఇది నిరంతర ప్రక్రియ
చైతన్యం దీపమై, చీకటిలో దారి చూపిస్తుంది
అలజడితో మొదలయి, శాంతి చరణంతో ముగుస్తుంది.

రంగులన్నీ అందమైనవి, అవసరంలో అవకాశంతో
దేని ప్రత్యేకత దానిదే మనిషి భావనా జగంలో
పలు రంగులు కలిసిన రూపం, ప్రతి జీవితం
సమాజ రూపానికి కొత్త దనాన్ని చేకూరుస్తుంది

ఒకరు పొమ్మంటే అడవికి పోవడం జరగదు
ఒకరు వద్దంటే ఆగి పోవడం జరగదు
గమ్యాన్ని ఎన్నుకున్న మనిషిలో సంశయం
అడవిలో ఆయుధాన్ని తోడుగా గ్రహిస్తుంది

ఇక్కడ మనిషి నిశ్శబ్దాన్ని కోరు కునేను
నిశ్శబ్దం మాత్రం శబ్దాన్ని వరిస్తుంది.
ఆయుధాన్ని అర్థవంతం చేసే పనిలో
అడవిలో ఆయుధం! శబ్దమయ మవుతుంది.

కళ్ళు ఉన్నందుకు రెప్పలు వాలి నిదుర తప్పదు
నిద్రలో కలలు! కల్పనలో విచ్చేయక తప్పదు

అడవి నుండి తన ఊరుకు వాస్తవాకృతి పొందవచ్చు
ఆయుధాన్ని వదలీ, తనలో హృదయం విప్పారీ

## 43.

మట్టి దిబ్బలలో గొంతు వరకు కూరుక పోయి
వాలిన తలలతో కఠిన శాసనాల శిలలు.
రణ స్పర్శ లేని జీవిత భాగం లేదు
రణ స్పృహ లేని సమాజ దశలు లేవు

మానుష పీడన సంక్షోభంలో
ప్రతి తరం కోరుతుంది పరివర్తనం
ఎద ఎదలో సమాజ చేతనతో
కదలుతుంది అక్షర నవ రూపం

శిరసు పై పాగాతో రాజరికం
చేతిలో తుపాకితో అధికారం
నిప్పుల జల్లులు చిమ్ముతూనో
తుపాను గాలులు వదలుతూనో

కన్నీటితో నిండీ వెలుగు కళ్ళు
జలాల పయి తేలే పడవల్లా
వాన జల్లు తెలీని వాతావరణంలో
హ్లాదరేఖ ఎరగని జీవన దృశ్యంలో

నిప్పంటిన దుస్తులతో పీడితులు
చెరువు వైపు పరుగులు తీసేరు
చెరువులో నీరు పయి నమ్మకంతో
మనుషుల మధ్య నుండి వేగంగా

జీవన ఘర్షణలో తగిలిన గాయం
తనలో రేపిన అభిమాన తేజంతో
మరో దిశలో అడవి దారి పట్టిస్తూంది
కరుణ నుండి వీర దశకు చేరుస్తూంది

# 44.

అదె! సూర్య బింబం! అదే ఉదయ కాంతి
చీకటి నదిలో కలలో స్నానం చేసి
స్వచ్ఛంగా శుభ్రంగా ఎదురుగా మరో రోజు!
సూర్య బింబ మదే! ఉదయ కాంతి అదే!

కనిపించని పురా భావ స్మృతిలో
కనిపించే వర్తమాన కథలో
పూచిన అభిలాషతో, వెలిగే అనుభవంతో
పాత ప్రపంచం స్థానంలో కొత్త ప్రపంచం

వెనక్కి నడవదు ప్రవాహం
సమయం వెనక్కి మరలదు
ఏ ఘటన! వెనక్కి తరలదు!
మనిషి మనసు ఒకటే! వెనకా ముందూ

ఉగాది అవనీ వసంతం రానీ
ఏ ఋతువుకూ అందనిదీ మనోజగం!

కల ఒక తప్పని స్థితి దార్శనికంలో
మనసుకు! స్వేచ్ఛా వేదికయై సృజనలో
దేని కయినా సాహసం ప్రదర్శిస్తుంది!
ఎంతటి రహస్య మయినా బయట పెడుతుంది

నది పయి వంతెన నిర్మించే చేతులు
మతిలో వంతెన కూల్చేసే పనిలో,
ఏ జంతువో! ఏ యంత్రమో! కాదు మనిషి
మతి ప్రభలతో సజీవ స్పందన రూపం!

కంటి నీరు తుడిచే అర చేయిలో
విరిసిన ఉదయ కిరణ స్నేహ సుమం!
గులాబీని ప్రేమగా అందుకునే చేతిలో
నాశన కర మారణ చణ సాధనం!

## 45.

అడవి బాటలో పచ్చని ప్రకృతి దీపం
ఉద్యమ బృందానికి పురోగమన చిహ్నాం
ఇక్కడా ఉన్నారు, పురా మూల నివాసులు
జాలి పడదగిన వారూ, సహాయం కావలసిన వారూ

అడవి నుండి సమాజానికి, కర్తవ్య ప్రబోధం
జాడ్యాన్ని తొలగిస్తూ, మౌనాన్ని పలికిస్తూ

రాత్రి వేళ నిద్రకు దూరంగా నిలచీ
చెట్ల మధ్య చుక్కల్లా మెరసే సెంట్రీలు
ఇక్కడా ఉన్నాయి శిలలు! కలలు వదలి
శిల్పం కన్నా చైతన్య శిఖలయి బ్రతకాలనీ

హద్దు లేని ఉద్రేకం ఉరక లెత్తుతూ
కళ్ళెం లేని ఉద్వేగం పరుగు లెత్తుతూ
అడవి నుండి సమాజానికి మెలకువ సందేశం
కలలను మరపిస్తూ, ఉత్సాహం వెలిగిస్తూ
అడవి దారి చెట్ల నీడలలో విశ్రమిస్తూ
వెనక నుండి విసరే, మృత్యు పాశానికి ఎడంగా

ఎవరి ఏడుపో తమలో ప్రతిధ్వనిస్తుంది
ఎవరి వేదనో తమలో ప్రతిస్వనిస్తుంది
లోపల  సముద్ర మంత భయ భావం
ఒడ్డున నిలిచిన నావ లా మనోరూపం

వసుధ ఎప్పటికీ సృజన యౌవన దశలో
యోధు డెప్పటికీ వృద్ధత తెలియని స్థితిలో
స్మృతు లెప్పటికీ పాతవయినా కొత్త ముఖంతో
చరిత్ర ఎప్పటికీ కొత్త వైపే అడుగు జాడలతో
ఆయుధం వదలి, సమస్యల అలలపయి కదలుతూ
ప్రజాస్వామ్య యానంలో, పరిష్కార మొక అవసరం!

# ఇది నగరం

## కవితయై

### 1.

ఇది నగరం
గగన విజయ మస్తిష్క శిఖరంతో
ఎప్పటికీ దాహం ఆకలి చింతనలో
తృప్తి లేని జీవన నవ రీతులతో
ఉండి ఉండి అవసరాలు హక్కులు వాదాలు వివాదాలు
ఆరని సెగలతో, ఆగని మంటలతో!

పల్లె ఎప్పటికీ తృప్తి రేఖకు దిగువనే
కావలసింది ఎప్పటికీ ఇంకా మిగిలీ
కాలం మోసే జీవిత రూపాలొక టొకటీ
వాస్తవ రేఖలతో, కల్పనలో పలు రంగులతో

తెరచిన కిటికీ నుండి దృశ్యం!
మితమై, వలయంలో బంధింపబడీ

ఎండిన కొమ్మల పయి పచ్చదనం కయి
ఎడారి బ్రతుకులో చిన్ని చిన్ని చెలమల కయి
ఆరాటం పరితాపం ఆలోచన! ప్రయత్నం!
స్థితులవే! ఎప్పటి నుండో ఇప్పటి దాకా

మొలకెత్తిన సమాజ స్పృహ ఎదుగుతుంది
శిశు దశ నుండీ కొమ్మలతో తరువయి వనమయి
ఒంటరి అంకె పక్కన అంకెలు చేరతాయి
వ్యక్తిని తనలో భాగం చేసుకొనీ! సమాజం!

## 2.

విశాల మయిన బోనులో మనుషులు! నగరంలో
వివిధ వర్ణ శ్రేణి సమూహ పంక్తులుగా! ఒక చోట
స్వేచ్ఛ గురించి ఆలోచన! జరుగుతుంది!
"స్వేచ్ఛా నిలయ" మన్న బోర్డు కూడ కనిపిస్తుంది

బోనులో ఉన్నా! ఏ భేదం లేకుండా
వచ్చే పరిమళ లహరి నెవరు ఆపగలరు?

ఒక ఆలోచనలో సూర్యుడు! ఉదయించ వచ్చు
ఒక కల్పనలో చంద్రుడు! ప్రకాశించ వచ్చు

మనిషి మనిషినీ స్పృశిస్తూ పోతుంది గాలి
ఎవరి వద్ద ఆగిపోదు, ఎవరినీ వదలి పోదు
అందరినీ కలుపుతుంది ప్రాణ సూత్రంతో
మనిషి మనిషిలో స్వేచ్ఛా ముద్ర వదలి పోతుంది!

భూమి పయి మనిషి యుగ యుగాలుగా
భూమిని గురించి తనకు తెలియక పోయినా
నింగిలో పక్షి! తర తరాలుగా
నింగిని గురించి తనకు తెలియక పోయినా

చీకటి కవితను స్వప్నిస్తుంది
వెలుగు కవితను సృజిస్తుంది
శబ్దంలో నిశ్శబ్ద ప్రపంచం కవిత
అర్థంలో వెలుగు తరంగం కవిత
చీకటి పాత్ర నుండి మనసును ముక్తం చేస్తుంది
ఉదయించని కిరణాన్ని హృదిలో ప్రతి ఫలిస్తుంది

## 3.

శాంతి వలయ శ్రేణుల్ని ఛేదించుకొనీ
అలజడి అశాంతి హింస! అకృత్యం!
అన్నిటికీ అవకాశ దిశలతో నగరం
ఆల్ ఇన్ వన్! చిర మానవ సంస్కృతికి ఛాలెంజ్

అరచేయిలో పడిన వెచ్చని కన్నీటి బిందువు
పొంగే జలధిని అలజడితో కలవర పెడుతుంది

నిప్పంటిన వన పంక్తిని ఆర్పేందుకు
సెగ సోకిన ప్రాణిని కాపాడేందుకు
జలాల కయి నిరీక్షణం! నగరంలో
హృదయ జలద సేచన కయి అల్లాడుతూ!

వ్యక్తి హింస సమూహ హింస సమాజ హింస నుండి
శాంతి హంస! ఎక్కడో తల దాచుకొనీ నీళ్ళలో

క్షితిజంలో పావురాళ్ళు! వరసగా
శాంతిని ప్రకటించే అక్షర పంక్తిలా!

ఒక్కొక శకల శకలం కలిసి బ్రతుకులో
స్వరూపం మారుతుంది! విలువలు! మారతాయి

ఎవరి దృష్టి కోణం వారికి! నిజం
ఎవరి భావ లోకం వారికి ప్రియం

నింగికీ నేలకూ వెలుగుతో సంబంధం
ఊహకూ మాటకూ బ్రతుకుతో అనుబంధం

చేతిలో పతాక చిహ్నం మారినంత సులభంగా
తమ తమ జీవన కారణ వాస్తవ రూపం మారదు

## 4.

నీదీ నాదీ ఈ యుగ మందరిదీ
తరాల మూలాలతో వికాస శాఖలతో
వ్యక్తి బింబ మెంతటి దయినా కానీ
అది సమాజ విజయ కీర్తిలో ఒక కళ!

ఎంత ముందుగా మేల్కొని ఉన్నా
దివ్వె లెన్ని వెలుగుతూ ఉన్నా
ఉషః కిరణ స్పర్శ తోనే
జీవన గమనంలో సార్థకం

అవని తలంపై నడక ఎంత ప్రియమంటే
ఇంటిలో అడుగు వేసినంత ఆత్మీయం

ఒక దేశం సరిహద్దులతో
మరో దేశం మానవ హక్కులకు చెక్!

ఏ దేశం ఎంత ఆప్త మయినా
ఏ సంస్కృతి ఎంత గొప్ప దయినా
జన్మ భూమి విశాల హృదయం పై
వ్యక్తి బ్రతుకు! శిశువు దశా సమం

ఇల్లు అయినా బయట బయట అయినా
మనోరూప మొకటే! ఇరు పార్శ్వాలతో
ఏ వికసించిన పూవో కనిపించవచ్చు
ఏ వ్రేలాడే ఖడ్గమొ! వ్రేలాడవచ్చు

సమస్య నుండి సమస్యకు తెరలు చీల్చుకొనీ
నిజం! సూర్య బింబం! చూడాలనీ, నగరం

ప్రశ్న నుండి ప్రశ్నకు పొరలు ఒలిచి వేసి
బ్రతుకు! చంద్ర బింబం! చూడాలనీ నగరం!

# 5.

వీధి వీధి నుండి ప్రశ్నలు! ఇది నగరం
జవాబు కయి చూచి చూచి పోరాటం వరిస్తుంది

మారని రుతు ఘోషతో సమాజ చలనంలో
జీవన చక్రం! తిరుగుతుంది నిరంతరం!

మెలికలుగా మలుపులతో, సుడులు తిరుగుతూ
ఉండి ఉండి సమయం! అనల నృత్యం చూపుతుంది

సామాజిక రాజకీయ సంక్షోభ దశలతో
కాలం! అన్నీ మరచీ ముని వ్రేళ్ళపై వేగంగా
మధ్య మధ్య అవరోధాలెన్నో! దారిలో,
తొలగే వీలు లేని వెన్నో! ఒక్క మనిషి తప్ప!

వెనకనే పడగ విప్పి మహా భుజగం! కదలుతుంది
తలపై పై నుండి పక్షి ఎగురుతూ వస్తుంది
మరణించక తప్పని మనుషుల మధ్య నున్న
మనిషి మరణాన్ని మరపిస్తుంది! యశోరూపం
మృత్యువు రూపాన్ని ఆకాశంలో విసరేస్తూ

టేబిల్ పయి జ్ఞాపక చిహ్నం గతంలో దింపుతుంది
గోడపై గడియారం! వర్తమానంలో నడిపిస్తుంది
రోజు! కవితా రూపమవుతుంది
లోపలి ప్రశ్నకు చక్కని జవాబుగా

ఎదురయిన ముఖ బింబం వచ్చే క్షణాల్ని వెలిగిస్తుంది
సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ అవలీలగా పక్కలకు జరిపేస్తుంది

స్వేచ్ఛా కవిత్వం - 59

# చెదరిన ప్రజాస్వామ్యం

## (కాలం కవితయై)

మాదిరాజు రంగారావు

2014

రసధుని - సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Free Verse - 59

# CHEDARINA PRAJASVAMYAM

(Long Poem)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2014

Price : 30/-

*Presented*
*to my daughter*

***Dr. Charitha. M***

Los Angeles

California, U.S.A

*with*
*affection and blessings*
*on her Birthday*
11th June

# చూచే దృష్టి గురించి

ఇపుడు వస్తూన్న స్వేచ్ఛా కవిత్వంలో (1) వ్యక్తి – జీవితం – సమాజం (2) అవసరాలు – సమస్యలు – హక్కులు – (3) పోరాటాలు – మార్పు – ప్రగతి భావన (4) మానవత – నైతికత – దార్శనికత లక్ష్యంతో కూడిన రూపం కనిపిస్తుంది. కొన్ని విషయాలతో ప్రభావాలతో ఒక్కొక విధమైన స్వరూపం – ఆయా కవుల వ్యక్తిత్వాల్ని బట్టి ఏర్పడుతూంది. ఏ కవి ఈనాడు పట్టనట్లుగా ఉండలేని స్థితి, చూచే దృష్టికోణాల ప్రాధాన్యాల్ని మార్చేసింది. సమాజం నుండి తాను ఎదురు చూచే దానికన్నా సమాజానికి తాను ఇచ్చే వెలుగును గురించి ఆలోచనతోపాటు క్రియాశీలత స్పష్టంగా కనిపిస్తుంది. కవిత్వం ప్రేరణ శక్తిగా రూపొందుతూంది. ప్రజాస్వామ్యంలో దొరికే మంచి అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవడం జరుగుతూంది. కవి తాను కోరేదీ తనకు నచ్చిందీ తోచిందీ నమ్మిందీ వ్రాయడం జరుగుతూంది. దీనితో విషయ వైవిధ్యం విస్తారంగా పెరిగింది. వాదాలు పెరిగాయి.

వర్తమాన సమాజ దృశ్యాల సమాకలన రూపం ఈ కృతి. “చెదరిన ప్రజాస్వామ్య”మన్న పేరు ఇపుడు ఉన్న స్థితిని సూచిస్తూంది. సాధారణమైన విలువల్ని కూడా పాటించని స్థితుల్ని నైతికమైన లోపాల్ని ఎత్తి చూపుతూంది. ప్రజల్లో సమాజం –వ్యక్తి స్థాయిల్లో ప్రబలమవుతూన్న ఈ దుస్థితి తొలగి సుస్థితి చేకూరాలనీ కోరిక సహజం.

ఇపుడున్న పట్టు తప్పుతూన్న స్థితిగతులు, ప్రతి ఒక్కరినీ కలతకు గురి చేస్తున్నాయి. విపరీత స్థితులూ, వికార చేష్టలూ నీతి తప్పిన ప్రవర్తనం, వివేకం లోపించిన ఆలోచన, స్వార్థం కేంద్రంగా సంక్షోభానికి దారి తీయడం జరుగుతూంది. సమాజంలో ప్రతి విభాగంలో వ్యక్తి స్థాయిలో స్వచ్ఛత లోపించిన వాతావరణం స్పష్టంగా కనిపిస్తుంది. అన్నిటికీ ఆధార సూత్రంగా రాజకీయ వైఫల్యం ప్రజాస్వామ్యాన్ని చెదరగొడుతూంది. అపహాస్యం పాలు చేస్తూంది. ఇది సరిదిద్దబడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇది సామాజికమైన మానసికమైన పరివర్తనతోనే సాధ్యమవుతుంది.

ఈ రచనలో యథార్థ జీవన రూపం యథాతథంగా చిత్రితమవుతూ, దీని అభివ్యక్తిలో కవిత్వ కళకు సంబంధించిన భావ రూపం, ప్రతీక, వ్యంజకత మొదలయిన అంశాలతో కూడిన సంవిధానం సమాలోచనంలో విశ్లేషణ కందుతుంది. స్వేచ్ఛా కవిత్వంలో సామాజిక చింతనతో ప్రజాస్వామ్యం మనుగడపై అభిలాషతో భవిష్యత్తుపై ఆశారూపమూ ప్రకటితమయింది. మానవ శక్తిపై యుక్తిపై వివేకంపై విశ్వాసం నిలుపుతూంది. కవిత్వం నెరవేర్చే సామాజికమైన బాధ్యతనూ అవసరమైన మానసికంగా నైతికమైన పాత్రను స్మరింపజేస్తూంది.

**– మాదిరాజు రంగారావు**

# చెదరిన ప్రజాస్వామ్యం

## దీర్ఘ కవిత

### 1.

కాలం కవితయై కదలుతుంది
వర్తమానం పుటలపై అక్షర సంకేతాలతో
సమాజ చలనంలో వాస్తవ దృశ్యాలతో
జీవన చరణాలపై మానుష హృదయంతో

నిశా వేళ భయం లోయ నుండి
దివా వేళ ధైర్య భూమి పైకి
నీలి నిద్ర ముద్ర నుండి
వెలుగుల మెలకువ రూపం!

ఇనోదయంతో పాటు శుభ్రంగా
ఏ రోజు కా రోజు సరి కొత్తగా
ఏ కటు సమస్య నుండి దూరం అవదు
ఏ విషమ పథం నుండి తప్పు కోదు

విశాలమైన సమాజ క్షేత్రంలో
విరుద్ధమైన గతి శక్తుల మధ్య
మజిలీ నుండి మజిలీలో నిరీక్షణం
జీవిత మొక నిరంతర ప్రయోగ నిలయం

అద్దంలో బింబంలా శబ్దంలో కవిత
ఆర్ద్రమైన కళ్ళలో మెరపు కళతో

సమాజ మెదురు చూస్తుంది ప్రతి రోజూ
స్వేచ్ఛా నవ కవితకై చెదరిన ప్రజాస్వామ్యంలో

## 2.

కాలం కవితయై కదలుతుంది
గడియారం ముళ్ళతో పోటీ పడుతుంది
నిన్న పై మర్యాదతో నేటిపై అభిలాషతో
రేపు పై విశ్వాసంతో నవ సమాజ శక్తితో

దారులు చీలే జంక్షన్‌లో విరామం అనంతరం
స్టేషన్ నుండి బయలు దేరిన రైలులా
ఎయిర్ పోర్టు నుండి ఎగసిన విమానంలా
గూడు నుండి బయటి కెగిరే విహగంలా

ఆగని కాలం నడుస్తుంది! గాఢ నిద్రలోనూ
జడమూ చేతన భేదం లేకుండా విశ్వంలో
చలనం తోనే మనిషి జీవనం సార్థకం
కదలిక లోనే మేఘం అందం ఉపయోగం

చీకటి ఊహ హత్యకు పురికొల్పుతుంది
వెన్నెల ఊహ హత్యను మరిపిస్తుంది
వెలుగు దారి బ్రతుకు సాగిస్తుంది
వెలుగు మనసు మనసుకు పండిస్తుంది

చీకటి వెన్నెల వెలుగు కవచాలతో
ఎవరి నెవరు హింసిస్తారో తెలియదు
ఎవరి నెవరు భూషిస్తారో తెలియదు
విలువ లెండి పోయి చెదరిన ప్రజాస్వామ్యంలో

## 3.

కాలం కవితయై కదలుతుంది
అనుభవాల లహరులపై యానంలో అన్వేషణం
ఎక్కడి కక్కడ కోరికలో ఊగే దానికై ప్రయత్నం
ఎప్పటి కప్పుడు శోధనకు పురికొల్పుతుంది

విజయానికి 'అంతరంగ' ప్రమేయ మవసరం
నీలి పొరల అడుగున అణగింది
రంగు తెరల చాటున దాగింది
ఇది! మాటల వలలో చిక్కేనా?

పెట్టెలో పాత నాణెం వలె చరిత్ర శకలం
రహస్యం మూత తొలగి బయటపడుతుంది
అనుకోని విలువలతో విపణివీది మ్రోగుతుంది
అమూల్యం భ్రమలో అందరినీ తిప్పుతుంది
అభిమాన ప్రకాశంతో మనసును నడిపిస్తుంది

"అంతరాత్మ"ను ఇంట్లో హేంగర్‌కు తగిలింది
నేలపై వెలుగు బొమ్మలు వెతుక్కుంటూ
హృదిలో బాధల మూటను మోస్తూ కదలే
మనిషితో సుఖంగా మాట్లాడేది! ఒక కవితయే
రశ్మిలా చుట్టూ చీకటి ఊహల్ని తొలగిస్తుంది

సమస్య పరిష్కారానికి వివేక మెంత ముఖ్యమో
చెదరిన ప్రజాస్వామ్యంలో నైతిక మంత అవసరం

# 4.

కాలం కవితయై కదలుతుంది జనమయమై
తనలో విద్యుల్లత దాచుకొనీ ప్రవహించే నదిలా

నిద్రా విరామాలతో జీవిత మొక మెలకువ కావ్యం
ఉదయ కిరణ పంక్తిలో వెలుగుల అక్షర లిపితో

నడచి నంత మేర! ప్రకృతితో సమాజం
సమాంతర గుణాలతో! వికాస శిఖరాలతో
వ్యక్తిలో మహనీయత మరచిన సందర్భంలో
వస్తుంది సమాజంలో క్షీణించిన విలువల దశ!

లయ తప్పిన సందర్భంలో
పయనం ఆగే సమయంలో
శబ్ద కవాటం తెరచుకొనీ! కవిత
బయటికి వస్తుంది! కదలిక తెస్తుంది

అధికార వికారాల్ని చుట్టు ముట్టిన అలజడి
ప్రజలను భయ కూపంలోకి దింపుతూంది
తాగేందుకు మంచి నీరు కరువైన నేలపై
కన్నీరు తోనో నెత్తురు తోనో గుర్తులు కనిపిస్తాయి!

వాదం ఏదయినా చర్యకు ప్రతిచర్యతో
మనుషులు! రాళ్ళు కారు ఏరి పారేయడానికి!

ఉదార జలాలు లేని మనస్సు శిలాఫలకం
మానవత ముక్కలయి చెదరిన ప్రజాస్వామ్యంలో

## 5.

కాలం కవితయై కదలుతుంది బంధువులా
సరసిలో బింబించే రవి తేజంలా
మనసులో అనుభవ రశ్మిని ప్రసరిస్తుంది
స్నేహ సుమం రేకులు విప్పారగ జేస్తుంది

సమస్యలో ప్రశ్నకు గురి అయిన ప్రజాస్వామ్యం
సరి అయిన జవాబుతో పునర్జవం పొందుతుంది

జీవిత మొక అనుభవాల వివరణ సంకలనం
పూల గుత్తి తాకవచ్చు ముళ్ళ కంప తగలవచ్చు

మితి మీరిన స్వార్థంతో ఆలోచన తనలో
సమాజాన్ని దింపుతుంది ప్రమాదంలోకి
నినాదాలపై తేలుతూ వివాదాలలో మునుగుతూ
హింసలో చిక్కుకొనీ నలిగి నలిగి క్షణాలు!

నిప్పంటిన తోటలో పూవుల్లా సామాన్యులు
చుట్టిన మంటల మధ్య పగలు గడుస్తుంది
వెలుగుకు బదులు మంటలతో ధగధగలాడుతూ
పచ్చదనం బదులు బూది శాలువా కప్పుకొనీ

తడిసిన కళ్ళతో! రాత్రి వేళ చంద్రుడు
చర్యలకు సాక్షులుగా చెట్లు! మౌన బంధంలో

రాజరికం ముగిసినా పదును పోని నిరంకుశం
ఎక్కడి కక్కడ ముక్కలై చెదరిన ప్రజాస్వామ్యంలో

# 6.

శీత కాలం గడ్డ కట్టిన కాసార తలం వలె
గతం! స్కేటింగ్‌కు పనికి వస్తుంది, అందంగా
ప్రాణి దాహం తీరే అవకాశం లేదు
తడికి మొక్క మొలిచి మురిసే అదృష్టం లేదు,

రవి రశ్మితో దాహం తీరదు
మంచు కరగి ధార కడుతుంది
హేతు బలంతో సమస్య తీరదు
పరిష్కృతికి దారి చూపుతుంది

గాజు పెట్టెలో వజ్రంలా ధర్మం! మెరుస్తూ
విలువలపై ఆశలు పేరుస్తూ భద్రంగా
ఎపుడయినా క్షణ కాలం పాటు బయటపడితే
చంద్ర బింబం చేతి వేళ్ళకు అందిన ఆనందం!

చినుగులతో అతుకులతో చీలిన ముక్కలతో
మాసిన రంగులతో చిక్కు ముడులతో
తళ తళ తరిగీ, వెలవెల బోతూ
రావలసిన మార్పుకై ఎదురుచూస్తుంది ! సమాజం

ఎండిన తరు శాఖపై చివురు శాలువా వలె
కఠిన శిలా శ్రేణి మధ్య, నీటి పాయవలె
మనిషిలో ఇంకా మనిషిపై నమ్మకం! బ్రతికీ
నిరాశలో ఆశగా చెదరిన ప్రజాస్వామ్యంలో

## 7.

కాలం కవితయై కదలుతుంది వెలుగుతో
స్మృతి కేప్సల్‌లో భద్రమయిన చిత్రాలతో
మూత తెరవబడీ! శబ్దమయమై బయటపడుతుంది
మెరపు తీగెలా చకితంగా, శిశువు నవ్వులో సహజంగా

నిజాన్ని చూపించే పనిలో ఉన్న
ఇజా లొక టొకటీ! రంగుల అద్దాల నుండి
కనిపించే దృశ్యం! అసలు రంగుకు భిన్నం
ఇది సమస్య పరిష్కారానికి దూరం చేస్తుంది

రాత్రిని పోలిన స్థితిలో ఆలోచన
అంతరంగ కాంతికై ఎదురు చూస్తుంది

అనుకోని ఘటన! మనిషి వివేకానికి పరీక్షగా
ఇది ఆపదకు దారి తీయవచ్చు
చరిత్ర గతిని మార్చి వేయవచ్చు

ఒత్తిడిలో చీకటి ఉరి త్రాడవుతుంది
ఉద్రేకం హింసకు నిచ్చెన అవుతుంది

అద్దంలో  కనిపించే ముఖం తనదే అయినా
అది విద్యుత్తు లేని బల్బుతో సమానం అవుతుంది

కళ్ళు చెమ్మగిలే బదులు కరుణతో
మంటల తీగెలు! కదలుతూ చూపులో!
గాయాలతో చెదరిన ప్రజాస్వామ్యంలో!

# 8.

కాలం కవితయై కదలుతుంది తోడుగా
చల్లని తొలి వెలుగు స్నిగ్ధ హృదయంతో
ఎవరి పలకరింత లేని వేళలో
పరుగు పరుగున చేరుతుంది ఆప్తంగా
చిన్న పిల్లల వలె గంతులేస్తూ
పావు రాళ్ళ వలె వాలిపోతూ

ఊహల అలలపయి ఊగుతూ
పెదవుల అంచు నుండి శబ్దిస్తుంది

జలదమై కదలుతుంది లోన అనుభవం
మాట సృజన కళతో బయటికి వస్తుంది
ఎడారి ముఖంపై లేత గాలి విసరుతుంది
శూన్య హృదికి ఆశా దృశ్య రూపమిస్తుంది

మెరపులకు పిడుగులకు భయపడి
ఎవరూ తమ కార్యకలాపాలను ఆపరు
ప్రకృతితో తప్పనిదీ జీవన యానం
బ్రతుకులో సమాజ బంధం ఎప్పటికీ

ఆశకూ నిరాశకూ మధ్య ఎడం
జలధిలో అలకూ ఒడ్డుకూ ఉన్నంత

చెప్పే మాటకూ చేసే పనికీ మధ్య అఖాతంపై
కూలిపోయే వంతెనతో చెదరిన ప్రజాస్వామ్యం!

# 9.

కాలం కవితయై కదలుతుంది
సమాప్తి లేని సమాజ పరంపరలో ఒకటై

సమాజ మెప్పటిదో? సముద్ర మంత పాతది
ఎప్పటి కప్పుడు! కొత్త అలల ఉరుకులతో!

జీవన రుచి కోరే బ్రతుకులో
అక్కడక్కడ! అందమైన దృశ్యాలు!
మనిషి వెనక తరలి వచ్చేవి కావు
మోసుకొని పో కలిగినవీ కావు!

వేలుతో చూపేది ఒక దిశ!
నడకలో పొందేది ఒక దిశ!
మనసులో ఉండేది ఒక దిశ!
ఇతరులకు చెప్పేది ఒక దిశ!
నాలుగు దిశల కూడలితో!
జీవిత మొక! వ్యవహార రూపం!

విలువల వెలుగులు మాసిపోయి
చీకటి మచ్చలతో నిండి
మనిషిలో! ప్రగతి బింబం! మసకబారి
ఏ దిశ అయినా ఒకటే నన్నట్లు ఉంది

ఆలోచన మారుతుంది బయటి దృశ్యాన్ని బట్టి
సంతోషం వెలుగుతుంది లోని తృప్తిని బట్టి!

రోజురోజుకీ ఆరోహణలో కిందికి జారుతూ
ఫలితం అందని యత్నంలో! చెదరిన ప్రజాస్వామ్యం!

# 10.

కాలం కవితయై కదలుతుంది జీవితంతో
మొదటి ప్రాణ చలనంతో కోరిక ఆరంభం
చివరి ప్రాణ గమనంతో కోరిక పరిసమాప్తి
ఈ మధ్య తెలియని పాత్ర లొకటొకటీ ప్రవేశం!

దేహంలో శిథిల కణం మృత్యు ఛాయతో
సంఘంలో స్వార్థ గుణం పతన పథంలో
గుహ నుండి బయటికి వేసే పులి అడుగులా ఒకటి
పుట్ట నుండి పైకి లేచి పాము పడగలా ఒకటి

శిఖరారోహణంలో మనిషిని అంటుకొనీ
తన నీడ కూడా పాకుతుంది పైకి సులభంగా
నిలవలేని అడుగులు జారి పడిపోతాయి
అడుగులతో నీడ కూడ! అదృశ్యమవుతుంది

చలనం లేని సమాధి కాదు జీవితం
మండే శ్మశాన ఖండం అవదు సమాజం

కూడిక తీసి వేత భాగ హారాలతో
ఒక అంకెకు మరో అంకె చేరుతూ
శూన్యం నుండి పూర్ణానికి జీవితం
విలువలలో మార్పులతో సమాజంలో భాగం

కాలంతో జీవితం! ఆగని గతిలో అనుకోనివి అంతలో
ప్రమాదం తెచ్చే సుడులు! చెదరిన ప్రజాస్వామ్యంలో!

# 11.

కాలం కవితయై కదలుతుంది అక్షరసేనతో
శబ్ద పథంలో, వర్తమాన వలయాలు దాటుతూ

జీవిత మొక పృథ్వీ ఖండ సమం
ఆలోచన ఒక వేగ నదీ సమం
స్వేచ్ఛలో అవకాశం ఆకాశంలా
మనిషిలో వర్తమానం పరచుకొనీ

ఒక మంచి సమాజంలో ఉండాలనీ
ఒక మంచి వ్యక్తిగా చరించాలనీ
తోటలో సుగంధ వాతావరణంలో
గడిపే కోరిక! ప్రతి మనిషిలో

ప్రవేశ ద్వారాన్ని మించిన ఆకృతితో
లోనికి నిటారుగా వెళ్ళే ప్రవర్తనలో
ఎంతటి స్థితి కయినా దారి తీస్తుంది!
మానుషాన్ని మరచే స్థితి రాకూడదు!

ఏదో ఒకటి అమ్ముకొని బ్రతికేవారే!
అందరూ! లేంది? ఎట్లా గడుస్తుంది
విద్య విజ్ఞానం శ్రమ వ్యాపారం వ్యవహారం!
ఏదో ఒకటి! అన్నీ బహిర్ వ్యక్తిత్వంలో ముఖాలు!
అపుడపుడూ అంతర్ వ్యక్తిత్వ ముఖం కనిపిస్తుంది
అమావాస్య రాత్రి 'సినీవాలి'లా, చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 12.

కాలం కవితయై స్వనిస్తుంది ఆశా స్వరం
పరచిన ఎడారిలో పచ్చదనం స్వప్నిస్తుంది
మంచు తెరను తొలగించి సూర్యరశ్మి నింపుతుంది
రానున్న రోజుకు! స్వాగత పత్రంగా నిలుస్తుంది

వెలిగే సిగరెట్ పొగల మధ్య
విలయ కాండ దృశ్యం ఊహించే వారూ
ఎదురుగా విధ్వంసం నుండి నిర్మాణానికి
సృజన భావ చిత్రంతో నడచే వారూ

నేమ్ ప్లేట్‌పై సిరా చుక్కలు చల్లి
నడచే మనిషి నీడపై నిప్పులు విసరి
విజయం సాధించిన తృప్తిలో బ్రతుకుతూ
ఊయలపై ఊగే మనోమయులూ! లేకపోలేదు

శూన్యం నుండి ఏదీ; స్మరణంతో ఊడిపడదు
గాలి మూటలో ఏముందో? ఆరాటం సహజం!

ప్రతి వస్తువు శ్రమ భవం సమాజంలో
విజయానికి అందం! నిజ నైతిక వ్యక్తిత్వం

నల్లని తెల్లని మబ్బుల వలె ఆలోచనలు
ఆశా నిరాశల లగేజి తో మానసం

ఏ రోజూ ప్రతి లిప్త గంధం చెక్క అవదు
ఏదైనా కావచ్చు! చెదరిన ప్రజాస్వామ్యంలో

## 13.

కాలం కవితయై వెలుగు రెక్క విప్పుతుంది
ఎదలో సంతోషం! గంతు లేస్తుంది! అంతలో
రెక్కలపై ఎగురుతుంది! పైకి పక్షిలా
ఉదార చరితతో మనసులో దిగుతుంది మబ్బులా

ఊహ మొదలు నుండీ తనలో ఏర్పడిన ప్రపంచం
ఎన్నటికీ కూలదు, ఎవరూ కూల్చలేరు, మార్చలేరు
అదృశ్యమై పోతుంది, తనలో నుండి సూటిగా
కవితలో నిలుస్తుంది! అక్షర పద భావనలో

ఒక దానితో మరొకటి పరిచయ బంధాలతో
సంకలన రూపం సమాజం! మార్పులతో కదలుతూ

దారిలో గాజు ముక్కలు! దూరం నుండి మెరుస్తూ
నడకలో అడుగు పడీ! నెత్తురు మరకలతో భూమి!

జీవన పథంలో జీవన్మరణ సమస్యలు
మౌనంగా నడవడం పడదు, నిశ్శబ్దంగా బ్రతకడం కుదరదు

స్వేచ్ఛ అందరికీ సమానమే! సందేహం లేదు
ఎవరి! ప్రపంచం వారిది తమలో, పరిమితిలో
వెళ్ళే దిశలు వేరు, దారులు వేరు
నడక వేరు, వేగం వేరు, లక్ష్యం వేరు

ప్రాణంతో ముడి వడిన విషమ క్షణాలలో
ఆలోచన ఆయుధమవుతుంది, చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 14.

కాలం కవితయై కదలుతుంది
వర్తమాన సమాజ స్పందనతో ఒకటై
నేల పై కాళ్ళ మునివేళ్ళపై నడిచే వారూ
అంతలో మబ్బులపై సాగాలని కోరే వారూ!

కాలంతో పని అంతానా? ఇంతానా?
కవితలో రుచి అంతానా? ఇంతానా?
రెండూ మనిషికి బహిరంతర్విధ భేదాలతో
కంటికి కన్పించని జీవన విభవం చూపిస్తాయి

కాలానికి సముద్రం పురాతన బంధువు
కాలానికి కవిత్వం! సరి కొత్త మిత్రం
వివిధ వస్తు సంచయంతో మ్యూజియంలా గతం
మనిషి నుండి! మర్యాదా పీఠాన్ని కోరుతుంది

సిమెంట్ రోడ్‌పై మట్టి గంధం లేదనీ
అడవిలో ఆధునిక సౌధం కనిపించదనీ
దోషారోపణ శీలం నిరాశలో తిప్పుతుంది
నిర్మాణ గుణ విమర్శ, కొత్తదనం చూపుతుంది

గుండెను మండించే ఉదగ్ర వాతావరణంలో
కరుణను వర్షించే హృదయం కై నిరీక్షణం!

మనిషిలో ఎదిగిన సంస్కృతి శిఖరాలొకటొకటీ
ఒరుగుతూన్న దృశ్యం! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 15.

కాలం కవితయై కదలుతుంది
ఆంతర ప్రవాహమై సృజన చేతనతో
వృద్ధత ఎరగని నవ యౌవన రూపం
జన సుందరతను కోరే ఆశయ యౌవన హృదయం!

చారిత్రక సాంస్కృతిక ప్రమేయ బంధాలతో
అన్నిటికీ అవసర కాంతి ప్రసార గుణంతో
అన్నిటినీ కలిపే మానవతా చిర సూత్రంతో
ఎప్పటికీ రాణించే మానసికావసరం!

ఒక అనుభవం జ్ఞాపకం ఆలోచన దర్శనంతో
సమాజ పురోగతికి ఉజ్జీవన ప్రేరణం!

బయట నుండి తగిలిన గాయం వేదన
ఎదలో కవితయై బయట శబ్దమయమై
తలుపులు తెరచుకునీ బయటికి వస్తుంది

మేఘ గర్జనకు పూల చెట్టు భయపడదు
కదలికతో సుందర సృజనకు సిద్ధమవుతుంది
మట్టిపై మనిషి! ఆ మనిషికి బ్రతికే హక్కు
సమాజ చరిత్రలో! ఎవరూ ప్రశ్నించరాని వరం
ఉదయానికి రిచార్జి అయి కిరణంలా దూకుతుంది

వర్ణం వర్గం మతం ప్రాంతం స్వార్థంలో పాతుకొనీ
మైలు రాయిలా మనిషి! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 16.

కాలం కవితయై కదలుతుంది
వెలుగు అలలతో జన హృదయం స్పృశిస్తూ

చీకటి కవరు నుండి తెరచిన ఉత్తరంలా
తలుపు తీయగానే చేతి కందుతుంది ప్రకాశ రూపం

గడచిన క్షణం స్థానంలో కొత్త క్షణం
తెలిసిన బరువును నింపుతుంది
తెలియని హరువును చూపుతుంది
తెలిసీ తెలియని స్థితిలో నిరంతర గమనంలో

మౌన పాత్ర నింపుతూ అనుభవంతో
అనుక్షణం వ్యక్తిత్వం మారుతుంది మనిషిలో
ఇది మట్టి పాత్ర కాదు
ఇది గాజు పాత్ర కాదు
అనుభవ గుణంతో జీవన స్పందన రూపం

కొండ శిలలు ముక్కలయి
అడవి తరువు చెక్కలయి
చేరతాయి ఒక చోట! ప్రయోజన లక్ష్యంతో

నిలయ రూపానికి అవసరమై
సంఘటిత శక్తికి చిహ్నమై
జగత్తులో పనికి రాని వస్తువు లేదనిపిస్తుంది
దేని దారి దానిదే! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 17.

కాలం కవితయై కదలుతుంది
జలధిలో బింబించే రవి తేజంలా
ఆంతర ప్రేరణతో మనసును నడిపిస్తుంది
బయటికి సమాజ చింతనలో దృశ్య పరంపరతో

తోటలో పూల అందం వెలుగులో తెలుస్తుంది
కవితలో సమాజ దృశ్యం! చింతనలో నిలుస్తుంది

కవి తన కవిత చదవడ మొక ఉదయానుభవం
ఇతరుల కది ఒక! ప్రతిఫలన బింబమయం

తరం నుండి తరానికి భద్రంగా
శత్రుతకూ మిత్రతకూ దూరంగా
సృజన ప్రతిభలోని శక్తి ప్రకటనం
అన్ని కాలాలలో అందరికీ చెందిన రూపం

కరగతూ పోయే కాలంపై
తేలుతూ పోతుంది కవిత!
పూర్వం తెలియని దృశ్యాలతో
కొత్త లోకాన్ని చూపిస్తుంది

మానస గగనంలో సూర్యుని వలె చంద్రుని వలె
కాలంతో కవిత! జీవన వాస్తవ గతులతో,
ముసుగును తొలగించి రహస్యం విప్పుతుంది
అపాయాన్ని హెచ్చరిస్తుంది! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 18.

కాలం కవితయై కదలుతుంది చలన శక్తితో
సమాజ దృశ్యాల్ని బింబిస్తుంది! వివిధ కోణాల్లో

భూమి తిరుగుతుందని తెలిసీ మనిషి నడక ఆగదు
నడక సాగుతుందని తెలిసీ ఊహ గతి ఆగదు!
దేని కదే చలనంలో గమనంలో నియత క్రమంలో
మూడూ కలిసిన రూపంతో విశ్వమయం! కవిత్వం

లోన కవిత కదలికతో
అవకాశం ఆకాశ మవుతుంది
కవితలో కళా హృదయానికి
సమయం! స్వాగత మిస్తుంది

సమాజ బంధువు కవి హృదిలో వెలుగు
అక్షర శిల్పంలో మనిషిని చూపిస్తుంది

చినుకుతో మట్టిలో జీవశక్తి సాకారం పొందుతుంది
ఆర్ద్రతా గుణంతో శబ్ద శక్తి కవితాకృతి పొందుతుంది

ప్రతి నిశీధి విషాద మయం కాదు
చాంద్రీ హ్లాదమూ ఎప్పటికీ ఉండదు

లోపంతో ఎదగ లేదు మనిషి నిండుగా
మోదం ఖేదం రెండూ పూర్ణత కిరు పార్శ్వాలు!

ఏదీ వీడదు అన్నీ బ్రతుకులో తప్పనివీ
వికారాల్ని ధరిస్తాయి! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 19.

కాలం కవితయై కదలుతుంది
తన వైపు చూచే మనిషి మనిషినీ పలకరిస్తుంది

అంతరంగ ప్రతిబింబం! ఈ ఉదయం
ఉగాది రోజు! మనిషిలో కొత్త పూవు చూడాలనీ

పూచిన చెట్టు పక్క ఒంటరిగా
ఎండిన బ్రతుకులు కనబడకూడదనీ

ఇనుప చువ్వల మధ్య నున్న మనిషి ముఖంలో
నేరాన్ని కప్పేసే పూల రేకుల్ని చూడాలనీ!

కొమ్మ కింద దోసిలిలో పూలు! రాలే బదులు
కళ్ళ నుండి ఈ వేళ! వెచ్చని అశ్రువు జార రాదనీ!

ఈ మనషుల మధ్య! ఈ సమయమయినా
మానవతా పరిమళం! అందరినీ స్పృశిస్తుందనీ
ఏకత నుండి అనేకానికి లౌకిక పయనంలో
అనేకం నుండి ఏకతకు మానస నిలయంలో

దారిలో దాహం తీర్చే నీటి కడవతో ఒకరూ!
పక్కనే విజయం కోరే! ఆయుధ మతితో ఒకరూ!

విధ్వంస పథంలో! మారణ దృశ్యం బదులు
నిర్మాణ  గుణంతో జీవన దృశ్యం చూచేమా?

మానవీయ స్పందనతో కవితకై నిరీక్షణం
నాశనకర ఘట్టంలో చెదరిన ప్రజాస్వామ్యంలో!

# 20.

ఆ చోటు నాది అనుకుంటే
అది నాది కాకుండా పోతూంది
ఒక చోటు నుండి మరో చోటికి! మార్పులో

డబ్బు కోసం పదవి కోసం సుఖం కోసం
కారణ మేదయితేనేం? బంధం విడిపోతుంది

దాగిన నిజం మడత విప్పేందుకు
ఇరు వైపు నుండి వాదం మొదలవుతుంది
ఎటూ తేలక! మధ్యలో చర్చ నిలిచిపోతుంది
క్రాస్ రోడ్ మధ్యలో మనసు నిలిచి పోతుంది

దీపం వెలిగించిన పూజా వేదిక
కర్పూర పరిమళం హత్తిన వేళలు!
నీళ్ళు పోసి పెంచిన పూల మొక్కలు
నలుగురితో పంచుకున్న మోదం! ఖేదం!

మాయ ఎరగని వెలుగులో లోకంలోకి వచ్చిన వాణ్ణి
గోడల మధ్య నుండి గడప దాటి బయటపడీ
పదును తెలివితో చాకులా తిరుగుతూ
చోటు నుండి చోటుకు! కాలక్షేపం కబుర్లతో

ఉన్న చోటుతో కాదు, చేసే పనితో అస్తిత!
పరమ రహస్యం తెలిసే లోపల! కర్టెన్ జారుతుంది
కాలం కవితయై కదలుతుంది స్మృతులను వదలుతూ
కోట గోడ వలయంలో చిక్కి చెదరిన ప్రజాస్వామ్యంలో

## 21.

కాలం కవితయై కదలుతుంది
జీవన స్పందనతో వర్తమాన స్వరంతో

చెట్టుకొమ్మ చివర వేలాడే ఫలాలు
గాలిలో ఊగుతూ మురుస్తాయి పరిణతిలో!
సమాజ బంధంతో అస్తితలో జీవితాలు!
ప్రకృతి శక్తికి దీటుగా, మనిషి శక్తికి గుర్తుగా

బుజాలపై విప్పారిన వెలుగు శాలువాతో
తళతళలో హ్లాదంగా కనిపించే ఉదయం
పొద్దెక్కిన కొద్దీ! వీధిలో అలజడిలో మునిగీ
శాంతి మాత్రం! ఎప్పటికీ ఒకే విధం! వజ్రంలా

లిప్తలు! గులాబి దళాలు కాకపోయినా
కొస దేరిన కంటకాలు కాకూడదనే!

కాలం ఒకరికి ఊరేగింపులో రథం
మరొకరికి! స్వారిలో పెద్ద పులితో సమం!

ఎవరి వాహనం వారికి అవసరమైన ఇష్టం
ఎవరి అభిమతం వారికి ముఖ్యమైన కవచం
ఒక తీరు హృదయంతో ఒక రీతి మేధతో
ఒక దిశ మార్గంతో ఒక లక్ష్యంలో ఎవరికి వారు

బ్రతుకుల్లో సంవేదన సమాజ సంక్షోభంతో
మానవ గుణ చర్యలతో చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 22.

కాలం కవితయై కదలుతుంది
దేశానికి సీమల వలె ఆలోచనతో
జాతికి పతాక వలె అభిమానంతో
మానుష ధర్మానికి కట్టు వడిన స్వేచ్ఛతో

సానుకూల చర్యలతో బ్రతుకును నడిపిస్తుంది
వ్యతిరేక చర్యలతో బ్రతుకు నదుపు పెడుతుంది

ఎవరి పనిలో వారు సమాజ చలనంలో భాగమై
ఎవరి మతితో వారు లౌకిక వ్యూహానికి కర్తయై

మనిషికి మనిషికన్నా నీడకు ప్రాధాన్యం
నీడ అయితే! తనతోనే ఉంటుందనీ

మహా కాలంలో ఒక సమయం
పసిడి రెక్కలతో ఎగిరి వచ్చి వాలుతుంది
మహా కాలంలో ఒక సమయం
ఇనుప రెక్కలతో ఎగిరి వచ్చి నిలుస్తుంది

అందని పై మెట్టు, ఆనని కింది మెట్టు
మధ్యలో అడుగులు! పడిపోయే స్థితిలో

చరిత్రకు కిరీటమనుకున్న స్వేచ్ఛా రూపం
ధైర్యం తగ్గి భయం క్రమ్మి అశాంతిలో
శిథిలాల మధ్య విశీర్ణ స్థితులలో
తిరుగుతూ పోతూంది! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 23.

కాలం కవితయై కదలుతుంది
ఉదయం తెరచిన దిన పత్రికలో శీర్షిక
నిన్న పేలిన క్షణాల్ని ప్రతి ధ్వనిస్తూంది
కాలిపోయి మిగిలిన దృశ్యాల్ని చూపిస్తూంది

బ్రతుకు లెప్పటికీ మంటల మధ్య చెట్లు కారాదు
నడత ఎన్నటికీ శిల్ప జడతను పొంద రాదు
ఇరుకులో మనసు ఒరిగి ఒదిగి సరించ రాదు
ఎత్తిన తల! రవితో శశితో పోటీ పడితే మంచిది!

పూవును నలిపేసే బలాత్కార దృశ్యంలో
ఎరుపు కళ్ళ చీకటి నర రూపం చూచి
ఆకాశం సిగ్గుతో తల వంచు కుంటుంది
మనిషి ముఖం బూది పొరలు కమ్ముతూంది

గాలి మూగ వోయి స్తబ్ధమైన సన్నివేశం
లో లోపల అశాంతి చుట్టుకొనీ రింగులుగా
సమయం పెను వరదలా తరలుతూంది
తనపై నిష్క్రియా సమాజాన్ని మోసుకొనీ

జీవన శోభ మలినమై ఆ క్షణం
రాగ ప్రసారం తెగిపోయి నట్లుంది

ఇది కల్పనలో గీసిన శబ్ద చిత్రం కాదు
చెదరిన వర్తమాన ప్రజాస్వామ్య శకల రూపం

# 24.

కాలం కవితయై కదలుతుంది
దిగులు నిండిన ఉపాధి బ్రతుకులు
కళ్ళలో ఎండిన బావుల లోతులు చూపిస్తున్నాయి
కష్టంలో ముళ్ళ తుమ్మ చెట్లను సూచిస్తున్నాయి

లాభం ఎరగని కర్షక సేద్యం, ఓడిన జూదంలా ఉంది
ఎవరి చేతనో ఆడింపబడే, బొమ్మలాటలా ఉంది,

క్షేత్రంలో చెమటలు పట్టిన శరీరం
పంటకు నిలిపిన దిష్టి బొమ్మలా ఉంది
భూమిపై చేనుకు నీటి తడి కరువై
కర్షకుని కళ్ళలో తడి పొర మెరుస్తూంది

విశాలమైన వాణిజ్య మహాప్రపంచంలో
వ్యాపార సరళిలో ఎగసే లాభాల భ్రమలో
ప్రపంచీకరణ భోగం! సామాన్యుని మరుస్తూంది
మార్కెట్ మాయలో బ్రతుకుల్ని తిప్పుతూంది

ఆ నేలకు  సరిపడని విత్తనం
ఆ బ్రతుక్కి సరిపోని వర్తకం
నీరు బయట చేపలా విలవిల లాడిస్తూంది

దప్పికలో భూమి! ఆకలితో ఆకాశం
రెండిటికీ మధ్య! శ్రామిక క్షితిజం!

కాలి బాట మూత బడి సమాజంలో
చిదికిన బ్రతుకులో ఆలోచన! మృత్యువు పిలుపుతో
మంటకు చిదుకులుగా పనికొస్తూంది చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 25.

కాలం కవితయై కదలుతుంది
పిలవకుండానే సృజన చేతనతో తానుగా
వెలుగు అక్షరాలతో మనః ఫలకం పై
అందరినీ కలుపుతుంది! మానవతా సూత్రంతో

వివిధ విభాగాల్లో కదలే జంతువులతో మృగాలతో
బయటి దారి మూసిన విశాలమైన బోనులా సమాజం

ఎత్తు ఎత్తుకీ మెరుగు పొందుతూ
ఘటన ఘటన కీ పదును తేలుతూ
కుటిలతతో జటిలతతో రాజకీయం!
ఆటవికాన్ని విడుదల చేసే యంత్ర మవుతూంది

సమస్య నుండి తప్పుకొనే అపమార్గం
మరో కొత్త సమస్యకు దారి తీస్తూంది,
కుసుమ రమ్య పరీమళ వాతావరణం బదులు
బాంబుల విస్ఫోటంతో వేడి వేడిగా ఉంది

ఎన్ని మబ్బుల్ని మోసుకొని వెళుతున్నా
ఎంత ధూళిని నింపుకొని పోతూన్నా
అలసట ఎరగని శాంతి పవనం ముందుకు సాగుతూంది
ఎంతటి అశాంతినైనా ఎదుర్కొనే జీవన యానంతో

అపుడపుడూ అరణ్యమై భయపెట్టే మాట నిజం!
మారణ చర్యలతో చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 26.

కాలం కవితయై కదలుతుంది
సమాజ గతిలో సంచలన దృశ్యాలతో
నాతో మాట్లాడే దెవరని?
ఒక ఉదయ కాంతి ముఖం తప్ప
నా వైపు చూచే దెవరిని?
ఒక గగన నయన దృష్టి తప్ప!

నాతో కలిసి నడచే దెవరని?
ఒక పవమాన లహరి తప్ప!
నాతో ఎప్పటికీ! ఉండే దెవరని?
ఒక సృజన చేతన తప్ప!

ఏ రోజు కారోజు ఆరోహణ యానంలో
వర్తమాన కర చాలనం! ఒక రమణీయానుభవం
తర తమ భేదం లేకుండా ప్రతి ఉదయం
అన్నిటికీ! స్వాగతం చెబుతుంది

ఎవరి దృష్టి వారిదయినా,
చూచినా చూడపోయినా
తర తమ భేదం లేకుండా ప్రతి కవిత
అందరికీ! ఆహ్వానం పలుకుతుంది

ఎవరూ కాదనలేని నిజాలతో
వర్తమానం భవిష్యత్తు నందు కొనీ,
చరిత్రగా మిగులుతుంది! సమాజంలో
నేరాలకూ పాపాలకూ సాక్షిగా అంతరంగం
అక్షర రూపంలో! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 27.

కాలం కవితయై కదలుతుంది
మంచు తెర చాటు నుండి
బయటపడిన ఇన బింబంలా
ఇన తేజం నుండి పొరలు దాటి వడపోసిన రశ్మిలా

ఒక దేశం సరిహద్దు దాటి
మరో దేశం లోకి ప్రవేశం
మనిషి కన్న మరో ప్రాణికి సులభం
నేలపై నింగిలో నిర్భయంగా స్వేచ్ఛగా

ఒకరిపై ప్రభుత చూపే రీతిపై
ప్రతి వ్యక్తిలో కోరిక! అంతో ఇంతో
ఒకరి అదుపు నుండి స్వేచ్ఛకై
ప్రతి వ్యక్తిలో ఆలోచన! అంతో ఇంతో

జరిగిన 'నిజం' ఒకటే! మనిషి కొక విధంగా
అవగతిలో ప్రకటనలో బహువార్తా ప్రపంచం
అద్దానికి ఎవరి ముఖ మయినా ఒకటే
పేదలు ధనికులు రక్షకులు హంతకులు!

రవి చంద్రుడు చుక్కలు! పై నుండి ఏ రోజూ
కింద నున్న వారికి! హితబోధ చేసి వెళతారు
అది భద్రంగా ఉంటుంది లోన ఆదర్శంగా
పురా సంపదగా! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 28.

కాలం కవితయై కదలుతుంది
ఎప్పటి నుండో తిష్ఠ వేసిన చీకటిని
వెలుగు చూపుతో తుడిచి వేస్తుంది
అయనానికి సుగమ పథం చూపిస్తుంది

ఏదో కొత్త దనం చూపేందుకు
తలక్రిందులుగా కదల నక్కరలేదు
ప్రతిభ లేని సృజన రూపం చూపేందుకు
ఇంద్ర జాల ప్రదర్శనతో పని లేదు

చేతిలో పదును ఖడ్గం ఉంటే సరిపోదు
ప్రయోగ నైపుణితో సాహస మవసరం
లోపిస్తే! తన తల ఉత్తరింపబడుతుంది
పని తీరాక! దాని స్థానం భద్రతా నిలయం!

నరకం అంటే లోపల రాశి అయిన భయ భావం
నాకం అంటే! లోపల మెరపులతో ప్రియ రూపం
మంచుకొండ అయినా అనల కుంజ మయినా
కవిలో సృజనకు స్పందన మూలం! ఒకటే

నిద్రించే కృష్ణ సర్పం లాంటి లోయదాటి
కూర్చున్న పక్షి రాజు లాంటి పర్వతం దాటి
అడవి నుండి ఊరుకు ఊరు నుండి నగరానికి
మార్పు కోరే అలజడిలో చెదరిన ప్రజాస్వామ్యంలో!

# 29.

కాలం కవితయై కదలుతుంది
మాన వికాస చరిత్ర భద్రమైన రూపం
నాలుగు వైపుల నుండీ బ్రతుకును బింబించే దర్పణం
సమాజమెప్పటికీ రుణపడి ఉండే ప్రతినిధి

పాలనా పీఠానికి పొదిగిన మణి ప్రభలకన్నా
అందంగా జన జీవన స్థితులను బింబిస్తుంది

ఒక పతాక దేశానికి చిహ్నంగా నిలబడుతుంది
ఒక కవిత సమాజానికి వేగ శక్తి నిస్తుంది

గడ్డ కట్టిన ఆలోచన రస మయమై
మోడు బారిన అనుభవం కుసుమ సమమై
జీవిత మొక కళామయ సుందర జగమై
సమయ సమయం వినిపిస్తుంది మానవీయ స్వరం

ఘర్షణలో గాయపరచే ఆయుధాల్ని మరపిస్తుంది
స్నేహంలో పనికి వచ్చే హిత సాధన మవుతుంది
చీకటి గుర్తులతో వాలి పోయే సాంధ్య వేళ
గుండెను హ్లాద పరచే బింబాన్ని వదలుతుంది

రాజ్యాంగం నడుస్తుంది రాజ పథంలో
సామాన్యుల బ్రతుకులు కదలుతాయి కాలి బాటలో

దేని దారి అదే అయినా! ఎక్కడో మజిలీలో
కలుస్తాయి రెండూ! చూపులు మాటలు ఒకటై
శిశిర శూన్య ముఖాలలో వసంత స్పర్శపై ఆశ!
లౌకిక చక్రంలో నలిగి చెదరిన ప్రజాస్వామ్యంలో!

# 30.

నిజాన్ని తెలుసుకొనే యత్నంలో
ఇజాలు! తీర్చబడిన కల్పనలు!

ఒక్కొక్క జీవాణువులో ఒక్కొక్క కాంతి కణం
తనలో ఉన్న సూర్యుని చూడలేని మనిషి!
మనిషి ముందు మనిషి! మనిషి వెనక మనిషి!
ఎవరి దారి వారిది! ఎవరి అస్తిత వారిది.

దూరం నుండి ఆకాశం వంగినట్లు కనిపిస్తుంది
సమాజాన్ని చూడాలనీ, సమాజంలో కలవాలనీ
దూరం నుండి సముద్రం! అలలతో ఎగసీ
గట్టు దాటి మెల్లగా, సమాజాన్ని స్పృశించాలనీ

ఇంటి ముందు దారిలో చెట్టు! చేతులు చాచీ
వచ్చే మనిషిని దగ్గరగా హత్తుకోవాలనీ!

శబ్దంతో కవిత మనసు నింపుతుంది
పలు రంగుల్లో అర్థం నెమలి పింఛంలా విప్పారుతుంది
భావం తెలిసే లోపల! అనుభవం ముగుస్తుంది
మరొకరికి చెప్పడానికి! బాగా పనికొస్తుంది

మూసిన తలుపులు తెరవ బడ వచ్చు
తెరచిన తలుపులు మూయబడ వచ్చు
దోసిలిలో నీరులా పూవులా సమయం జారుతుంది
నిండు హస్తాలతో కనిపించ వచ్చు
శూన్య హస్తాలతో కనిపించ వచ్చు
ఏమయినా జరగవచ్చు! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 31.

అడుగున బలంగా నాటుకునీ సమాజంలో
కులం మతం వర్గం వర్ణం దేశంతో చిర బంధం
ఎన్ని సార్లు తుంచినా మళ్ళీ మళ్ళీ చిగిర్చి ఎదుగుతుంది
కొమ్మలతో ఆకులతో తరువుల్లా పోటీ పడుతూ

ఒకరి జీవన తంత్రులు లాగబడి బిగింపబడి
మరొకరి స్వార్థంలో సంతోషానికి రుచి నిస్తాంది

సూర్యుడు ఉదయించే దిశ ఎంత పవిత్రమో
సూర్యుడు అదృశ్యమయ్యే దిశ అంత పవిత్రం
ఇవతల నున్న వారికి అస్తమయ దృశ్యమయితే
అవతల నున్న వారికి ఉదయ మయ్యే దృశ్యం

బయటి ఎప్పటికీ చీకటి! ఉండదు
నాలుగు గోడల మధ్య చీకటి! ఎప్పటికీ
మనిషికి మనిషితోనే బంధనమైనా! స్వేచ్ఛ అయినా
మనిషికి మనిషితోనే స్నేహమైనా! శాంతి అయినా

కాలం! చుట్ట చుట్టి బుజాన వేసుక పోయేది కాదు
మానవ పయనంలో అనుభవాల్ని విస్తరిస్తూ పోతుంది!

వర్తమానాన్ని ఎదుర్కొలేక గతాన్ని ఆశ్రయిస్తారు
గతంలో నిలవ లేక భవిష్యత్తుకు చేరతారు
వర్తమానాన్ని ఎదుర్కోడానికి సాహస మవసరం
ఇది ఒక ఛాలెంజ్! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 32.

కాలం కవితయై కదలుతుంది
వెలుగులు ప్రసరిస్తుంది! తలపులు మెరపిస్తుంది
కవి కవిలో భిన్న రుచులతో! సృజన రూపం
తెలియని ప్రపంచాన్ని అనుభవింప చేస్తుంది

ప్రతి ప్రశ్నకు జవాబు అన్వేషణలో
ఒకటి కుసుమ దళాలను జారుస్తుంది
ఒకటి అనల కణాలను రాలుస్తుంది
ఒకటి రుధిర బిందువును చూపిస్తుంది

గగనంలో పరచిన చుక్కలుగా ఉన్నవి
మనసులో వెలుగు అక్షరాలుగా మారతాయి!
కవితకు పాత లేదు ఎప్పటికీ కొత్తే
లేంది! చెల్లని నాణెంతో సమానం!

మానవ శ్రేయో సాధనలో మానసిక సాధనం
ఒకరి నుండి మరొకరికి అందే ప్రసార రూపం
గమనం నిలిచిన వేళ కవితలో ఆలోచన
గోడల్ని తొలగిస్తూ ముందుకు సాగిస్తుంది,

ఇది పూలగుత్తి కాదు, ఆయుధం కాదు
సజీవ స్పందనతో ఎప్పటికీ అంతరంగ రూపం

నలు వైపుల నుండీ చేరే దారుల కేంద్రం
అస్తితను నిలుపుతుంది చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 33.

కాలం కవితయై కదలుతుంది ఆత్మీయంగా
ఉదయం మేల్కొగానే, కిరణం అందిస్తుంది
రహస్య నిలయంతో వర్తమాన ప్రకాశ పేటిక!
రోజంతా గడుస్తుంది బయటపడే భవిష్యత్తుతో

తర తరాల బంధానికీ సాక్ష్యంగా
తీరం నుండి తీరానికి చేర్చే వంతెనలా

చేతులు రెండు! కాళ్ళు రెండు! పరస్పర సహకారంతో
హృదయం ఒకటే! మేధ ఒకటే! మానవ రూపంలో

మేల్కొన్న కళ్ళ నుండి రాత్రి కన్న కలలు
ఒకటొకటీ జారతాయి వెలుగు చూపులో

బరువయిన మస్తకం ఆనేందుకు
చల్లని నీలి మబ్బు అవసరమవుతుంది
బరువయిన హృదయం వాలేందుకు
మెత్తని పూల చెండు అవసరమవుతుంది

కాలం కవితయై కదలుతుంది నవోన్మేషంగా
కోరింది దూర దూరం జరగవచ్చు
కోరంది దగ్గర దగ్గరగా రావచ్చు
రెండూ క్రాస్ అయ్యే సందర్భాలెన్నో

అక్షర జలాలతో కవిత ఒక ఒయాసిస్
ఎడారి నిరాశతో చెదరిన ప్రజాస్వామ్యంలో!

# 34.

కాలం కవితయై కదలుతుంది
మౌనాన్ని కరగిస్తుంది శబ్దంతో సరిస్తుంది
మనసును దింపుతుంది మరో జగత్తులోకి
చేతనతో ప్రాణ శక్తి రెక్కలు విప్పారుతాయి

ఎక్కడికక్కడ నిలిచి పోయే జడ స్థితి నుండి
అప్పటి కప్పుడు ముందుకు పోయే గతి నిస్తుంది

కుంభ కర్ణ నిద్ర ముద్ర పడిన మనసుకు
మెలకువతో వివేక ప్రకాశం దయ చేస్తుంది

నవోన్మేష సంకల్పం! కవితకు మూల ధనం
జీవన స్మృతితో వర్తమాన దృశ్యం
సూర్యునీ చంద్రునీ మరపిస్తుంది,
అక్షర లహరులపై తేలే నవ బింబంతో

అస్థి పంజరంతో నడచే వార్తకు
చేతనతో ఆకారం నింపుతుంది! పరుగెత్తిస్తుంది
అరుపులు! కేకలు! హెచ్చరికలు! సూచనలు
అన్నీ వినిపిస్తాయి! సమాజ బంధు కవితలో

కాదన్నా వద్దన్నా ఆగని కవిత
ఉన్న చోటు నుండి విశ్వమయం చేస్తుంది
స్వార్థంలో చెలరేగిన ప్రతికూల శక్తుల మధ్య
కళ్ళ ముందు! సజీవంగా, చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 35.

కాలం కవితయై కదలుతుంది
ఇంటికి చేరగానే హృదయం పరచిన విశాలావకాశంతో
ఆత్మీయ గంధ పవన చలనంతో పరవశింప జేస్తూ
వ్యవహార జగం వీడి, మనోజగం లోకి నడిపిస్తుంది

బయట అక్కడక్కడా తగిలిన గాయాలు
ఇంటికి రాగానే ఆర్ద్ర భావ దళం హత్తుకొనీ
అనుమానం లేని ఆలోచన ఆవహిస్తుంది
గతాన్ని మరపిస్తుంది క్షణాల్ని హ్లాదమయం చేస్తుంది

సంతోష ముఖంలో జలద భావ స్పర్శ
వెనుక నున్న వేదనను మరపిస్తుంది
కన్నీటి బిందువులో విద్యున్నవ కాంతి!
వెనుక నున్న వాస్తవాన్ని మెరపిస్తుంది

మబ్బు నుండి స్వచ్ఛమైన ధార లా
సందేహం తీరి సందేశం వర్షిస్తుంది

బ్రతుకులో ప్రకృతి శక్తి ప్రసారాలు
వివిధ స్థితుల్లో నిలిచిన అనుబంధం చూపుతాయి
ప్రతి ఘటనలో ప్రకృతి మూల తత్త్వం
వివిధ పాత్రల్లో మనిషిని! తలపిస్తుంది

విపరీతపు పోకడలు వ్యక్తి స్థాయిని దించుతూ
వికార దృశ్యాలొకటొకటీ చెదరిన ప్రజాస్వామ్యంలో!

# 36.

కాలం కవితయై కదలుతుంది
స్పందమాన సృజన శక్తిని సాకారం చేస్తూ

సమాజ చలనంలో అనుకూలం! వ్యతిరేకం!
ఒకదాని నొకటి ఆనుకొని, ఆక్రమించాలని
మనసు వాలుతుంది ఒకవైపు
చెట్టు కొమ్మలాగ అవసరాలలో

పుస్తకంలో పేజీలు చింపి ముక్కలు చేసి
భావ జాలాన్ని మాయం చేసిన తృప్తిలో ఒకరు!
సూర్యుణ్ణి రంగు అద్దాల నుండి చూస్తూ
తేజానికి తెర దించిన మోదంలో ఒకరు!

ఒకరిని హింసించే చర్య వెనక
తనలో హింసకు గురి అయ్యే మానసికం

గాయపడిన పక్షి ఎగరలేదు,
కవితలో ఎగురుతూ! కనిపిస్తుంది
ఎన్ని యుద్ధ సంఘటనలు వచ్చిపోలేదు?
ఎన్ని వికల దృశ్యాలను చూపలేదు?

ప్రదర్శన శాల కాదు  ప్రజాస్వామ్య రూపం
హేతువుతో ప్రశ్నిస్తుంది? ప్రతి చర్యను
ఎవరి ఇష్టం పైన! చరిత్ర పేజీలు మారవు
నీతి నియమం ఒక ప్రక్క, మనిషి హృదయం ఒక ప్రక్క

రెండూ సమయానికి పని చేయని సందర్భాలెన్నో
ప్రేక్షక పాత్రలో వ్యక్తులు! చెదరిన ప్రజాస్వామ్యంలో

## 37.

కాలం కవితయై కదలుతుంది
చెట్టు కింద నేలపై పరచిన ఇసుకపై
అక్షరాలు దిద్దే చిన్న పిల్లల ముఖాలలో
ఆకాశం తొంగి చూస్తుంది! ఆశామయంగా

పక్కన దారిన వెళ్ళే బిక్షువు మాట
సమయాన్ని అలంకరిస్తూ పోతుంది
అతని బ్రతుకులోని రుచిని వినిపిస్తుంది
అతని గుండె లయతో గాలి కదలుతుంది

ఒక తరంలో తాము దైవానికి సప్రియంగా
ఒక తరంలో తమకు దైవం బహు ఇష్టంగా
ఒక తరంలో దైవాన్ని హేతువుకు నిలుపుతూ
ఒక తరంలో తమ కోరికలకు అండగా

ఇంట్లో గోడకు అమర్చిన
ఎగిరే పక్షి బొమ్మ, చూపును బంధిస్తుంది
ఎదురుగా గోడకు తగిలించిన
గడియారం! వ్యక్తి బాధ్యతను గుర్తు చేస్తుంది

పై నుండి క్రిందికి
క్రింది నుండి పైకి
కదలే చక్ర భ్రమణ జీవితంలో ఒక సమయం
చీకటి వంతెన అవుతుంది! చెదరిన ప్రజాస్వామ్యంలో!

## 38.

కాలం కవితయై కదలుతుంది
సమాజంలో ఎవరూ విధ్వంస కాండ కోరరు
అయినా ప్రవేశిస్తుంది! జీవన వైరుధ్యాలతో

ఏదీ ఆగదు! ప్రవాహాన్ని ఎవరూ ఆపలేరు
అది వరదలుగా ముంచెత్తి తేనే ప్రమాదం
సత్వర నివారణ చర్యలు తప్పవు! అవసరం

ధనం బలం అధికారం సమస్యకు నిరంకుశంలో
పరిష్కారం బదులు జటిలత కూర్చే తంత్రం!
కష్టాలకు నష్టాలకు మనిషి కారణమై కేంద్రమై
స్వేచ్ఛలో అవకాశం! స్వార్థానికి పీఠమవుతూంది

ఎంతటి కళా దృష్టిలోనూ కవి
చెక్కిన మౌన విగ్రహం కాలేడు
దార్శనికం శబ్దంలో బింబిస్తుంది
సంఘం ఆలోచనలో కదలుతుంది

ఇది ఎవరి మన్నన కోరి కాదు
తన సంతోషాని కసలే కాదు
కవిలో తన కర్తవ్య పాలనం! ప్రధానమై
ఇది అంతరంగ ప్రచోదితం! కావలసి ఉంది

వర్తమాన చరిత్రలో పుటలు పొగలు కమ్మి
అనల శిఖల మధ్య సమాజం! చెదరిన ప్రజాస్వామ్యంలో

# 39.

కాలం కవితయై కదలుతుంది
స్వార్థంలో నిప్పులు పూచే లిప్తల దృశ్యం
తల తీసి అయినా స్వంత లాభం పొందాలనీ
చేతి కందింది! గప్‌చుప్‌గా సంచిలో వేసుకోవాలనీ

మరచి పోవాలనుకుంది! మరపున బడదు
మరింత వేగంగా పై బడాలని చూస్తుంది

మేధలో సమాజ చింతనతో వికాస కల్పనలు
గేటు ముందు రంగుల తోరణాల హేలా రుచులు
పై కెగరబోయి ముళ్ళ తీగెకు చిక్కిన పక్షిలా
మనిషిలో ఆలోచన! అంతలో చదికిలబడ జేస్తూ

మౌఢ్యం కొండలా అండగా నిలుస్తుంది
వివేకం చేతి కందని బంతిలా ఎగురుతుంది
ఉత్సాహం ధారలా పై నుండి జారిపోతుంది
నలుపు తెలుపు రెక్కలతో రోజు! తీరం చేరుస్తుంది

కటు వయిన మాటలో మృగ తత్త్వం నిండీ
ఆదరణకు నోచుకోని మనుషులు!
ప్రియమయిన మాటలో సంస్కారం పండీ
నమస్కరింపదగిన వ్యక్తిత్వంతో మనుషులు

తెరచిన నరక ద్వారం నుండి! తనతో ఎవరెవరో
ప్రవేశం బహు సులభం! చెదరిన ప్రజాస్వామ్యంలో

# 40.

కాలం కవితయై కదలుతుంది
రాత్రి గడవదని ఎవరూ అనుకోరు
వచ్చే ఉదయం గురించి సందేహం ఉండదెవరికీ!
అన్నిటికీ మనసు సిద్ధంగా ఉంటుంది

బ్రతికే రోజులన్ని ఏలాలనుకునే వారు
ఎపుడే లోయలో పడేదీ తెలియదు
నేతలుగా రాణించాలనుకునే వారు
పీతలుగా మిగిలిపోయేదీ తెలియదు

రాజకీయ క్రీడలో నేతల గుండెలు హఠాత్తుగా
ఆటలో గోలీల్లా బంతుల్లా మారుతున్నాయి
ధైర్యం అదే! సాహసం అదే! చొరవ అదే! గమ్యం అదే
తంత్రంలో సాధన పథం, దుర్నీతిని పొందుతూంది

అల్లిన ఇనుప తీగె బోనులో నిలబడీ
జీవన చదరంగంలో గెలుపు ముఖ్యమవుతూంది
ఆయుధం ఎరగని మనిషి రణంలోకి దిగేనా?
మస్తిష్కం! నాశన కర నిలయంగా మారేనా?

ఏ దోషానికి మనిషి దూరంగా ఉండాలో
అది లాభ సాటియై దగ్గరగా చేరుతుంది

చీకటి ముక్కలుగా చీలదు
చీలికల్ని ఒకటిగా చేరుస్తుంది
వెలుగు లేని సమయంలో చీకటి
శత్రువు చేయిలా తాకుతుంది, చెదరిన ప్రజాస్వామ్యంలో

## 41.

కాలం కవితయై కదలుతుంది
సమాజ సన్నివేశంలో వచ్చే మార్పుల గుర్తులతో

నాగలితో బయలుదేరిన కర్షకుని
కను సన్నలలో పొద్దు పొడుస్తుంది! కవితను తలపిస్తుంది
చివురించే అవకాశంలో మూలంతో మ్రోడు!
చినుకుతో తలపై వెలసిన పచ్చని పాగాతో

గడప దాటి బయటికి వెళితే
తిరిగి ఇల్లు చేరుకునే లోపల
దారిలో మనుషు లెందరో వస్తూ పోతూ
బొమ్మల వలె! హృదయ రాగం మరచీ

జన సమూహ పంక్తులతో వీధి
బొమ్మల శాలను తలపిస్తూంది.
మేడపై నుండి కిందికి చూస్తే నగరమొక నిశ్శబ్ద సముద్రం
నేలపై నడుస్తూ చూస్తే ఒక కోలాహల ప్రపంచం

కాలంతో పరుగులు తీసే జీవితంలో
తనతో నడచే మనుషులతో పోటీ తప్పదు

అద్దంలో బింబించే చంద్ర బింబంలా
పొంగిన ఊహపై తేలుతుంది కవిత!

గాయపడిన స్వరంతో నిష్క్రమిస్తుంది సాయం సంధ్య
నైతిక పతనంతో చెదరిన ప్రజాస్వామ్యంలో

# 42.

కాలం కవితయై కదలుతుంది! ఒక సమయంలో
నాటకంలో విశేష ఘటన సుందరంగా

అభిప్రాయ భేదం లేని భావ జాలం లేదు
చర్చకు తావు లేని కళా కృతి లేదు
విమర్శకు గురి కాని నేటి కవిత లేదు
దాహంలో గొంతులో మంచు ముక్కలా! కవిత

చెట్టు వైపు చూస్తే
ఏ పూవో ఫలమో, దృష్టి నాకర్షిస్తుంది
పాకే పురుగూ రాలే ఆకూ
చూపు నుండి తొలగుతాయి!

పక్షి ఎగిరితే అందం
పూవు కదిలితే అందం
నిప్పు ఎగిరితే ప్రమాదం
జ్వాల నడిస్తే అపాయం

కవిత అనుభవ స్నిగ్ధ మయితే ఆనందం
కవిత ప్రేరణ చిహ్నమయితే ప్రయోజనం
వాస్తవ బింబంతో కవిత! నిలిపేస్తుంది
దర్శన తేజంతో కవిత! కదలిస్తుంది

ఎత్తులో గగనంతో మాట్లాడడం సులభం
చెట్టుతో కొండతో వాదించడం సులభం
దూరాన చుక్కలతో చర్చించడం సులభం
ఏదీ సులభం కాదు, చెదరిన ప్రజాస్వామ్యంలో

## 43.

కాలం కవితయై పరిమళిస్తుంది ఆత్మీయంగా!
వసంత సమారంభంలో జన సుందర హృదయంతో

ఆహ్లాద లిప్తల తోరణంతో ఉదయం
ఎదురవుతుంది! సమాజాని కొక ఉపాయనం!
ఆరు రుచులు కలిసిన అనుభవ రూపం
ప్రతి ఒక్కరి నాలుకపై నర్తిస్తుంది ఒక క్షణం

చివురులో  పూవులో ప్రతి ఫలించే ఈ రోజు
వ్యక్తికి కావలసిందీ ఊహకు రావలసిందీ
లోపలి మార్పుకు ప్రవేశ ద్వార మవుతూంది

పూలతో పండ్లతో పరిమళ ప్రసారంలో
చెట్లు! ఒకదానితో మరొకటి పోటీపడుతున్నాయి
శోభారూపాలతో! మనుషులు! రసమయ లోకంలో

ఎవరూ కోరని నిన్నటి మంటల సెగలు అణగి
అమృత రూపం! అవతరించవలసి ఉంది, నేడు

హృది హృదిలో అమృత బిందు స్పర్శతో
సమాజ మొక పూర్ణ బింబం కావలసి ఉంది
అంతరంగ సుందరతతో మానుష వ్యక్తిత్వం
మానవతా మధువుతో సామాజిక వర్తనం

పూచే కోరికపై ఆశారూపం సహజం!
సృజన శక్తితో సాధ్యం చెదరిన ప్రజాస్వామ్యంలో

## 44.

కాలం కవితయై వెలుగుతుంది
రెప్పలు వాలే సమయంలో నా గదిలో

రాత్రి విప్పారిన చీకటి నిలయంలో
నా గది గోడపై! వెలుగు బొమ్మ! దిగుతుంది

వీధి దీపం వెలుగు కాదు! టార్చ్‌లైట్ ఫోకస్ కాదు
దృష్టిని ఆకర్షిస్తుంది! నిదుర పోస్ట్‌పోన్ అవుతుంది

మా ఇంటి కెదురుగా మేడపై గది
కిటికి నుండి ఒక కోణంలో సూటిగా
గది గోడపై వెలుగు బొమ్మ మానవతా బింబం

చేసిన తప్పుకు శిక్షగా ఉరి పడిన
మనిషిలో చూడదగిన మంచికి గుర్తుగా
అన్వేషణలో దొరకాలిసిన నిజం జాడలా
వేదికపై తెర తొలగి పాత్ర ముఖంలా

మరణించే వ్యక్తిలో ఇంకా జీవించే కోరికలా
పోయిన విలువల స్థానంలో రావసిన విలువలా
పగలంతా తిరిగినా దొరకని నిజం చిరునామాలా
వెలుగు బొమ్మ! నాతో మాట్లాడుతుంది! ఎన్ని విధాలుగానో

ఇంతలో కిటికి మూతపడుతుంది, రెప్పలు వాలతాయి
నిజానికి ప్రవేశ ద్వార మింత సులభంగా ఉంటుందని తెలియదు

అహంకార  దర్పణంలో నాలో రూపం
ఆరోహణంలో శిఖరంపై అందే బింబం!
“నేను”లో ప్రకాశం ఈ ప్రియ రూపం
ఎక్కడక్కడో తిప్పుతుంది చెదరిన ప్రజాస్వామ్యంలో

## 45.

కాలం కవితయై కదలుతుంది
చరిత్రలో కనిపించని చిరునామాల్ని శబ్దిస్తుంది
తోటలో పూవులా ఒక్కొక జ్ఞాపకం మనసులో
అందం విరిసి పరిమళం వదలి పోతుంది

చెట్టు ఒంటరిగా ఎదుగుతుంది బ్రతుకుతుంది
నది ఒంటరిగా కదలుతుంది సరిస్తుంది
గిరి ఒంటరిగా తల ఎత్తి నిలుస్తుంది
ఒంటరిగా వచ్చిన మనిషికి సంఘంతోనే అస్తిత!

ఊహల లహరులు లేంది
జీవన సముద్ర మెక్కడిది?
అనుభవ వాస్తవం లేంది?
వ్యక్తికి వికాస మెక్కడిది?

శత్రు లెవరో? మిత్ర మెవరో? తెలియని స్థితిలో
గడి నుండి గడికి గంతు లేసే రాజకీయం
వికార దృశ్యాలను వదలుతుంది
అస్థిరతకు దారి చూపుతుంది

మనిషి ఊహ వెలుగును కోల్పోయినపుడు
చీకటిలో కలిసి ఏమయినా అవుతుంది
మొన తేలిన శిల అయి బాధించవచ్చు
పదు నెక్కిన అసి అయి ఖండించ వచ్చు

గాలి రాని వెలుగు లేని మూసిన గోడలతో నిలయం
ఉక్కిరి బిక్కిరి చేస్తూ! చెదరిన ప్రజాస్వామ్యంలో

## 46.

కాలం కవితయై తలపులో మెరపులతో
చేతిలో కాగితం! పృథ్విలా పరచుకుంటుంది
ఆలోచన ఎగసి విప్పారుతుంది! జలదంలా
మానవతా సేచనతో అనుభవ గతిలో వర్తమానం!

గతం గురించి మాటల కవకాశ మెంతో!
వర్తమాన మంతా చేతలతో నిండీ
ఆలోచనకు హద్దు లేదు స్వేచ్ఛలో
కవితలో ఒదుగుతుంది బింబమై

మెదడు లేని మనిషి లేడు
గమ్య మెరగని బ్రతుకు లేదు
వెలుగులో కంటి చూపుకు సార్థకం
మానవతతో మనిషి కథకు అస్తిత్వం

ఏ గాయం నుండి మల్లె పూలు జారవు
సాయం సంధ్య పూచే అగ్ని పూలు రాలవచ్చు
మనిషి రణ క్షేత్రంలో ఎప్పటికీ సక్రియగా
మనసు శాంత హృదయంకై అన్వేషణలో సదా

కొలతల కందని కాల ఖండం
ఇముడుతుంది కవితలో అందంగా

అర చేయి గీతల్లో నుదుట రేఖల్లో
అంకెలలో గ్రహగతులలో చూచే లెక్కలతో
కనిపించని భవిష్యత్తును తెలుసుకునే ఆరాటం!
జోస్యానికి బహు గిరాకి! చెదరిన ప్రజాస్వామ్యంలో

# 47.

కాలం కవితయై కదలుతుంది
ప్రతి ఉదయం కొత్త అర్థంలో బ్రతుకులు!
ఎక్కడి నుండి ఎక్కడికో పలు రంగుల చర్యలతో,
ఏదో ఒక లౌకిక ముద్ర లేని వ్యక్తిత్వం లేదు

తన రాక గురించి అనుమానానికీ ప్రశ్నకూ
ఏనాడూ ఎవరికీ అవకాశం ఇవ్వడు, దినకరుడు!

తెల్లవారినా రెప్పలు తెరవని నిలయాల ముందు
నిలిచి పోతుంది! సంతోషంగా దూకిన కిరణం
మోడును స్పృశిస్తూ చల్ల గాలి ఆగి ఆగి కదలుతుంది
సమాజ చలనంలో పోస్ట్ పోన్‌ను ఎవరూ కోరరు

రేపు జరిగే దానిపై ఆశతో అంతా నడుస్తుంది
కొత్తదనం కోసం ఆరాటంలో అలసిన మనిషిని
రాత్రి చేతులు చాచి ఎదకు హత్తు కుంటుంది
క్రియా శక్తి మొలకెత్తితేనే పూవో ఫలమో సాధ్యం!

ఎక్కడో బయలుదేరిన నది, సుదీర్ఘ యానంలో
కష్టాల్లో నష్టాల్లో కదలుతూ గమ్యం చేరుతుంది
ఆ తీరాన నీడ దొరికిన చోటే! మనిషి ఆవాసం ఆత్మీయం!

ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇప్పటికీ వీథిలో
ఆకలి పిలుపు! గాలిలో పయనిస్తూనే ఉంది
కోపమో నిరాశో! మాటలో రంగు! ఎరుపో నలుపో!
మాటల రంగులు తెలిసేది! ఇలాంటి సందర్భాలలోనే!

పసివాడు కాదు! అతడు ఏడుస్తూ పడి ఉండడానికీ
ఏ తల్లో వచ్చి, “ఆకలి తీరుస్తుంద”ని అనుకోడానికీ!
పొద్దెక్కే కొద్దీ! కఠోర దృశ్యాలు! చెదరిన ప్రజాస్వామ్యంలో

# 48.

కాలం కవితయై కదలుతుంది
ఒక సమాజ దర్శనం ఒక జన హిత లక్ష్యం
కవులను కదలిస్తుంది, సృజన ఆవహిస్తుంది
వెలుగుతో చీకటి అక్షర పంక్తిగా మారుతుంది

గెలిచిన వారయినా ఓడిన వారయినా
ఏ పాత్ర పట్ల మిత్రతకూ శత్రుతకూ తావులేదు
సృజన దృష్టిలో వెలుగుకు ఏ భేదం ఉండదు
మనిషిలో మరో మనిషిని బయటికి తెస్తుంది

నీడలు వెనక్కి జరుగుతాయి
వెలుతురు ముందుకు వస్తుంది

వ్యక్తి సమాజం పట్టాలపై కదలే స్వేచ్ఛా రూపం
ఆ రోజు సీమలు చూపిస్తుంది,
శబ్దంలో కొత్త ప్రపంచం అర్థవంతమై
ఇంతకు ముందు చూడని కోణంలో నిలుపుతుంది

నిన్న నెత్తురుతో తడిసిందీ
నేడు కన్నీరులో మునిగిందీ
రేపు కొత్త చరిత్ర పుటలలో వెలుగుతుంది
మొన్న అణగి ఉన్న మనిషి నేడు శిఖరమై నిలిచీ

ప్రతిరోజు క్రితం రోజు వాగ్దానం మిగిలే ఉంటుంది
లేంది! జీవన క్రమం లేదు, సమాజ పరిణామం లేదు

సమాజ యానంలో చరిత్ర భవిష్య రూపం!
మానవ శక్తికే సాధ్యం చెదరిన ప్రజాస్వామ్యంలో

స్వేచ్ఛా కవిత్వం - 60

# గాయ పడిన ప్రజా స్వామ్యం

(దీర్ఘ కవిత)

మాదిరాజు రంగారావు

2014

రసధుని - సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Free Verse - 60

# GAAYA PADINA PRAJAA SWAMYAM

(Telugu Poetry)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. Maadiraju Santhosh Kumar

Y.P. : 2014

# అంకితం

తెలంగాణ

ఉద్యమంలో వివిధ దశల్లో

ప్రాణాలర్పించిన అమరవీరులకు

# దీన్ని గురించి

ఈ కృతి "గాయ పడిన ప్రజాస్వామ్యం" దీర్ఘ కవిత వర్తమాన కాలంలో చారిత్రకమైన పాత్రను నిర్వహించిన ఉద్యమం – ప్రయత్నం – విజయం వస్తువుగా కలిగింది. రాజకీయ నేపథ్యంలో అదీ చాలా సంశ్లిష్టమైన, సంక్లిష్టమైన భావనా వ్యవహారాలతో సులభం కానిది. చివరకు అనూహ్యామైన రాజకీయ పరిణామాలకూ దారితీసింది. చివరలో చూపే రాజకీయ ప్రభావం ఎవరికి అందనిదీ, తెలియనిదీ, ఊహ కందనిదీ.

ఈ రచన విశాల ప్రాతిపదికపై మానవ మూల మనో రూపం ఆధారంగా నిర్మితమైంది. సమాజంలో (1) వేర్పాటు ధోరణి ఆలోచన (2) సాధించే ప్రయత్నం (3) నిరసన – ప్రతిఘటన (4) ఉద్యమ సన్నాహం (5) నిశ్చయ పథం (6) నిర్ణయ రూపంతో కూడింది. వివిధ దశల్ని పొందింది. అవరోధాల్ని దాటింది. స్థూలంగా సామాజిక, రాజకీయ, ప్రాంతీయ, సాంస్కృతిక, వ్యక్తిత్వ మనస్తత్వ కోణాల్లో సహేతుకమైన భావనా సూత్రం ఈ కవితల్లో దృష్టికి వస్తుంది. ప్రజల్లో తీవ్రమైన విభేదాలతో విభజన మనోరూపం స్పష్టంగా కనిపిస్తుంది. అనివార్యమైన పరిస్థితు లేర్పడతాయి. ఇది ఒక తెలంగాణాకే కాదు, ఇలాంటివాటి కన్నిటికీ వర్తిస్తుంది. ఇది చారిత్రక వాస్తవం. సామాజికమైన అవసర క్రియా చరణం. ఇది పాజిటివ్ గుణంతో సుస్థితికి అవకాశ రూపం. ఈ దీర్ఘకవిత "చెదరిన ప్రజాస్వామ్యం" తరువాత "గాయపడిన ప్రజాస్వామ్యం" నిర్వహణలో భావ రూపాలు, ప్రతీకలు అర్థాంతర స్ఫూర్తి విశేషాలతో ఆవిష్కారాన్ని పొందింది.

2–7–2014 **– మాదిరాజు రంగారావు**

# గాయ పడిన ప్రజా స్వామ్యం

## దీర్ఘ కవిత

### 1.

నిటారుగా తల ఎత్తిన స్వాభిమాన శిఖరం
"నేను" నుండి దారులనేకం సమాజ వలయంలో
మహా జన చేతనలో ఒక భాగం "నేను"
మనమై మానవమై వాస్తవమై నడిపిస్తుంది.

ఇది ఒక అనల శిఖ కావచ్చు
ఇది ఒక నీలి మబ్బు అవచ్చు
ఇది ఒక చీకటి చెట్టు కావచ్చు
ఇది ఒక కాంతి ఖడ్గం అవచ్చు

జీవన బంధంతో కదలే క్షణాలు
పూవుల్లా పూచి అదృశ్య మవుతాయి
పరిణత గంధంతో త్యాగానికి సిద్ధమై
రాగం నుండి విరాగానికి సుగమం చేస్తాయి.

రాత్రి బొగ్గు గనిలో పని చేసే
మహా శ్రామిక రూపం సూర్యుడు
పగలు వెలుగులు పంచుతూ కదలుతాడు
సాయం బూది కమ్మిన కొలిమియై నిష్క్రమణం

చెరువు కట్టపై నిలిచి చూడడ మొక ఉల్లాసం
మహా నదీ తీరాన నడవడ మొక ఉత్తేజం
ఉల్లాసం ఉత్తేజం తప్పనివీ జీవన చలనంలో
మితం నుండి విశాలావకాశంలోకి పయనం

"నేను" నుండి సమాజం లోకి నిరంతర ప్రక్రియ
సమాజం నుండి "నేను" లోకి అపుడపుడు విశేషంగా
ఉద్యమ సంరంభం తదుపరి నైతిక పాత్ర కీలకం
గాయాల నుండి బయట పడిన ప్రజాస్వామ్యంలో

## 2.

వ్యక్తిలో కల పక్షియై బయట పడుతుంది
దీని వెనకనే మనిషి జీవికకై పరుగిడుతూ
మెతుకులు చల్లుతూనో వలలు పన్నుతూనో
ఆశా పంజరంలో చిక్కిన తన మనోరూపంతో

ఒడిసెల నుండి దూకిన రాయి
ధనుస్సు నుండి దూసిన బాణం
మరొకటి మరొకటి ఘాతుక సాధనం !

గురికి పక్షి హతం కావచ్చు
గురిని తప్పు కొనీ పోవచ్చు
పోయిన ప్రాణం మళ్ళీ వచ్చేనా?
గడచిన కాలం వెనక్కి మరలేనా?

విరామ సమయంలో కలకు ఒక అవకాశం
భవితను దర్శిస్తూ మనసు సంచరిస్తుంది.

కల ఎగురుతుంది గూడు నుండి పక్షిలా
స్మృతి జారుతుంది రెక్క నుండి ఈకలా
మనిషిలో పక్షితో అనుబంధం ఎప్పటిదో?
ఇతిహాసానికి ప్రధాన భూమికగా నిలిచింది.

దాచిన ధనంలా భూమిలో విత్తులా
బొగ్గులో నిప్పులా శిల కింద నీరులా
దప్పికలో జలధి నుండి అలల్లా
సామాన్యుని కికురిస్తూ రాజ్యాంగంలో హక్కులు

మేల్కొన్న కళ్ళలో సూర్యుడో ! చంద్రుడో !
ఇరువురి కళ్ళు కప్పి నీడల రూపాలు
పెడ దారులలో సాగే చీకటి నటనలు !
మారిన చిరునామాతో, గాయపడిన ప్రజాస్వామ్యం

## 3.

ఎన్ని బాధల అంచుల నుండో కదలి తరలి
అర్థ శతాబ్ది పైన పోరాటం! దశలు దశలుగా
కష్టాల కడలి నుండి ఇపుడు తీరం చేరింది
ఇక స్వేచ్ఛా పథ యానంలో నవ తెలంగాణ !

బలి దానంలో సాహస కార్యంతో
ఆహుతిలో అజేయమైన త్యాగంతో
గతంలో చిందిన కన్నీటి గుర్తుల నుండి
రేఖలతో ఈ రోజు ! కొత్త ఉషసు చిత్రం

అవనిపై జీరాడే పచ్చని పైరు శాలువా తో
చరిత్రలో తీసుకున్న కొత్త మలుపు మార్పుతో
గుప్పిట్లో నుండి బయట పడింది! శాంతి పావురం
అణచివేత నుండి కదలింది, అపూర్వ కాల చక్రం

దశాబ్దాలుగా ఫాల తలంపై కనిపించని కాంతి
వర్తమాన ముఖంలో వెలుగు పూల అందంతో!

ఇది ఎవరికీ వీడ్కోలు మాట కాదు
ఇది ఒక ఆశ్వాస రశ్మితో
ఇది ఒక సంతోష స్వరంతో
పరివర్తన లో ఒక స్వాగత చరణం

ప్రతి పోరుని ఊపిరితో అల్లుకొని
ఈ సమయం తీగెయై ఆశల్ని సుమిస్తూంది
పొరలు పొరలుగా అణగారిన జీవితం ఈ రోజు
చీకటి తెరలను చీల్చుకొని బయటికి వెడలింది.

ఒక వైపు నుండి స్థిర సంకల్పంతో ఉద్యమం నడచి
ఒకవైపు నుండి నిజ యత్నంతో రాష్ట్రం ఏర్పడింది
ఈ రమణీయ సన్నివేశం ! పునర్జీవన సంకేతం
గాయాల నుండి తేరుకునే ప్రజాస్వామ్యంలో

## 4.

బతుకులకు ప్రాణ దాత బతుకమ్మ దేవత
ఇది ఈ ప్రాంతం ఆనవాలు! పరిపోషణ రూపం
ఈ సుందర వాస్తవాన్ని గుర్తించని వారెవరు?
అంతా 'ఔ' నని ఆత్మ శక్తి పెంచుకునే వారే !

గుమ్మడి చేమంతి బంతి మల్లె మందారం తంగెడు
ఒక్కొక్కటి ఒక్కొక సమయంలో ప్రేరణ రూపం
అన్ని పూలు కలిసిన జీవన రూపం ! ప్రేమ మయం
సమ భావనతో అమరిన చిర భాగ్యానికి చిహ్నం

బోనాలు మనిషిలో రహస్య శక్తి ప్రకటనం
ఇది బతుకులో వికాస రక్తి కళా విలసనం
నల్లని మృత్యువు రేఖలు చెరగి పోయి
బంగరు రేఖల విజయ ద్వారం వెలసింది.

రవి కిరణం ఏదీ దాచదు, అన్నిటికీ మిత్రం
కవి హృదయం ఏదీ వదలదు, అన్నిటికీ ఆప్తం
తప్త హృదికి రస కళ నందిస్తుంది
మనిషికి సంస్కృతి బహుమతి నిస్తుంది.

వలస పాలన అనుకున్నా, ఆధిపత్యమనుకున్నా
జటిల నీతి తంత్రమైనా, పెట్టుబడుల వ్యూహమైనా
అన్నీ ఈ లిప్త నుండి చీకటి గదిలో మూలన
విసరేసిన పాత బడిన వస్తువులతో సమానం.

వాడిపోని తేజంతో – ఇది స్వేచ్ఛారుణ ఉదయం
చరిత్ర పుటలో చేరిన ! స్వర్ణ యుగారంభం
వేదన పర్వం ముగిసింది, వికాస పర్వం మొదలైంది
తలుపులు తెరవబడీ, గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 5.

"నేను" బిందువు కేంద్రంగా వృత్త నిలయాల్లో
ఒకరితో మరొకరి ప్రవేశం! సమాజంలో
ఉద్యమాన్ని అందుకున్న వ్యక్తులతో సమూహాలు
శ్రేణులుగా ఉత్సాహంతో పాత్రల్ని నిర్వహిస్తూ

"నేను" తో తన కాళ్ళపై నిలబడే బలంతో
ముందుకు సాగడ మొక అపూర్వమైన అనుభవం
సుస్థిర లక్ష్యంతో సక్రియ అయిన జీవితం
అంకిత భావంతో త్యాగ మయం అవుతూంది

ప్రశ్న పదును చాకులా వెడలుతుంది
మౌనం ఘన శబ్దంతో మ్రోగుతుంది
అక్షరమూ అక్షరమూ కలిసి, అనల కణ పంక్తియై
మాటలో కవిత ! విలయాకృతి పొందుతూంది

మెలకువలో వర్తమానం ఉత్సాహం ఒలుకుతూంది
చీకటి గుహలో గతం, శిల్పంలా నిదురపోతూంది
కర్తవ్యంలో మనిషి ! ఆయుధ శక్తిని తలచకుండా
సాధించిన విజయానికి ఆకాశం తలవంచుతూంది

ఎవరి పాత్ర వారిది! చివరకు అధినేతకే కిరీటం !
గులాబి కందువాను రవి తేజం వరిస్తూంది

ఇది నీడల పందిరి కాదు
ఇది మాటల నిచ్చెన కాదు
ఎత్తుకు పై ఎత్తులతో రాజనీతి వ్యవహారం

చేసిన వాగ్దానం, జలదంలా వెనకనే రావలసి ఉంది
సంకల్ప విజయం నుండి
నవ నిర్మాణంలోకి పయనం !
గాయాల నుండి తేరుకునే ప్రజాస్వామ్యంలో

# 6.

ఇంతవరకు సాగిన ఉద్యమ నిపుణత
పాలనలోకి పరివర్తన పొందాలిసి ఉంది.
ఇంత వరకు చెలరేగిన స్వరాష్ట్ర కాంక్ష
సహనంతో విశ్వమయం కావలసి ఉంది.

మోసం ద్వేషం కుటిలత అధికత పాత పాటలు
ప్రగతిలో సైడ్ బోర్డుల వలె జ్ఞాపకాలవుతాయి
విషమ గతులలో రాష్ట్రం ! నూతన సరిహద్దులతో
ప్రతి పౌరుని భుజాలపై ఆకాశమంత బరువుతో

మనుషులలో స్వార్థం వైరం ద్వేషం శత్రుతలకు
సెలవుతో, నైతిక జీవన సంస్కృతి ముఖ్యం !

విశ్వ భావనామతితో ఆకాశం కప్పు క్రింద
బ్రతుకులు సాగవు ! మరో కప్పు అవసరం !
నాలుగు గోడలతో ఒక నిలయం తప్పదు

అధికతా భావం ఇంకా కంటకమై నిలచీ
న్యూనతా భావం ఇంకా లోయలుగా ఒదిగీ
ఎప్పటి కథయే ! పునరుక్తం కాకూడదు
స్పందనతో పాటుగ ఆలోచన అవసరం

భాష ఒకటే అయినా గమ్యం ఒకటే అయినా
చర్యలతో పాత్రల రూపం మారుతుంది
మానసికంగా ఏర్పడిన అఖాతాలు
దాటరానివై ఎప్పటికీ నిలుస్తాయి !

పెరిగిన కొద్దీ శాఖలు దూర దూరమవుతాయి
స్వేచ్ఛకు అవకాశంతో అస్తిత వేరవుతుంది
రెండు ముక్కలయింది మూడు ముక్కలు కావచ్చు
మరో దారి లేని ! గాయపడిన ప్రజాస్వామ్యంలో

# 7.

బయటికి భాష ఒకటే అయినా
లోన మనో మూలం దెబ్బతిని
సౌదర్యం వికటిస్తుంది, జ్ఞాపకాలు మిగులుతాయి.

మహా నదికి దేశాల సరిహద్దులతో పని లేదు
మహా మనస్వికి సమూహాల భేదాలతో పనిలేదు

లౌకిక లాభాల్లో రాజకీయ తంత్రాల్లో
ఎక్కడ బడితే అక్కడ విభేదాలతో హద్దులు !
కంటికి కనిపించని గోడలు ! నిలువునా
మనసుకు మాత్రం తోచే చేష్టలు ! ఎదురుగా

సెలయేరుకు మహా నదియై ప్రవహించాలనీ
దీప శిఖకు సూర్య కళయై వెలగాలనీ
కోరికతో సరికొత్త ఆలోచన మొదలవుతుంది
సెలయేరు ఎండిపోవచ్చు ! దీప శిఖ ఆరి పోవచ్చు

స్వేచ్ఛ కోరే కారణంగా అభిమాన గుణంతో
ఎదుర్కొనే కష్టాలొకటే ! విడిపోయే దెవరైనా
చెమట చుక్కలో తేలే అనల కణం ఒకటే
గుండె కోతలో వీచే ఆర్త రవం ఒకటే

ఏ హక్కునూ ఏ మిషపైనా ఎవరూ నిరాకరించలేరు
దాని అమలులో ప్రయోజనం లభించడమే సమస్య
సమస్య పరిష్కారంలో ఎప్పటికీ ఏదో ఒక అవరోధం!
చివరకు ! ఎవరి తీరు వారిది! ఎవరి భవిత వారిది !

పలు విధాల బ్రతుకుల సంకలనం సమాజం
మితం నుండి విస్తృతికి ! ఆదర్శం పరచబడీ ! నిరంతరం
నిన్న పిలిస్తే వినబడని ఉద్యమ కోలాహలం
నేడు కనిపిస్తే హత్తుకునే ఉత్సవ సంరంభం
వర్తమాన చలనంలో ! గాయపడిన ప్రజాస్వామ్యంలో

# 8.

ఇది శిశువు జననం వంటిది కాదు
పరివర్తన క్రమంలో కొత్త దశ ఆరంభం

చరిత్రలో కొత్త యుగం ! వెలుగు తోరణంతో
పరిమిత మతి నుండి విశాల విశ్వ హృదయంతో
చీకటి నుండి ముక్తమై ఉషస్సు లోకి ప్రవేశం
ఆశయాల మైలు రాళ్ళు దాటాలిసిన నవ యానం !

ప్రజల గుండెపై కొండంత బరువు ! అర్ధరాత్రి
పక్కకు తొలగినట్లుంది! తేలికగా శాంతంగా

కత్తెర అంచుల చక్రం నుండి క్షేమంగా
విజయ కేతనంతో ! బయట పడిన ఉద్యమ సమయం
ప్రతి పౌరుని హృదయ మొక జలద నిలయ మవుతూంది
ప్రతి పౌరుని ఊహ ఒక ఉదయ కిరణ మవుతూంది

ఇపుడే నినాదాలతో బ్యానర్‌లతో పనిలేదు
గౌరవంగా సాగే వికాస బాధ్యత ఒకటే !

ఎత్తిన తలతో మెరసే ఫాలంపై శుభ్రంగా
వర్తమాన విజయ చిత్రం ! మానుష ఆశా రూపం
నేల పైకి దిగే సంతోషపు చినుకుల ముందు
నింగిలోని ఇంద్ర ధనుసు అలంకారంతో పనిలేదు

దిన మణి రథానికి అశ్వాల్లా క్షణాలు
విముక్త జీవన భాగ్యంతో ! ఈ ఉదయం
మధు మందారంలా విప్పారిన అభిమానంతో
భవిష్యత్తు నందుకుంటూంది! వర్తమాన హస్తం
మాటతో పాటతో సౌందర్యం సౌజన్యం నిండి
ప్రతి ఒకరూ ! గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 9.

తీరం చేరుకున్న మనిషి ముందు నావలా సిద్ధంగా
ఈ ఉదయం ! నవయుగ సుందర యానంకయి
యాన పాత్ర నాశ్రయించి! ప్రజలు ఒకరొకరూ
ఆశల వెలుగులతో స్వేచ్ఛా సమాజ చిహ్నాలు

సరిగ్గా అర్ధరాత్రి అవతరించిన సంకల్ప బింబం
ఈ ఉదయం ! నావయై పయనానికి ప్రేరేపిస్తోంది
ఈ సమాజ జలధి యానమంత సులభం కాదు
జలాలపై ఆకాశం దిగినట్లుంది! స్వాగతిస్తూ

ఉద్యమంలో మండిన లిప్తల త్యాగ పరిమళం
గాలిలో కదలుతూంది స్మృతి గుర్తులుగా
దేశ పటం పయి కొత్త రాష్ట్రం అవతరణం
ఎంత కాలం నుండో వేచి చూచే ! శుభ పరిణామం

అణచివేత నుండి తరాల ఆక్రందనం !
అమృతం ఆశించలేదు, పిడుగులు ఊహించలేదు
బ్రతుకులో పచ్చదనం ఆశించింది
జనహిత రస సేచనం కోరింది!

చెరువులో చేపల్లా ! జీవితంలో అవకాశాలు
సమాజం ఒడ్డున ! వలతో సిద్ధంగా ఆశా జీవి

ప్రభుత్వాలు మారినా, దార్శనికాలు మారినా
దొరకని మానవీయం అన్వేషణలో కవి హృదయం

ఉద్యమంలో విరామ దశలను కలుపుతుంది కవిత
మంచులా మందమయిన కాలానికి వేగం తెస్తుంది
గుండెలో పోరాట పటిమకు సంప్రేరణం ఇస్తుంది
కొత్తదారి చూపుతుంది! గాయపడిన ప్రజాస్వామ్యంలో

# 10.

పైకి చూస్తే రాత్రి ఆకాశంలో చుక్కలు
అన్నీ ఒకే విధంగా ఏ భేదం లేకుండా
కింద భూమిపై పరిచయాలతో మనుషులు
ఎన్నో భేదాలతో విభేదాలతో ఒక్కొక విధంగా

వైరుధ్యం అధికారం పీడన వైరం వ్యతిరేకం
ఒకదశ దాటితే ! తీవ్రమై చరిత్రను మారుస్తుంది

జాతి మతం ప్రాంత భేద భావం లేని
ఆలోచనా ప్రపంచంతో ! ఒక స్థాయి మనో రూపం
విరుద్ధ గతుల్లోని వాస్తవాలకు భిన్నమై!
సంక్లిష్ట సమాజ హృదయాన్ని గ్రహించలేదు!

అపుడపుడు పేలిన అగ్ని శిఖర స్థితులు
ఇపుడిపుడు స్మృతిలో హిమ శిలలవుతున్నాయి
పూర్వం తగిలిన గాయాలపై
అద్దిన పూవుల్లా ! కొత్త అనుభవం.

ఆత్మాహుతి జ్వాలలో పరుగెత్తిన క్షణాలు
ఆత్మ తృప్తి ఫలాలతో ఎదురవుతున్నాయి
దారిలో చిన్న బాకులా మొన తేలిన గడ్డిపోచలు
అడుగుల క్రింద పట్టు దారాలుగ మారుతున్నాయి

వ్యక్తి తెలివి తాపానికి వాడిపోయి మాడిపోయి నైతికం
వ్యూహానికి ప్రతి వ్యూహంతో రాజకీయం నడుస్తుంది
ఇపుడు కావలసింది! ఉదార సంస్కృతితో మానవీయం

అర్ధరాత్రి ప్రజల కళ్ళలో ప్రతిఫలించే ఉదయం
రంగుల మెరుపులతో ఆగామి దశను సూచిస్తూంది
శాంతానికి మారుతూంది! గాయపడిన ప్రజాస్వామ్యంలో

# 11.

ఎవరి చేతిలోనో వెనక నుండి సూత్రంతో
వేదిక పయి ఆడే బొమ్మల్లా! నాయకులు
ముక్కలయిన ఆదర్శంలో కొత్త రూపం కోరీ !
తరాజులో ఎపుడే వైపు దూకేదీ తెలియదు

వివేక బింబ మెపుడో మంట కలసి పోయింది
అపుడపుడూ దానికై అన్వేషణం ! సాగించేరు,
లాభం కయి! ఏ దేవతనో ఆశ్రయించేరు
రాజకీయ శిఖరాలకు దూకాలని ఆరాటం !

బంతిలా పరుగెత్తే కాలం ! ఎదురుగా
చేతి కందినట్టయి జారుతుంది, నిలవదు
మనిషిని ఆటతో అలరిస్తుంది!
ఉద్యమం ఆట కాదు, మానవ శక్తికి ఛాలెంజ్ !
మనిషిలో మరో మనిషి ! మానవ శిఖరాల్ని చేరాలనీ
మనిషిలో మరో మనిషి ! మానవ తేజాన్ని నింపాలనీ

కెరటాల్లా దూకే ఉత్సాహ శక్తి రూపాల్ని
జ్ఞాపకం చేసే విజయ చిహ్నాలు ! దారిలో
కొత్తవైన క్షణాలకు స్వాగతం పలుకుతూ
పాతబడే చరిత్రకు వీడ్కోలు చెబుతూ

అటు చూస్తే ఉద్యమ చరిత్రను వినిపిస్తాయి
ప్రతి కథలో ఒక మానవ స్వరం వినిపిస్తుంది
అభిమానం చుట్టూ ఎన్ని కష్టాలో నష్టాలో
కాలం మెడలో వేలాడే అనల శిఖల మాలగా

చెట్టు కింద నీడ! ఆర్తి హరణ నిలయం అవుతూంది
గోడ పైన నీడ ! తనలో దోషిని నిలబెడుతూంది
ఇపుడు హలం కలం ఇరు చేతులతో సమాజం
గాయాల నుండి తేరుకునే ప్రజాస్వామ్యంలో

# 12.

నీటి చుక్క చిన్నదే ! కొన్ని చుక్కలు కలిసి
ప్రాణి దాహం, నేల తాపం తీర్చే, పాత్ర గొప్పది
నీటి చుక్క అల్పమే! కొన్ని చుక్కలు ఏకమై
తటాకమై నిలిచి ప్రవాహమై సాగుతూ!

నీటి చుక్కల్లా కలిసి మెలసి వ్యక్తులు
తుఫానులా విరుచుక పడుతూ
వరదల్లా పరుగులు తీస్తూ
ఉద్యమ వేగ రూపం పొందడం, విశేషం

ఊయెలపై ఊపింది సంక్షోభం
అంచుల్ని చూపింది ఆటవికం
అనల రాగమై స్వనించింది గాలిలో
ఇపుడు జలద చలనంతో రావలసి ఉంది

చేవ ఉన్న చెట్టు కెవరి సిపారసుతో పనిలేదు
చినుకుతో చివురిస్తుంది సుమిస్తుంది ఫలిస్తుంది
ఇవి ఎవరి కోసమో? చెట్టుకు తెలియదు
ఆ తెలిసిన మనిషి ! చెట్టు ముందు చేయి చాచేను

తిరిగే గడియారం ముళ్ళ సందు నుండి
కాలం కదలుతుంది ఒడుపుగా తప్పుకొనీ
సూర్యచంద్రుల ప్రసక్తిలేని మనసులో
అక్షర బింబం వెలుగులో కవి పయనం

నీటి చుక్కల్ని మోసుకొని పోయే జలదం లానో
నీటి చుక్కలతో పచ్చదనం తెచ్చే ప్రవాహం లానో
చల్లని పరివర్తన దశలో శాంత సమాజం!
ఈ సమయం, గాయం నుండి ప్రజాస్వామ్యంలో

## 13.

పిల్లల వలె తరలి వచ్చి జలధిలో కెరటాలు
కాళ్ళకు చుట్టుకొని సంతోషింపజేసినా
దాహం తీర్చలేవు ! మరో ప్రయత్న మవసరం
ఎంతమంది ఉన్నా చుట్టూ! ఉద్యమానికి యోధులతోనే పని

మనిషిలో ఒక అడవి! ఎప్పటికీ
గొడ్డలి గాటును చెట్టు ఓరుస్తుంది
వాన చినుకుల్ని పూవు సహిస్తుంది
పూవు స్థానం స్థిరం కాదు, చెట్టు స్థలం మారదు
చెట్టులా సమాజం; పూవుల్లా మనుషులు

అడవి దగ్ధ మవుతూ ఉంటే
అది తమ ఆవాసం కాదని ఉపేక్షించరెవరూ!
మంటల్ని ఆర్పే సాహసంతో ముందుకు వస్తారు
చెట్టుకు పూవు ఫలం! పరివర్తన దశలతోనే సాధ్యం

వర్తమాన సమాజంలో కవిత పాత్ర
"నేను" లో పొరలతో హత్తుకొనీ
సంక్లిష్టంతో పాటు సంశ్లిష్టంగానూ
ఉద్యమంలో ప్రవేశానికి వీలును కల్పిస్తుంది.

గ్రీష్మంలో కరువైన చల్లని గాలిలా తాకుతూ
శిశిరంలో దొరకని వెచ్చని వెలుగులా సోకుతూ
అణువణువు సజీవ స్పందనతో ఉద్యమం
విజయ ఫలం ! అమర వీరుల కర్పణం సహజం!

స్వేచ్ఛకు చిహ్నమై నిలిచిన యశోరూపం !
మృత్యువును జయించింది! గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 14.

సమస్యకు పరిష్కారం దూరమయ్యే కొద్దీ
ఉద్యమం బలపడుతూ ఉంటుంది సమాజంలో
విజయ శిఖరాలను చేరేవి కొన్ని!
ఓటమి లోయలోకి జారేవి కొన్ని

ప్రతి తరం గళం నుండి కొత్త స్వరం
కొత్త దారి కొత్త నడక కొత్త ఆశయంతో
అవకాశాల తలుపులు తెరవాలని డిమాండ్!

మూలం ఒకటయినా సమాజ నిర్మాణంలో
కోణాలు మారతాయి, ప్రయోజనాలు వేరవుతాయి

ప్రతి రోజు తనలో వెలుగు రూపం
కొత్త అడుగు జాడ వదలిపోతుంది
స్వంతానికి కొన్ని సమాజానికి కొన్ని
వ్యక్తి బ్రతుకు బాటకు చెరొక వైపు చెరతాయి.

ఎగసే కెరటాల్లా నినాద పంక్తులు
సమస్యను దృష్టికి తెచ్చే తొలి సాహస యత్నం

ఇంత వరకు జరిగింది దప్పికలో గొంతుకు
నీటి చుక్క అందే బదులు ! గొంతును మూయడమే

కవి ఎప్పటికీ ఒంటరి వ్యక్తి కాడు
చుట్టూ ఎందరో ! తనలో ఎందరో
ప్రేరణతో స్పందనలో నిజం బయటపెడుతూ

ఆయుధ ప్రసక్తి లేని ఉద్యమ చైతన్యం
మానవీయ సంస్కృతిపై విశ్వాసం పెంచుతూంది
మనిషిలో బయట పడని వెలుగును చూపిస్తూంది
సమాజ బంధంతో గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 15.

ఉద్యమ చేతనలో మృత్యువు సుందరతకు వశమై
జీవితాన్ని హారతిగా సమర్పించిన యోధులు
నిర్వచనాల్ని దాటిన త్యాగఫలం! మహనీయం
చివరకు ఎవరికి వారే అయినా! లక్ష్యంలో ఒకటే

ఎవరి ఆలోచన వారికి అభిమానం సువిశాలం
మరొకరికి కనిపించని ప్రపంచంతో పరిమితం

ఉన్నది పోయిందని ఒక బెంగ
కోరింది రాలేదని ఒక బాధ
పాతది పనికి రాదని ఒక మాట
కొత్తది అర్థం కాదని మరో మాట

వెలుగు చీకటి రెండూ మనిషిలో తప్పనివీ
ఒకటి బంధువు మరొకటి మిత్రం ! సమయ సమయంలో
హ్లాదం నింపే సృజన రూపం వెలుగు
మనసును మరపించే శిల్పశాల చీకటి

వ్యక్తిత్వం నుండి రవియై మేఘమై
సమాజ చేతనతో ప్రవాహమవుతుంది కవిత!
మార్పుకు దారితీసే ప్రతి మలుపులో
కవిత ! ఒక అనుభవ నవ్యతనిస్తుంది !

కనిపించే దృశ్యం నుండి
కనిపించని దృశ్యం లోకి
వాస్తవమొకటే! చూచే కోణాలు వేరు
నిజం బయటపడుతుంది కాలం వడపోతలో
కంటకాల నల్లుకొన్న తీగెపూచి పరిమళంతో
సుందరతనిస్తూంది! గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 16.

రెండు వేరు వేరు ఆలోచనల మధ్య
రెండు వేరు వేరు అనుభవాల మధ్య
రెండు వేరు వేరు ఆశల మధ్య
రేఖలు పలు రంగులలో ! నీడ రంగు ఒకటే

విత్తులో చేతనతో చివురు పూవు ఫలం
మనిషిలో చేతనతో సమాజ పరివర్తనం
తనలో ప్రవహిస్తుంది భావనా ప్రవాహం!
దాటేందుకు వంతెనపై నుండి ఎందరో!

ఈత రాని వాడు పడవ నాశ్రయిస్తాడు
సాధనమేదైనా దాటడం ప్రధానం!
వ్యక్తి అవసరం నుండి సమాజావసరానికి
పెను మార్పుకు సక్రియ రూపం ఉద్యమం

గమనంలో వ్యక్తి పాత్ర ముందు చూపుతో
మనిషిలో అభిలాష ! అవసరాన్ని చాటుతుంది
స్వార్థంతో సంకుచితంలో స్వేచ్ఛ ఎక్కడిది?
స్వేచ్ఛ లేని వ్యక్తికి పరిపూర్ణత చేకూరదు.

వానకూ చలికీ, మంచుకూ, ఎండకూ
కుంచితమై భయపడి పోతూ ఉంటే
జీవితం వికసించి పరిమళం పొందేదెప్పుడు?
ఆశయం ఫలించి అనుభవించేదెప్పుడు?

కష్టం దుఃఖం వేదన భయం న్యూనతలో
ఏదో ఒకదానికి ఎపుడూ వేలాడుతూ ఉంటే
పయనం సాగేదెప్పుడు? పరివర్తన పొందేదెప్పుడు?
లక్ష్యం చేరేదెప్పుడు? గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 17.

క్షణాల అలలపై ఈదుతూ పోయే
యోధుల పయనంలో అపాయాలు ఆటంకాలు!
జలచరాలు సుడిగుండాలు తుపానుల అనుభవాలు
అన్నిటికీ సిద్ధమై ! ఉద్యమ జలధిలోకి దిగడం!

అలజడి సంఘర్షణ మారణ సందర్భాలలో
ప్రజల నుండి సానుభూతి ఒక వరం
కష్టంలో నష్టంలో జారే కన్నీటి బిందువులో
నలుపు నుండి ఎరుపుకు, ఎరుపు నుండి నలుపుకు ! దృశ్యం

ఏది మంచి ఏది చెడు? నిర్ణయం సాధ్యం కాదు
ఎవరు దోషి ! ఎవరు కాదు ! తేల్చడం సులభం కాదు
కాలం ఎప్పటికప్పుడు 'మిశ్రమ స్థితుల నుండి
ఎన్నిటినో ఏరి బయట పడేస్తూ పోతుంది

ఇది ఒక నాటితో ముగిసేది కాదు
ఎవరి బ్రతుకు వారిదయినా బంధంతో
ఎందరిపైనో ప్రభావం తప్పనిదీ
అన్నీ సమాజ సంకలనంలో భాగాలే!

ఆకలి ఆర్తి ఎరగని సమాజమెక్కడుంది?
ఎందరివో వాగ్దానాలు గుట్టలుగా పడి ఉన్నాయి

ఒక వైపు నుండి నవ్వుతో
ఒక వైపు నుండి బాధతో
అద్దం ముందు మనిషి ! కనిపించని ఆలోచనతో

ఉద్యమానికి అలుపు లేదు, విరామం కలగవచ్చు
ఆశలు విప్పారీ మూసుకొనీ ప్రతి మనసులో
కొత్త చూపు అవసరం ! గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 18.

దీర్ఘ కవితలా! ఒక్కొక వీధితో ఎదిగిన నగరం
వీధులలో బ్రతుకు పాత్రలతో! ఒక ఇతిహాసం!
ఎదుర్కొనక తప్పని కటు వాస్తవం
ఎడ తెగని మాటలతో శూన్యం అర్థవంత మవుతూంది

తరు పంక్తుల వలె మేడల నీడలు !
అలసటలో కాస్త ఊరట పొందే ఆశ్రయాలు

ముండ్లలా చాకుల్లా బయటపడే చూపులతో
బొగ్గు ముక్కల్లా నిప్పు రవ్వల్లా వదలిన మాటలతో
ప్రకృతిలో వస్తువులెన్నో అన్ని గుణాలతో
సమాజంలో అవసరాలెన్నో అన్ని వేషాలతో

ఇది స్వప్నం కాదు, మెలకువలో అనుభవ వాస్తవం
మనిషిని కాదని మనిషి బ్రతకలేని స్థితుల్లో
అనుభవాల మహా గ్రంథంలో ఒక్కొక పుట
ఒక్కొక జీవన విశేష కథలతో! నిండీ

ఒకవైపు నుండి సృజన భావ రూపాలు
ఒకవైపు నుండి విలయ క్రియా రూపాలు
ఏ రోజూ ఏదో ఒక డిమాండ్‌తో
ఆవేశంతో ఉత్ప్లవిస్తూ పోయే ఉద్యమకారులు

ప్రజల మధ్య కవి, కవితో ప్రజావళి
ఎంతటి సంకట స్థితిలోనూ కవిత
ఒకరి హృదయం మరొకరికి చూపే దర్పణం
ఒకరి వార్త మరొకరికి అందించే కపోతం
మారిన నాటకంలో ! ప్రతిదీ కొత్తగా
శాంతి సన్నివేశంతో ! గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 19.

చేతనతో ప్రతి మనసు అంతో ఇంతో
ఏదో ఒక దీక్షలో తపస్సులో గమ్యంతో
చూడంది చూడాలని, అందంది అందాలని
పొందంది పొందాలని, ఉన్నది పెంపొందాలని
స్వాభిమాన సుందరతతో బతుకు గడవాలని
స్వేచ్ఛా సమన్యాయంతో సమాజం! వెలగాలని

బయటి నుండి భయానికి రక్షణగా ఆయుధం
లోపల అనుమానానికి దృష్టి ఆయుధంపై
ఆయుధ ప్రమేయం లేని సమాజమెక్కడుంది?
ఆయుధ ప్రయోగం లేని చరిత్ర ఎక్కడుంది?
రాయి రైఫిల్ నుండి మిసైల్ వరకూ అవసరాలలో

పెదవులు విప్పారి ఆగ్రహ బాధా శబ్దం
వెనకనే! ఆయుధం ఆసరాగా కోరబడీ!
ఇది సమస్యకు చివరి సమాధానం కాదు!
చివరి సమాధానమని అనుకోవడం చరిత్రలో
మానవ నాశన శక్తికి పరాకాష్ఠ చేకూరింది.

ఆపదకు తత్కాలం! ఆనకట్టగా
జారిపోయే స్థితిలో అందే చేయిగా
బంధువై తోడుగా మిత్రమై వెనకనే
ఒకరి ఆయువు తరుగుతుంది సులభంగా

మనిషి ఆశలలో అవసరాలలో తప్పనిదై
ఒకరి ఆయువు పెంచుతుంది
యుద్ధకాండలో విచిత్రమైన పాత్ర నిర్వహిస్తుంది
ఇప్పుడు ! లోన మనో నిలయంలోనే భద్రంగా
ఆయుధం లేకుండానే ఈ మహాపరివర్తనం
ఒక అద్భుత విషయం ! గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 20.

రేపు వచ్చే ఉదయం గురించి ఆలోచన తప్పదు!
అది ఏలా ఉండేదీ! నిర్ణయం కాకపోయినా!
శాంత భావ రమణీయంగా ఉంటుందనే నమ్మకం

ఒకరికి ఇష్టమైంది! మరొకరికి కాకపోవచ్చు
మనిషిలో సంకల్ప సిద్ధికి సంకేతంగా
సమాజ శిఖరంపై పతాకలా సూర్యుడు!

జీవన గమనంలో అపుడపుడూ సంకెళ్ళు
కాలికో చేతికో పడవచ్చు, వేగం తగ్గుతుంది
వాటిని తప్పుకొనో, వదలించుకొనో
చతురతతో పోవడమొకటే అప్పటి కర్తవ్యం.

సాధారణ స్వేచ్ఛ లేని బ్రతుకుల్లో వేదన
మితిమీరిన స్వేచ్ఛలో అనుకోని బాధలు
ప్రజాస్వామ్యంలో ఉన్న వెసులుబాటు మనిషిని
అతని పనిని బట్టి తన వెంట లాక్కొని పోతుంది.

చీకటి రాత్రి భయదమనీ
దీన్ని వదలి ఎక్కడికి పోగలరు?
అవసరానికి దీపమో! టార్చ్‌లైటో
ఏదో ఒక వెలుగుతో గడుస్తుంది సమయం!

ఉదయం ఇంకా అవలేదని తొందరలో
తూర్పున పెను మంటలు ప్రత్యామ్నాయంకాదు
ఎడారిలో నీటి కరువు తీరేందుకు
మబ్బుల్ని తరలించి బలవంతంగా కురిపించలేరు

అర్థంకాని కవిత; గాలిలో ఎగిరి
ఎవరి చేతిలోనో పడవచ్చు
మార్పు చూపవచ్చు, దారి మారవచ్చు
శాంతి తేవచ్చు, గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 21.

నిన్నటి సమాజ నిర్మాణం నేటికి పాతబడి
కొత్త దానిపై ఆలోచన అన్వేషణ నిర్ణయాలు

మనిషి ఉదయ బింబంలా వెలగాలని మనసులో
భూమి పై మొక్కలా ఎదిగి గగనం చేరాలని

నిదుర నుండి మేల్కొని కొత్త జగంలోకి
కొత్త ముఖం కొత్తమాట కొత్త బ్రతుకుకై
చుట్టూ సశక్తులు తమ తమ పనులలో
శ్రమ కళలో కదలుతూ సమాజ భాగ్యంకై

మదిలో గ్రీష్మాన్నో శిశిరాన్నో దాచుకొనీ
హృదిలో మేఘాన్నో వసంతాన్నో నింపుకొనీ
పరిచయ మయ్యే రూపాలెన్నో ఒకరొకరు
ఏదో ఒక అవార్డుగా రివార్డుగా ఒకరికొకరు

విపణిలో వరసగా వస్తువులెన్నో అమర్చబడీ
తనకు కావలసింది దొరికితేనే ఎవరికైనా సంతృప్తి
బయట ఎన్నో! తమ వైపు లాగుతూ వ్యవహారాల్లో
తనకు లాభించేది పొందితేనే ఎవరికైన సంతోషం

మనిషిని మనిషి కలిసినపుడు హృదయం
తంత్రీ స్వన సుఖదంగా స్పందించాలి
ఆలయంలో మ్రోగే ఘంటా నాదంలా
ఆయువును పెంచే అను రణనం చేయాలి

మెట్లపై నీటి బిందె జారి దొర్లినట్లు కాదు
భావనలో అనుభవ సుందరతను కోల్పోరాదు
కోరుతూంది సమాజం నేటి నిర్మాణంలో
వాస్తవ గుణ కళామయం! గాయపడిన ప్రజాస్వామ్యంలో

## 22.

వచ్చిపోయే మబ్బుల్లా అతిథులతో నగరం
మెరపు చూపులతో మాటల సందడితో
ఉద్యమాలకు కేంద్రమయిన చైతన్య పీఠం
రోజు తరలుతుంది! ఆటలో బంతిలా వేగంగా

పాత అనుభవాల స్థానంలో కొత్త అనుభవాలు
గతం గురించి ఆలోచనకు తీరిక లేని వర్తమానం

ఎదలో వేదనతో పైకెగసే ఆవిరి చుక్కల్లా
వాస్తవం బయట పడుతుంది! బహు సామాన్యంగా
ప్రజాస్వామ్య విజయం కయి! సాహస చర్యలతో
అగ్ని శిఖలు! వీధుల్లో కదలడమొక విశేషం

అనుభవ పరంపరలో వ్యక్తిత్వం కరగుతుంది
విశాల సమాజ చలనంలో భాగమవుతుంది

బ్రతుకులోని అనుభవ సార రూపం కవిత
వాస్తవాల నిజ రూపం విప్పి చూపుతుంది
ఘర్షణలో వెనక నున్న శక్తుల గతులను
విభేదం లేకుండా చోటును కల్పిస్తుంది

పైకి కనిపించని మూలాల్ని ప్రకటిస్తుంది
వాద వివాదంతో ఏ విలువను తిరస్కరించదు
పయనం రహదారిన సాగాలని లేదు
కాలి బాటలోనూ గమ్యం చేరవచ్చు
కొత్త దారిలోనూ అడుగులు కదలవచ్చు
దారి దొరకని ప్రయాణం ! ఎక్కడా ఉండదు

విజయ చిత్రా లొకటొకటీ తన ఎదపై నిలుపుకొని
కాలం కదలుతుంది! గాయపడిన ప్రజాస్వామ్యంలో!

## 23.

ఎందరో మనుషుల ప్రత్యేకతలు పలు సందర్భాల్లో
ఎవరూ ఎవరికీ డిటో కాదు సాధారణంగానూ
ఒకరి నొకరు కలవడం జీవికలో ఉన్నదే!
అనుబంధం సంబంధం! తప్పనివీ సమాజంలో

ఎవరి ఆశల తోట వారిదే లోపల
ఇష్టమైనవీ కానివీ మొక్కలెన్నో! పూలు ఎన్నో
చివురించని, కుసుమించని కొమ్మ లేదు
శాఖా కీర్ణమైన సమాజంలో శ్రేణులెన్నో
మనిషికి ప్రియమైనవి పూలు! అందమైనవి
కొన్ని నేల రాలిపోతాయి
కొన్ని ప్రతిమ నలంకరిస్తాయి

బతుకుంటే కదలని పెను బండ కాదు
బండల నుండి జారి కదలే ప్రవాహం
బ్రతుకంటే వ్యాపార విపణి నిలయం కాదు
దార్శనికం వెలుగులో మానస సజీవ రూపం

పాత బడినవి అన్నీ వీడవు! ఎక్కడికీ పోవు
జీవ కణంలో మూల గుణంతో నిలుస్తాయి
భూమి పాతది, ఆకాశం పాతది ఎప్పటిదో
భూమిపై విత్తు నుండి వచ్చే మొక్క కొత్తది

ఒకవైపు కరుణ ఎడారిలో జలదంలా
ఒకవైపు వీరం ఆశయానికి ఉత్సాహంలా
శాంతి కవచంతో గెలిచిన ఈ ఉద్యమం
హంసాకృతి పొందుతూంది, గాయపడిన ప్రజాస్వామ్యంలో!

## 24.

శూన్యంగా ప్రవేశిస్తుంది వర్తమాన క్షణం
అనుభవ సార సంగ్రహంతో నిష్క్రమిస్తుంది
మనో రహస్య జగతికి అక్షరాకృతి కవిత
అవసరంలో ఏ పనికయినా పనికి వస్తుంది

బాధల గాథలతో ఆలోచన మొదలయి
అభిమాన మూలం నుండి ఉద్యమం తలెత్తుతుంది
స్వయం శక్తి ప్రకటనతో అధికారం కోరుతుంది
విరోధ రేఖలతో ఒక భాగం వేరవుతుంది

మనుషుల మధ్య వైరుధ్యం ప్రబలి పోయి
మబ్బులకు బదులు బండలు దొర్లుతాయి
జలాలకు బదులు అగ్నులు రేగుతాయి
ఎడం పెరిగి పెరిగి వేరుకాక తప్పదు

దూరమయి వేరయి అపాయ కర స్థితిలో
వెలుగు స్పృశిస్తుంది, మానవం ఒకటిగా చేస్తుంది
ఇది మలినంలేని శుభ్రమైన ఆకృతితో
దారి చూపుతుంది, ఇక నడవడం మనిషి ఇష్టం!

ఒక్కొక్కరిలో ఆకృతి ఒక్కొక్క విధంగా
చెట్టుపై పురి విప్పిన నెమలిలా
పచ్చికపై గంతులేసే హరిణంలా
కోరిక ననుసరించి అందంగా ప్రియంగా!

నదిని సమీపిస్తే దప్పిక తీరుస్తుంది
మనిషిని చేరితే అగ్ని అంటకూడదు

ఏ క్షణమూ శూన్యంగా కదలదు గడవదు
బరువుతో వెళుతుంది చరిత్రగా మారుతుంది
ఉద్యమ సమాప్తిలో విజయ పతాకతో సమయం
అమృత రాగం కోరుతుంది, గాయపడిన ప్రజాస్వామ్యంలో!

## 25.

అలల వలె పై కెగసిన చేతులతో జన సమూహం
ఆకాశాన్ని స్పృశించబోయే ఆనంద ప్రకాశంతో

టేబుల్ పై పరచిన పెద్ద ప్లేటులా ఆకాశం
క్రిందికి వేలాడే పూల దండల్లా దిగిన దిశలు
చరిత్ర గతిలో మలుపు తీసుకున్న సంబరం ముందు
ఎంతటి వరమయినా తక్కువే! ఒదిగి పోవలిసిందే

నిరాశకు తావులేని ఈ ఉత్సవ సన్నివేశం
విజయ శక్తుల్ని వహించే విమానం!
ఇది ఏదో చమత్కారం కాదు ఇంద్రజాలం కాదు
కఠిన వాస్తవాల్ని ఎదుర్కొన్న చారిత్రకానుభవం

కళ్ళలో వెలిగే వత్తులతో వేల రాత్రులు గడిచాయి
బయటికి వస్తే దిశలను చుట్టేసే చీకటి!
నీడలతో చుట్టబడి నిలయం
తనది కాకుండా పోయేనని భయం
తవ్విన గోతులు కనిపించవు
అపాయ సూచనలు కానరావు

చేతిలో చిన్న దీపం! ఎన్ని దారుణ దృశ్యాలనో చూపిస్తుంది
బ్రతుకులో ప్రవేశ రూపంకై పోరాటం! ఎప్పటి నుండో
ప్రవాహంలో రాళ్ళ మధ్య ఇరుక్కొని పోయిన వారూ
వరదకు మేటలు వేసిన ఇసుక దిబ్బలపై చేరినవారూ

గతంలో కష్టాలను నష్టాలను మరచి
వర్తమానంలో మంచిని పంచుకునే ఉద్దేశం అవసరం
గాలి కబుర్లు వదలి, చెప్పే సమాజ కథలో కాలం
మునిగి తేలుతూంది, ఇపుడు గాయపడిన ప్రజాస్వామ్యంలో!

## 26.

అవకాశం చేయి జారి పోయిందని ఆక్రోశం
తనకు రావలసింది దాటి పోయిందని ఆగ్రహం
స్వార్థంలో తేలుతూ గట్టు దాటిన నిధులు
ఎవరిది ? ఎవరికి? అన్న ప్రశ్న వాడి బాణమవుతూంది

భూమి, చెట్టు నీరు ఎవరివీ కావు! అందరివీ
జీవన గతిలో బలంతో అవసరంతో స్వంతం అవుతున్నాయి.

గాలి కోసం అన్వేషణ అక్కరలేదు
నీటి కోసం ప్రయత్నం అనివార్యమవుతూంది
అవసరాలలో మిగులుతో వస్తువులకై పోటీ
స్వంతం చేసుకొనే పేరాశతో ఘర్షణ!

మస్తిష్కం ఒక ప్రయోగశాల ! మేధ పాత్ర అమేయం
చరిత్రను స్వజిస్తుంది. సంస్కృతిని ధ్వంసం చేస్తుంది
స్పందన శీలంతో మానుష గుణ పాత్రకు
అవకాశ మెక్కడుంది? వీలు చేసుకొని రావచ్చు

చరిత్రలో పాఠాలు ఎంత కాలం ఎన్ని విన్నా
అవి ఏవీ పనికి రావు, అప్పటికి కొత్తది కావలసిందే

దూరాన పైన ఇంద్ర ధనుసును చూచి
స్వర్గానికి ద్వారంగా నమ్మనవసరం లేదు
దూరాన పైన చంద్ర బింబం చూచి
అన్నానికి కరువు లేదని చెప్పనవసరం లేదు

ఎడారి పై రవి తేజం నెరపుతుంది నిరకుశం
జలాలపై శశి బింబం శాంతి హంస అవుతూంది
తనకు లాభించే వస్తువుకై మితం లేని ఆశతో
స్పర్ధ ఎక్కువై ! గాయపడిన ప్రజాస్వామ్యంలో!

## 27.

బయటికి రాగానే చూపును ఆవరించి చెట్లు
ఒకటొకటీ ! ఆశా రూపంతో దర్శనమిస్తాయి
బుజాల పై నుండి సూర్యబింబం!
గతాన్ని తుడి చేసే ప్రకాశాన్ని వదలుతూంది

ఎటు చూచినా! మొదటి సారి రాగ బంధంతో
ఈ ఉదయం ! కొత్త దనంలో తేలుతూ ! కనిపిస్తూంది
స్వర్ణ ద్రవంలో మంచి పైకి తీసినట్లు అందంలో
సమాజమూ ప్రకృతి పోటీ పడుతున్నాయి

ఉద్యమ తీవ్రతలో ఒకరు ప్రాణం అర్పిస్తారు
ఆ ఆదర్శం విగ్రహ రూపం పొందుతుంది
ఎంత కాలం గడచినా తరగని కళతో
దోషాల్ని సరి చేసుకొనే అవకాశం కల్పిస్తుంది

ఆగామి తరాలకు ప్రేరణగా నిలుస్తుంది
చుట్టూ దారులవే! పాతవి! చర్యలు మాత్రం కొత్తవి
తరం నుండి తరానికి కొత్త సమాజం
పదం నుండి పదానికి కొత్త వివరణం

కాలం ఎవరికీ భయపడదు
తన పనిలో నిమగ్నమై ఉంటుంది
చరిత్ర ఎవరినీ ఉపేక్షించదు
తన గతిలో రూపొందుతూ పోతుంది

క్రితం క్షణం పాతదై, ఈ క్షణం కొత్తదై
మనిషికి బహుమానం ! అర్హతపైనే
ఈ సమయంలో, హృదయ స్పందన లయతో
నవ జీవన సంకేతం! గాయపడిన ప్రజాస్వామ్యంలో!

# 28.

ఆయోజనం నుండి ఆచరణం దశకు చేరిన ఈ ఉద్యమం
ఇక అర్ధరాత్రి నుండి ఉదయానికి చేరడమే
దేశ చరిత్రలో స్మరణీయం, అనుభవ స్థాయిలో అపూర్వం
ఇది మొదటి చివరి విశేష ఘటన స్వేచ్ఛలో

కాగితం వలె జీవితం పరచబడుతూ
చెప్పే మాటకూ చేసే పనికీ పొంతన కనిపించదు
రెండూ కలిసిన స్థితి సమ కూడేది మాత్రం
అంతరంగం కలిసి ప్రవాహమై సాగినపుడే

కుటిలమైన తంత్రంతో యశోరూపం కోరే వ్యక్తికి
స్వాగత కరాలతో ఉద్యమ విజయం సిద్ధంగా ఉండదు

పసి పాప ముఖంలో శుభ్రమయిన దరహాసంలా
ఉదారమైన చర్యలో ఉదయ కిరణ స్పర్శలా
అనుకోని మలుపులతో! ఈ విజయాదర్శం
ఉద్యమ శ్రేణుల్లో! సమాజ శక్తి నింపుతూంది

బాష్ప కణం వెనక! నీలి మబ్బు కళ్ళలో
ఆ వెనక సమాజ సముద్రం! వేదనా హృదయంతో
ఎన్ని దశలు దాటితేనో! ఈ పరివర్తన విశేషం
ప్రజలో సంకల్పం! ఒక సుందర దిన మణియై

ఉద్యమ వేగంలో సూడో నేతలు! ఒక్కొక విధంగా బిజీగా
అమెరికా దర్శనంలోనో! పర్యాటక విలాసంలోనో
తీర్థ యాత్రలలోనో! మరో మరో వ్యాపకంలోనో
విజయ సూచి అందగానే ! ఉదయానికి మొదటి వరసలో

బాష్ప కణంలో నీటి కణంలో స్పందన చిత్రం ఒకటి కాదు
ఇది గుర్తించడం అవసరం! గాయపడిన ప్రజాస్వామ్యంలో!

## 29.

కవి బతికిన కాలానికి ప్రతినిధియై కవిత
వచ్చే తరాలకు నిజ రూపం చూపిస్తుంది
ప్రజా స్వామ్య వ్యవస్థలో ప్రశ్నించే హక్కుతో
మనసును మానవ చేతనతో కదలిస్తుంది

ఇది దొంగల్ని దాచే రహస్య నిలయం కాదు
దోషారోపణంపై ఉంచే కారాగారం కాదు
నిర్ణయ ప్రకటనంలో నిజం వైపు మొగ్గుతో
సందేహానికి వీలు లేని వివేక విభాతం

కనిపించని రంగులు బయటకి వస్తాయి
అర్థవంతమై శబ్దం ధ్వనిస్తుంది సరిస్తుంది
తెరచిన పిడికిలితో అభయ హస్తం చూపుతుంది

ఎత్తిన పిడికిలిలో ప్రగతి రూపం నిలుపుతుంది
సమస్య గురించి చింతనకు తలుపులు తెరుస్తుంది
విజయానికి కావలసిన ఉత్సాహ హస్తం అందిస్తుంది
ప్రజా స్వామ్య దిశలలో వెలుగు దారిపై విభేదం సహజం
సమస్య తీర్పులో ఇది చూడని కోణం చూపిస్తుంది

అసమానత అణచివేత అధిక భావ వర్తనం
వేర్పాటుకు కారణమై, పర్యవసానం సునిశ్చయం!
పోరాడే హక్కులతో ప్రగతి శీల ప్రజాస్వామ్యం
చీకటి దిశలలో వెలుగును ప్రసరిస్తుంది

హేతు బలం మానవతా వాద గుణంతో
ద్వేషాగ్నిని ఆర్పడం కష్టం కానే కాదు
ఈ సమయం ! తెలంగాణ రాష్ట్రానికి అవతారిక
హ్లాదమైన అవసరం ! గాయపడిన ప్రజాస్వామ్యంలో!

## 30.

మనిషిలో పైకి కనిపించని సముద్రం
ఒక సమయంలో తప్తమై, ఆవిరియై
మబ్బులు వదలితేనే ఉపశమనం
సమాజానికి అందం ప్రయోజనం

దరిద్రం మూర్తీభవించి నిరాశలో ఉన్న మోడు
చినుకుతో చివురిస్తేనే బ్రతుకు సార్థకం

చీకటిలో ఒంటరిగా ఉన్నా భయం కలగదు
తానే ఒక దీపమై వెలుగుతూ ఉంటే

అడవిలో ఒంటరిగా తిరుగుతూ ఉన్నా భయం ఉండదు
తానే ఒక ఆయుధమై శౌర్యంతో కదలుతూ ఉంటే

గుండెలో బాధల బరువుతో
ఎప్పటికీ గడవడం ఎవరూ కోరరు
సమస్యకు జవాబుగా రణ చర్య తప్పనిసరి కాదు
సమాజ సౌభాగ్యానికి శాంత జీవన మవసరం

మందు పాతర వ్యూహంతో పని లేకుండా
ట్రిగ్గరపై వేళ్ళు కదలే అవసరం లేకుండా
ఇది ప్రజాస్వామ్య పథంలో ఆశయ విజయం
రాజకీయ చేతనతో తెలంగాణ అవతరణం

ఈ విశేష సందర్భంలో రవి చంద్రులు కన్నులుగా
పై నుండి చూస్తూ ఉన్న అమర వీరుల మెరపులు!
నల్లని మృత్యు రేఖలు చెరిగి పోయి
బంగరు జీవన చిత్రంలో ఆగామి దృశ్యం

చీకటి జాడలు తొలగే ఆలోచనా కిరణంతో
హింసకు తావులేని సహన భావ బంధంతో
అనుభవ దర్పణంలో ! ఉద్యమ విజయ బింబం
చరిత్రకు కిర్మీర కిరీటం! గాయపడిన ప్రజాస్వామ్యంలో!

స్వేచ్ఛా కవిత్వం - 61

# ఈనాటి నిజం

దీర్ఘ కవిత


మాదిరాజు రంగారావు



2015

రసధుని - సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Free Verse - 61

# EENAATI NIJAM

(Telugu )

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

*Presented*
*to my wife*

*Smt. M. Indira*

*on her birthday*
*28 March*

# రుచి – రూపం

"రుచి ఎరగని రసన లేదు
రుచి కోరని బ్రతుకు లేదు"

ఒక వైపున కవీ మరో వైపున పాఠకులూ సహృదయులూ విమర్శకులూ, వీరిలో అభిలాష, అభిరుచి, అభిమానం ఆసక్తి కవిత్వాన్ని చదివింప చేస్తాయి. వీటి ప్రమేయం అంతో ఇంతో తప్పని సరి, కవులలో వలెనే వీరిలోనూ ఎవరి దృష్టి వారిది. దీనితోపాటు స్పందన గుణం వివేచనాశీలం ప్రయోజన రూపంతో భేదిస్తాయి. ఎవరి పరిమితులు వారికి ఉంటాయి. తప్పదు. ఎవరి ప్రమాణాలు వారివి. ఎవరి లక్ష్యం వారిది. వీటి వెనక నుండి సామాజికం సాంస్కృతికం పెరిగే వాతావరణం, అంతో ఇంతో తప్పకుండా పని చేస్తాయి. అయినప్పటికీ ఇన్నింటిలోనూ, ఏవో కొన్ని అంశాలు, ఒక స్థాయిలో కలిసిన, రుచి – రూపం ముందుకు నడిపిస్తుంది. రుచి ఆంతరమైన అనుభవాన్నీ రూపం బాహ్యమైన నిర్మాణాన్నీ సూచిస్తాయి.

కవిత్వ విషయంలో రుచి అంటే స్వాదుత కాంతి కామనీయకత ఆలోచనలో నిలుస్తాయి. ఈ విశేషం కవి సృజన ప్రతిభ నుండి సృజన క్రియ (ప్రాసెస్)లోకి ప్రవేశిస్తుంది. రూపంలో స్థిరపడుతుంది. దీనికి కవి అంతర్వ్యక్తిత్వం పునాదిగా నిలుస్తుంది. బహిర్వ్యక్తిత్వం వివిధ కోణాల్లో ఆకృతిని సంతరింప చేస్తుంది. పాఠకుల్లోనూ సహృదయుల్లోనూ విమర్శకుల్లోనూ ఈ స్పృహ అవసరం. కవిత్వాన్ని చదివి విశేష స్థితులను పొందే అనుభవ సూక్ష్మతలూ ముఖ్యం.

ఎన్ని చెప్పినా ఒక వైపు నుండి కవీ. కవిత మరో వైపు నుండి పాఠకులూ, సహృదయులూ, విమర్శకులూ ఉంటారు. ఈ రెండు వైపుల్లో ఉన్న వారి మధ్య కవిత్వ వివేచనలో గ్రహణ పటుత (Perception)లో అనుభవ గుణంలో దూరం ఎంత తక్కువ ఉంటే అంత మంచిది.

ఈ దీర్ఘ కృతి "ఈనాటి నిజం"లో విషయం వర్తమాన స్థితుల్లో బయటికి రాని, రాలేని 'నిజాలు' కేంద్రంగా సాగింది. 'నిజం' కనబడకుండా చోటు చేసుకొనే విపరీతాలు వికారాలు నైతికేతరాలు అవాంఛనీయాలు దృష్టికి వస్తాయి.

ఇందులో వస్తువు మానవ జీవితంలో అనివార్యమయిన ప్రకృతి నేపథ్యంతో, ఈనాటి జీవన వాస్తవికతలతో సమాజ స్థితిగతులతో సమ్మిళితమయింది. ఈ రచనా శిల్పం ప్రతీయమానానికి ప్రాధాన్యంతో ఆవిష్కారాన్ని పొందింది.

ఈ సూచన స్వేచ్ఛాకవిత్వం గురించి సమాలోచనానికి అంతో ఇంతో ఉపకరిస్తుందని భావిస్తాను.

**– మాదిరాజు రంగారావు**

# ఈనాటి నిజం

## ఆశా ఫాలంపై

### 1.

ఆశా ఫాలంపై
తెలుపు నలుపు రంగుల బొమ్మలు
వర్తమాన జీవన స్థితిలో క్రీడలు
పని చేసే చేతుల్లో మారే జీవన రేఖలు
పనిపై తనలో అభిలాషతో
సమాజ చక్రంలో తప్పని గతి రీతులు

ప్రతి ఒకరూ తమ భవిత గూర్చి చింతనలో
కర్షకులు కార్మికులు వ్యాపారులు ఉద్యోగులు
మేధావులు! నిరుద్యోగ సమూహాలు! ఇంకా
లౌకిక వ్యూహాల్లో ఘటికులు! సామాన్యులు

అలసట ఆకలి అలజడి ఓటమి నుండి
దశ దశలో పునర్భవ సుందరతను కోరుతూ
వెలుగులో మనుషుల్ని అంచనా వేస్తూ
చీకటిలో చుక్కల్ని లెక్క పెడుతూ
మనిషిని మనిషి కలుస్తూ వీడుతూ,
చలన సమాజంలో ఎక్కడి కక్కడ!
చీలే దారులతో సువిశాల ప్రపంచం

ఎంత గొప్పదయినా గతం వచ్చి ముందు నిలవదు
ఎంత స్వల్ప మయిన దయినా వర్తమానం తప్పదు
ఎవరి ప్లాన్‌తోనో చరిత్ర పటం ఏర్పడదు

రాత్రి నుండి స్వర్ణ ప్రభాతంలా
అనల పరీక్ష నుండి బయటపడి శుభ్రంగా
రావలసిన రోజుకై కావలసిన క్షణంకై నిరీక్షణం
విలువలతో ప్రజాస్వామ్య విజయంలో భాగమై

## 2.

ఎంతటి తుఫాను గాలి వీచినా
భూమి నుండి తృణమూలం కదలదు
ఎంతటి శిశిర బాధలోనూ
చెట్టులో సృజన గుణం తొలగదు

జీవన చలనంలో మొదటి లిప్త
ఎంత మోదమో! మాటల కందదు
ఆ సమయం! కదలే! వసంత హృదయం

జీవన గమనంలో చివరి లిప్త
ఎంత ఖేదమో! మాటలు చాలవు
ఆ సమయం! మండే తాప విశిఖ !

జలధి కదలుతుంది ఆరాటంలో వృద్ధులా
చినుకులు చిందులేస్తాయి! చిన్న పిల్లల్లా
ప్రవాహం తరలుతుంది! యువ గణ పంక్తిలా
సమాజ మెదురు చూస్తుంది! ఉత్సాహ కళకై

జలధి మధ్య నావలా
ఏకాంతంలో వ్యక్తి
చూపులతో వెదకేను! తీర భూమి దాకా
మరో మనిషి తోడు కయి! సముత్కంఠతో
జన సమూహ శక్తిని చేరాలనీ
నిజ సమాజ దృశ్యం చూడాలనీ

చేతనలో కవిత! మానవ సంస్కృతిలో భాగం
స్పందన శీలంతో! ప్రతి హృదికీ వేదిక
కవితకు ప్రేరణ! చుట్టూ ఉన్న సమాజం
కవి హృదయం విశ్వమయం! ఎక్కడ ఉన్నా!

## 3.

నింగిలో ఏ రవి లానో ఏ శశి లానో
భూమిపై నిలవాలని కోరిక! అవసరం లేదు
మానవతా కాంతిని నలువైపుల పంచుతూ
మానుష బింబమై బ్రతుకులో నడిస్తే చాలు!

అహంకార మొక సుందర ప్రభావ తేజం
జీవన యంత్రానికి నడిపే అవసర సాధనం
అణువణువును కదిలిస్తూ అంతశ్చేతనతో
మానస శిఖరాలను పొందే ప్రేరణగా నిలుస్తుంది

అందం ఆనందం సీమలు దాటిన సృజనలో
సమాజ స్పందనతో కొత్త సీమ! ఏర్పడుతుంది

చిన్ని చిన్ని గుడిసెల్లో చిన్ని చిన్ని బ్రతుకులు
బాధలకూ బరువులకూ అందం ఆనందం తరిగి
హద్దులు దాటే సంకల్పం! మొదలవుతుంది
నవ సమాజ క్షేత్రంలో! లక్ష్యం మారుతుంది

వరదలా దరిద్రం! తరలి వస్తుంది! ఆగదు
పైపైకి వేగంగా! పై బడి ముంచేస్తుంది
దిశలు మూతబడే దిగ్భ్రమలో తిప్పుతుంది
భౌతిక మానసిక స్థాయిల్లో ఏదో రూపంలో
దరిద్రం లేని సమాజం! అందని ఆదర్శరూపం

వరద తీసి బురద నుండి బయట పడి
ప్రకృతి అందం బ్రతుకు చందం రెక్కలు వాలిపోయి
మర బొమ్మల్లా! మనుషులు బ్రతుకులో తిరుగుతూ
అణగి ఉన్న బాధ రాజుకొనీ!
నిప్పై మండి బయట పడవచ్చు
ఉద్రేకంలో కొత్త బాట పట్ట వచ్చు
ఉత్సాహంలో కొత్త దిశను పొంద వచ్చు

# 4.

మనోమయం వయొలిన్‌పై ఏదో ఒక స్వరం
సమయ సమయం! వివిధ స్థాయిల్లో ఎప్పటికీ
దేహంలో అణువణువును చేతనతో నిలుపుతూ
మానవ సజీవ స్పందన కొక సూచనగా

గేటు వద్ద పూల కొమ్మ! గాలికి కదలుతూ
ఎవరో రాబోయే! వ్యక్తి అలకిడితో
నాలో మరో మనిషి! స్నేహ సుందరంగా,
స్మృతు లొకటొకటీ తరగలుగా మనసులో
తరగలపై వర్తమాన వాహన యానంతో
శిశు దశ నుండీ బ్రతికే సమాజ రూపంలో

అన్నీ ఉన్న మనిషికి! ఇతరేతర సమస్యలు
ఏమీలేని మనిషికి! మౌలిక జీవన బాధలు

ప్రతి రోజూ! తుపాను విచ్చేయదు
మాటి మాటికీ! భూకంపం రాదు
వీపున తుపాను మోసుకొని వచ్చేవారు ఉన్నారు
పిడికిలిలో భూకంపం దాచి కదలేవారు ఉన్నారు

ప్రకృతిలో చర్యలతో సమంగా మనిషిలో
ప్రవర్తనా రీతులతో జీవన సందర్భాలెన్నో!
ఎవరి పాత్రలో వారు! ఇష్టానికి అనుసారంగా
ఇతరుల బ్రతుకులపై నిరంకుశ ముద్రను మరచీ

చెరువులో నీరు లేదు, దగ్గరలో నదిలేదు
జలధిలో నీరు వీలు లేదు, దాహంతో మనుషులు

నీలి మబ్బుకై ఎదురు చూచే ముఖాలపై
ఉండి ఉండి! ఎండ చురుగ్గా విసరి కొడుతూంది

కురవని మేఘాల్లా నేతల వాగ్దానాలు
నీడల చేతులతో నేలను స్పృశిస్తూ పోతాయి

# 5.

కదలే రైలుకు పగలు రాత్రి భేదం లేదు
నిస్సందేహంగా నిర్భయంగా పట్టాలపై పయనిస్తుంది

రైలు రాక ముందు తెల్లని దుస్తులు ధరిస్తూ
విరామ సమయంలో నల్లది దుస్తులు వహిస్తూ
రాత్రి వేళ ప్లాట్‌ఫార్మ్‌లా! జీవితంలో సన్నివేశం
వస్తూ పోయే ప్రయాణికులతో కొత్త ప్రపంచం

గదిలో తిరిగే ఫాన్ కార్నర్‌లో టెలిఫోన్
ఎదురుగా కలర్ టెలివిజన్ చేతిలో మొబైల్
విజ్ఞాన విజయ శిఖరంపై సంతోషంతో మనిషి!
బయట యంత్ర మయం! లోన మనోజగం

మెలకువలో కొమ్మపై పూలతో మెలగిన చేతులు
కలలో నిప్పులతో ఆడుకోవడం! మానసం!
భయాన్ని అవలీలగా జయిస్తూ
నిజాన్ని స్వేచ్ఛగా బయటపెడుతూ

అవసరాలు సులభంగా తీరుతూ ఉంటే
ఉదయ వేళ జారే మంచు బిందువులు
క్షితిజం మెడలో! హారంలో ముత్యాల్లా కనిపిస్తాయి
అవసరాలు తీరక సతమతమవుతూ ఉంటే
అవే! బాధితుల! కన్నీటి చుక్కల్లా తోస్తాయి
అవసరాలు ఎక్కువై బ్రతుకులు దుర్భరమై
ఇంటి ముందు ఎరుపు రంగు పూలు
మండే జ్వాలారుణ శిఖల్లా వెలుగుతాయి
గాలి వాటున అలలు! మబ్బులు! పూలు! కదలుతాయి
మనిషి మాత్రం స్వేచ్ఛగా! తన జీవన రుచి గతిలో

# 6.

నీరుతో కూజాలా వెనకనే గతం
నీరుతో గ్లాసులా చేతిలో వర్తమానం

కవితలో పదాలు మబ్బుల్లా భావ జలాలతో
మనిషిని అలరిస్తూ మురిపిస్తూ ఆశపెడుతూ

ఉదయ మవుతూనే! ఎవరి పనులలో వారు
శ్రమ చేతన మూర్తులు
భ్రమ వీడని బ్రతుకులు
మనో గగనంలో కదలే ఆశల మేఘాలతో
ఏది! ఎపుడు ఎక్కడ దయ చూపేదీ తెలియదు
ఏది! దేన్ని దాటి ముందుకు పోయేదీ తెలియదు

తెలుసుకొనే దశలో బాల్యం
మార్పు కోరే స్థితిలో యౌవనం
ఉన్నది కాపాడుకునే స్థితిలో ప్రౌఢం
గత స్మృతుల ఊయెలపై ఊగే వృద్ధత

తరం నుండి తరానికి మారే అనుభవ దృశ్యాలతో
మనో రూపం! మాత్రం! అన్నిటికీ నిలయమై

అందరినీ చుట్టూ తిప్పుకునే శిశువు
పెరిగి పెద్దవుతూ ఎందరి చుట్టో తిరగాలిసీ!
సముద్ర మంత బాధలలోనూ
చంద్రుని బింబంలా హ్లాద పరుస్తుంది! వివేకం

నిప్పు కణాల్లా మండే సమస్యలతో
సుడి గుండాల్లా జటిల ఘటనలలో
ఉన్నదారి ఆ ఒకటీ కాల సర్పం అపరాదు
ఉన్న ఊహ ఆ ఒకటీ రణ వ్యూహం కారాదు

# 7.

మల్లె పూవు మచ్చ ఎరగదు
అనల కీల జాలి ఎరగదు
మల్లె చెట్టుకు దగ్గరగా
అనల జ్వాలకు దూరంగా
హ్లాదాన్ని పంచుతూ ఆర్తిని గ్రహిస్తూ
మూసిన దారులు తెరవడం కవి పని!

శబ్దంలో సృజన రూపం! ఉదయ రశ్మితో
అర్థంలో నలు వైపుల పరిమళం వదలుతుంది

హిమ శిల నుండి జల ధుని లాగ
జల ధారలో విద్యున్నవ తేజంలా
కవి నుండి కవిత! జీవన చేతనతో
వ్యక్తి నుండి సమూహమై సమాజమై అస్తితలో

నరాలలో నెత్తురు పరుగెత్తించడం గొప్ప కాదు
ఆ సమయంలో లక్ష్యంపై చెదరని చూపు ప్రధానం

కల్పనలో భవితకు పునాది పడుతుంది
ఆచరణంలో క్రియకు సాకారం లభిస్తుంది
చేతులు పాతవి! చేసే పని కొత్తది
పూల గుత్తిలా అభయ ముద్ర చూపవచ్చు
వాడి కత్తిలా బాధకు గురి చేయవచ్చు
సంకెల వేయవచ్చు, సంకెల విప్పవచ్చు

ఇంటి ముందు పూచిన, మల్లె తీగెతో
మృత్యువు! కాసేపు ఆడుకొని పోతుంది
పరిమళ సుందర జగంతో పరవశించి
తాను వచ్చిన పని మరచిపోతుంది

# 8.

ఎక్కడో ఒక పచ్చని చెట్టుపై
ఆగని ఆవేశంతో పిడుగుపాటు దృశ్యం
ఎక్కడో ఒక వికార చేష్టతో
పరిసర సమాజ దృశ్యంలో బీభత్స చిత్రం
ఒక విషాద శకలంగా మిగులుతుంది
ఇది దైనందిన సంక్షోభం కాకూడదు

ప్రతి వ్యక్తి తనను మినహాయించుకొని
వైరుధ్యాల పథంలో సుగమం కోరడమొక రహస్యం
ఊహ లెంత విషమమో! కఠినమో!
కార్య మంత జటిలం క్లిష్టం అవుతుంది

చెలరేగే మంటల్ని ఆర్పే బదులు మనిషి
మంటల తీగెల్ని మనిషి చుట్టూ సృజించేను
వాస్తవంలో కనిపించే వెలుగుల్ని కాదని
కల్పనలో అందని బింబం కయి ఆరాటం!

మందు పాతర పేల్చబడి దారిలో
మానవ బాంబు మందుతూ ఎదురుగా
పొగలలో మాటలలో! మానవం
ఆహుతి అవడం! సాధారణ విషయం కాదు

వెలుగు కయి చీకటిలో వత్తిని వెలిగిస్తే
అది పదును కత్తిలా భయ చిత్రం గీస్తుంది
వెలుగు రేక విరిసిన సంతోషంలో ఉంటే
అది విసర నున్న బాకులా తయారవుతూంది

చలనం లేని స్తంభం తలపై వెలుగు కిరీటం
మనిషిలో కోల్పోయిన వివేకాన్ని జ్ఞాపకం చేస్తుంది

# 9.

గాజా యుక్రెన్ సిరియా రాజకీయ సంక్షోభాలతో పాటు
సమాజ పరివర్తన కయి అరణ్య కేంద్రం నుండి పోరాటం
సమస్య మూలం ఎప్పటిదో! ఇప్పటికీ
శాఖోపశాఖలుగా! మనుషుల్ని మింగేస్తుంది

నిప్పు దస్తులతో గడపడం ఎవరికి ప్రియం!
చల్లారేందుకు జవాబు లేని మౌన సమాజం!

మనిషిలో నీడ లొకటొకటీ తలపడే
విషాద సందర్భంలో! ఎక్కడయినా ప్రపంచంలో
మహానేత! మహాకవి! స్పందనలో ఒకటే!
అసాధారణ పథ వరణంలో ఒకటే!
బాంబుల దాటికి చెదరిన సంసారాలు
ముక్కలై కూలిన గాజు మేడల్ని తలపిస్తాయి
శిథిలాల్లో పడిపోయిన మానవ శరీరాలు
బ్రతికి ఉన్న వారికై వెదకుతూ! మిగిలినవారు

చెట్ల క్రింద నిప్పు ఆరిన పొయిలో నుండి
ఎగసే బూదితో పొరలతో కమ్మిన వాతావరణం
సగం కాలిన కొమ్మలతో తళుకు మాసిన ఆకులతో
కమురు గాలి ! మనుషుల ముఖాల్ని చుట్టేస్తుంది

ఊరి పొలిమేరల్లో నీటి పాయలో
సన్నని నెత్తురు ధార సాగుతూంది
ప్రవాహ చలనంతో పోటీ పడుతూంది
మనిషి ఎంత క్రూరుడో! చరిత్ర అంత కఠోరం

తెరచిన వాస్తవ గ్రంథం పుటలో
ప్రతి వాక్యం కొత్తగా అనుభవంలో

# 10.

అంతరంగంలో నిజం ! బయటికి కనిపించదు
బ్రతుకులో ఆనవాళ్ళు వదలుతుంది!
మనసులో వెలుగు కొలువు తీరుస్తుంది
ఊహల్ని కరెన్సి నోట్లలా రెపరెపలాడిస్తుంది

దీన్ని ఎవరి పిడికిలిలో బంధించే వీలులేదు
దీన్ని ఏ సూత్రంతో ఆడించే వీలు లేదు
దీని ముందు ఎంత ఎత్తు మనిషి అయినా
గుహలా కుటిలా నిలిచిపోవలసిందే

ప్రవాహంలో పడవలా తీరం చేరుస్తుంది
దేహంలో చల్లబడిన శక్తిని జ్వలింప చేస్తుంది
ఊపిరిలో ఆగనున్న గాలిని సరింప చేస్తుంది
పనంలో మనసుకు అశ్వంలా ఉపకరిస్తుంది

కత్తి సార్థకమవుతుంది, దాని పదునుతో
చేతిలో విచిత్ర చలన సుందర రణ కళతో
ప్రవాహంలో మొదటి మునకలో అల
రెండో మునకకు గతమవుతుంది
గతమూ వర్తమానమూ భవిష్యత్తు క్రమ సంపుటితో
ప్రవాహం! క్షణాలలో కదలే మానవ జీవిత రూపం

కాలానికి నిలిచిన కవిత ఎప్పటికీ కొత్తదే
కాలంతో పాటు నడక! కవికి అవసరం

నిజం గురించి అన్వేషణ కవి పనిలో భాగం
కవితలో అంతరంగ ప్రసార మొక దార్శనికం
భయంతో ఎగిరి మాయమయ్యే పావురాళ్ళు
కవిలో స్వాగత తోరణాలై కదలుతాయి!

# 11.

చుక్కలుగా జారే నెత్తురు, పడియలుగా మారేనా?
ఒక దిశ నుండి మరో దిశకు ఊగుతూ
అనుమానం సందేహం వైరం అల్పతతో
'శాంతి' నిర్ణయం పోస్ట్ పోన్ అవుతూ పోతుంది

ఉదయం నుండి అస్తమయం వరకూ సూర్య కాంతి
విశాలశాలా గగనంలో రాత్రి చంద్ర కాంతి
భూమిపై కనిపించని బీజం తల నిమురుతూ
మొలకెత్తిన రూపాన్ని పరామర్శ చేస్తూ
ఎద నిండుగా విప్పారిన పూలను అభినందిస్తూ
ప్రకృతిలో జీవన బంధాన్ని నిలుపుతూ
జీవన చలనంలో తేజాన్ని జ్ఞాపకం చేస్తూ
మనిషిలో సృజన భావ జగత్తును ప్రేరేపిస్తూ

ఎపుడేది రావాలో కావాలో చేయాలో
ప్రకృతి నుండి వస్తుంది జరుగుతుంది లభిస్తుంది
అంతకు మించితే! మొదటికి మోసం విపరీతం
అంతకు తగ్గితే! నిరాశలో దు:ఖం! దౌర్భాగ్యం

పరిమళించే పూవుకు ఆధారం మట్టి అనీ
పూలకు బదులు మట్టిని గ్రహించలేరు
మూలం ఒకటయినా! ఎదిగే కొద్దీ
దేని పరిమితి దానిదే! దేని ప్రయోజనం దానిదే

అశాంతి నుండి శాంతికి జీవన పరివర్తనలో
వేడి గాలి విసురుతూ, జాలి గొలిపే వేళలో
కురవ నున్న వర్షా హర్షానికి తోడుగా
ఒకటి రెండు పిడుగుల సహనం తప్పదు

## 12.

ఈ సమాజ మొక సజీవ పరిణామ మహో ప్రవాహం
అగ్గి పుల్ల గీసివేస్తే ఆవిరై ఎడారిగా మారదు
మానవ సంస్కృతితో మనోజ్ఞ పరంపరా రూపం!
జ్వాలా తీరాలతో దారుణ దృశ్యంగా మారుతూంది

తన సుందర పాత్రను చూపేందుకు మనిషి
స్వార్థాని కతీతంగా నైతిక చేతన అవసరం

మానవతా ముఖం చూపే నైతిక రూపం
ఇపుడు! అడుగంటిన నీరుతో సరస్సులా

స్కేటింగ్‌కు పనికి వచ్చే నిశ్చల హిమ ఫలకం
రవి కిరణ స్పర్శతో జల చలనం పొందుతుంది
ఆ జలాలలో కమలం తల ఎత్తవచ్చు
కదలే నీటిపై పడవలు పయనించవచ్చు

కొండలపై నుండి జారే జల ధారలా
ఎవరు కోరే! మార్పు రూపం వారిదే
గమనంలో పరిమితమై ప్రయోజన దిశ
అవనిపై చేరాక వాస్తవం తెలుస్తుంది

ప్రతి ఆకులో స్వేచ్ఛ! పూవులో స్వేచ్ఛ
మూలంలో జీవ శక్తి ప్రసారంతో
ప్రతి ఊహలో స్వేచ్ఛ, మాటలో స్వేచ్ఛ
వర్తనలో విలువలతో పరివర్తన గాథలతో

శబ్దానికి ఊహల ఊపిరిపోసి
ప్రతి కవి కవితను తన దారిన వదలేను
ఎంత బ్రతికినా ఏదో మిగిలి ఉన్నట్లు
ఎంత వ్రాసినా ఇంకా మిగిలే ఉంటుంది

## 13.

మాట్లాడేందుకు ఎంతో ఉంది
ఓపిగ్గా వినేవారు దొరకాలి! కానీ

హంసతో పావురంతో మబ్బుతో
ఎంత సేపయినా మాట్లాడవచ్చు
చెప్పింది వింటూ ఉంటాయనీ! అనుకొనీ
మనిషితో అంతరాయం లేకుండా కుదరదు

ముఖం ముడుచుకొని వింటూ ఉండవచ్చు
ముళ్ళ చూపులు విసరుతూ పోవచ్చు

ఎగసే అలల సముద్రంతో మాట్లాడవచ్చు
కదలే అలల ప్రవాహంతో మాట్లాడవచ్చు
కొండలతో శిల్పాలతో సరేసరి!
ఆఖరికి చెట్టుతో నీడతో అంతరంగంతో

తోటలో పూలతో రాత్రి చుక్కలతోనూ
వీటితో మాటలు! ఎంతో ఆత్మీయంగా

శిశువుతో తల్లి మాట్లాడుతూనే ఉంటుంది
జవాబులు కూడా తానే చెబుతూ సప్రేమగా
అనుమానం లేకుండా సందేహం లేకుండా
అదే పనిగా! ఎదిగే దాక! మాటలు వచ్చేదాకా

హ్లాదంలో తేలుస్తుంది సల్లాపం
సమయాన్ని కరిగిస్తుంది సంభాషణ

ఆకాశంలా అందని అనుభవం కిందికి దిగి
తనతో నడుస్తూ ఉన్నట్లు ఉంటుంది
తన కల నిజమవునో కాదో తెలియదు కానీ
ఎద ఎడారిలో అలలు మాత్రం కదలుతాయి

## 14.

మాటలో ఉపదేశం ఎండకు మబ్బు గొడుగులా
మాటలో సందేశం కొమ్మకు పూవులా పండులా
ఏ సందేశం ఒకటి రెండు మాటలకు మితం కాదు
ఏ ఉపదేశం ఒకటి రెండు మారులకు మితం కాదు

అనుమానం లేకుండా సాగుతుంది సందేశం
సందేహం లేకుండా వెడలుతుంది ఉపదేశం

కదలుతూన్న కాలంతో మార్పు బ్రతుకులో
చేర్పులతో కూర్పులతో సిద్ధంగా మనోరూపం
మరునాటికి కొత్తగా మారిన వ్యక్తిత్వంతో
మాటల్లో అర్థ ఛాయలతో స్నేహం! వైరం! భేదం! కలహం

దోసిలిలో జారకుండా నీరు నిలపడ మొక వైపుణి
ఓటమి నుండి గెలుపుకు నీతి తంత్రమొక అవసరం

కత్తికి పదునుతోపాటు ఆపరేషన్‌లో
చేయి వేళ్ళ చలనంలో నైపుణి ముఖ్యం
గాయం మానే దశలో విజయానికి
మనిషిలో జిజీవిష! ఆటలో చివరి సిక్సర్

ప్రతి క్షణం! పెట్టుబడికి సోపానంగా
ప్రతి పనీ! లాభ సాటి వ్యాపారంగా
కవులను గురించి మాట చెప్పనవసరం లేదు
అదృష్టం వరించాలని! ఉంటుంది లాటరీలో

రుచి ఎరగని రసన లేదు
రుచి కోరని బ్రతుకు లేదు
ప్రతి కవిలో, వేరు సృజన రూపం
అస్తితలో భాగం ఈ సహృదయ సమాజం!

## 15.

మనసులో తోచింది ప్రతిదీ మాటలో రాలితే
అఖతా లేర్పడతాయి, కొంప లంటుకుంటాయి
సమయం సందర్భం ఔచితి మాటతో
వంతెన లేర్పడతాయి ఇళ్ళు నిలుస్తాయి

గుండెపై ఉన్న బరువు తొలగక పోగా
ఆపై కొండలు దిగడం! క్షేమం కాదు

మాటతో మనసులో కొత్త నిజం చివురిస్తుంది
మాటతో మేధలో భావ జగం వెలుగుతుంది
గమనంలో లక్ష్యానికి వెలగు దారి చూపుతుంది
పదును కత్తికావచ్చు మాట! వెలిగు వత్తి కావచ్చు

ఆపదలో తాడులా సాగి మాట
నూయి నుండి బయటి లాగవచ్చు
గొంతుకు! ఉరి బిగింప బడవచ్చు
ఎదలో ప్రేమ సుమం విప్పారవచ్చు
కథలో అమృత బిందువు! ఒలకవచ్చు
మానవతా స్పర్శతో గమనం మారవచ్చు

ఘర్షణ చూడని జీవితం లేదు
యుద్ధం తెలియని సమాజం లేదు
ఇవి తొలగే ఉపాయం! మనిషిలో
మనిషిపై మనిషికి విశ్వాసం! ఆదరణం

మాటలో తోచే అర్థాన్ని అధిగమించి
అంతరంగ స్పర్శతో భావ ప్రసారం
మాటలో సరిస్తుంది ప్రాణ వాయువులా
జీవశక్తి పెంచుతుంది గుండెకు నిస్పృహలో

## 16.

చేతి కందబోయి అందని తెలుపు పావురం
కలలో! ముంజేతిపై వాలుతుంది ఎరుపు రంగులో

ఎత్తులో గాలికి రెప రెపలాడే పతాక
కలలో తూరుపు దిశలో అనల బింబమవుతుంది

కలహం బీభత్సం అన్యాయం అరాజకం
సంఘాన్ని వికృతం చేసే చర్యా శిఖలెన్నో!
చరిత్రలో ఘర్షణ లేని దశ లేదు
మాట నుండి క్రియతో విలయ పర్వం వహిస్తుంది

మానుష బల సంపదనూ బలహీనతనూ
రికార్డు చేస్తుంది! కథలో! ఇతిహాసం
శాంతి పేరుతో విరామ దశలు కొన్ని
ఇరు వైపుల కలహ సన్నివేశ దృశ్యాలలో!

కొన్ని స్థితులు గుట్టలవలె పడి ఉంటాయి
కొన్ని స్థితులు చెరువుల వలె నిలిచి పోతాయి
కొన్ని స్థితులు కరగి నీటి కాల్వ లవుతాయి
వీటి రహస్యం! ఇంకా సమాజ పరిశోధనలో

ఎంత కాలం వేచినా ఎంత దూరం నడచినా
నిజం అంతరంగంలో శుక్ర తారలా మెరుస్తూ

నిజం చెదరి ముక్కలయి రూపు మారి
బహు విధ వేషాల్లో! తారుమారు కావచ్చు

బంగారం విలువ స్వర్ణ కారునితో పాటు
ఆభరణం ధరించే మనసుకు తెలుస్తుంది
'నిజం'లో విలువ ఉపదేశంలో కన్నా
అనుభవ జగత్తులో దిన మణిలా మెరుస్తుంది

# 17.

వాతావరణ కథనంలో వార్తల్లో
ఇప్పటి దాకా గర్జించిన మేఘాలు
ఇక భూమికి పచ్చని కళ తెస్తాయనే

పగలు తాపంతో అలమటించే చెట్లు
మరో ఉదయానికి ఆర్ద్రతతో కనిపిస్తాయనే!
ఆశలు తీరే కాలంతోనే సుందర సమాజం!

పయనంలో చెట్టు నీడన నిలిచిన వాహనం
'టైరు'ను పంక్చర్ చేసే పనిలో కొందరు
మొన్న వేసిన రోడ్ పై నిన్న కురిసిన వర్షానికి
నేడు మృత్యు రచనలా గోతులు! పయనం ఆగదు

గమ్యం చేరే సమయంలో పయనం
మైలు రాయి వద్ద నిలిచి పోరాదు
ఆశా పతాక! గాలికి చినిగి పోరాదు
సామాన్యుని కోరిక! పూవో పండో! అవనీ!

గుహ నుండి బయటికి వచ్చిన
మనిషి గురించి ఆలోచనా రూపం!
అసహనం తాకిడిలో, అహంకార ఘట్టనలో
నలిగిన బ్రతుకుల్ని! హత్తుకొని సాగనీ

పయనంలో కారు చక్రం క్రింద
నలిగిన ప్రాణి దృశ్యం! ఒక సంధ్యా శకలం.

కరుణకు స్థానం లేని హృదయం
నీరు లేని బావితో సమానం

నిద్దురలో కాలం! తీర్చిన హిమ శిల్పం
మెలకువలో కాలం! ఆగని జలపాతం

## 18.

భూమికీ ఆకాశానికీ మధ్య ఏ అడ్డూ లేదు
అయినా అవి! ఎక్కడా కలవడం జరగదు
వాస్తవమూ కల్పన! దేని ఉనికి దానిదే
చెరొక వైపుకు చేరుస్తాయి! జీవితాన్ని

కళ్ళు తెరిస్తే చూపులో కదలే వాస్తవికం
కళ్ళు మూస్తే ఊహలో కదలని కాల్పనికం
ఆలోచనలో హేతువు! చీకటిలో దీపం
క్షణంలో మరో దృశ్యానికి స్వాగతమిస్తుంది

తన కెదురుగా అలలు కదలుతున్నాయనీ
ఎవరి పయనం! ఒడ్డున నిలిచిపోదు
అలలు లెక్కపెడుతూ కాలక్షేపం! జరగదు
అలలు దాటే ఉపాయం! మనిషికి వర రూపం!

కల్పనలో సుందర గ్రంథ మయిన జీవితం
వాస్తవ గతిలో ఆశామయమై పరుగెత్తిస్తుంది
నిశ్శబ్దంగా ఉన్న శాంత దృశ్యం కన్నా
కోలాహల జన చలనం పైనే మనిషి దృష్టి!

సమస్యల స్వాగతంతో! ఎదురుగా వర్తమానం
సద్యః స్పందనతో! కవితకు ప్రేరణం
ఈనాటి కవిలో సంకల్పం సామాజికం
వర్తమాన వాహన గతికి చేతన రూపం

పచ్చని నేలపై బంగరు పంటలు
శ్రమ బిందువుతోనే! నెత్తురు బొట్టుతో కాదు
ఏ నెత్తురు మరకలూ! నెత్తురుతో తొలగవు
బాష్ప కణం కలిసిన శాంతి జలం అవసరం

## 19.

వీధుల మధ్య నిలబెట్టిన ప్రతిమపై కన్నా
ఎదురుగ వచ్చే మనిషిపై చూపు! పనికొస్తుంది

మట్టి ముద్దకు ప్రతిమ రూపం ఇవ్వడమొక కళ
జీవితాన్ని రణంలో రథంలా నడపడ మొక నైపుణి
పనికి రాని దనుకుంది అవసరానికి అందల మెక్కిస్తుంది
మలిన మంట కుండా బ్రతకడమొక! యశోవరం

మస్తిష్కంలో జీవన చరిత్ర నిండీ
అస్థి పంజరంలో ప్రాణ సూత్రం నిలిచీ
స్పృహలో స్పందనతో మనిషి అస్తిత్వం
ఏకాంతం నుండి సమాజ చక్రంలోకి
మట్టి బొమ్మ నుండి! సజీవ రూపానికి
లేకపోతే! సరాసరి మ్యూజియం లోకి

మనిషి చుట్టూ పంజరం! శలాకల సందులతో
స్వేచ్ఛగా బ్రతకడమొక దార్శనిక వాస్తవం
అనుభవ గతిలో బంధన సూచిక లెన్నో!
ఏదో ఒక రూపంలో! ఏదో ఒక మిషతో

ఒకరిలో హృదయం కోటలా, భయ భావనతో
తలుపులు మూతబడీ, ఎపుడో తెరవబడీ!
కోట తమకు రక్షణగా క్షేమంగా గడిపేవారూ
ఒకరిలో మనస్సు తోటలా, ఊహలు విప్పారీ
తోట తమకు హ్లాదంగా సార్థంగా తలచేవారూ
కోట నుండి తోటకు! మధ్యలో నచ్చిన నిలయంలో

నిద్రలో కోట గోడలు! విజయాలను కలగంటూ
నేత లెందరు మారినా! మెలకువలో సమస్యలవే!

# 20.

రాత్రి వేళ మనిషిలో రేపటి సూర్యుడు పొంచీ
నీలి కర్టెన్ వెనక దాగిన పిల్లవాడులా

ఆకాశం నుండి సూర్య కిరణం కై వేచి వేచి
మనిషి! తానే ఒక బింబమై పైన నిలవాలనీ!

దీపాన్ని మింగాలని దాగి దాగి చీకటి!
చీకటిని తరిమేయాలని సాగి సాగి వెలుగు
ముంగిలిలో చీకటి అడ్రసు మారాలనీ
వెలుగులో నవ మానవ రూపం! చూడాలనీ

చీకటి దశ రావచ్చు, వస్తుంది, జీవన చక్రంలో
చిరునవ్వులు చిందే చుక్కలు మాయం కావచ్చు
చీకటి పొదలతో నిండిన మానస వనంలో
గుహ నుండి తప్పిన పులికి! ప్రవేశం లభించవచ్చు

అస్తమించే సూర్యుని గురించి ఎవరికీ పట్టదు
రేపు తప్పక వస్తాడనే, చెదరని విశ్వాసంతో

నిశా విరామ దశ! మనసును సిద్ధం చేస్తుంది
రేపటి పనిలో మనిషిని! కొత్తదనంతో

రైలు రాకతో తెల్లని దుస్తులతో
విరామంలో! నల్లని దుస్తులతో
రాత్రి! ప్లాట్‌ఫార్మ్‌లా! జీవన స్థితిలో
మారే దృశ్యాలతో! వర్తమాన సన్నివేశం!

తెరచిన పుస్తకంలా తూర్పు దిశ నుండి
ఎవరికి తెలిసిన లిపిలో వారికి వెలుగులు
ఎవరికి అందే ఎత్తులో వారికి ఆలోచన!
సమాజ శక్తులతో నడచే జీవన కథలో

## 21.

దారిలో ప్రవాహం కాలాన్ని మోస్తూ
అడ్డంగా కాలి బాట దాటేందుకు ఎప్పటిదో
నీటి ఉధృతి లేనపుడు దీని ఉపయోగం ఎంతో
వాగులపై వంకలపై బొంగులు! చెక్కలు! తీర్చబడీ

ప్రయాణం ఆగదు, ఆగరాదు జీవితంలో
ఆపైన వంతెన! స్థిర రూపం! కాంక్రిట్‌తో
కాలి బాట నుండి వంతెన వరకూ
ఇది మానుష శక్తి యుక్తుల ప్రయోగ చిహ్నం

కోట గోడ పై పైకి దృష్టిని మరలిస్తుంది
కోట పరిఖ చుట్టూర చూపును తిప్పుతుంది

పల్లంలో దూకి వంపులలో కదలుతూ వేగమందుకొనీ
రాళ్ళు దాటి కొండలు చుట్టి అందంగా
మలుపులతో మానవ జీవన ప్రతి రూపమై
ప్రవాహం! ఎందాక? జలనిధి దాకా!

ప్రవాహానికి తోడుగా ఉండేది గాలి! మాత్రమే
కొంత వరకు నీటిలో బింబించే రవి చంద్రులు చుక్కలు!
ప్రకాశ మాన రూపాలతో ధైర్యాన్ని ఇస్తాయి
నదితోపాటు జీవితమూ! సమాంతరంగా

సమాజ రూపానికి అర్థాన్ని పెంచుతూ
మానుష లక్ష్యానికి ఆదర్శం చూపుతూ
నదులు! పూర్వం రాజ్యాలకు సరిహద్దులు
బ్రతుకులకు సాంస్కృతిక చైతన్య తీరాలు!

మనిషిలో ఉదారతను జ్ఞాపకం చేస్తాయి
ప్రాణిలో ఉత్సాహాన్ని గంతులు వేయిస్తాయి

## 22.

ఉదయ స్పర్శతో సమాజ యంత్రం పని మొదలు!
ఎవరి పనిలో వారు, నచ్చినదో! నచ్చనిదో!
అవసరాలకో ఉబుసుపోకకో సమాజ బంధంతో
ఏదో ఒక పనిలో! కాలం గడుస్తుంది తేలిగ్గా

ఏ రోజూ ఉషఃకిరణం! కొత్తగా పలకరిస్తుంది
మనసు విప్పి ప్రగతిలో భాగం చేస్తుంది
పాతవి మరచి పోయేట్లు చేస్తుంది
లేకపోతే బ్రతుకులో రుచి ఎక్కడిది?

శిశువు ఏడుపు స్వరం! కరుణలో తేలుస్తుంది
పిల్లల అల్లరి శబ్దం! ఓపికను పెంచుతుంది

తప్పు లెన్ని ఉన్నా నలు దిశలు పరుచుకొని
ఎవరి దృష్టిలో వారి అవసరాలకన్నీ ఒప్పులే!

శరీరం స్వేద బిందువులు రాలుస్తుంది
కళ్ళు! బాష్ప బిందువులు జారుస్తాయి
హృదయం చివరి దాకా లయ శబ్దం వీడదు
భూమి తలం కఠినమయినా నడక ఆగదు

ఒడ్డుకు చేరే అలల్లో చివరి దంటూ లేదు
దూరం సాగే అలలకు విసుగు అంటూ ఉండదు

నీంలో ఎంత సేపు? మునక వేసి తల ఎత్తక తప్పదు
నీరు తన కెంత ప్రియమయినా! బయటికి రావలసిందే
పూవును చూస్తే విలాసమో! వికాసమో!
నిప్పును చూస్తే ఉత్సాహమో! ఉద్రేకమో!
నీరును చూస్తే ఆర్ద్రతయో! దప్పికయో!
జ్ఞప్తికి రావడం! బ్రతికి ఉన్న స్థితికి నిదర్శనం

## 23.

నీళ్ళలో మూటలా అవకూడదనీ
నీళ్ళపై రాతలా కాకూడదనీ
పయనం పడవలో, గమనం వంతెనపై
క్షేమంగా! గట్టుకు చేర్చేవి! విజయ సాధనాలు

పచ్చని ముఖం వాడి పోయే తాపంతో
సూర్యుని తేజం! నిరాశలోకి దింపుతుంది

వర్షం దయ చేస్తుంది, తుపాను మోసుకొనీ
బీభత్స ముద్రల్ని వదలి పోతుంది అంతటా

మనిషిలో తప్పని వెన్నో! ఆశాచక్రంలో
ఇష్టమైనవి కొన్నీ సృజన భావనలో
ఇష్టం కానివి కొన్నీ విలయ భూమికలో
అన్నీ కలిసిన రూపం! కాలం ఆల్ ఇన్ వన్

ఇష్టమైన వాటికి స్వాగతం పలుకుతూ
ఇష్టం కాని వాటిని సహనంతో భరిస్తూ
ప్రవాహ రూపం! మానవ జీవిత మొక వాస్తవం
ఇరు వైపుల తీరాలపై పచ్చని సిగ్నేచర్‌తో

జలమయమైన నేల అద్దంలా!
సృజన రేఖతో భవిష్య భాగ్యాన్ని సూచిస్తుంది!

సమాజ చలనంలో భాగమైన జీవితంలో
ఆరు రుతువుల గమనంతో పరివర్తన చక్రం
ఏడు రంగుల దీప్తితో! ఉదయ ప్రకాశం
ఆగదు ఆశాచక్రం! జీవన భ్రమణానికి కారణం

మనో మయం ప్రవాహం! ఆగని నవ జీవన గతితో
కాలంతో కదలాలనీ మాయని ప్రజాస్వామ్య కళతో

## 24.

విలాస యాత్ర క్షణంలో విషాద యాన మయింది
ప్రయోగ లిప్త కాస్త ప్రమాద దృశ్య మయింది
తళ తళ మెరసే గోధుమ వన్నె తాచులా
పరుగు పరుగున ప్రవాహం! వేగంగా! ఉన్మత్తంగా

అది వేసిన కాటుకు, యువ శరీరాలు వశం తప్పాయి
అలలపై అందని దూరం తరలి పోయాయి
కళ్ళ ముందు చూపు నుండి తప్పి పోయి
చేతిలో కెమెరా చిత్రంలో మాత్రం మిగిలాయి

తుపాను వచ్చే భయం లేదు
ఉప్పెన దూకే అపాయం లేదు
హ్లాదంగా నర్తించే ఆ సమయం
జల ధారా వేగానికి అయోమయంలో

బియాస్ ఉల్లాస నదీ రూపం
పిల్లల పాలిట విసరిన ఉరి తాడయింది

ఎక్కడో రాళ్ళ మధ్య చిక్కుకొనీ కొన్ని
బురద మేటలపై తేలీ మరికొన్ని
గుర్తు పట్టరాని శరీరాలతో
శాంత జీవనంలో నాశన పర్వాన్ని తలపిస్తూంది

బాష్ప జలంతో మసక బారిన కళ్ళ ముందు
జీరాడే మృత్యు ఛాయలతో కాలం!
మనిషిని ఉనికినే! ప్రశ్నిస్తూంది
మనసును ఆశ్చర్యంలో బంధిస్తూంది
ఎంత అందంగానో ప్రవహించే రూపం
క్షణంలో వికారంగా శూన్యం కావడం ఘోరం

## 25.

స్కూల్ బస్ క్రాసింగ్‌లో రైలును ఢీకొనీ
నెత్తురులో తడిసిన పిల్లల శరీరాలు
ముక్కలయి ఎగిరి పడి దూర దూరం
నేలపై చెల్లా చెదరుగా బీభత్స దృశ్యం

విషాదాన్ని చూడక తప్పని ప్రమాద స్థితిలో
అక్కడున్న మనుషులు! దిగ్భ్రమలో
చేరిన మనుషులు ఇనుప స్తంభాల్లా
వచ్చిన బంధువులు! పాతిన కొయ్య ముక్కల్లా

ఊహించని పెను గాలికి
కొమ్మలు విరిగిన చెట్టులా
ఉదయ చిత్రం! దీనమైన ఆకృతితో

మబ్బు కమ్మిన వెలుగులా పగలు
కళ్ళ ముందు! చీకటిని తలపిస్తూంది
ఏ తప్పూ లేకుండా! అమాయకులు పిల్లలు
చకితంగా ఘోరమైన విపత్తుకు బలియై

గాలికి తెరవబడిన పుస్తకం పుటల నుండి
జారి పడిన నెమలి ఈకల్లా! విద్యార్థులు!
పుటలు చినిగి గాలి కెగిరి పోయి
పిల్లల భవిష్యత్తు! విషాద చక్రంలో మాయమై

దారుణం చూడాలసి వచ్చిన కళ్ళలో నీరు
చిన్ని అనల సరసిగా మారుతూంది
కారణం! గుండెను నిలువునూ కోసేస్తూంది

తన స్వాధీనం కోల్పోయిన యంత్ర వాహనంలో
ముందుగా! ఎదురుగా నిలిచేది బస్ నడిపే డ్రైవర్
ప్రమాదానికి తప్పిదంలో మనిషే ఒక దోషిగా

## 26.

రైల్వే ప్లాట్ ఫార్మ్‌పై – పిక్ పాకెటర్లు
అమాయక ముఖాలతో తిరుగుతూ
చలాకి కదలికలతో గడుపుతూ
మాటలో చూపులో చర్యలో కత్తెర మతితో

పొద్దున వార్తా పత్రిక! సమాచార సంచయం
సమాజంలో స్థితుల మలుపులతో సూచనలతో

మోసాలు హత్యలు క్రూర క్రియలు కఠిన రీతులు
కాలమ్‌లో ఐటమ్‌ల బాగ్ విప్పి చూపుతుంది
పాఠకులకు తెలియని బాటలు చూపిస్తుంది
రాజకీయ తంత్రంలో మెలకువలు తెలుపుతుంది

ముని మాపు నుండి టెలివిజన్ సినిమా ఎపిసోడ్
ప్రేక్షకులకు బ్రతుకులో రహస్యాలు బయట పెడుతుంది
రాక్షసుల రహస్య శక్తుల్ని మించిన కథలతో
చీకట్లను అమాంతం మింగేసే చర్యలతో
శంకలతో వంకలతో మనుషులకు ప్రేరణగా
తాగే నీరు కరువయినా, కన్నీరు మాత్రం పుష్కలంగా

ఎవరికేమి అవసరమో వారికి ఆ మాట ఇస్తూ
దేవతలకు నకళ్ళు భగవాన్‌లు సన్యాసులు
“శాంతి” కోసం వారి దగ్గరకు వెళ్ళాలనుకునే లోపల
“భిక్ష” కోసం ఇంటి ముందు ప్రత్యక్షమవుతారు

పూజలందుకునే ప్రతిమ కెదురుగా కళ్ళు మూసుకొని
నిలిచిన భక్తునిలో ఒక కోరిక బీజం! మొలకెత్తుతుంది
ఆ రూపానికి బదులుగా తాను చేరితే
ఇది సాధ్యమా? దైవ కృపతో సాధ్యం కాని దేముంది?

సంకల్పంతో విశ్వాసం ముఖ్యమై
ఎంతటి ఆలోచన కయినా పురి కొల్పుతుంది

## 27.

బ్లేడ్‌తో గాటు నుండి నెత్తురు సంతకంతో
విసరబడిన మృత్యు పత్రం సాయం సంధ్యా శకలం

గాలి ఎత్తుకపోతుంది! సముద్రంలో వదలుతుంది
అక్కడి నుండి గట్టుకు చేరాలని తహ తహ
స్మృతి హస్తం అందుకొని కాలం వెంబడి
తీరం నుండి సమాజానికి చేరుతుంది

నేలపై నిలువునా దీర్ఘమైన కీర్తి స్తంభం
విజయ చిహ్నంగానో! భాగ్య సూచన గానో!
లోన శక్తి ఉంటే చాలదు! ప్రకటన రూపం అవసరం
తనకు డబ్బు ఉంటే చాలదు! వినియోగ విధం ముఖ్యం

మనిషిలో ఆంతరశాల! చిత్ర శిల్ప సృజన కళా భాగాలతో
తలుపులు మూయబడీ తాళం వేయబడీ ఉంటుంది
తాళం చెవి కోసం! వెదకు లాట మొదలవుతుంది
ఎక్కడో మరచినట్లు జ్ఞాపకం! ఉంటుంది

మరపును ఛేదించే లోపల
అవసరమయిన కాలం గడువు ముగుస్తుంది

ఏ బతుకును అణచ లేదు నింగి జారి
ఏ మనిషిని మ్రింగలేదు భూమి చీలి
ఇది ప్రతి వ్యక్తికి తెలిసిన యథార్థం

చీకటిలో ముంచి పైకి తీసి
అనల శిఖలపై విసరుతుంది, స్వార్థం

మృత్యువు ఛాయలతో కదలుతూ
రణ వ్యూహంలో తిరుగుతూ
నీ నా భేదం లేకుండా, ఎప్పటికీ.
మనిషి కన్న ముందుగా మరో మనిషి పోటీ!

## 28.

నిదుర నుండి లేచీ లేవడంతోనే
మరో మనిషి నాలో కదలుతూ
ముందు కొచ్చి నిలుస్తాడు
ఇంట్లో నా పనులను సాగిస్తాడు

బయటి గేటు దాటగానే
నాలో ఉన్న మనిషి తప్పుకొనీ
మరో మనిషి ముందు కొస్తాడు
నేను చూచే పనులు చక్క బెడతాడు

రోజూ పని చేసే కార్య నిలయంలో
నాలో ఉన్న మనిషి తరలి పోయి
మరో మనిషి వచ్చి చేరతాడు
నేను చూచే విధులు నిర్వహిస్తాడు

ఇంతకూ! నేను ఉన్నది పర్యవేక్షణలోనా?
అన్నిటికీ కేంద్రమైన అంతరంగమయమై

కాలం ఊయెలపై జీవితమంతా
ఈ దిశ నుండి ఆ దిశకు
ఆ దిశ నుండి ఈ దిశకు
శూన్యాన్ని పూర్ణం చేస్తూ గడపడమేనా?

నాలో ముందుకు వచ్చే మనుషులతో
ఆయా విభాగాల అవసరాలలో
ఇట్లా సమాజమూ కార్య నిలయం
ఎక్క డెక్కడో ట్రాన్స్‌పరెంట్ సంబంధంతో

ప్రపంచాలు మూడు దేనికది ప్రత్యేకంగా
సమన్వయ సుందరంగా నిలపడమే అంతరంగం పని

వీటిని కలిపే సూత్రం! అదృశ్యంగా
అది! మనిషిలో మధు పుష్పం వికసించే ప్రకాశ రూపం

అందరికీ తెలిసిందే! తెలియనట్లు జీవితాలు
ఇది నైతిక బంధానికి తప్పనిదీ! వీడనిదీ,
దారి మారి నడత తప్పి మనిషిలో
దేని కది అంతరంగ శక్తికి బహు దూరంగా

(2)

ఆవరణంలో బావి లాంటిది ఇల్లు
గోడలతో పరిమిత వలయంలో ఆవాసం!
ఊరుకు చెరువు లాంటిది కార్య నిలయం
బయట జలపాతం లాంటిది లౌకిక వ్యవహారం

మానవతా రుచిరంగా దప్పిక తీర్చే నీరు
జీవన సుస్థితికి చెప్పరాని అవసర రూపం

ఇక సముద్ర జలాల సంగతి వేరు
ఇది దాహం తీర్చే పని కన్నా మించిన
విశాల ప్రయోజనంలో! సామాజిక దర్శనం
సృజన కారణం! వర్షా మేఘానికి ఆధారం

మనిషిలో మనిషి మరో మరో మనిషి
ఈ విషయం తెలిసే దెందరికి?
ఏదో! తెలిసి నట్లే ఉంటుంది అందరికి!
పూర్తిగా తెలియదన్న రహస్యం తెలియదు

ఎందరో తమతో మాట్లాడుతూ ఉన్నట్లు ఉంటుంది
తమను గురించి ఆలోచన చేస్తున్నట్లు ఉంటుంది

వేరు వేరు పనులలో వేరు వేరుగా కన్పించే వారు
ఒకే అంతరంగం వెలుగులో తమ తమ పాత్రలలో

# 29.

తేనె చుక్కకై నాద ధునితో భ్రమిస్తూ
అందంగా ఆకర్షణతో తిరిగే భ్రమరం
గాయ పరచ వచ్చుననీ భయం!

గాలి దారిన వెళ్ళే నీలి మబ్బు నుండి
పిడుగు జారి పడవచ్చుననీ భయం
ఈ భయ మూలం ఎప్పటిదో! శిశు రూపం నుండీ
భయ వలయాలను ఛేదిస్తూ ధైర్యంతో
ముందుకు సాగడమొకటే అంతరంగ నిర్దేశం

పగలంతా తిరిగి తిరిగి యంత్రం వలె శరీరం
రాత్రి పుష్ప గుచ్ఛ మవాలని కోరిక సహజం

తలపై నీలి టోపి లా గగనం
వేలి ఉంగరంలో ముత్యంలా చంద్రుడు

ఒక నిదురలో తప్పు! మెలకువలో
రాత్రి వేళ వెలుగు రేక అవసరం

నడుస్తున్న ఘటనలో బాధలు మరచి
పొందే సుఖాలపై ఆలోచన! సాగుతుంది

గతించిన ఘటనలో తృప్తి నిచ్చే
జ్ఞాపకాల ఎన్నికతో ఆలోచన! నిండుతుంది

వర్తమానం ఎప్పటికీ విమర్శన నికషంలో
మనిషిని సాన బట్టి పదును తీరుస్తుంది

అవసరం లేని కలలు అదృశ్యమవుతాయి
అవసరం ఉన్న వాస్తవం కళ్ళ ముందు ప్రత్యక్షం!

వ్యక్తిలో మూల స్థాయిని మించదు జీవితం
అంతరంగ చేతన తోనే మానవీయ మవుతుంది

## 30.

ఉదయ కిరణ వేగంతో రాగంతో
పూవు చుట్టు తిరిగే తుమ్మెదలా
ధన బల సంపద సంచయనంతో
మనిషీ! మనీషి! మనస్వి ఎన్ని తీరుల లోనో

మల్లె పూవులా బ్రతకాలని లోపల అందరికీ
విహగంలా పైపై స్థాయికి చేరాలనీ! మనసులో
ఎదురయ్యే ప్రశ్నలకు జవాబుల అన్వేషణం!
నిరంతరం సాగుతుంది మనిషి ప్రయత్నం!

గోడకు తగిలించిన క్యాలెండర్
కాగితాల రెక్కలు రెప రెపలాడుతూ
తేదీల బంధన నుండి ముక్తం కావాలనీ
కాలం! ఎదురు చూస్తుంది! బయట పడాలనీ

వెలిగే దీప కళిక! ఆ రోజు తేదితో
మరు నాటికి గాలిలో స్మృతిలో తన గుర్తుతో

మూత తెరచిన అమృత కలశమై సమయం
చేతి కంది పెదవిని చేరే లోపల!
మూత తీసిన విష కలశమై సమయం
అందుబాటులోకి! వచ్చే యత్నం!

సమాజంలో కదలుతూన్న వర్తమానం
సమాజం ముందు రానున్న భవిష్యత్తు
సమాజం వెనక చేరిన గతం
ఈ మూడిటి సంపుటి జీవితం!

ఉదయ మదే ఎప్పటిదో బహు ప్రాచీనం
పునర్భవ సుందరంగా వస్తుంది ప్రతి రోజు!
జీవితానికి కొత్త ముఖం ఇచ్చే సంకల్పంతో
అది పొందే యోగ్యత మనిషికి ఉండడం అదృష్టం!

## 31.

మనిషితో మనిషి పోటి! ప్రతి పనిలో
లిప్తను మరో లిప్త దాటాలని! ప్రతి గతిలో
గాలి కాలాన్ని ఎత్తుక పోజూస్తుంది
మనిషి కాలాన్ని స్వంతం చేసుకోవాలనీ!

రేపై పై విశ్వాసం జీవితాన్ని నడిపిస్తుంది
తీరం నుండి తీరానికి చేరడమే పని
తీరం చేరగనే మరో తీరంపై కోరిక!
ప్రవాహాల్ని దాటుతూ పోవడమే! బ్రతుకంతా

కెరటాలు ముందుకు కదలుతాయి వేగంగా
గట్టుకు తాకి తల బాదుకుంటాయి
గట్టు దాటే ప్రయత్నం! దాటితే కల్లోలం!
దాట లేక పోతే! కలవరం! సంవేదన!

గాలి రంగంలోకి ప్రవేశిస్తుంది
కెరటాల్ని అదుపులో పెట్ట చూస్తుంది
చీలుస్తుంది! ముక్కలు చేసి విసరతుంది
కెరటాల దృశ్యం! చర్యలతో జీవితం!

కళ్ళ ముందు పచ్చదనం ఉండాలనీ!
ఎదలో ఎడారిలో తిరిగే ఘటనలతో
చేతన! అణచ బడదు! దాచ బడదు
చిన్న చినుకుతో! పచ్చదనం ముఖ మెత్తుతుంది

దీపక రాగంతో అవసరం లేదు
మేఘ రంజనితో పని లేదు
శబ్దంలో అగ్నిశిఖ! అర్థంలో జల సేచన
మహాశక్తి నిస్తూ అగ్ని! అదుపులో పెడుతూ జలం!

అంతరంగం స్పర్శతో విలువలు చేరతాయి
ప్రజాస్వామ్యం లక్ష్యంతో భాగ్యం విప్పారుతుంది

# 32.

ప్రశ్నలకు జవాబులు మనిషి నుండి మనిషికి
మాటలతో రాతల తోనే కాదు
లాఠి కదలికతో బులెట్ గమనంతో
అవసరమైతే మిసైల్ రూపంలో చేరతాయి

నేతలు తమ బాధ్యతల్ని మరచినపుడు
ప్రాణాలను మృత్యువు కొక్కానికి తగిలించి
అన్నిటికీ సిద్ధం కావడమే సామాన్యుల పని!
నేతల చేతుల్లో ఆడే సమాజంలో

ప్రశ్నలు తిరగ బడతాయి
జవాబులు చదికిల బడతాయి
తృప్తి లేని జవాబులు గాలికి పోతాయి!
ఉక్కిరి బిక్కిరిగా వాతావరణం! విపరీతం అవుతుంది

ట్రిగ్గర్‌పై ఆనవాళ్ళను స్కానింగ్ చేస్తే
ఆడుకునే పిల్లల చేతి వేళ్ళ నమూనాలు
వణకు తున్న వృద్ధుల అరచేతుల గుర్తులు
ఎవరు ఎవరికి నేర్పేదీ తెలీకుండా ఉంది!

కొవ్వొత్తి వెలిగేది ఒక వైపున
మరో వైపు నుండి నిలుస్తుంది స్థిరంగా
మనిషి మాత్రం ఇరు వైపుల వెలగాలనీ
హేతువు కతీతంగా ఆశయం పొందాలనీ

ఏకాంతం వ్యర్థం కాదు భయపడే అవసరం లేదు
మెలకువలో నిద్రలో రెండిటా చీకటి నాకు కాపలా

కళ్ళు మూస్తే లోపల వెలుగు
ఊహల్ని మరో దిశకు మరలిస్తాయి
కళ్ళు తెరిస్తే బయట చీకటి
తెల్లవారే సరికి! మరో దృశ్యం! ఆశయ రూపం!

# 33.

చిన్న తనంలో మట్టితోనో ఇసుక తోనో
కట్టిన ఇల్లు ఎపుడో మాయమయింది కానీ
ఆ ప్లాన్ పెద్దయ్యాక మనసులో ఇప్పటికీ
ఎన్నిటికో వాస్తవాన ప్రేరణగా నిలుస్తుంది!

చిన్నప్పుడు వాచకంలో అక్షరాల కింద బొమ్మలు
అంతగా పనికి రావనిపించినా పెద్దయ్యాక
చుట్టూ మనుషుల చేష్టల్లో బింబిస్తాయి!
మరీ ముఖ్యంగా జంతువులు మృగాలు! కదలుతూ

చిన్న నాటి రంగుల రాళ్ళలో ఆశల కాంతులు
ఇప్పుడు! శూన్యంలో అంతరించి పోయాయి
ఆ కల్పన! ఇప్పటికీ పెద్దయ్యాక
బ్రతుకులో ఎన్నిటికో! మూలంగా నిలుస్తుంది

'మంచి' బయటకు రావడం మంచిది
'చెడు' లోపలనే ఉండడం మేలు
చెడు బయటకి వస్తే! సులభంగా
శిశిరాలకు శిథిలాలకు ఆహ్వాన మందినట్లే

దీప స్తంభం! నిటారుగా ప్రయోజన పాత్రలో
విద్యుత్ తంత్రులతో వెలుగుకు ఆలంబమై
టెలిఫోన్ తీగెలతో మాటకు వాహకమై
మనిషిపై నమ్మకాన్ని పెంచుతాయి! జవాబుగా

రాత్రి దీపంలా వెలిగే నాకు
వేరే దీపంతో పని లేదు
రాత్రి గడవదనే చింత లేదు
నిదుర పడుతుంది! కలల కోసమైనా!

# 34.

గాలి అవసరం! అయినా గాలితోనే బ్రతకలేం
నీరు అవసరం! అయినా నీరుతోనే బ్రతకలేం
గాలిలో కొట్టుక పోవచ్చు
నీటిలో మునిగి పోవచ్చు

సమాజ బంధంలో మనిషి!
పుటక నుండి చివరి దాక!
వ్యక్తులతోనే సమాజ రూపం
సమాజం లేంది జీవితం లేదు

నగరంలో సిమెంట్ రోడ్పై వానతో
బాల సముద్రం తరలి వచ్చినట్లుంది
వాన అవసరం లేని అవని భాగం లేదు
పల్లె అయినా నగరమయినా అడవి అయినా
దప్పిక తీరేందుకో! పంటల పచ్చదనానికో
ఏదయినా సమాజం సుఖ శాంతులు పొందాలనీ!

సమయానికి వర్షం విచ్చేస్తే సంతోషం
కాస్త ఆలస్యమయితే చెప్పరాని అసహనం
నిష్టురోక్తు లెన్నో! నిందా వచనాలెన్నో!
దైవాన్ని నిందిస్తూనో, కాలాన్ని కోపిస్తూనో

తన మాటలు గాలిలో పయనించి ఎంత దూరమయినా
ఆ మబ్బులతో మాట్లాడి! ఇటు రప్పిస్తాయనే!
భూమి అణువణువూ స్వాగతం చెబుతుంది
ఆకాశం దిశలు చాచి ఆహ్వానం పలుకుతుంది

ఎప్పటి పరిచయాలతోనో ఆర్ద్ర మేఘం
మెరపులతో వీక్షిస్తుంది
ఉరుములతో పలకరిస్తుంది
ప్రకృతి నుండి దూరమయిన నగరానికి

చినుకుతో కొత్త అనుభవ గంధం వీస్తుంది
సామాన్యుడు మేధావి లౌకికుడు అమాయకుడు! అంతా ఒకటే

వాన వెలిసిన క్షణంలో వాతావరణం అద్దంలా
బింబించే మనిషి ముఖం! పూల గుత్తి అవుతుంది

ఎక్కడో మూల నున్న విత్తు! మొలకేస్తుంది! ఆర్భాటం లేకుండా
గేటుపై వంగిన కొమ్మ! చివురు వేస్తుంది! హడావిడి లేకుండా

నగరం సంకెళ్ళు లేని విశాల శాలాగారమా?
తానొక బందీ యని మనిషికి తెలియదు
మనషులు! తిరుగుతూ యంత్ర రూపాల్లో
లోన ప్రకృతి విరిసిన పూల గుత్తితో

నగరం మనిషి ఎదుట వర్తమాన ఇతిహాసం
చేరే మనిషిలో ఆధునికతను ఒలుకుతుంది

ఊరు అయినా నగర మయినా సమూహ శక్తులతో
ఆస్తికం నాస్తికం ఆదర్శం హేతువుతో
వాస్తవ రూపంలో ప్రజాస్వామ్య స్పందనతో!
కాలాన్ని జయించే ఇచ్ఛతో సంక్లిష్ట సమాజం!

ఎంత ఎత్తు ఎదిగినా పైపైకి
మేడల అంతస్తులు దాటుతూ
నగరం స్వాగత తోరణం ముందు
తల వంచి ప్రవేశించాలిసిందే!

బ్రతుకులో రుచి మారుతుంది
విశ్వ హృదయ స్పందనలో ఒకటై.

## 35.

యంత్రం కనుగొనడం మేధావి కర్తవ్యం
నిరపాయంగా నడపడం మనిషి బాధ్యత

ప్రేమ కరుణ వీర శాంతంతో
విశాల శాలలలో విభేదాల శ్రేణులతో
నాలుగు స్తంభాల కప్పు కింద సమాజంలో
నీతి పాలనం! తాగే నీటికి ఆధార సమం

తలపై కిరీటాలు మారిపోతూ నేతలు!
కొత్త గుర్తులతో అదే! పాత దారిలో
బుజాలపై కండువా రంగు మారుతూ బృందాలు
కొత్త స్లోగన్‌తో అదే! పాత రీతిలో

కిరీటం ఆయుధంగా పనికి వస్తుందో లేదో కాని
మెడలో కండువా మాత్రం! ఉరి తీసుకోడానికో
మరొకరికి ఉరి వేయడానికో! పనికి వస్తూంది
కళంక చరిత్రకు ఒక దృశ్య రూపాన్ని ఇస్తూంది

చలనం ఎరగని స్థితిలో గడవడానికి
మనుషులు! శాశ్వత ప్రతిమలు కారు!
చలనంతోనే జీవితానికి అందం! భాగ్యం

మార్పును కోరుతూ ప్రగతిని సాధిస్తూ
నేను ఎక్కడి నుండి ఇక్కడికి వచ్చిందీ తెలియదు
ఈ చేరిన ప్రదేశం నను వీడేట్లు లేదు
అద్దం ముందు నిలబడితే ఇపుడు!
నన్ను నేను గుర్తు పట్ట లేకుండా ఉంది
నాటకంలో కొత్త పాత్రకు అవకాశంతో
ఇది దొరకడమే, ఫ్లేవర్‌తో ఒక ఫేవర్

## 36.

వాస్తవానికి ఎక్కడో దారి తప్పి
తన ఊరు చూచే పనిలో
తన ఇల్లు చేరే తపనలో

తన అడుగుల అలకిడి విని
తలుపులు తెరచే వారెవరు?
లోనికి వెళ్ళే అమృత క్షణా లెపుడు?

ఇది సులభంగా జరగాలని అనుకొనీ
అడ్డ దారి తొక్కితే
అది అడవి లోకి తేలింది

కఠిన శిలల తలలు దాటి
జన పద హృదయాల నుండి
ఎంత దూరం? ఎక్కడికి చేరాను?
ఎడ్ల బండి నుండి యంత్ర వాహనంలో

కాలి నడక ఏలాగో తప్పనిదీ
అంతా జీవన సహజంగా అవలీలగా

తాను చేరిన చోట
తనకై ఎదురు చూచే ముఖా లెక్కడ?
వెతుక్కోవలసి వస్తుంది,
సాయం సంధ్యా సూర్యుడు
స్నానానికి జలధిలో దిగే వరకూ

రాత్రి అనగానే ఆ రోజు అదృష్టవశాత్తు
గగనంలో చంద్రబింబం
కనిపిస్తే సంతోషం పొందాలిసిందే

పగలు అయితే అనుకోకుండా
చెట్టు కొమ్మకు పూలు
చూచి తృప్తి పొందాలిసిందే

అక్కడక్కడా ఏదో ఊరు కనిపిస్తూ
వీధుల కూడలిలో మహనీయుల ప్రతిమలు చూస్తూ
అన్వేషణ! వెనక్కి జరుగుతుంది
మణులూ వజ్రాలూ మనసు నలంకరిస్తాయి

తన చుట్టూ ఉన్నవి దృశ్యాలెన్నో!
ఇవి ఏదో కాల క్షేపానికేనా?
తనలో అనుభవ జగత్తును నింపుతూ
ఎంతో మేలు చేస్తూ ఉన్నట్లు ఉంటుంది

లోపల ధైర్యం ఉంది! ఎందుకు?
కావలసిన దారిని చూపిస్తుందా?
పోవలసిన గమ్యం చేరుస్తుందా?

కాళ్ళు తన ఊరును చేరితే
కళ్ళు తన ఇల్లును చూపిస్తాయి
ఇది జీవిత కాలంలో జరిగే పనేనా?

ఏలిన వారి వెలుగు జాడ లేకపోయినా
బూజు పట్టిన కోట గోడలు! మిగిలీ
నిశ్శబ్దంగా పడి ఉన్న నీడలకు
గాలి! జోల పాట వినిపిస్తూ పోతూంది

గతానికి తలపై పుష్ప కిరీటంపై కోరిక!
వెలుగు అలలతో స్పృశిస్తూ కదలే సూర్యుడు
శిథిల వైభవాన్ని జ్ఞాపకం చేస్తూ పోతాడు
వర్తమాన నిర్మాణంలో నవీనతకు సూచనగా

"స్వేచ్ఛ" ఉన్న మాట వాస్తవమే
నిజ గమ్యం చేరలేని స్థితిలో ప్రయోజనం?

వింతలు చూపవచ్చు వరసగా
అనుభవాలు పేర్చవచ్చు రాసులుగా

ఒక సమస్య పరిష్కారంలో ముందుకొచ్చి
చేతికి కత్తిని అందించ వచ్చు
అది గోడకు తగిలింప బడవచ్చు
చేతికి పూవును అందించ వచ్చు
అది జేబులో పడి దాగి పోవచ్చు
కాలం ఒక జవాబును ముందుకు తెస్తుంది

పోవలసిన దారిలో ఎంత దూరం సాగినా
రాళ్ళపై నడచేందుకు ధైర్యం లేకపోలేదు

లోయల్ని దాటేందుకు భయం మాత్రం లేదు
తన నిలయం చేరే దాక ఆగేదీ లేదు

దారిలో అగ్ని శిఖ అయితే దారుణం
మధ్యలో ఘన శిల అయితే విచిత్రం

నడచి నడచి ఏ ఊరో చేరి
ఒక ఇంటి గేటు ముందు ఆగిన మనిషిని
ఎవరో గుర్తుగా పలకరించడం విశేషం.
కాలంలో మారే కథలో పాత్రలతో
మారని హృదయంతో మానవ రాగం ఒకటే
ఊరు అదే! నిలయ మదే! ఉన్నది వాస్తవ రూపం.

స్వేచ్ఛా కవిత్వం - 62

# ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం

## దీర్ఘ కవిత

మాదిరాజు రంగారావు

2015
రసధుని - సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Free Verse - 62

# INKA BAHU DURAM LO PRAJA SVAAMYAM

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2015

*Presented*

*to my second daughter*

**Prof.** ***M. Charitha***

California - U.S.A

*with affection and blessings*

*on*

*her Birthday*

11th June

# ప్రవేశిక

స్వేచ్ఛా కవిత్వం పరంపరలో "ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం"– కృతి (62) అరవై రెండోది. ఈ వస్తువుకు సంబంధించినవి, ఇంతకు ముందు వెలువబడినవి, 1. చెదరిన ప్రజాస్వామ్యం 2) గాయపడిన ప్రజాస్వామ్యం. ఇది మూడోది 3) ఇంకా బహు దూరంలో – ప్రజాస్వామ్యం – కలిసి త్రయంగా భావించవచ్చు. ఒకే వస్తువు సూత్రంగా కలవి. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛతో పాటు రావలసిన నిబద్ధత కావలసిన నైతికత ఉండవలసిన దార్శనిక స్పృహ – హక్కులతోపాటు బాధ్యతల్ని గుర్తు చేస్తాయి. ఇవి వర్తమాన సామాజిక భావనా కృతులు.

వర్తమాన కాలంలో అదుపు తప్పుతూన్న సామాజిక రాజకీయ నైతిక వాతావరణం నేపథ్యంలో ఈ దీర్ఘ కవితలో సామాజిక జీవన భావనా జగత్తు చిత్రితమైంది. వైయక్తికమైన అనుభవ సూక్ష్మతలతోపాటు సామాజికమైన విషయ చిత్రణమూ ఉంది. దీనికి హేతు దృష్టి – మానవీయ స్పందనం – మనస్తత్వ ప్రకాశం – సామ్య వాద ప్రజాస్వామ్య దార్శనిక స్ఫూర్తి కేంద్ర స్థానాలుగా ఉన్నాయి.

సృజన చేతనతో ఆవిష్కారాన్ని పొందిన ఈ కృతిలో కొత్తదనంకై ప్రయత్నం జరిగింది. దీన్ని అభివ్యక్తి కళలో నిర్మాణ విధంలో భావ ప్రసారంలో గమనించవచ్చు. కవిత్వం లేని మానవ దశ లేదు, కవి లేని సమాజమూ ఉండదు. వ్యక్తి నుండి సమాజం ఎంత రిఫైన్ అయితే అంత ఉన్నతమైన స్థాయిలో కవిత్వం వెలువడుతుంది. పాఠకుల్లో శ్రోతల్లో వివిధ స్థాయిలకు చెందిన వారు ఉంటారు. అందువల్ల స్థూలంగా మొత్తం మీద సాధారణ ప్రమాణ రూపాన్ని దృష్టిలో ఉంచుకొని చెప్పినమాట. ఏ దార్శనిక మయినా ప్రేమ కరుణ సహనం శాంతి చివరకు అంతా కోరేవి. ఇవి చేకూరే మార్గాలు భిన్నంగా ఉంటాయి, ఇక్కడ భేదించడం జరుగుతుంది. దీనితో వైవిధ్యం ఏర్పడుతుంది.

ఈ దృష్టితో ఈ కృతి స్వేచ్ఛా కవిత్వంలో సహృదయ సమాలోచనార్హమైందిగా భావిస్తాను.

**– మాదిరాజు రంగారావు**

# ఇంకా దూరంలో ప్రజాస్వామ్యం

## దీర్ఘ కవిత

### 1.

ఇంకా దూరంలో ప్రజా స్వామ్యం
చేరాలిసిన గమ్యం మిగిలి
పొందాలిసిన పూర్ణత మిగిలి
చేరువలో ఉన్నట్లుగ అనిపిస్తుంది

సమయం చెక్కిన శిల్పంలా రాదు
చర్యలతో ప్రవహించే హిమ ఖండం

మనుషుల కోర్కెల పరిపూర్తికి
రణ వరణంలో తరిగిన విభవం
హృది మాసిన మానవ సౌందర్యం
స్మృతిలో మెరుస్తాయి అపుడపుడు

ఒకటొకటి తలపడి వైరుధ్యాలతో
నిరాశ జలధిలో ముంచవచ్చు
తాప శిఖలపై నడిపించవచ్చు
కొందరు గెలుపు అలపై తేలవచ్చు

ఒకటి సర్పంలా చుట్టు కొన్నది లేచి
ఒకటి విహగంలా ముడుచు కొన్నది ఎగిరి
భవిష్యత్తుపై ఆశలు విప్పార జేస్తాయి

వైవిధ్యంతో పరివర్తన కేంద్రంగా
పునర్భవ జీవన గుణంతో ప్రకృతిలా
అన్నిటికీ సిద్ధంగా ఉంటుంది మనోరూపం

ఒక సమయంలో హంతకుని పాత్ర
ఒక తరుణంలో హతాశుని పాత్ర
తెలుపు ఎరుపు నలుపు రంగులలో
ఇరువురి మధ్య సన్నని రేఖ వేరు చేస్తూ!

అప్పటి వరకు ఉన్న విభజన రేఖ
క్షణంలో అదృశ్య మయిపోతుంది
సమస్యల పునాది రాళ్ళను బయటికి తీస్తూపోతే
జీవన నిలయం ఉనికికి ప్రమాదం

శైశిర దృశ్యం అవతరిస్తుంది
విలయ ముఖం చూపిస్తుంది

అలజడిలో చేరే వ్యక్తు లెందరో
అందరి నిరసనలో గళ రవ మొకటే

ద్వేషంలో మనిషి నుండి ఉద్రేకం
అపుడపుడు ఫూత్కార రవం వినిపిస్తుంది
కోపంలో మనిషి నుండి ఉద్వేగం
అపుడపుడు పిడుగు పాటు ధ్వని నినదిస్తుంది

ఎంత గొప్ప రంగుల కల అయినా
తెలివి అణగిన నిద్ర లోనే సాధ్యం
మదిలో వాస్తవ మూలంతో ఉంది
మెలకువలో జ్ఞాపక చిత్ర మవుతుంది

చితికిన బ్రతుకుల సంక్షోభంలో
కీలక పాత్రను పోషించిన వాస్తవం
చరిత్రలో గుప్తంగా అణగి ఉంటుంది
కథలు చెప్పుకోడానికి మిగులుతుంది

తెల్లని కాగితంలా చేతి కందే రోజు
అర్థవంతమైన అక్షర పంక్తులతో
సార్థకమయితేనే! మనిషికి సంతోషం
మషీమయ మయితే! పరివేదన
బూది పొరలు రాలితే! విషాదం
ఏ ఘటన మరో ఘటనకు డిటో కాదు

చర్యలతో జనం అనుభవాలు నింపుకొనీ
పగలు రాత్రి బుజాలపై కాలం!
మనిషికి మిగిల్చేది చరిత్ర అయితే
మనసుకు పట్టేది! జీవన వికాస తేజం

## 2.

ప్రాణ రూపం ఉన్నంత వరకు
విశ్వ ప్రేమ! సుందర వనిలో పరిమళంలా
తలుపులు మూసిన ముంగిట్లో వెలుగులా
లో నుండి మనిషికై! వేచి ఉంటుంది

వెలుగుల్ని పట్టుకొని భద్రంగా
పెట్టెలో దాచాలని అనిపిస్తుంది, కొందరికి
ఇది అయే పని యేనా?
చీకటి పూర్తిగ పోవాలని అనిపిస్తుంది, కొందరికి
ఇది జరిగే పని యేనా?

వెలుగులు చేతికి చిక్కవు
చీకటి మనిషిని వదలదు
చీకటి నుండి వెలుగుకూ
వెలుగు నుండి చీకటికీ!
విలువైంది ప్రతిదీ పెద్దలకు
పెట్టెలో భద్రపరచి తాళం వేయాలనీ
ప్రియమైంది ప్రతిదీ పిన్నలకు
బయలు పరచి అందరికీ చూపాలనీ!

తాళం చెవి మాయం చేసే పనిలో ఒకరు
పెట్టెను బద్దలు కొట్టే యోచనలో ఒకరు
పోయిన వస్తువుతో ఒకరు!
విషాదం తలుపులు తెరవబడీ
దొరికిన వస్తువుతో ఒకరు
ప్రమోదం తలుపులు తెరవబడీ!

తళుకులు చిమ్మే! గాజు కన్ను చూపులతో
వాడని ప్లాస్టిక్ పూల గుత్తి ముఖంతో
లో నుండి బయటికి అడుగులు వేస్తూ
రోబొట్! ప్రతి ఒక్కరిలో
తానుగ నడిపిస్తుంది! కావలసిన వ్యవహారం!

అసలు రూపం లోపల స్ఫటికంలా హిత పీఠంపై
విశ్లేషణ వివరణ నిర్ణయ గుణ పాత్రలలో!

భూమి దున్ని విత్తు నాటే క్రియలో
ఎవరి అవసరం మేర శ్రమలో వారు
కట్టెలకై చెట్టు నరికే పనిలో
ఎవరి లాభ సాటి విధంలో వారు

మర్రి విత్తనం లా ఆలోచన నాటుకొనీ
శాఖోప శాఖలుగా దిగే విస్తరణ రూపం
బడలికలో ప్రాణికి ఆశ్రయ మవుతుంది

దిశలు కొన్ని మాత్రమే! దారు లనేకం
తాను వెళ్ళే దారి ఒకటే!
చుట్టూ దారులనేకం! ఎందరో పయనం

నీలి మబ్బు తడి సిగ్నేచర్‌తో
పచ్చ దనం కై నేల ఎదురు చూస్తుంది
భాగ్య వశం కై మనిషి ఎదురు చూచేను
శాంత జగం కై మనసు ఎదురు చూస్తుంది

విగ్రహ భావం వదలి పూర్తిగా
కణకణాన సృజన గుణంతో
పూవులా విప్పారే ఆలోచనతో
మబ్బులా కదలే వర్తన శీలంతో
జీవితం సరించడం అవసరం!
లేంది! ప్రజాస్వామ్య మొక "జోక్" అవుతుంది

## 3.

‘శాంతి’ పదం కవచమై ఆదుకొనే ధైర్యంతో
జీవితాన్ని యథేచ్ఛగా నడపాలని కోరిక!
స్వేచ్ఛలోని అవకాశం తన వరకే పరిమితమై
ఎవరికి వారొక ద్వీపం కావాలని కోరిక

సంఘ పురో గమనంలో జన హిత మొక కలయై
స్వార్థ గోపురంపై తిష్ఠ వేయాలని కోరిక
ఒక దోషం పై మనిషిని శిక్షించే క్రియలో
తళ తళలాడే యశసును పొందాలని కోరిక

జీవితాన న్యాయం నీతి మాటల మెరుపులతో
సమ ధర్మం గగనం అంచులు చూపాలని కోరిక

మంటల వెనక నుండి జల సేచనలా
వైరుధ్యాలకు దీటుగ సంస్కరణ పథంలో
పరివర్తనలో పలు శక్తుల చలనంలో
సమన్వయం! రావాలని కోరిక

ఆశయాల కలయికతో! దార్శనికంచే
తరం నుండి తరానికి మారే సంఘాన్ని
ఎవరికి వారు తమ ఊహకు చేతకు
చేరువగా నడపాలని కోరిక

చేతికి నెత్తురు బొట్టు అంట కుండా
మార్పులు పొందిన మానవ దశ లెన్నో!
ఆ యోజనలో స్వేచ్ఛకు పెద్ద పీట
వేసి చూపాలని కోరిక!

అహం క్రియకు వెనక నుండి తేజో రూపం
ఎదగ జేయవచ్చు, కాల్చి వేయవచ్చు
ఇది శక్తి ప్రదర్శనలో ఒక భాగమై
కదిలిక పొందాలని కోరిక!

ఆయుధం అవసర మొక స్వల్ప కాలికం
రాజ్యానికి రక్షణగా నిశ్శబ్దంగా
అధికారంలో సహక్రియకు అండగా
ఉండాలని కోరిక!

ఒక వైపున దారిని చూపే దార్శనికం
ఆర్థిక సాంఘిక రాజకీయ రీతులతో
ఆకాంక్షల నవోహలకు, ఆచరణం
చేరాలని కోరిక!

ఆలోచన బూజు పట్ట కుండా
ఆశయం చిలుము పట్ట కుండా
ఉత్సాహంలో వెచ్చని లహరులతో
బ్రతకాలని కోరిక

ఎప్పటికీ ఇంతేనా? అనుకొని
ఆశల గోపుర శిఖరాలపై
అంగలు వేస్తూ, ఆటంకాలను
దాటాలని కోరిక!

కోరిక తీరే దెప్పుడు?
గమ్యం చేరే దెప్పుడు?
పూర్ణత పొందే దెప్పుడు?
ఇప్పటికీ బహు దూరంలో ప్రజాస్వామ్యం

# 4.

భూగోళం ఆకర్షణ నుండి
బయట పడడ మంత సులభం కాదు
కొన్ని అవసరాలలో విశేష సందర్భాలలో
వైజ్ఞానిక సాధనాల తోనే సాధ్యం!

పడవలో వెళ్ళవచ్చు జలాలపై తరలవచ్చు
విమానంలో సాగవచ్చు గగనంలో
అపూర్వాన్ని సాధించే మానవ శక్తిపై
విశ్వాసంతో పయనం సాగుతుంది

పాత ఆవరణం నుండి
కొత్త ఆవరణం లోకి
పాత అనుభవాల నుండి
కొత్త అనుభవాల లోకి

చుట్టూ పరిమిత సమూహంతో
వలయంలో ఉండే సంబంధం వేరు!

నేల పైకి రాగానే విశాల సమాజంలో ఒకటై
రిబ్బన్‌లా చుట్టిన ఏకాంతం వదలుతుంది

స్వేచ్ఛాచరణంతో భూమిపై జీవితం
పెరిగిన బాధ్యతతో! దూర దూర పయనం

మదిలో ఊహ సూచి దారులు చూపిస్తుంది
హృదిలో గుండె లయ! ధైర్యం సాగిస్తుంది
ముళ్ళ మధ్య గులాబి ముఖ మెత్తుతుంది
భయ సర్పం పుట్ట లోకి వెళ్ళిపోతుంది

ప్రతి మైలు రాయికీ! యశో మూర్తులు
ఒకరొకరు! దార్శనిక ప్రకాశంతో
శంకరుల నుండి మార్క్స్ వరకూ ఎందరో
పయనాన్ని సుగమం చేసే ఉత్తేజంతో

మానవ జాతికి బహు సుఖదంగా ప్రేరణగా
ఆదర్శం చేతనతో చలన రూప మిస్తుంది
శూన్యానికి అంకెలతో విలువలు పెంచుతుంది
వ్యక్తికి దిశనూ సంఘాని దశనూ చూపిస్తుంది

టప టప రాలే చినుకులతో వర్షం
పని చేసే టైప్ రైటర్ ధ్వనిలా
హితమో సూచనయో సందేశమొ! సంకేతమొ!
ప్రభావంలో యథార్థం తరువాత గాని తెలియదు

పురోగమన శీలంతో చరిత్రలో మనిషి
దేనితో పోటీ లేదు
దేనికీ ఉజ్జీ కాదు

ఒకరి అవసరం ఆసరాగా మరొకరు
ఒకరి అస్తితను మీరాలని మరొకరు

క్యాలెండర్‌లో అంకెల వలె
రోజులు మౌనంగా జరగవు

చాచిన వెలుగు రెక్కలపై పగలు
కదలే చీకటి బుజంపై రాత్రి
మనిషిని తిప్పుతాయి జీవన దృశ్యంలో

మనిషిని కొలిచే సాధన మెక్కడుంది?
ఎవరి వ్యక్తిత్వం వారిది ప్రత్యేకతతో
ఒకరి ప్రమాణంలో విలువలు
మరొకరికి పనికి రావు, నప్పవు

భూమి! ఎప్పటిదో పరిచిన హృదయంతో
సమయ సమయం! మారుతుంది దృశ్యం
రవి బింబం అదే! రాగ బంధంతో
పరివర్తనలో గమ్యం! మారుతుంది యానంతో!

# 5.

పృథ్వి విశాలం జీవితం అగాధం సమాజం అమేయం
దారు లనేకం, నిలయానికి ప్రవేశా లెన్నో! రహస్యా లెన్నో
గతాన్ని మరిపిస్తూ నడిపిస్తుంది వర్తమానం
ఎక్కడి కక్కడ మితంగా స్వతంత్రంగా కదలిపోతుంది

అన్నీ కలిసి చరిత్ర అవుతుంది
కాలాన్ని దశలుగా తలపిస్తుంది

నడచే దారి నీయని భూమి లేదు
కదలే గాలి నెరగని చోటు లేదు

తెలిసిన బ్రతుకులకన్నా
తెలియని బ్రతుకులు ఎన్నో!
వచ్చిన ఉదయాలకన్నా
ఇంకా రావలసిన వెన్నో!

ఎప్పటి నుండో సమాజంలో దు:ఖం
ఒక చోట రాశి పోసినట్లు చీకటి

రెక్కలు లేని మనిషికి ఏ రోజూ ఉదయం!
ఒక స్వర్ణ పంజరాన్ని బహూకరిస్తుంది
దివి నుండి దిన మణి కిరణం
భూమిని స్పృశిస్తుంది సప్రియంగా

మనిషిని మెలకువకు పురికొల్పుతుంది
చుట్టూ ఎత్తునూ లోతునూ చూపిస్తుంది

వెలుగు నుండి మెలకువతో తేజంతో
మానుష వర్తనలో మలుపులతో మార్పులతో
పలు రంగుల్లో సమాజ దృశ్యాలు!

స్వప్నంలా మెరసే మంచు పటంతో
జీవన వాస్తవం ప్రవాహమై కదలుతుంది
ఉత్సాహం ఒలుకుతుంది ప్రకృతిలో
ఉద్వేగం దుముకుతుంది మనిషిలో

## 6.

జనని గర్భం నుండి బయటికి రాగానే
ఏకాంతం అంతరించి, సమాజం వరిస్తుంది

విరుద్ధ స్థితుల మధ్య మనిషి! అస్తితతో
మేఘ గర్జను స్వాగతిస్తూ
పెను గాలిని సహిస్తూ
ప్రకృతిలో తట్టుకొనే చేవ ఉన్న చెట్టులా!

మనిషి బతక లేడు చెట్టులా
శిల్పంలా నిలవలేడు సంఘంలో

ఏ దిశ నుండి ప్రశ్న వీచినా
సమస్యకు జవాబు అవసరం
ప్రశ్న మనిషిని బంధించవచ్చు
అపుడు! అడుగు ముందుకు సాగదు

బ్రతుకులన్ని సమానం చేయడానికి
క్లోనింగ్‌లో తీర్చిన మొక్కలు కావు!

సరి ఎత్తులో నిలపడానికి బ్రతుకులు!
వీధిలో నిలిపే దీప స్తంభాలు కావు
జీవన సార్థానికి హేతు దృష్టి వివేకంతో
మనిషిగా సమాజంలో బ్రతకడ మొకటే!

దేశ భక్తికి రంగుల చిత్రాలు అద్ది
జాతి కీర్తి మూర్తిని కల్పనతో నింపి వేసి
చరిత్రలో చోటు దొరకని నిజాలెన్నో?
వచ్చే తరాలకు తెలియని రహస్యాలెన్నో?

జలధిలో అలల అక్షరాలతో
తెరచిన పుస్తకంలా వర్తమానం
జీవిత కాలం చదివినా ముగిసేది కాదు
చేరాలిసిన గమ్యం! ఇంకా మిగిలీ!

# 7.

ప్రతి వ్యక్తిలో కనీసం ఒక శత్రువు
తప్పని సరిగా ఎప్పటికీ ఒక నిప్పుకణం!
ఆలోచన ఆచరణంలో గుప్తంగానో స్పష్టంగానో
మనసుల మధ్య విద్యుదనల రేఖలా

దాటేందుకు ఎవరి ఉపాయం వారిది
ఉపాయాలు ఎదురు పడవచ్చు, పోటిపడవచ్చు
ఎప్పటికి దారి దొరికేది తెలియదు
ఎప్పుడు? ఎక్కడ! నిలిచేది తెలియదు

ప్రతి రణ విజయంతో సమాజం
పొందే ప్రయోజనాలతో పాటు
పోగొట్టుకునేవి! తక్కువేమీ కాదు,
తిరిగి రాని, పోయిన ప్రాణాలెన్నో!
మోయ రాని కష్టాలతో నష్టాలతో
శిథిలమైన శీర్ణమైన సంపదలూ

చరిత్రలో అంతగా దృష్టి పడని
జన వేదన! మరో చరిత్ర అవుతుంది

బ్రతుకులో శత్రుతకు గురి కాని విషయం లేదు
అవసరాన్ని మించినపుడు! నిశ్శబ్దంగానో సశబ్దంగానో

కాలం తెరచాటున మరుగున బడిపోయిన
చరిత్రలో వాస్తవ రూపం! హేతువు కతీతం కాదు

ప్రశ్నతో వెలుగు, ముఖం ఎత్తుతుంది
జవాబుతో చీకటి, తల దించుతుంది

గమనం ఏ దిశలో నైనా సాగవచ్చు
పగలు రాత్రిని మరపించే పయనంలో!
గమ్యం చేరే ఆలోచన ఒకటే చాలదు!
విలువలతో అనుభవం గగన కుసుమం కాకూడదు

## 8.

ఊపిరికీ ఊపిరికీ మధ్య విరామం
మనిషిలో ప్రాణ దీపానికి స్తిమితం కూరుస్తుంది

బయట పడిన శిశువు తొలి స్వరం
నిశ్శబ్దాన్ని చీలుస్తుంది పాయలు పాయలుగా
తీవ్ర తీవ్ర స్థాయిలో! శబ్ద చిత్రం వదలుతుంది
కనిపించని చీకటిని దూరం విసరుతుంది
మనిషిలో వెలుగుకు అవకాశం ఇస్తుంది

మనిషిలో నిశ్శబ్దం నిండు గోదావరిలా
నిశ్శబ్దం మనిషిలో పూర్ణ చంద్ర బింబంలా
పతాకలో నిశ్శబ్దం! అభిమానం ధ్వనిస్తూ
శిల్పంలో నిశ్శబ్దం! కళా హృదయం స్పందిస్తూ

ప్రతి మహా కార్యానికి ముందు నిశ్శబ్దం
నిలబడే ధైర్యానికి ఆసరా అవుతుంది
ఎత్తిన ఆయుధ ముఖంలో నిశ్శబ్దం
వివేకానికి ఒక అవకాశ మిస్తుంది

మంచు శిలలు కరిగి ప్రవాహ మవుతుంటే
మదిలో సంతోషం అలలు! నిశ్శబ్దంగా
నదిలో అంచున హంసలు తేలుతూంటే
ఎదలో సుందర సృజన లోకం నిశ్శబ్దంగా

పై నుండి రవి కిరణం దిగుతుంది నిశ్శబ్దంగా
గుండె తట్టి జీవన రుచికై మేల్కొల్పుతుంది

మానవతా మనోజ్ఞ స్వరం విశ్వమయంగా
అనుభవ జగంలో మాత్రం! నిశ్శబ్దంగా
నిశ్శబ్దం నుండి శబ్దం! సమాజ జీవన స్వరం
కవిత స్వనిస్తుంది శబ్ద విపంచిపై ఆత్మకళతో
వేదన తరలుతుంది అక్షర పంక్తిలో నిశ్శబ్దంగా

# 9.

మేనిఫెస్టో లొకటొకటి! వాగ్దానాల్ని మెరపిస్తూ
శుష్క భూమిపై గడ్డి పోచల తృప్తికి మితమై
దార్శనికా లొకటొకటి! పరివర్తనల్ని వెలిగిస్తూ
వేదికపై చీకటి ముఖాల మోదానికి కారణమై

సూర్యుణి చంద్రుణ్ణి మరపించే వెలుగులతో
దిగువ నున్న బ్రతుకులు! అనుభవ రుచి పొందాలని
ఒక మేనిఫెస్టో పక్కనే మరొకటి పోటిగా
ఒక దార్శనికం పక్కనే మరొకటి చేరుతూ

రాజకీయ తంత్రంలో భాగమై
దేని దిశ దానిదే, సరికొత్తగా

నేలపై నడక సాగుతూ ఉంటే
ఏదో ఒక వాహనం తటస్థ పడుతుంది

గజం రథం అశ్వం ఎప్పటివో!
యంత్రమయం వాహనం ఇప్పటిదీ
మనుషుల తీరని కోరికపైనో!
వ్యక్తిని కిడ్నాప్ చేసేందుకో

కళ్ళు ఉన్నా చూచే కోరిక అవసరం
చెవులు ఉన్నా వినే కోరిక అవసరం
అవసరాల ప్రాధాన్యం! ఒకరొకరికి వేరు వేరు
ఒకరిచే పురస్కృతం కావచ్చు, తిరస్కృతం కావచ్చు

ఏ మానిఫెస్టో సమస్యకు పరిష్కారం కాదు
ఏ దార్శనికమూ ప్రశ్నకు అతీతం కాదు

అరణ్య రహస్య బంధంతో
భవిష్య సమాజ చింతనలో
సమస్య పరిష్కృతికి కనబడి కనబడకుండా
ఒక దిశలో నుండి! ఆయుధ చలనం

ఉద్రేకంతో ఊగే వాతావరణంలో
పొగ వాసనతో పరివర్తన పవనం!
కఠిన వాస్తవాల్ని మానవీయ కోణంలో
చూపే యత్నంతో ఘర్షణ మొదలవుతుంది

కంటికి నిండుగా నిద్ర ఎరగని ప్రతి రోజు
ఒకదాని వెనుక మరొకటి! పరుగెత్తే అశ్వాల్లా

క్యాలెండర్ తేదీల్లో నెత్తురు మరకలు కనిపించవు
బ్రతుకులు మాత్రం! నెత్తురు గీతల చిత్రాలవుతాయి

మార్పును సాధించే పనిలో హింసా మార్గంలో
ధైర్య సాహసాలు! విస్ఫోటన చర్యలలో ఏండ్లుగా
ప్రతి కదలిక! రహస్య వార్తా సూచనపై
ప్రాణ భయంతో! అరణ్యంలో ఉదగ్ర బృందం

మధ్యాహ్న వేళ మార్తాండ హృదయంతో
అమావాస్య రాత్రి సినివాలి రహస్యంతో
తీక్ష్ణమైన మారణ చర్యలతో సమాజంలో
నిప్పు పూలతో! సౌభాగ్యం నింపాలనీ!

కాలాన్ని నిప్పులపై నడిపించే యోజనతో
హఠాత్తుగా చెలరేగే విప్లవ పవనం!
కదలే మేఘాలను చెదరగొడుతూంది
ఆయుధంతో పూచే వసంతాన్ని కోరుతుంది

హృదయాన్ని చెట్టు కొమ్మకు తగిలించి
చరిత్రకు నిప్పు దుస్తులు తొడుగుతూ
ఎర్రని మచ్చలతో నల్లని బింబాలు! తిరుగుతూ
మౌనంగా ఉన్న వాతావరణం! ఒక్క మారు పేలుతుంది

ఎపుడేది జరిగేదీ తెలియని కాలం
వెల్లువలా దూకుతుంది, వరదలా సాగుతుంది
పరుగులతో తరలు తుంది, ప్రజాస్వామ్య స్వేచ్ఛలో
వినాశన పర్వంలో, శవాల్ని మోసుకపోతుంది

అనుకున్నది సాధించే రాతి గుండె ధైర్యంతో
ఇప్పట్లో చేర లేని దార్శనిక లక్ష్యంతో
జీవిత మంతా హింసకు దారుల అన్వేషణలో
సందేహం వదలి, నిర్ణయం బయటపడి
సమస్య జటిలమై, కౌగిలిలో వదలని ఆయుధంతో
అశాంతి వలయంలో చిక్కిన సాయుధ మూర్తులు!

సమాజ భాగ్యంలో సృజనకు ప్రశ్నగా
ప్రజాస్వామ్య రూపానికి అగ్ని పరీక్షగా

# 10.

ఆకలి చావుల పట్ల ఉపేక్ష
నవీన యుగంలో అమానుషం
పల్లె అయినా నగర మయినా
దరిద్రంలో జీవితాల ఆర్తి ఒకటే

ఒక దేశం  మరో దేశంతో ప్రపంచమంతా
అనుబంధంతో విస్తరణం! సమాజ లక్ష్యంగా
ఆర్థిక నీతిలో భాగం ప్రపంచీకరణం
ఆదుకునే మానవీయ కోణంతో సార్థకం

ఉద్దేశం ఆదర్శ రమణీయం కావచ్చు
అనుభవంలో సామాన్యుల జీవన చలనానికి
ఆటంకం కారాదు బ్రతుకు తెరువు మూయ రాదు
మానవతా బంధానికి సెలవు చీటి కారాదు

బడుగుల బ్రతుకులు ఎడారిలో విసరబడీ
లోహ పదం దరిద్రానికి కానుకగా లభించరాదు

మనిషిలో స్వార్థం! సమయంకై వేచి
ప్రాంతీయ వ్యాపకాల్ని గ్రహణంలా మింగేసి
ఇనుప కాళ్ళతో ఇనుప ముక్కుతో వాణిజ్యం!
సామాన్యుల బ్రతుకును తన్నుక పోచూస్తుంది!

శ్రమ జీవన రూపం పరీహాస పాత్ర మవుతుంది
అంత వరకు సాధించిన దేశీయం వాలి పోతుంది

అగ్గి పెట్టెలో మడవ దగిన సిల్కు చీరెలా
కంప్యూటర్‌లో ఒదిగిన ప్రపంచ కార్య కలాపం!

పేపర్‌తో పెన్‌తో పని లేని అంతర్జాలంలో
ఆలోచనా రీతులు! ఆన్ లైన్‌లో చాక్షుషమై
సాంకేతిక విభవంతో అక్షర చిత్ర ప్రపంచం
ఎంత దూరమయినా మెరపులా! పయనిస్తుంది

ఒత్తిడిలో మానవతను కోల్పోని మతి విలసనం
మనిషి ఎత్తు! పెంచుతుంది సాంకేతిక విజ్ఞానం
మానవ శక్తికి కొలమానం! పై స్థాయిలో
దీని ఉపకృతిలో వెలుగులు సమాజ చరిత్రలో

## 11.

గతిలో జీవన సుఖ హిత భావనతో
వేణువా! వీణా! సితారా! వయొలినా! మరొకటా!
వెనక నుండి స్వనిస్తుంది సన్నని ధారగా
ప్రాణంతో కలిసి సరిస్తుంది
మనిషిని మేల్కొల్పుతుంది
మనసును కదలిస్తుంది

ఆశా భూమికపై
ఉత్సాహ లహరి నింపుతుంది
ఉత్తేజ గతిని పెంచుతుంది
అంతరాత్మ స్పందనం వినడం ఒక విశేషం

లేంది మనిషి నిరాశలో భయ ముద్రతో
గుహ నుండి సౌధం దాక వచ్చేనా?
విజ్ఞాన వికాసాలతో సంస్కృతి
తన అనుభవ గత మయ్యేనా?

ఉపజ్ఞతో ఉపాయం వెదకడం
ధైర్యంతో అపాయం దాటడం
అవసరమే కాదు, మనిషి కర్తవ్యం! కూడా

వేదనతో క్రుంగి బాధలలో మగ్గి
నిరాశ కార్పెట్ పరచే అవసరం లేదు
నిందల మూటను విప్ప నవసరం లేదు

విషాద ముద్రలతో క్షణాల్ని పరుగెత్తించలేం
ప్రతిష్ఠ తెరలతో దోషాలను విస్మరించలేం
కవులను కదలించని విషయం లేదు జీవితంలో

జారే కన్నీటి బిందువులో వేలాడే
కొత్త కథను చూడక తప్పదు
ఆశయాలతో కదలే మహానేతల గమనంతో
సాగే ఉద్యమ చరిత్రలో భాగం కాక తప్పదు

ఏదయినా మనిషికీ సమాజానికే కాదు
అంత రంగానికీ ఎప్పటికీ! జవాబు దారి!

జీవన బాధా రవాలు, వేదనా స్వరాలు
చెట్లు దాటి గిరులు దాటి కదలుతూ
వేడెక్కిన వాతావరణం ఎవరిని కదలించదు
సూదుల్లా గుచ్చే క్షణాల నెవరు మరుస్తారు

ఒకరి కొకరు ఎదురు బడుతూ కలుస్తూ
తప్పని వేషాల్లో బ్రతుకులు గడుపుతూ
వేషం తీసాకే! అంతరంగం గురించి ఆలోచన

బుద్ధుని తేజ శ్చక్రం కనిపిస్తుంది
గాంధిజి శాంత బింబం నిలుస్తుంది
వేషం తీసాకే సమాజ శ్రేయం గురించి ఆలోచన!

నిజానికి వాదాలు చర్చలు పరమావధి కాదు
వీటితో దార్శనికం మలిన రహితమవుతుంది

అంతరంగ స్పందనతో పరిష్కారం లభిస్తుంది
అయితే కొత్త కథతో కొత్త వేషం రావచ్చు

అద్దంలో చూచే తన ముఖంలో
వెలుగే కనిపిస్తుంది అందంగా
అదే ముఖం! మరొకరికి! మరో విధంగా
అద్దం తొలగిస్తే కనిపించే ముఖం వేరు

కల్పనలో కలలో దృశ్యాలు నిజమవుతాయా?
అమాయకమైన ఆలోచన! కవితకు ఒక ఆకర్షణ

తప్పిదమో! దోషమో! తప్పనిదో! ఏదయినా
చీకటిలో దీపంతో వెలుగులో వివేకంతో పని!

జ్ఞాపకాల భయాలతో ఏమి చేయ గలడు మనిషి?
వర్తమాన క్షణాలలో మేల్కొన్న ధైర్యంతో తప్ప!

ఈనాడు సమాజానికి విలువలు పెరిగేది
నైతిక చేతనతో ప్రజాస్వామ్య వ్యక్తిత్వంతోనే

## 12.

చూపులో చుట్టూ జన సందోహం
ముందున్న ప్రకృతి వెనక్కి వెళుతుంది
సమాజం! మరీ ముందుకు వస్తుంది
దృశ్యంలో వ్యక్తి పాత్ర ముఖ్యమవుతుంది

క్షణాలు విసరిన పాచికల్లా
పందెంలో ఆటను వేగిర పరుస్తాయి
మనిషిలో అహంభావం ముందుకు నెడుతుంది
జీవన గ్రంథంలో పుటలు తరలుతాయి

ఉండీ లేనట్లుగా ఉన్న ఫుట్‌పాత్
ఒక వైపున పొడవునా రోడ్డు పక్కన
కత్తి అంచున నడచినట్లు ఉంటుంది
వేగంగా వాహనాలు! సదమద జన సమ్మర్దం!

తనలో ఒక కారు
ఆ కారులో ఒక సామాన్యుడు
ఇది కాకపోతే మరో అవసరం
ఆలోచనలో కోరిక ఫల రూపం
నిజమయ్యేనా? ప్రశ్నకు
జవాబుగా కాసేపు బోనులో

దారిన నడుస్తూ ఉంటే గోడలపై రాతలు
బ్రతుకును మార్చే దారుల సూచనలు
గోడలు మాట్లాడ లేవు కాని
అక్షరాలు సైగ చేసి చూపగలవు

ఊహా ప్రపంచం అక్షరాల్లో దిగుతుంది
చేతన సంస్పర్శతో అనుభవానికి వస్తుంది
ఏ శిక్షణతో పని లేదు
ఏ ఉపదేశం అవసరం లేదు

కాలాన్ని లాక్కొని పోతుంది ఆలోచన
నిజాల్ని బయట పెట్టే ఉత్సాహంతో
ఎక్కడో మూలాల్ని బయట పెడుతుంది
అవి తెలిసి తట్టుకునే దెవరు?

ఏ మనసు శుభ్రంగా ఉంటుంది? అద్దంలా
ఏ నీడల బొమ్మలో కదలుతాయి
ఏ మలిన చిత్రాలో జారుతాయి
అద్దంలో ప్రతిఫలన గుణం పోతుంది

శాంతి సహనం ప్రేమ కరుణ బీజాలతో
పూల తోట అవతరణం సులభం కాదు

క్షుభిత లిప్తల నుండి
విలయ చర్యల నుండి
వెనక్కి జారిన ప్రకృతి
ముందుకు రానే వస్తుంది

మనిషికై మనిషి బ్రతుకుతూ
మనిషితో మనిషి కదలుతూ
కవి మాత్రం సమాజ చలనంతో కవితలో
ఏ సూర్యుణ్ణో ఏ చంద్రుణ్ణో తలపించే
తనలో ఆశా బింబం బయటికి వదలుతూ

## 13.

నేరాలు హత్యలు పెరిగి శోక విషాదాలతో
బరు వెక్కిన సామాజిక వాతావరణం
పదు నెక్కిన రాజకీయ మతి తంత్రం
మనిషిని తొలి దశలోకి నెట్టేస్తూంది

రొట్టె ముక్క కై కాదు
అన్నం కబళం కై కాదు

బ్రతుకు అంచులో ఓటమి భయం
అహం భావ విస్ఫోటంతో విపరీతం

మెరసే స్వర్ణ తోరణంలా ఎదురయ్యే ఉదయం
మండే అగ్ని మాలికలతో ఉద్రేక పరుస్తూంది

మొదలు నుండి ముగింపు వరకు బ్రతుకులో
శాంతికై ఆరాటం అన్వేషణం! ప్రతి దశలో

గ్రీష్మం వస్తుంది, చండంగా తీవ్రంగా
జలధిలో బిందువుల్ని ఆవిరిగా మారుస్తుంది
ఉన్న చోటు నుండి పైకి తరుమ బడతాయి
రూపం మారుతుంది, ప్రయోజనం వేరవుతుంది

మానవ సమాజ చరిత్రలోనూ
వైరం పీడన ఘర్షణ సమరం
ఏ దశలో మరపున బడలేదు
అన్నీ పరీక్షకు నిలిచినవే

ఎండలో వానలో మంచులో చలిలో
వెన్నెల నుండి చీకటి నుండి పూవులా
స్పందమాన హృదయం ఎన్నిటినో ఓరుస్తుంది
సృజన చేతనతో వెలుగు రేకులతో నిలుస్తుంది

విషమ ఘడియల నుండి బయట పడుతూ
నవ నవంగా శుభ్రంగా
మనిషికి మానుషతను జ్ఞప్తికి తెస్తుంది
మనసుకు మానవతను స్ఫూర్తికి తెస్తుంది

ఎరువులతో దున్నిన భూమి నుండి మొక్క
ఆహారం అందిస్తుంది భాగ్యం చేకూరుస్తుంది

అవసరం లేని వస్తువు లేదు ప్రకృతిలో
అవసరం లేని మనిషి లేదు సమాజంలో
ప్రతి వ్యక్తిలో నిపుణతకు తగిన విధంగా
ఉపయోగం ఎన్నిక శిక్షణ ప్రజాస్వామ్యం విధి

ఇప్పటికీ బహుదూరంలో! చేరాలిసిన సమాజం
ఎప్పటికైనా అందే ఆశను నిలుపుతూంది ప్రజలో

## 14.

పేదరికంలో ఆకలి ఎరగని దేశం ఉందా?
చెదరు చెదరుగా సమూహ పంక్తులుగా అంతటా

సమాజ వనిలో మానవతా పుష్ప శోభ కోరని
సురభిళ వీచిక తెలియని మనుషులు ఉన్నారా?
ఆ క్షణాన అనుభవ మొక జీవన వాస్తవం
అలంకార మయం కాదు, అహంకార స్పర్శ లేదు

మంత్రంతో పని లేదు తంత్రంతో పని లేదు
ఎవరి ఆజ్ఞతో అనుమతితో అవసరం లేదు

కష్టంలో మనసుకు ఊరట కలిగిస్తుంది
పరిమళ మధు కణ స్పర్శతో ఉత్తేజం సరిస్తుంది

ఆటవికం నుండి నాగరకం వరకు
గుణ రుచి ఒకటే, తర తమ భేదం లేదు

రాజ్యం రణ ఘోషలో నలిగింది
శత్రువు కలహాలతో దగ్ధమైంది
దండ యాత్ర రాపిడిలో శీర్ణమైంది
నిరంకుశంలో అణగి మణగి ఉంది

బాధలు చింతలు కోర్కెలు సమస్యలు
ఎవరికీ తప్పనివీ, ఎప్పటికీ ఉండేవీ

మనిషిలో ఆరని అంతరంగ బింబం
లోని చూపుకు మాత్రమే కనిపించే రూపం
మనసుకు చూచే తీరిక ఉండదు
తీరికలో గొలుసు కట్టు నీడలు క్రమ్మీ!

ఇది కలలకు కథలకు అందనిదీ
మాయకు మర్మానికి దూరమైంది
హింసకు అగ్నికి జడతకు భిన్నమై
అపుడపుడు పచ్చని తోరణం వేలాడుతూ

సరసిలో ఈదే హంసలా మనసులో
ఎపుడు తేలి కనిపించేది తెలియదు

తనకు తెలియంది అయితే
అది రహస్యం, అతీతం!
తనను మీరింది అయితే
అది చతురత, వంచన!
ఈ రెండిటిపై జీవితం! పట్టాలపై రైలులా
పయనంలో తెలియని వారే ఎక్కువగా

సృజన విలయ రూపాలతో జీవితం
ఎప్పటివో సమస్యల మూలాలతో
ఇప్పటికీ చివరి నిర్ణయం కై వేచి
తానే ఒక సమస్యగా మారడం విచిత్రం

సమస్యను ఎదుర్కోవడం మానవ కర్తవ్యం
గమ్యం చేరే పూర్ణత పొందే, ఆశా హృదయం సహజం

గుండె నుండి శబ్ద తరంగం
మృత్యువును దూరాన నిలుపుతుంది
మనిషి వెంట మనిషి, తరం వెనక తరం
ఇప్పటికీ బహు దూరంలో ప్రజాస్వామ్యం

# 15.

వర్తమానం ఒక ఎలివేటర్
క్షణాల మెట్లపై పైకి జీవితం

ఉద్వేగంలో సూర్యుని తేజంతో
ఉత్సాహంలో ప్రకాశ రూపంతో
ఆలోచనా రీతులు! ఒకరొకరిలో
ఇది ఒక రోజుతో ముగిసే విజయం కాదు

పైకి పాకిన తీగెతో గుడిసె!
బీర పూలో మల్లె పూలో మరొకటో,
లోపల శూన్యంగా ఉన్నా
బయటికి కంటికి ఇంపుగా

వీచే గాలులకు ఎగిరి పోదు
మండే ఎండలకు దగ్ధ మవదు!
శూన్యానికి లేదు భయం
లోపలి ధైర్యంతో నిండుగా

మృత్యువును జయించే కల్పన కన్నా
బ్రతుకును స్వచ్ఛంగా ఉపయోగంగా
ఉంచే అనుభవ నిర్మాణ విధం అవసరం

దివి నుండి అమృతాన్ని దింపే ఊహ కన్నా
తనలో మధు కలశాన్ని ఉన్నది గుర్తించి
చరించడం ముఖ్యం! ప్రతి పనిలో
నాలుగు చినుకులకు మురిసే భూమి
మనిషిలో ఆశా ప్రపంచాన్ని సృజిస్తుంది
విత్తు నుండి మొలక! నేలను అలంకరిస్తుంది
మనిషికి జీవన రుచి భాగ్యం తలపిస్తుంది

తృప్తి లేక సానుకూల దృష్టి లేక
సృజన మనో గుణం లేక ఊహలో

ఇల్లు వీడి సమాజాన్ని వదలి
తెలియని అడవిలోకి ప్రవేశ నిర్ణయం

అడవిలో చెట్ల మధ్య గడుపుతూ
కొండ శిలల వెనక దాగిపోతూ
కాలం మెట్ల పై విజయ వికాసాలకు
ఏ రోజూ నిద్రకు ముందు సమీక్ష!

వసంతం ఎరగని ఎడారిని వరించి
కారుణ్యం తెలియని ముళ్ళను కోరి
ప్రాణానికి ముప్పులో సాహస క్రియలో
చుట్టూ జన సమూహాల్లా చెట్ల మధ్యలో

పగలు కొవ్వొత్తిలా కరగిపోతుంది
అడవి మిత్రంలా రహస్యం కాపాడుతుంది

రాత్రి కన్న కలల ప్రభావంతో
పగలు తళ తళ ఊహలు మెరుస్తూ
మండే గుండె ఉత్తేజాన్ని ఇస్తుంది
తల పెట్టిన పని మనసును బంధిస్తుంది

కను రెప్పల మధ్య ఆకాశం నుండి
బాష్ప లవం బదులుగా
అనల కణం జారుతుంది,
పడిన కష్టాన్ని బూది చేస్తుంది

సూర్యుని అస్తమయంలో తేజం ఆవహించి
కదలే ఉగ్ర మూర్తుల ముందు
భయంతో మృత్యువు మాయ మవుతుంది

గమ్యానికి దూరం తగ్గే ఉదయంకై నిరీక్షణం
మానవతా విభాతంతో వికాస ప్రజాస్వామ్యంలో

## 16.

జీవితం ఎక్కడుంది? మనిషిలో మనిషితో
క్షుధలో వ్యథలో చలనంలో మలుపులతో
బాష్ప కణం వెనక నున్న అనుభవ రూపం
నడిపిస్తుంది ఆగకుండా, ఊహను అలంకరిస్తుంది

రణ సన్నాహానికి సైతం అవకాశంలో
మనిషిని గురించి సులభంగా మరపిస్తుంది
మనిషిగా తప్ప, తాను మరే మయినా కావచ్చు

మెతుకు కోసం బతుకుకోసం
క్షణాలు కదలుతాయి అలల్లా వేగంగా
క్షణాలు నిలవచ్చు శిలల్లా అడ్డంగా

కాలానికి అందరూ సమానమే
ఆధిక్యంపై మక్కువ, అసమానత పెంచుతుంది

పూలలో పండ్లలో భేదాల్లా మనోరూపాలు
రూపం రంగు పరిమళ గుణ వ్యక్తిత్వాలతో
అనుకూలం వ్యతిరేకం! మతిలో ప్రయోజన గతిలో

ఉదయం నిద్ర లేపే రవి కిరణంలా
రాత్రి బూది కమ్మిన నిప్పు కణంలా
జవాబుకై ఎదురు చూచే ప్రశ్నలతో
క్షణాలు జారిపోతాయి, పాద రసం గుళికల్లా
వెనక నున్న వాటికి అవకాశ మిస్తాయి
మనిషి మాత్రం అక్కడే! వెనక నున్న బ్రతుకులకు
దారిని మూసేస్తూ! ఆశలు నిలిపేస్తూ!

ఎక్కడి కక్కడ జీవితం ముక్కలు ముక్కలుగా
కులం మతం వర్ణం వర్గం దేశం ప్రాంతం
అన్నిటినీ కలిపే మనోజ్ఞ రూపంతో తీర్చే
ఉద్దేశంలో ఇంకా బహుదూరంలో ప్రజాస్వామ్యం

స్వేచ్ఛా కవిత్వం - 63

మూడో భాగం

# సంస్కృతి

## హృదయం నుండి హృదయానికి

(దీర్ఘ కవిత)

మాదిరాజు రంగారావు

2015

రసధుని - సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Free Verse - 63

# SAMSMRUTHI
# &
# HRUDAYAM NUNDI HRUDAYANIKI

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2015

*Presented*
*to my wife*

***Smt. Indira***

*on her Birthday*
28th March

# పీఠిక

ఈ కృతి చిన్న కవితల సంకలనం. దేనికదిగా ఉంది. మొత్తం మీద మానవ జీవితం – సమాజంలో అనుభవ స్థితులతో ప్రజాస్వామ్య దార్శనికతతో కూడిన సూత్ర పంక్తి దృష్టికి వస్తుంది. ఈ కోణంలో దీర్ఘ కవిత స్ఫూర్తికి రావడం సహజం. కవిత్వం (1) రూపం (2) భావన (3) అభివ్యక్తి (4) దార్శనికత నాలుగు లక్షణాలు కలిసిన విధంలో ప్రత్యేకతలతో – కవి వ్యక్తిత్వాన్ని బట్టి అస్తిత్వాన్ని పొందుతుంది.

"సంస్మృతి"లో వాస్తవ భూమిపై జీవన స్థితి గతుల చిత్రణం ఉంది. అక్కడక్కడా దీన్ని సాధారణీకృతం చేసే వ్యాఖ్యాన గుణంతో కవితా రూపాన్ని పొందింది. సమ్యక్ స్మృతి విశేషం, మానసికమైంది. తత్కాలంలో అనుభవాల జ్ఞాపకాల స్ఫురణ కలిగింది. గతంతో అనుబంధం కలిగింది. వర్తమానంతో స్పందించేదీ. భవిష్యత్తును గురించి ఆలోచన చేసేదీ. ఇందులో (1) ఒక పొర కఠోరమైన వాస్తవాలకు సంబంధించింది. (2) మరొక పొర తాత్త్వికమైన అన్వయ శోభను పొందింది. ఈ సంవిధానం ఎక్కడి కక్కడ విషయ బలంతో అనుభవానికి వస్తుంది.

మానవ యానం నిరంతరం సాగే సమాజ పరిణామ ప్రక్రియలో భాగం. ఇందులో వైయక్తికమైన అనుభవాలు లేకపోలేదు. ఇవి సమాజంలో సాధారణమైనవీ, ప్రత్యేకమైనవీ. ఏ దార్శనిక వాదమైనా ఏ రాజ్య వ్యవస్థలో ఏ విధానాలు(Policies) అవలంబించినా (1) బాధ నుండి సుస్థితికీ సంతోషానికీ (2) వేదన నుండి భాగ్యానికీ ఆనందానికీ ప్రయత్నిస్తాయి. ఇవి వ్యక్తి వికాసాన్ని సమాజ హితాన్ని కోరేవి. విశ్వమయతను కలిగినవీ. ఈ రచన వర్తమాన స్వేచ్ఛా కవిత్వంలో సామ్యవాద ప్రజాస్వామ్య దార్శనిక పథంలో పేర్కోదగిన కృతిగా నవ్యతను కలిగింది.

**– మాదిరాజు రంగారావు**

# సంస్కృతి

## 1.

సంస్కృతిలో ఒకటొకటి అనుభవ దృశ్యం
అద్దంలో ప్రతి ఫలన కళామయంగా
ఏ మూలనొ మస్తిష్కంలో పదిలంగా గతం
వర్తమాన లిప్తలలో కదలుతుంది బయటపడి
సంస్పృహ కాప్సెల్‌లో మనిషి భావ జగం
తరం నుండి మరో తరం అందుకునే ప్రస్థానంలో

ప్రవాహాన్ని దాటించే పడవలా వంతెనలా
హెలికాప్టర్‌లా వర్తమాన మొక సాధన రూపం

బాధ తొలగి సంతోషం ఉదయించేందుకు
ఆర్తి బాసి ఆనందం వికసించేందుకు
కోరికలో చేతన! మనిషిలో ఎప్పటికీ
ఏ పని కయినా సంసిద్ధం చేస్తుంది.

## 2.

పగలు పైకి చూస్తే కళ్ళు మండి
మాటల మంటలు పైకి చిమ్మబడి
సూర్యుని నిజ తేజం వెనక్కి తీసేనా?
నిరీక్షణంలో తన కోరిక చల్లగ లభించేనా?

రవి కిరణంలా ఆలోచన సాగేందుకు
సందర్భ బలంతో ప్రకాశ గుణం అవసరం
ఎంతటి వరమయినా ప్రియమయినా
ఎదకు రవిని అద్దుకొనే ధైర్య మెవరి కుంది?

బంధూకం పూల గుత్తిలా సూర్యుడు
మల్లె పూల చెండులా చంద్రుడు
భిన్న కాల దశల సమయ చిహ్నాలు
మనిషి ప్రకృతి నుండి వర్తనలో! కనిపిస్తాయి

## 3.

నిజం పగలు సూర్యునిలా
ఆశ రాత్రి చంద్రునిలా
అపుడపుడు భ్రమింప జేస్తాయి

అనుమానం! కమ్మిన మంచుతో
సందేహం ! మూసిన మబ్బుతో
పొరపాటుకు దారి తీస్తాయి

ఉదయం ఉషస్సు వెలుగులో ముంచి
రాత్రులు వెన్నెల వెలుగులో తడిపి
మనసును పైకి తీస్తుంది! కాలం

రోజు మొదలవుతుంది శుభ్రంగా సుందరంగా
ఊహకు అందీ అందని మలిన ప్రభావం నుండి
యశస్సును కాపాడే బాధ్యత! మనిషిదే

## 4.

అజంతా గుహలో శిల్పం
ఎలోరా గుహలో చిత్రం
చూపుకు ఆర్ద్ర శోభ నిస్తాయి
ఊహకు తత్వ లోక మిస్తాయి

శ్రమ కణాలతో స్నిగ్ధం కాని
అవసర నిర్మాణం ఏదీ సాగదు
పంటలేదు విపణి లేదు పరిశ్రమలు లేవు
నిలయం లేదు వికాస విభవం లేదు

జీవ కళ తొణికే శిల్పం చెక్కే
అగ్గి పెట్టెలో ఒదిగే చీరెను నేసే
చేతులు తొలగించే క్రూర మతులు నియంతలు
నీలి రాత్రిలో ముంచి తీసిన మనసులతో

## 5.

సమాజ చలనంతో వీడని అస్తితతో
భవిష్యత్తుకు దారి తీసే దార్శనిక మతితో
సుమ సమ మస్తిష్కంతో పరిమళ హృదయంతో
మనిషిలో ఆకృతి బయటికి వస్తుంది

నిశ్శబ్దంగా ఉన్న మౌనాన్ని పలికిస్తుంది
శబ్ద శక్తి రూపాన్ని వరిస్తుంది కవిత!
హ్లాదానికి శ్రేయానికి ఆశ్రయమై
ఎంతటి వారయినా తనను చేరవలసిందే

బాధలలో వేదనలో అలసిన మనసుకు
చల్లని ఆర్ద్రగుణం అద్దుతుంది
ఎత్తుకు తీసుక వెళ్ళి, ధైర్యంగా
కిందికి అలవోకగ దింపుతుంది

## 6.

పోయే దారిలో ఈ వైపు ఆ వైపు
తోటలలో పూలు పండ్లు! అందనివీ
ఏ కంచో ఏ గోడో ఆటంకంగా
చూపును అల్లుకొనీ కోరిక సాగుతుంది

ప్రజాస్వామ్య హిత రూపం! సామ్యవాద ఛాయలో
వర్గాల సమూహాల వైరుధ్యాలను మాపే కృషిలో
సమన్వయ సుందరతను సాధించే పనిలో

నిన్న అణచ బడిన తలలు! పంక్తులుగా
నేడు పైకి లేవడ మొక అపూర్వ దృశ్యం
సమాజ సంబంధాల్లో కొత్త విలువలు చేరుస్తూ

చర్చా మర్యాదలతో అందరి పరి తృప్తికై
అవసరాల అనుభవాల పరిగణన క్రియలో
వ్యక్తి విశేషంతో మొదలై, సమాజ లక్ష్యం దాక
జీవన గమనంలో మానవీయ మొకటే ప్రమాణం

## 7.

అవనిపై వాన చినుకు గుర్తులతో
సందేశ, వదలుతుంది సంఘానికి మేఘం
ఇది నాగలి దున్నే రైతుకు తెలుస్తుంది
ఇది బీజం విత్తే మనిషికి తెలుస్తుంది

అంత వరకు నింగి వైపు చూచిన కళ్ళు
ఇపుడు సంఘం వైపు మరులుతాయి

నీకెవరు దిక్కు? అని ఎవరైనా అడిగితే
రైతు వేలు భూమి వైపు చూపుతుంది
నీకేది మహా ప్రియమని అడిగితే
రైతు వేలు పంట వైపు తిరుగుతుంది

క్రియా చరణంలో భూమితో సంబంధం
తన కృషిపై విశ్వాసం జీవితాన్ని పండిస్తుంది

## 8.

చెలమ చెరువు బావి ఏరు లో నీరు
మనిషికి మొదటి అవసరం, ఇష్టం సహజం
దాహం తీర్చ లేదు సముద్ర జలం
అయితే ఇది లేంది, నీలి మబ్బు రాదు
భూమి దాహం తీరదు, చల్లబడదు
పంటకు పని మొదలు కాదు

కదలే నదికీ కదలని గిరికీ
పోలిక లేదు! దేని గుణ సంపద దానిదే
అయినా సంబంధం! ఎప్పటిదో
విరుద్ధ రూపాల స్నేహం, సాధ్యానికి చిహ్నంగా

మనిషికి ప్రకృతిలో ప్రతి వస్తువుతో
జీవన సరణిలో అనుబంధం! యుగాలుగా

## 9.

ఆశా చలనంతో ఎగిరే రెక్కల్లో వేగంతో
గగనంలో విహరించే పక్షిలో ఆత్మ విశ్వాసం
నిరాశ ఒలికే నిశి నీడల ముఖంతో
నేలపై నడిచే మనిషిలో అభద్ర భావం

అడుగు పడి నలిగిన మల్లెపూవు
బరువు పడి చితికిన టొమాటొ!
రాయికి గుండె లేని మాట నిజం
మనిషి గుండె రాయి అవడం వాస్తవం

నేతల వ్యక్తిత్వం చిమ్మే ప్రభావ రూపం
మసి మరకలు చూపవచ్చు
సుగంధ స్పర్శ నీయవచ్చు
ధూమపంక్తితో అనల కణం రాల వచ్చు

అందరిలో సరించే రక్త మొకటే అయినా
మతిలో ఊహలతో, బయటపడే చర్యలతో వేరు వేరు

## 10.

అద్దంలో తన ముఖం చూచుకొని
దిగులుతో ఒకరు, నవ్వుతూ ఒకరు
ప్రతిబింబం నచ్చక ఉద్వేగంలో
అద్దాన్ని విసరేసే వారు మరొకరు

మతిలో విరుద్ధ రేఖలతో ఆలోచన
ఎదుర్కొనే సమస్య మరింత జటిలమవుతుంది
తన బ్రతుకు గురించి మరచి
మరొకరి బ్రతుకు లోకి చూడడం
అవసరమో మానసికమొ కానీ
జ్ఞాపకాల మూట విప్పి చూస్తే
తళతళ లాడే వజ్రాలు! బయటపడతాయి
కదలే సర్పాల మెరపులను తలపిస్తాయి!

## 11.

బహు దేవతల పాత్రల వేషాల్లో కొందరు
దైవం అవతారాలను ప్రకటిస్తూ ప్రత్యక్షం
ఒళ్ళు మరచి, కళ్ళు అప్పగించి సమూహాలు
తమలో మార్పు కన్న కాల క్షేపానికి పట్టం

కనిపించని దైవం గురించి కథలతో
పండుగ సమయాల్లో ఇంటి ముందు ప్రత్యక్షం
చూచి చూడనట్లు పోయే వారు కొందరు
అదలిస్తూనో విదలిస్తూనో పోయే వారు కొందరు

ఆరోహణలో నిచ్చెన తో పాటు నేలపై
నిలిపే స్థిర భౌతిక తలం అవసరం
గుండెపై పూవులా మోదంలో నింగిలో
గుండెపై ముల్లులా ఖేదంలో భూమిపై

## 12.

ఎవరి పనిలో వారు కాలాన్ని మరచి
తీరం చేరే తొందరలో కెరటంలా
ఒంటరి తనం తొలగిపోయి తమలో
ఏ స్తంభాన్నో శిలనో ఆశ్రయిస్తుంది

ఆకాశం మౌనానికి పర్యాయంలా
మాటలాడకుండా ఉండలేదు సముద్రం
నిశ్శబ్దంగా ఉండ లేదు సమాజం
ప్రతిమ లాగ గడప లేడు మనిషి!

పక్షి పైకి ఎగర కుండ ఉండలేదు
మబ్బు పైన కదలకుండ ఉండలేదు

కొండను నది గలగల పలకరిస్తుంది
రసమయంగా స్పృశిస్తూ పోతుంది
మనిషి తరచు మరచే విలువల్ని
మనసుకు జ్ఞాపకం చేస్తూ ఉంటుంది

## 13.

ఏకాంతం మనసుకు మౌన సౌధాన్ని నిర్మిస్తుంది
సృజనకు మూలంగా ప్రేరణగా నిలుస్తుంది
ఆలోచనా లహరులపై పయనింపజేస్తుంది
అనుభూతి సుందర వనిలో విహరింపజేస్తుంది

ప్రతి ఒకరి ఊహలో తమ దయిన ప్రపంచం
బ్రతుకులో పై మెట్టుకై నిరంతర క్రియలో
మదిలో గర్వం చివురించే స్థితి చేకూరుతుంది
తలపై మకుటంకై కోరిక ప్రబలుతుంది

కోర్కెలతో సమస్యల వలయాల్లో భ్రమణం
అపుడపుడు తప్పని ఘర్షణ వాతావరణం
ఒక సమయం మెడలో పూల మాల అవుతుంది
అదే! క్షణాలలో కాల సర్పమై వేలాడవచ్చు

## 14.

కాలం అందరికీ ఒకే విధం
చేతిలో సూత్రంలా మెదలుతుంది
దీర్ఘమై విశాలమై విశ్వమయమవుతుంది
అనుభవంలో ఖండ ఖండాలుగా
ఆచరణలో మందంగానో వేగంగానో
వివిధ కోణాలలో, పజిల్‌గా మారుతుంది

మిత్రతలో మోదంగా, శత్రుతలో ఖేదంగా
జీవన వాస్తవ గతిలో నడిపిస్తుంది
తాత్త్విక ప్రవాహ తీరాల్లో తిప్పుతుంది
చరిత్ర నింపుకొని సంస్కృతిలో కాల రూపం

కాలం అడుగు ముందుకు వేసే లోపల
తన అడుగు ముందు పడాలని మనిషిలో
ఒక సమయంలో తనకే ఆశ్చర్యంగా
విజయానికో విపర్యయానికో దారి తీస్తుంది

## 15.

మాట ఒక అనల కణమై వివాదంలో
సమాజ వనిలో ఆకులపై బూది పొరలు వదల వచ్చు
కొమ్మలకు నిప్పు పూలు పూయవచ్చు
స్తబ్ధమైన స్థితిలో కదలిక తేవచ్చు

నిప్పును అంటించడం బహు సులభం
దహించే స్థితిలో ఆర్పడ మొక కారుణికం
తాపం చల్లబడి సరి కొత్తగా
తిరిగి విభవం పొందడం సృజన విజయం!

జీవన గమనంలో జారే శ్రమ బిందువులు
దార్శనిక పథానికి వెలుగు దివ్వె లవుతాయి
సాటి వ్యక్తిపై నిరంకుశ చరణ మెత్తిన
మనిషిని చూచి మృగం, తల వంచుక పోతుంది

## 16.

జన సమూహాల నుండి తప్పుకొని
అడవిలో పొగల మధ్య శిఖలుగా యువ గణం
నిశ్శబ్దం బద్ధలై పలు వైపుల విసరబడి
మారణ యంత్రాలతో రాజకీయ తంత్రాలతో అడవులు

పిల్లల దుస్తులతో అమాయకత సిద్ధించదు
దార్శనిక భాషణంతో ఆదర్శం ఊడి పడదు
రౌతుకు గుర్రానికి భేదం తెలియని
ఆలోచన! పయనంలో లక్ష్యానికి చేర్చ లేదు
చేతిలో గన్‌కు బెదరి దేవత వర మీయదు
హనన చర్యలో మృత్యుస్వర మొకటే వినిపిస్తుంది
ప్రతిమల్లో మాత్రం మిగిలి బుద్ధుడు! గాంధి
ఇపుడు ఉండి ఉంటే? సజీవంగా
కళ్ళ నుండి పాయలుగా అశ్రు ధారలలో
కొట్టుకపోయే మనుషుల దృశ్యం! చూడక తప్పదు

## 17.

వర్షా సమయంలో ఇంద్ర ధనుసు! రంగులలో
అపుడపుడు విరిసి అవతరిస్తే! నింగికి అందం

తేజంలో సూర్యునితో, హ్లాదంలో చంద్రునితో
భూమిపై జన హిత కరమైన మనిషి! బ్రతుకులో
కొన్ని క్షణాలు కాలి బూది రాల వచ్చు
కమురు వాసన రావచ్చు, పరిమళమూ రావచ్చు

మారే జీవన దృశ్యాలతో కాలం
సామాజిక చింతనకు అవకాశమిస్తుంది

వ్యక్తిలో అగ్ని రేఖల విడంబనం చూపిస్తుంది
మనసును దుశ్చర్యల వలయంలో తిప్పుతుంది

మనిషిలో సమస్యల కోలాహలం
జీవిత మంతా వ్యాపించి, సముద్రంలా
కెరటాల్లా ఉత్సాహంగా ఎగసి సాగుతూ
గట్టును దాటే యత్నం! రాజకీయ చర్యలో

## 18.

నాలుగు వైపుల నుండి నలుగురితో కవిత
పది వైపులలో పదుగురితో మాటల సందడి
వ్యక్తిని పూర్తిగా సమాజ పరం చేస్తాయి
భిన్నతలో మానవ గుణ బంధం చూపిస్తాయి

సూర్యుని కన్న చంద్రునికి బాగా తెలుసు
కష్టంలో లోకంపై ఎంత దయగా ఉండవచ్చో
కరుణతో చల్లగా తెల్లగా ఆర్ద్రంగా
నిశకు యశో రూపాన్ని ఇస్తుంది వెన్నెల

ఎవరి సూచన అక్కర లేకుండా
ఎపుడో ఒకపుడు విజిటర్‌గా తప్పనిసరిగా
నగర జీవితంలో రుచిని చూచి పోతుంది
పూర్వపు బంధంతో అడవి నుండి వానరం!

## 19.

ట్విట్టర్ ప్రకటిత మవుతుంది విశ్వ వ్యాప్తంగా
నిఘా కోరేవి, గవేషణకు పురికొల్పేవి
పరిశోధనకు పనికి వచ్చేవి, పరిశీలన కోరేవి
మనోభావగతమైనవి, హృదయ స్పందన కలవీ

అంతర్జాలంలో విషయ ప్రపంచం
బీజంలో అణగి ఉన్న తరువులా
కణ కణంలో పరిణామ గుణంలా
ఎవరెవరికో! ఆలోచనలకు పని కల్పిస్తాయి

బుజ్జగింపులు బెదిరింపులు వార్తలతో
సందేహాలు సందేశాలు సూచనలతో
మౌన పటంపై అక్షర చిత్ర వర్ణరూపాలు
ఎవరినీ నెమ్మదిగా ఉండనీయవు
అవసరం ఉన్నా లేక పోయినా
ఏవేవో పనులకు ప్రేరేపిస్తాయి

## 20.

ఏవీ వదలవు ఎక్కడికిపోవు! అన్నీ
సందేహాలతో సమస్యలు వదలుతాయి

సమాచార విజ్ఞాన విశేషాల సంపుటితో
పిల్లలు ఉత్సాహంగా ఆటను సాగిస్తారు
గమ్యం చేరాలిసిన రైలుకు
మధ్యలో స్టేషన్ స్టేషన్‌కు సిగ్నల్‌తో పని!
ఎక్కడ పొరపాటు జరిగినా
పయనించే ప్రాణాలకు ముప్పు!

బాణాలతో అక్షయ తూణీరంలా కవిత
సంస్కృతి నుండి బయట పడిన అక్షర పంక్తులతో
సమాజం నుండి ప్రశ్నలు ఎదుర్కొంటూ
కాలం కన్న ఒక అడుగు ముందు పడే కోరిక!

## 21.

ఒక సమయం తిరిగే జీవన చక్రంలో
నిశీధి శకలం మిగిలిపోతుంది భేదంలో
బాధల వెనక నుండి ఊరటగా ఏదో పేరుతో
అపుడపుడు వెన్నెల స్పర్శతో సంతోష పరుస్తుంది

ఎంత కరుణో అహో! అంతకన్న ఎక్కువ కఠినం
అనిపించే దైవానికి ఏ తర తమ భేదం లేదు

మనిషి విజయ సీమలు దాటి మృత్యువు
విషాద రాగంతో దీర్ఘ నిద్రకు దారి తీస్తుంది
క్రూరమైన చిత్ర హింసకు గురి చేస్తూ
విలయ సవనానికి ప్రాణం బలి కోరుతుంది

ఆశల్ని తుంచి ముక్కలు చేసి దూరం విసరుతుంది
ఎక్కడి కక్కడ స్వేచ్ఛను కత్తిరించి సంకెల వేస్తుంది
కల లొ కటొకటి మంచు తుంపురుల్లా రాలిపోతాయి
మెలకువ తళుకు మాసి, వర్తమానం గడ్డ కడుతుంది

## 22.

బయటి బాధ, లోన వేదన, రెండు రెక్కలతో ఆపద
కనిపించని దైవం పయనానికి, వాహన మన్నట్లుంది
బాధను తీర్చే విజ్ఞాన ఫలంకై నిరీక్షణం
వేదన తొలగే దార్శనికంకై గవేషణం

మంచు మేలి ముసుగు నుండి రవి
సామాన్య దృష్టికి అందంగా ప్రియంగా
హతాశునికి మాత్రం! దాగిన సుతీక్షణ రూపంతో
సమయం గడచే కొద్దీ అగ్ని బాణాలు వదలుతూ
తమ స్థితి బాగా లేక ఆర్తిలో ఈదుతూ
అభయం ఇచ్చే మేఘం ఎక్కడుంది?
వ్యక్తి నుండి సమాజ నిలయం దాక!
చుట్టూ పచ్చని చెట్లతో పూలతో ఆకలి తీరదు!

## 23.

స్పందమాన హృదయం పలికే మాట మరచి
చెక్కిన శిల్పాల్లా మనుషులు ఆలోచనలలో
బాధ్యత మరచిన ఉత్సాహం! పాల పొంగులా
స్వేచ్ఛకు అవకాశం ఉన్న ప్రజాస్వామ్యంలో

లోపాలను సవరించే సూచనతో
దోషాలను సరిదిద్దే మాటలతో
అందంగా తీర్చిన మనః పటలంపై
కాలం! ఆదర్శానికి కల్పన రూపం

శిల్పాల మెడలో పూల దండలు వేస్తూ
అభినందన! సన్మానం! ఏదో ఒక పేరుతో
ఎవరికి తోచిన అర్థంలో వారు
ఉరుకులతో పరుగులతో మజిలీ కొక సన్నివేశం!

## 24.

పలు వన్నెల ఉదయం ఎంత గొప్పదయినా
ఏడు వన్నెల హరివిల్లు ఎంత అందమయినా
మట్టిపై కదలికతో అనుభవంతో జీవితం
మానవతా పుష్ప వనంతోనే మనసుకు సార్థకం

చేతులు చాచిన మృత్యు ధూమం గాలిలో
పచ్చని బ్రతుకును దగ్ధం చేసే అగ్నితో
మంటలతో సంక్షోభం! ఆర్పే సంరంభం పనిలో
విలయానిది, పై చేయిలా చుట్టూ పరితాపం
వైజ్ఞానికమో! ఆధ్యాత్మికమో! ఏదీ సమయానికి
బాధను తొలగించే శక్తి లేని విషాదం.
జవాబుకై అన్వేషణలో హేతువు కిరణం
అందని ఏ కొమ్మకో వ్రేలాడుతూ అదృష్టం

ఆశా మరీచికల్ని మధ్య మధ్య చూపుతూ!
మృత్యు భయం తగ్గించే పనిలో విద్యుస్మతులు

## 25.

అభిమాన బలంతో బ్రతికే వారు అరుదు
అహంకార తంత్రంతో నడిపే వారే ఎక్కువ
లౌకిక చతురత రాజకీయం నేర్పుతుంది
వ్యూహ రచనలో వక్రత బాసటగా నిలుస్తుంది

భ్రష్టమై వివేకం తీవ్రమైన చర్యలతో
ముళ్ళలో చిక్కుకొని, ఎవరు కష్టపడితేనేం?
సుళ్ళలో తిరుగుతూ ఎవరు నష్టపోతేనేం?
తమలో స్వార్థంతో విజయ స్తంభం ఎత్తాలనీ

విన్నది వినని యట్లు ఎవరు నటించ గలరు?
వినకూడనిది విని, ఎవరు మరచిపో గలరు?
పాప భీతి లేని మతితో
ఆర్ద్ర కణం లేని హృదితో
విలువల పతనం అంచులలో, పై నుండి
క్రిందికి జారుతూ పాకుతూ కదలుతూ!

## 26.

తన శ్రమ ఫలం మూటతో నడవాలని మొదలై
ఇతరుల మూట లెత్తుకొని పోవడం జరుగుతూంది
చెట్టు కొమ్మ ఛిన్నమై పక్షి గూడు చెదరి
దృశ్యం! అనుకోని వికృతాకృతి పొందుతుంది

రక్షణ కవచంగా ఏర్పడుతూ వచ్చిన విజ్ఞానం
ఇంకా వినాశన కారణాలు గురించి చింతనలో
పైకి ఎదిగే ఆలోచనతో, సొంత లాభానికి
సోపాన నిర్మాణంలో, మగ్నమయి పోతూంది
నైతిక శోభ మాసి ప్రచార దీప్తి పెరిగి
మనిషిని యంత్ర మయం చేస్తూంది విపణి పథం.
ముఖంపై అగ్ని విసరి ఘన కార్యం చేసిన సంతోషం
వ్యక్తి నీతి లేని, సంఘ భయం లేని, బీభత్స ప్రవేశం

## 27.

విజయంలో ఉల్లాసంగా ఊగే సందర్భం
ఒకటి చాలు! సామాన్యుని జీవిత కాలంలో
ఏ నేత వచ్చినా ఏ నియంత మారినా
సామాన్యుల జీవితం! ఎక్కడి కక్కడ శిలామయం

కార్టూన్‌కు నప్పదు, పారడీకి పనికి రాదు
గంజితో జీవితంలో ఆశయం తీరదు
చుక్కలతో జీవన నవ చిత్రం రూపొందదు
ఇది ఏ నియత వేళలో నిర్ణయమయ్యే ఆట కాదు

సామాన్యుని బ్రతుకులో అసాధారణ మేముంది?
ఆడంబరాలకు, సూది మొన చోటు లేదు
విగ్రహం కిమ్మనదు, మౌనం వహిస్తుంది
ఉపదేశం ప్రశ్నకు జవాబును దాటేస్తుంది

## 28.

ఎండిన కొమ్మ! మళ్ళీ చివురిస్తుంది
పండిన మనసు పండ్లను జారుస్తుంది
మండిన గుండె బూదిని విదలిస్తుంది
లేని బ్రతుకులో శూన్యం! స్వేచ్ఛా రూపం కాదు

బాధలో వైజ్ఞానిక విభవం వేయి చేతు లెత్తేస్తుంది
ఆర్తిలో తాత్విక కిరణం! సూక్తులు వెలిగిస్తుంది!

ఆలోచన మరో ఆలోచనను దాటుతూ దాటుతూ
వాస్తవ రేఖ వద్ద ఆగి పోతుంది, వెనక్కి వెళ్ళలేదు

జీవన యానంలో భౌతికం మానసం స్థాయిల్లో
అగ్నిని ఆర్పేందుకు జల కలశాలతో! ఎందరో?
నాలుగు వైపుల నుండీ, ఊహ అదే తత్త్వమదే!
విజయ రహస్యం తెలిపే అంకె ఎప్పటికీ 'జీరో'

## 29.

నాలో సంస్కృతులు అనుభవాల పేటికలు
జ్ఞాపకాలకు అర్థాలు! కొత్త అన్వయంతో

స్విచ్ ఆన్ అయిన టార్చ్ నుండి వెలుతురులా
గమనంలో ముందు వెలుగు! వెనక చీకటి!
సగం తెలుపు సగం నలుపులో విశ్వం
సప్త భావ సమీకరణ దృశ్య సంపుటి సమాజం

సృజనలో ఆలోచన ఉషస్సులా
అందరికీ సాధ్యం అయ్యేది కాదు
ఆపరేషన్‌లో పదును కత్తిలా
సమస్యలో నిశిత చర్య అనివార్యమవుతుంది

వచ్చే మార్పులతో పొందే అనుభవ గుణం
డాక్టరు కన్నా పేషెంట్‌కే! బాగా తెలుస్తుంది

## 30.

ఏ వ్యక్తి ఒంటరి కాదు జీవితంలో
చుట్టూ ఉన్న పాత్రల చలనంలో
తన దయిన అస్తితతో కదలుతూ
సమాజ బంధంతో సమూహ పరమై

ఏ దైవం ఒంటరి కాదు
ఎందరో భక్తులు చుట్టూ తిరుగుతూ
ఏ నేత ఒంటరి కాదు
అనుచర బృందంతో బయట కదలుతూ

కాలంతో సమంగా పోటిలో మనిషి
వర్తమాన గతిలో జీవన పయనంలో
ఉదయ సాయం సంధ్యల నుండి మనిషికి
ప్రకృతి నుండి రోజూక స్వాగతం! వీడ్కోలు! సిగ్నల్

## 31.

కవి మనసులో సృజన సమయం
తుమ్మెద ఝుంకార స్వర రాగం
జలధి ఘోష! మేఘ గర్జా రావం
వివిధ స్థాయిల్లో జీవన స్థితి సూచనలతో

అవసరం లేని ప్రభావాలతో ఎవరికి వారు
జీవితంలో! నిర్ణయ పథంలో స్వేచ్ఛగా.
ప్రతి పనికీ ఎదురు బడే సమస్యలతో
మనో రూపం మారుతుంది! అది వ్యక్తిగతం

చాలా కాలానికి ఓటుకై బయలు దేరిన
నాయకుల వెనకనే మొరుగుతూ కుక్కలు!
మనుషులు చేయ లేని పనిని చిత్రంగా
స్పందనలో జంతువులు చూపడం! విచిత్రం

## 32.

చేసి చూపడానికి సమాజంలో ఎంతో ఉంది
నాలుగు చేతులు ఉంటే! నాలుగు దిశలలో పని!

పేదరికం అవిద్య మౌఢ్యం అసమానత
మానసికంగా మనిషిని పేదనకు గురి చేస్తూ,
మండే ఎండాకాలం ముఖాన దుమ్ము చిమ్మి
ఇసుక ఎడారిని భ్రమింప చేస్తూంది గాలి

వేగంగా వచ్చే జల్లుకు తలుపులు కిటికీలు
మూతబడి! సూక్ష్మమైన అనుభవాన్ని కోల్పో జేసేను

పైన రవి చంద్రుల అయనం లోనే కాదు
కింద మనుషులు గమనంలో లక్ష్యం ముఖ్యం!
నేల నుండి హఠాత్తుగా నింగిలోకి చూపులు
చకితంగా ఆలోచన! మానవేతర శక్తిపై

## 33.

సృజన క్రియలో అహం భావం లేంది
మొక్క లేదు చెట్టు లేదు మనిషిలో విజయం లేదు
వెదికితే దొరకేది కాదు వికాసం
ప్రేరణతో శూన్యంలో ఆకారం పొందవచ్చు

మౌనాకాశం నుండి రవి చంద్రుల ప్రకాశం
కోలాహల సమాజంలో వ్యక్తిలో నిశ్శబ్ద జగం
కవితలో అక్షరం మౌన బంధం వీడుతుంది
తుమ్మెత ఝుంకృతి లా నాద మయ మవుతుంది

కెరటం ఆగదు! కిరణం మాయదు! భావం నిలవదు
మనిషిలో క్రియా శక్తి కార్యాన్ని ముందుకు నడిపిస్తుంది
పిడికిలిలో విత్తులతో కదలే రైతులో
మొక్క నుండి ఎదిగే పంటతో రూపంలా

## 34.

జలధి తాపం నుండి ఎగసి పైకి కదలే
జలదంలా కవిత! ఆగని చలన గుణంతో
కవితకై సమాజ హృదయం ఎదురు చూస్తుంది,
చినుకు పడి ఆర్ద్రమయ్యే భూమిలా

ఒకటి తర్వాత మురొకటి గాయాలకు
ఉపశమన చర్యలతో క్షణం తీరిక ఉండదు
పెదవులపై అక్షరాలు శబ్ద నృత్యం ప్రదర్శిస్తాయి
హృదయంలో సమార్ద్రత సృజనకు అవకాశమిస్తుంది

జీవన శాలా సమాజ నిర్మాణంలో శ్రమ శక్తి
పరంపరా రూపానికి అస్తిత చేకూరుస్తుంది

గాలిలో అదృశ్యమయినా మేఘం మరపున బడదు
నేటి బురద నుండి రేపు పద్మంపై ఆశ సహజం

## 35.

దీర్ఘమైన పయనంలో రైలు లైను మారినట్లు
జీవన యానంలో మనసు దారి మారుతుంది
ఎంతటి స్వేచ్ఛలోను ముందుకు పోయే కొద్ది
ఇంకా వీడాలిసిన బంధనలు ఆటంకాలు ఎన్నో!

చూస్తూ ఉంటే క్షితిజంలో రంగుల కలయిక
కాసేపటికి మరో విధం రంగుల కలయిక
జీవితం లోను అంతలో అపుడున్న రూపం
మారుతూ! కొత్త రూపం అవతరిస్తుంది

వెన్నెముకలో గుప్తంగా శక్తి ప్రసారంతో
మందంగా తీవ్రంగా కదలుతూ ప్రతి పనిలో
పయనంలో ఉంచుతుంది ఎప్పటికీ జీవితాన్ని
మహానదిలో నావలా పవన వీధి విమానంలా

## 36.

గుండె స్పందిస్తుంది ఒంటరి రూపంతో
మేధ పని చేస్తుంది సమూహం బంధంతో
అనుభవ పరంపరకు క్షతి కలగకుండా
ఆకాశం అంచులు చూచే దెపుడో?

దేని కదే భావనలో కరుణం వీరం రాగం హాస్యం
అన్నీ కలిసిన రూపం! వాస్తవ జీవనం
వర్తమాన గాథా రూపాల శ్రుతులతో!
సంఘానికి అలసట లేదు, విరామం లేదు జలధిలా

నది ఎరగదు విశ్రాంతి
గాలి ఎరగదు విరామం

సమిధ కాలుతుంది ఒక వైపు నుండి
అనల గుణం పొందుతుంది వేదనలో
తరిగే ఆయువు సూచనతో
మానుష శక్తిలో సార్థకాన్ని తలపిస్తుంది

## 37.

రహస్యాలకు నిలయం మనసులో శాలా రూపం
దీనికి తలుపులు కిటికీలు ఉండవు
నిశ్శబ్దంగా వెలిగే సిగరెట్‌లా మనిషిలో
దాచలేని ఉబలాటం బయటపడుతుంది

ముఖంలో అందం, అద్దంలో ఇనుమడిస్తుంది
మాటలో చందం, ఫోనులో ఆకర్షిస్తుంది
ముఖాలు ఎదురయితే మనుషుల ప్రభావ రూపం
హృదయం నుండి హృదయానికి ప్రసరిస్తుంది

కనిపించని దైవాన్ని కృపా కరంగా తలచి
శిల్పంగా మలచి, మనసు బయట పెడుతుంది
అనుభవంలో ఒకరికి, క్రూరమై భయదమై
బాధలో చుట్టిన అగ్ని మధ్య! జీవన వాస్తవం
కాలం గడుస్తుందది హేతు మతికి అందని ఎత్తులో
పొంచిన మృత్యువుతో వ్యవహారం నడుస్తుంది

## 38.

వికార రూపం కనబడకుండా కళ్ళు మూత పడవచ్చు
కటువు మాట వినబడకుండా చెవులు మూతబడవు
ఎవరెవరో! మనుషులు! అహంకార గోళాలవలె తిరుగుతూ
ఏవేవో! చర్యలు! నడచే చరిత్రకు కళంకాలుగా

అగ్ని పూజ చేసి పవిత్రమవుదా మనుకుంటే
మంట లెగసి పాకి బూది అయ్యే ప్రమాదం!
ఇలా జరిగిందేమని వేసే ప్రశ్నకు
హేతు గతికి ఒక జవాబు! తత్త్వమతికి ఒక జవాబు!

ఇరువురికి మధ్య! సమాధాన భావనతో
ఒక వైపు నుండి స్నేహం ఆశించే వారు!
వైరుధ్యంలో కారణ సహితంగా యోచనతో
మరో వైపు నుండి గమనం సాగించే వారు!

## 39.

అశ్వంలా వేగంగా పరుగెత్తే విధంగా
క్షిపణిలా నిశితంగా దూసుకు పోయే రీతిలో
అలరించే స్వప్న దృశ్యం! మేల్కొన్న మనిషిలో
పనికి రాని, మరీచిక అవుతుంది

కల్పనకు సమయంతో పనిలేదు
రుతువులతో పని లేదు, ఎవరి సహాయ మక్కర లేదు

ఏదో సాధించే కోర్కెలతో బ్రతుకులో
వర్తమానం వాహనమై ముందుకు సాగిస్తుంది
జీవితం కొత్తం ముఖం పొందుతుంది
సన్నివేశం మారుతుంది, ఆలోచన వేరవుతుంది
జ్ఞాపకాల పొరలు నింపుతూ వర్తమానం
రీలులా చుట్టిన అనుభవాల్ని వదలుతుంది
క్షణాలు రాలి ఆకుల్లా పాతవయి పోతాయి
కొత్త క్షణాలు అలల్లా ముందుకు కదలిస్తాయి

## 40.

నగరంలో నాలుగు దారుల మధ్య టవర్
పొడవయిన నిర్మాణం! ఎత్తులో గడియారం
నిశ్శబ్ద క్షణాల్ని శబ్దమయం చేస్తుంది
సెకండ్ల రూపంలో కాలం విడుదల అవుతుంది

నిలబడిన విగ్రహంలా ఎప్పటి నుండో
ఎన్నిటికో సాక్షిగా, సమయ పాలనం బోధిస్తుంది
కర్తవ్యం మరచిన మనిషి, రాత్రికి ఇల్లు చేరి
పశ్చాత్తాపంతో, మరో ఉదయంకై నిరీక్షణం!

మట్టిపై మానవతా స్నిగ్ధమైన మనుషులతో సమాజం
నెత్తురు మరకల్ని బూది పొరల్ని తనలో లీనం చేసుకొనీ
చుట్టూ జీవన వ్యాపారం మధ్య క్లాక్ టవర్
మనిషికి జీవన లయతో కర్తవ్యం గుర్తుకు తెస్తుంది

## 41.

పూవు ఫలం పొంద లేని పొదలా పేదరికం
వాడని రాలని ప్లాస్టిక్ పూలు పండ్లతో భాగ్యవనం
సమాజ వ్యత్యాసాలకు కాలం జవాబు దారి కాదు
గుడిసెను సౌధాన్ని వేరు వేరుగా చూడదు

రణ చరిత్రలో చోటుకు అవకాశం లేని
మానవత ఒకటే! శాంతికి విలువలు చేకూరుస్తుంది

కళ్ళు తెరిస్తే చుట్టూ ఉన్నది
తనదే అన్నట్లుగ ఉంటుంది
కళ్ళు మూస్తే ఆ ఉన్న దేదీ!
తనది కాదన్నట్లు ఉంటుంది

విషాద ముద్రలు పడిన బ్రతుకులో
నిశీధి గురించి మంచి అవగాహనతో,
కవితలో అక్షరాలు నక్షత్రాలవుతాయి
సహృదయులలో వెలిగే దీపాలవుతాయి

## 42.

తొలకరి సమయంలో నీలి మబ్బు చెదరి
రైతు కళ్ళు అశ్రు కణాలను రాలుస్తాయి
మోదం ఆశించే మనిషిలో ఖేదం!
విజ్ఞానం నాగరకత ఏమీ చేయలేని స్థితి!

నిప్పు రవ్వలా ఎదలో వేదన
ఇది లో లోపల దాచేది కాదు
బయటికి తీసి విసరేసేది కాదు
హృదిలో మండుతుంది, మండిస్తుంది

బాధను మరపించే హ్లాద స్పర్శ
ఏ సోపానంపై అందేదీ తెలియదు
తీరని సంక్షుబ్ధ జీవన సమస్యలో
పేకాటలో తేల్చేసే జోకర్ లాంటిది కాదు

## 43.

చీకటి తీగెలా సమస్య అల్లుకొని
కదలనీయదు! మెదల నిస్తుంది! ఏం లాభం?
సమస్య పైకి లేచి తల ఎత్తుతుంది
చూస్తూ ఉండగనే అలలా అందకపోవచ్చు

నీలి మబ్బులా ఆలోచన! మనో గగనంలో
దాహార్తిని తీర్చే ఆశా ముఖంతో వస్తుంది
సమస్యను దాటేసి ముందు కెళ్ళి పోవచ్చు

అగ్గి పుల్ల వెలుతురు ఒక వైపు నుండి
నాలుగు వైపుల అవసరాల్ని వెలిగిస్తు,ది
సూర్యుడు! చంద్రుడు! మనిషి బ్రతుకు తెరువులవే!
ఏ రోజూ సమస్య దృశ్యం! సరి కొత్త విధంగా

## 44.

మొక్కను చూస్తే ఎదిగేనా? అన్న ప్రశ్న రాదు
పూవును చూస్తే ఎవరిని చేరేను అన్న ప్రశ్న రావచ్చు
ఎవరికీ చెందకుండా రాలి మట్టిలో కలవొచ్చు
పచ్చదనం మాత్రం భవిష్యత్తుపై ఆశ నిలుపుతుంది

ప్రతి పుష్పం పారిజాతంలా కథకు కేంద్రం కాదు
ప్రతి శిల్పం దేవతా మూర్తి గౌరవం పొందలేదు
ఈనాడు అవసరం కోరని అమర కోశంలా ఎన్నో
షో కేస్‌లో వస్తు సమూహంలా విషయాలెన్నో!

మంచు కరగి స్రవిస్తుంది
కరగని సమయం కూడా ఉంది
నీరు పారి నదిస్తుంది
ఆగే సందర్భం కూడా ఉంది
కాలం గడుస్తుంది గడవ నట్లు అనిపిస్తుంది కూడా
ఏ బ్రతుకూ హేంగరుకు వేలాడే వస్తువు కాదు

## 45.

మనసుకు ప్రియమేదో? కొద్ది మందికి తెలుసు
తమకు ముఖ్యమేదో? చాలా మందికి తెలియదు
అపుడపుడు ఎక్కడో ఎవరో జ్ఞాపకం చేస్తారు
అప్పటి కపుడు కాక పోయినా తర్వాత మరుస్తారు

అలంకారం ఏదీ లేకుండా లోకం లోకి వచ్చి
మధ్యలో ధరించే అలంకారాల్ని వదలి
ఆ రావడం ఈ పోవడం మధ్య ఆకర్షణీయ సమాజం
జీవన యానంలో సహజం, ఏ విపరీతం లేదు
వీటిలో ఏది ఇష్టమయినా కాకపోయినా
ఎవరు కాదన లేని వ్యక్తిగతం స్వతంత్రం

మనసు పూల వనికి బయట దూరంలో ఉన్నా
సుగంధ పవనం చేరుతుంది స్పృశిస్తుంది
సంకుచిత మతిని వికసితం చేస్తుంది
ప్రియమై అవసరమై చైతన్యమయమవుతుంది

## 46.

భూమి ఆకాశం నీరు నిప్పు గాలి కలిసిన
పంచీకరణంతో నేపథ్యం తప్పదు కవితలో
దీనికి పాత లేదు, ప్రతిభ చేత కొత్తదనం వస్తుంది
దేశం ప్రజ బ్రతుకులో వైవిధ్యం వైరుధ్యం గతులతో

శ్రమ యజ్ఞంలో మనిషే దేవత
సమాజమే కావలసిన వస్తు చయం
శ్రమ కేతనం కవిత! రిబ్బన్‌లా సాగుతూ
అది వెళ్ళే దారి కావచ్చు, సాగే రైలు కావచ్చు

గత చరిత్ర విశ్లేషణకు గురి అవుతుంది
కాలి మువ్వల గలగలలతో వర్తమానం
వివేచన కన్నా అనుభవ ప్రకటనలతో,
దూరాన్ని లెక్క చేయదు, భవిష్యత్తు పవనం

## 47.

ఆయుధంతో ఆత్మ గౌరవం పెరగదు
అణచబడిన మొక్క, చెట్టుగా ఎదగదు
ఏ ఇజాని కయినా కవిత! ఒక పుష్పకం
నిజాన్ని దాచడం మరవడం ఒక దోషం

నిత్య దరిద్రంగా బ్రతుకు గడుస్తుంది కొందరికి
ఎంత ఉన్నా రెండు చేతులు చాస్తూ కదలుతారు
మరో మరో చేయి ఉంటే బాగని లోపల దిగులుతో
దాహం ఆకలి మిగిలి, ఎప్పటికీ! సతమతమవుతారు

ఎంత విర్ర వీగినా గట్టును తాకే దాకే సముద్ర సంరంభం
ఎంత ఠీవి చూపినా ముక్కలయి మేఘం మాయ మవుతుంది
సహజమైన పరిణామంలో మలుపులు సాధారణం
సమాజ చరిత్రలో ఘట్టాలన్నీ మలుపులు తిరిగినవే

## 48.

భూమి పైకి రాగానే తొలి శ్వాసతో
పొత్తిళ్ళతో మొదలవుతుంది వస్తువు అవసరం
తరువాత అలంకారాలతో ఎన్ని విచిత్రాలో!
పొంగ జేసే క్రుంగ దీసే సందడితో జీవితం

ఇదొక శబ్ద ప్రపంచం అర్థ విశేషాలతో
వస్తూ పోయే ఆగంతకులు అతిథులు ఎందరో
అలంకార ప్రియులు! ధన వస్తు సేకరణంలో మగ్నులు
అవసరమైతే చేతులకు ఇనుప గ్లౌజుల బలంతో

చినుకు రాలుతుంది, సంతోషం చిలుకుతుంది
తమతో ఆడేందుకు పిల్లల్ని సాగతిస్తుంది

రవి శశికీ మనకూ మధ్య కనిపించే నీలి మబ్బు
బాధకు దు:ఖానికి సంకేతం కాదు
ఇది ఆర్ద్ర భావ రూపం! చిర బంధం
పూల కుండిలో "బొన్‌సాయ్" అవకూడదు మనో రూపం

## 49.

రవి ఆగమనంతో నిష్క్రమణంతో
పయనానికి సంబంధం లేదు

చెప్పుకో దగిన పని లేని వేళలో వినే పాట
చెప్పుకోదగిన ప్రభావంతో మనసును మారుస్తుంది
మరునాడు ఉదయానికి, కొత్త వ్యక్తి తనలో
తన రూపానికి దగ్గరగా పెరిగిన విలువలతో ఆర్ద్రంగా

సమాజం గురించి చెప్పాలంటే
మానవ సంబంధాలను చూడాలి
మనిషి గురించి రాయాలంటే
సమాజ చరిత్ర బాగా తెలియాలి

చూచే లోపల తెలిసే లోపల ఏమేమొ జరుగుతుంది
అంచనా మారవచ్చు, ఆకర్షణ కేంద్రం మారవచ్చు

ఎన్ని ముక్కలయినా చేసి భూమిని పంచవచ్చు
ప్రవాహాన్ని గగనాన్ని పంచలేరు, మనసును పంచలేరు

## 50.

స్వేచ్ఛా పిపాసతో నడచి నంత దూరం భూమిపై
కాలం విసిరిన ఎడారి ముక్కలు! బాధా రూపాలు
దరిద్రాన్ని జయించే వాదాలెన్నో! దార్శనికాలెన్నో!
నాగలి చాలులో! మణులూ మాణిక్యాలూ! మొలవ్వ!
చాచిన చేతుల కందని ఆర్ద్రత, నేలకు దిగి నిలవాలి
విత్తిన నేలపై చాలులొ, క్షుధ తీరే సంపద ఎదగాలి

దేని కోసం పోరాటం? అహంకార విస్ఫోటం? ఉగ్రరూపం?
మనిషితో మనిషి కలిసి బ్రతికే కళలో ఉంది కిటుకు!
సంస్కృతి నుండి కొంత, అనుభవ రుచితో కొంత
బ్రతుకు నుండి అడవి రూపం తొలగి పోతే నగరం

ముంగిట్లో! భవిష్యత్తు ఎవరి కోసం వేచి ఉండదు
నిరాశను తోసి వేసి చేతనతో స్వర్ణమయ మవుతుంది

## 51.

చరిత్ర సదా మనిషి వెన్ను నంటి ఉంటుంది
మతిలో వ్యూహ రచన సమాజాన్ని నడిపిస్తుంది
రాజకీయం లేని రాజ్యం లేదు
ఆర్థికాన్ని వదలి జీవనం లేదు

మంటల దారులలో నడచే స్థితి వస్తే
చరణ యుగం హిమ కవచం ధరించక తప్పదు
నరకే వాడి తల, తన పని చేయడం మాని
తల నరకడం ఇప్పటికీ క్షిపణి యుగంలోను

అన్యాయం ఆక్రందన పోరాటం ఉద్రేకంలో
విపరీతం! విలువల్ని ప్రమాదంలో పడేస్తుంది
తుఫాను తగ్గాక చెదరిన బీభత్స దృశ్యంలా
సమాజంలో ఉన్మాద విపరీత ప్రభావం!

## 52.

ఎవరిలో ఏ మతం! ఏ గతం! గూడుగా మారేది తెలియదు
కల్పనలో  పుట్టినవీ సమాధాన పడనివీ! చర్యలు
వాస్తవాన్ని ఎదుర్కొనే సంస్కార బలం లేక
విజయంకై చెలరేగుతుంది రణ మనోరూపం

హరిణం వెనక అడుగులు వేస్తూ నిశ్శబ్దంగా పులి
కలలోనో కథలోనో కాదు! సమాజ వనిలో ప్రత్యక్షంగా
ప్రతి దేశంలో! అనుకోని ఉద్రిక్త బీజాలు
పూర్వపు రణ శక్తుల వికేంద్రీకరణ విభాగాలు

ఎక్కడి కక్కడ శత్రు భావ మయ శాఖలు
ఉగ్రత ఒక వాదమై, అశాంతి పాకెట్‌లు

ముసుగులో గుప్తంగా మెరపులా చకితంగా
నీలి ముఖం! బయట పడి చీకటి చిమ్ముతుంది

## 53.

కొన్ని మాటలు! అలజడుల పొదలకు విత్తనాలవుతాయి
కొన్ని మాటలు! బ్రతుకులో నాణాలుగ చెల్లుతాయి

అరాజకంలో ఏదో గొప్పది పొందే ఆశలో
వ్యక్తి హింస నుండి సమూహ హింసకు ఒకరిద్దరు
శుభ్రమయిన గాలిలో సుగంధ గుణానుభూతికయి
గార్డెన్‌లో కూర్చున్నా, పక్కదారులలో నుండి
ధూళి ఎగసి, పొగలు సాగి, ఉక్కిరి బిక్కిరి చేస్తాయి
వెంట బడి ప్రమాదం, వీధిలోకి తరుముతుంది

బిగించిన పిడికిలి నుండి పుట్టిన ప్రశ్నలు
జవాబు కోసం! పిడికిలి తెరవగానే క్షణంలో
పక్షుల్లా ఎగిరి అందకుండా, చెట్లపై వాలతాయి
ఇవి రిమోట్ కంట్రోల్‌తో, అదే పని చేస్తాయి

## 54.

బాణాల్లా దూసే ప్రశ్నలు కొన్ని
లక్ష్యం ఛేదించ లేకపోయేవి కొన్ని,
గురి తప్పి పక్కకు తొలగేవి కొన్ని
కొన్ని పనికి రాకుండా వ్యర్థమై పోయేవీ

చెట్టు కొమ్మ నుండి ఎగరబోయే పక్షిని
చూస్తూ అందమైన దృశ్యంలో ఒకరై పోయే సమయం
కాలితో తల తాకుతూ పక్షి ఎగిరిపోతుంది
ఇది అనుకోని ఘటనగా సమాధాన పడడమే!

రాలే ఆకులనూ పూలనూ ఒకటొకటి లెక్కపెడుతూ
ఉండే తీరిక! అవసరాలు ఎవరికి ఉన్నాయి?
సృజన విషయ రూపాలను ఒకటిగా తలచే
స్పందనలో సూక్ష్మతతో కవి హృదయానికి తప్ప!

ఎదురుగా షెల్ఫ్‌లో "మేఘ సందేశం" అక్షరాలలో హృదయం
ప్రస్తుత కవితకు స్పందన గుణ శక్తిని అందిస్తూ

## 55.

ఆకాశం కప్పు కింద రాత్రులు గడుపుతూ
చుక్కలకు వ్రేలాడే కోర్కెలతో
మినార్ చివర కూర్చున్న మనసుతో
పగలంతా వీధుల్లో తిరుగుతూ నిరాకృతులు

సొంత ఊరు స్వదేశం స్థల బిందువు నుండి
జీవన రేఖల చిత్రం! విశాలమవుతూ
ఎక్కడి కక్కడ ముక్కలయిన అనుభవాలతో
సంస్మృతిలో సిద్ధంగా! పరంపరగా జ్ఞాపకాలు

ఏ రోజూ కొత్త ఉదయంకై నిరీక్షణం
పాత బడిన రోజు గురించి వివేచనం
ఉదయం వెనక తేజంలా
నవ్వుల వెనక అగ్నులు!
ఊహ నుండి మాటలో క్రియలో
జీవన రూపంలో భాగం అవుతూ

## 56.

భిక్షువు తన జోలెలోనా! అర చేతిలోనా!
చంద్ర కళలు జారి పడాలని కోరడు!
రాలే చుక్కలతో నిండాలని కోరడు
అన్నపు మెతుకులొ! చిల్లర డబ్బులో తప్ప!

పోషణకై ఇరువైపుల కర్రలకు బిగించిన
తాడుపై చేతులు చాచి నడుస్తూ ఉన్నట్లు
వీధి నుండి వీధికి ఊరు నుండి ఊరుకు
స్థలం నుండి స్థలానికి మార్పులేని సంచారంలో!

పుట్టినప్పటి నుండి మార్పు కోసం ఆరాటం
వివిధ స్థాయిల్లో సమాజంలో! ఎందరో మహానుభావులు
"మలహర" రాగం వినిపించే జలద హృదయంకై
సమాజ మెదురు చూస్తుంది, నైతిక గుణ సమభాగ్యంకై

## 57.

అంతా భయపడే గ్రీష్మంలో
మొదటి చరణం ఉత్సాహాన్ని ఇస్తుంది
తాళ లేని పరితాపంలో
చివరి చరణం శౌర్యాన్ని తలపిస్తుంది
వేచి ఉన్న వాన మొదటి బిందువులో ఆనందం
కురిసి కురిసి పోవు చివరి బిందువులో నిర్వేదం

పక్షి పాము చీమ పురుగు! ఎన్నో ప్రాణుల
కాశ్రయమై చెట్టు! అన్నిటికీ స్వాగతంతో
పూవు ఫలం పచ్చదనంతో ఆశా రూపం
మనుషులు తమ ఇంటి గడప దాటగనే

పగలంతా శ్రమ దైవంగా గడిపే వ్యక్తికి
శూన్యంలో నిశి! కలలు గనే తీరిక ఎక్కడిది?
అభినందన అభిశంసన పరీక్ష పరిశీలనం
విమర్శ సమీక్ష వివేచన సూటిగా మెలకువలోనే!

## 58.

నడచి నంత మేర భూమిని
తన కొలతల్లో బంధిస్తూ పోయే
మనుషుల కొలతల్లో నుండి
బ్రతుకులు తప్పించుక పోతాయి

హృదయం తన గోడును వినిపిస్తుంది
వినక తప్పని గగనం మౌనం వహిస్తుంది
నాల్గు దిశలు చెవులు నిక్క పొడుచు కొని
అంతలో మరచి పోవడం జరుగుతుంది

ఎవరి దారి వారిది అయినా
చుట్టు ఎన్ని గొప్ప వస్తువులున్నా
మనిషిలో మనిషితో కలవాలని మాట్లాడాలని
లేంది! సంఘంలో మనిషి అస్తిత్వానికి అర్థం లేదు

## 59.

పూలతో పక్షితో మేఘంతో ఎవరు మాట్లాడతారు?
కవితా హృదయం గల మనుషులు తప్ప
మనిషిలో కోరిక! తన కథకు సరిగ స్పందించే
మనిషికి వినిపించాలనీ వినాలనీ! ఉంటుంది

మనిషికి మనిషితో ఆశ్రయ విశ్వాసం
సమాజ చక్రంలో పాత్రగా నిలబెడుతుంది
బ్రతుక్కి మరో బ్రతుకు అనుబంధం సంబంధం
వ్యక్తి శక్తిని సమాజ పరంగా మరలిస్తుంది

పరిమితమైన గోడల మధ్య నివాసం
గోడలు తగ్గిన విశాల తలంలో విహరణం!

ఎప్పటివో గోడలు! ఇప్పటికీ స్వేచ్ఛను తగ్గిస్తూ
ఇప్పటి అవసరాలలో కొత్తవి! ఉపయోగ సుందరంగా

## 60.

ఎంతటి నది అయినా జలధిలో విలీనమై
స్వీయ దీర్ఘ యానాన్ని మరచి పోతుంది
తనలో వ్యక్తిత్వ వికాసాన్ని కోల్పోతుంది
దాహం తీరే జల రుచి మరొకటి అవుతుంది

ప్రవాహ గమనంలో ఉన్న స్వర కళ వినిపించదు
మలుపులలో వంపుల అందం కనిపించదు
చలనంలో జీవన గుణ రణనం చెవి సోకదు
గమనంలో పురోగమన కాంక్ష శూన్యం!

క్షార జలాల నుండి తాపంలో పైపై
కెగసే మేఘం! ప్రత్యక్షం రసమయ వ్యక్తిత్వంలో
జీవన రుచి రమణీయంగా సమాజ చింతనతో
స్వచ్ఛమైన నీరు వదలి భూమిపై ప్రాణాలను పోషిస్తుంది

సృజన చేతనలో కవుల పాత్ర స్వతంత్రం
సమాజ లక్ష్యంలో మార్పులు సహజం, అనివార్యం

## 61.

దగ్గరలో ఉన్నా దూర దూరంలో ఉన్నా
ఆప్త హృదయం పిలుస్తుంది ఆర్ద్ర హృదయంతో
ఒక్క గంతులో అక్కడికి చేరాలని ఉబలాటం
రెండు కన్నీటి చుక్కలు రెండు కాళ్ళను నిలిపేస్తాయి

ఉదయం లేవగనే విప్పారిన మొదటి చూపులో
స్త్రీ రూపం! ఇంట్లో నడచే ఉషః కిరణం
నీడ బొమ్మలు దూరంగా జరిగి పోతాయి
మంచు తెరలు అంతలో అదృశ్యమవుతాయి

వివిధ పాత్రలలో మనుషులు ఆయువు తీరాక
వీధిలోనో పార్కులోనో ప్రతిమల్లో మిగిలి
మౌన ముఖాల నుండి అవసరం బయటపడి
చూచే వారి తలపై వాలి ఎగురుతుంది

## 62.

సొంత నిలయం లేని మనిషికి
దొరికిన ఆశ్రయ మొక పంజరం
నింగి లోకి ఎగిరి పోవడానికి వీలులేదు
నేల పైన నడిచి పోవడానికి వీలులేదు

చిన్ని చిన్ని గోడలు దేని కని ఒక తరం ప్రశ్న
ఎన్ని గోడ లుంటే అంత మంచి దని మరొక తరం
అనుమాన భయాలతో ఏర్పడతాయి గోడలు
భద్రతకై రక్షణకై కోటలుగా మారతాయి

వాన చినుకు లొకటొకటి చేరి ప్రవాహమై
మనుషులు! ఒకరొకరు! కలసి మెలసి సమాజమై
భయం లేని చోటు! స్వేచ్ఛా పుష్ప వనం
ప్రతి పూల చెట్టుకూ ఒక కంచో! గోడో! ఉండదు

## 63.

అనుకున్న స్టేషన్‌కు రైలు రావడం
ఎయిర్ పోర్టులో విమానం దిగడం
ఒక పనిలో మనిషి గమ్యానికి చేరడం
ఆలస్యం కావచ్చు, సమయం తప్పవచ్చు

ఏ రోజు మొదటి ఉషః కిరణంతో పోటి
సైకిలో మోటర్ సైకిలో స్కూటరో వాహనంపై
దేహంలో దీపించే సన్నని ఉత్సాహ శిఖతో
హారన్ వినిపించని ఎమర్జన్సి అంబులెన్స్ గతితో

పలు స్థాయిల్లో శబ్ద తరంగాల్ని వదలుతూ
ఎక్కడ ఏది ఇవ్వాలో! జ్ఞాపక సూచికలతో!
పాల మనిషి! పేపర్ బాయ్! వానలో చలిలో
ఎదురు చూచే కళ్ళకు ఆశా కళికలుగా

కాలాన్ని ఊపిరి దారానికి చుట్టి
తమ వెంట లాక్కొని పోయే వేగ మూర్తులు!

## 64.

అప్పటికి స్విచ్ ఆఫ్ కాని వీథిలో దీపాలు
సార్థక ముఖాలతో శ్రమ శీలికి స్వాగత మిస్తాయి
పలు దారుల వ్యూహంలో నివాసాలలోకి
అంతలో ప్రవేశిస్తూ ఇంతలో నిష్క్రమిస్తూ
చకత్ చకిత సుందర సేవా రూపాలు

కాస్త ఆలస్యం అయితే జన కోలాహలంలో
ఒత్తిడిని అదుపులో ఉంచే మానుష యంత్రాలు
మరో రోజు వరకు విరామం! పునర్భ్రమణం! అనంతం

జీవన వ్యాపక పరీక్షలో ఉత్తీర్ణతను
వెలుగు పత్రికలో! ఉదయం స్వర్ణ లిపిలో
టీ కాఫీ వార్తా రుచులతో పాటు
ఎవరి భాషలో వారికి హృదయం ప్రకటిస్తుంది

## 65.

లోన ఉన్న మనో జగం
గుప్త భావ చిత్ర మయం
ఇందు లోని వస్తు చయం
ఎవరి సొంత విషయం కాదు

పాత్ర లెవరి నీడలలో
ముద్రలతో కనిపించవు
అవతలి వ్యక్తి పిస్టల్ అయితే
ఇవతలి వ్యక్తి గురితో రైఫిల్ కావచ్చు

ఇరువురి మధ్య జల ధారా సూత్రంలా
కదలుతుంది మానవతా రాగం అందంగా
మానుషం కన్న శ్రేష్ఠం లేదని తెలిసీ
వాస్తవం మరిచి కల్పనలో ప్రతి ఒకరూ

## 66.

వీరానికి భయ పడుతూ కొందరు
కరుణం తో విచలితులై కొందరు
రాగానికి దూరంగా మరికొందరు
ఎవరికి వారు ముఖం ముడుచుకొనీ
భౌతికమో మానసమో! భూమికలో ఎప్పటికీ
ముఖాలు విప్పారేందుకు యత్నాలెన్నొ

రాయిని శిల్పంగా తొలిచి అందం తేవచ్చు
మనిషిని ఆర్ద్రంగా తీర్చి చూపే దెవరు?

కవి మనో రూపానికి దర్పణం కవిత
కవితలో కవి అస్తితను మరచి తమ ముఖం
చూచే పనిలో పాఠకులూ! విమర్శకులు
స్వేచ్ఛా చరణంలో మిన్నగ! చూపాలనీ

సంస్కృతి కవాటం తెరచుకొని అపుడపుడు
మనో విశాల శాలా ప్రవేశంతో! దృశ్య దర్శనం!

## 67.

సమాజ రహస్యం అన్వేషణలో మేధ
సూర్యుని కిరణంలా కవిలో సమభావం

జలధిలో అలల వలె చెట్టుకు ఆకుల వలె
వ్యక్తులతో సమాజం! భాగ్యం! విజయం! విభవం

నలిగిన హృదయం స్పందన మరుస్తుంది
బాధకు గురి అయి వేదన ప్రకటిస్తుంది

పీఠంపై చేర్చవచ్చు అహంకారం
అదే పెరిగి! సమాధినీ కూర్చవచ్చు

అనుభవంలో దశ్యం విజ్ఞానాన్ని ఇస్తుంది
జ్ఞాపకంలో దృశ్యం సందేశాన్ని ఇస్తుంది

దూరమై పోయింది, సంస్మృతుల్ని ఒంపుతుంది
దగ్గరై పోయింది, వాస్తవాన్ని దింపుతుంది

## 68.

బయట పడే కన్నీటి చుక్క వెనక
తుఫానులో తరలే జలధి బింబం ఉంది
మెరసి పడే శ్రమ జల కణం వెనక
మండే సూర్యుని ప్రతాప బింబం ఉంది

ఎవరి ఇష్టం వారిది, సమాజం కేంద్రంగా
చలనంలో జీవితం వర్తమానం లిప్తలపై
బ్రతికే హక్కులో వెలిగే చేతనతో
అందరికీ తలుపులు తెరచిన నిలయం ప్రజాస్వామ్యం

సాధారణ జీవన గతుల వెనక ఉన్న
సంశ్లిష్ట సమాజ రూపం, హేతు పథంలో
మానవతకు జీవ సార ప్రసార గుణంతో
స్వేచ్ఛా కవితా లక్ష్యంలో, మరో వైపు యానం

## 69.

చిన్న నాటి ఇల్లును ఎదకు అద్దు కోవాలని
"ఎంత బాగుంటుంది?" అనుకొనే లోపల
అమ్మ రూపం అవతరిస్తుంది, అభేదంగా,
శిశువయి వాలతాను, అందుకోని అలరిస్తుంది.

ఇంటి ఆవరణంలో ఉన్న చెట్టును చేరాలని
"ఎంత హాయిగా ఉంటుంది" అనుకొనే లోపల
గేటు తెరచుకొనీ బంధువులా లాక్కొంటుంది
పచ్చని బంధంతో మనసు పరవశిస్తుంది.

బారులుగా విరిసిన పూల ప్రవాహంపై తేలే కోరిక
"ఎంత ఆత్మీయంగా ఉంటుంది?" అనుకొనే లోపల
సతీ మధు హృదయం రసావేశంతో
తనలో నిలుపు కుంటుంది, ఒకటిగా.

## 70.

శ్రమ జలంతో నేల తడి తడియై
పంటకై క్షేత్రం ఎదురు చూస్తుంది
ప్రతి మొక్క! ఫలవంతంగా ఎదగాలనీ
ప్రతి మనసు! భాగ్యం కయి తపిస్తుంది

ఇంటి కప్పుపై గగనం అందరాని ఎత్తులో
తలపై కళ్ళకు మాత్రం కనిపిస్తుంది
అపుడపుడు మొలిచిన కొమ్ములు సాగి
దగ్గర అయ్యే కోరిక! పోస్ట్‌పోన్ అవుతుంది

ఇంట్లో దాగిన రహస్యం ఒకటొకటీ
లోపల ఉండ లేక బయట పడుతుంది
సంఘంలో గాథలలో బ్రతుకుతుంది
పదుగురిలో సూక్తులలో వినిపిస్తుంది

## 71.

దూరాన చిన్న నాటి ఇల్లు స్మృతిలో
ఒక్క గంతులో ముంగిలిలో వాలాలని కోరిక

రెప్ప పాటు మెరపులా సందేహం
బయటి తలుపు వేసి ఉంటే?
కిటికి చువ్వల ఎడం నుండి
పక్షిలా ఒరిగి లోనికి వెళ్ళేనా?

ఒళ్ళు జలదరించే వర్షపు చినుకుల్లో
తడిసి చిరు చెరువు అయిన తలపై
అమ్మ కొంగు! బంగరు పాగాతో వరండాలో
చిందు లేసి మురిసిన దృశ్యం! ఎదురుగా

ఆకాశం రాల్చే అశ్రు సమూహం వర్షం
హర్షం లోనా? ఖేదం లోనా? ఏదయినా కావచ్చు

గమ్యం చేరే ఆనందంలో బాష్పకణం
జారి, వాస్తవ తలంపై దింపుతుంది

## 72.

కొండ కొనను ఢీ కొన్న హెలి కాప్టర్ లా
ఆశ! ముక్కలయి చెదరిన సందర్భాలెన్నో!

ఊరు నుండి ఊరుకు మనుషులు
అడవి నుండి అడవికి పక్షుల్లా
చలనంలో నిరాశ పడని మనసు లేదు
గమనంలో గాయ మెరగని బ్రతుకు లేదు

దున్నిన భూమి! గాయం పాలవుతుంది
అయినా కాలంపై పంటకు సిద్ధమవుతుంది
పునాదితో నేల! గాయపడుతుంది
శ్రమ జీవన కరాలపై నిలయం లేస్తుంది

అనుకూల స్పందనలో ప్రతికూల చర్యలలో
కవిత! జీవితానికి సహృదయ నిర్వచనం!
నవత! సమాజానికి అవసర వ్యాఖ్యానం!

# హృదయం నుండి హృదయానికి

## పరిచయ స్పర్శ

కవిత్వం మనిషి హృదయ స్పందనకూ మనోభావ (ఫీలింగ్) సూక్ష్మతలకూ సంబంధించింది. అభివ్యక్తి కళకూ అంతో ఇంతో స్థానం కలిగిందీ.

కవి తాను వివిధ సందర్భాల్లో పొందే అపూర్వమైన అనుభూతితో చేకూరే భావనా విశేషాన్ని, సమాజానికి అందిందే శబ్ద శక్తి ప్రసరణం కవిత్వం.

దీన్ని ఎవరయినా కొంత వరకే దర్శించగలరు. అక్షర రూపంలోకి తేగలరు. ఒక స్థాయికి చేరినపుడు విజయం లభిస్తుంది. ఈ స్థానం నుండి దారులు చీలతాయి. వైవిధ్యం ఏర్పడుతుంది. అభిప్రాయాలు వేరవుతాయి. వీటి పరిశీలనం సాహిత్య సమాలోచనంలో భాగమవుతుంది.

వర్తమాన స్వేచ్ఛా కవిత్వంలో 1) తన చుట్టూ ఉన్న సమాజం – దేశం – ప్రపంచం 2) ప్రకృతితో అనుబంధం – ప్రభావం 3) వ్యక్తిలో అనుభవం – ప్రేరణ రూపాలు 4) పరివర్తనం – భవిష్యత్తు దర్శనం 5) మానవీయం – మానవత విశ్లేషణ కందుతాయి. వైయక్తిక సామాజిక స్థాయిల్లో ఆంతర బాహ్య దృష్టి కోణాలతో విశాలతను పొందుతూంది. వైవిధ్యాన్ని పొందుతూంది.

లోకంలో సాధారణ మనుషుల్లో పొందే అనుభూతి, ఆయా కవుల విషయంలో ఉదయ వేళ పైకి ముఖ మెత్తే పద్మంలా విప్పారుతుంది. రాత్రి వేళ చంద్ర బింబంలా ప్రకాశిస్తుంది. ఈ భావనా రూపం అక్షరాకృతి పొందుతుంది.

ఆధునిక కాలంలో మారే స్థితుల్ని బట్టి అసాధారణ స్థితుల్లో అంతరించి నవనుకున్నవి, రూపాలూ, విలువలూ ఉత్సాహంతో పునర్భవాన్ని పొందుతాయి. ఉత్తేజంతో పునర్నవాన్ని పొందుతాయి. పునర్జవంతో పురోగమిస్తాయి. దీనికెన్నో ఆటంకాలు సహజం. వీటిని అధిగమించడమూ జరుగుతుంది.

మంచి కవిత్వంలో విశిష్టత ఎంత చెప్పినా విమర్శలో అనుభవ ప్రకాశం ఇంకా ఇంకా మిగిలే ఉంటుంది. ఇది సూర్యకాంతిని దోసిలిలోకి తీసుకోవడం లాంటిది. "హృదయం నుండి హృదయానికి" సంస్కృతి కృతిలో భాగంగా రూపొందింది.

**– మాదిరాజు రంగారావు**

# హృదయం నుండి హృదయానికి

## 1.

శిశువు మనిషి చేతులలో జారగనే
విశాల ప్రపంచం లోకి ప్రవేశం
సమాజ పర మవుతుంది జీవితం
జీవ సార స్పందన హృదయం కీలక మవుతుంది

సౌభాగ్యం సుందరత ఆనందంకై
విరిసిన వెలుగుల మతితో ప్రస్థానం
ఒక చోట దు:ఖ చిత్రం
ఒక చోట బాధా స్వరం

వెలుగు జాడలలో నీలి జాడలు కలిసి
ఒక దానికి బదులు మరొకటి
అడుగులు పడుతూ! నడతలో
నడక ముందుకే గాని వెనక్కి మరలదు

మొక్కకు ఎదిగే అవకాశంతో
మనిషికి పెరిగే అవసరాలతో
ఉదయానికి మాయమై పోయే
నిశీథి నక్షత్రాల్లా ఆశలు

ఉన్న వాటిలో ఇష్టమైందో కావలసిందో
ఎన్ను కోవడం! వరకే వ్యక్తికి అవకాశం

చీకటి భయాన్ని నిద్ర మరపిస్తుంది
ఇది మనసుకు లభించే కోరని వరం !
మెలకువలో పనులెన్నో! సమయం తక్కువ
హృదయంతో కలిసి మేధ, పనిలో విజయంకై

గగనంలో జలదం ఎటు పయనిస్తే నేమి?
రైతుకు తన క్షేత్రానికి ఆర్ద్ర కళ లభిస్తే చాలు!
చూపు సాగి, స్వాగత తోరణమవుతుంది
పయోదాన్ని బంధించే అవకాశం లేదు

## 2.

ఉదయం లేచే సరికి
సూర్యుని వెలుగుతో పోటి పడుతూ
మనిషి ముఖం కనిపిస్తుంది

ప్రతి హృదిలో ఒక బాల భాను బింబం
అనుమానం మంచు తెరలు తీసి
లోలోపల ధైర్యాశ్వాన్ని పరుగెత్తిస్తుంది
లేంది! జీవిత మొక తెలియని అగాధం

ప్రతి మతిలో ఒక సినీవాలి ఆకృతి
అల్లిన చీకటి దారాల డ్రెస్‌లో అందంగా
పరుగుకు పరిమితితో చెక్ పెడుతుంది
లేంది! బ్రతుకులో హద్దు అదుపు ఉండేనా?

మలి సంధ్యలో గగనంలా మారే ముఖాన
చంద్ర బింబం కనిపించే గ్యారంటి లేదు
చుక్కల్ని అల్లుకొని ఆశలు
మల్లె పూల తీగెను తలపిస్తాయి

అగ్గి పుల్ల గీసి అయినా
సిగరెట్ వెలిగించి అయినా
అవసరానికి దారికై ఆరాటం!
చీకటి లోనూ పోవలసిన పయనం ఆగదు!

చంద్రుడు వస్తాడు, నిరాసక్తంగా వెళ్ళిపోతాడు
సూర్యుడు వస్తాడు, ఆత్మీయంగా కదలిపోతాడు
ఎక్కడో దూరాన ఉన్న మబ్బు ముక్క
పైన ఉన్న సూర్య బింబాన్ని కనబడనీయదు

చిన్ని చిన్ని కుటిల జటిల సమస్యల ముందు
మసి అంటి వివేకం మసకబారడం విచిత్రం!

## 3.

టేబుల్ పై కళా రూపం పరుగెత్తే అశ్వం
క్షణంలో ఉత్సాహ లహరిని దూకిస్తుంది
రూపం నుండి క్రియకు పరివర్తన దశలో
జన హిత రుచితో రెడ్ కార్పెట్ పరుస్తుంది

చీకటిని చీలుస్తూ వెలుగు రేకులు విప్పుతూ
హృదయం నుండి హృదయానికి కవిత
క్షణాలకు పరిమళ స్పర్శను అందిస్తూ
జనతకు సమతలో నవతను చూపుతూ
స్టేషన్ నుండి స్టేషన్‌కు చేరే రైలులా
భవిష్యత్తును తన వశం చేసుకుంటుంది

కాలంతో పెరగడం అందరికీ ఇష్టం
ఆయువుతో తరగడం ఇష్టం ఉండదు

పెదవిపై కత్తి పదును మెరపుతో
ముఖంలో అగ్ని శిఖల తలపుతో
గెలుపు ప్రధానంగా పందెంలో స్వార్థం
ఆటలో దొరలే బంతిలా జీవన సమయం!

ఎంత కయినా తెగించే మొండి సాహసంతో
స్వేచ్ఛలో ఉత్సాహం! పొంగే షాంపేన్ నురగలా
అశాంతికి తావు లేని ఆలోచనలో
సమస్యకు పరిష్కారం ఉదార వర్తనలో

మనిషి నుండి మనిషికి ఆశా ప్రసారంతో
చీకటి బొమ్మలు తొలగిన మనోవేది నుండి
మానుష స్వరం! 'నిజం' పలకవలసి ఉంది
దహన కాండ బదులుగా వెలుగు సర్గ చూడాలిసి ఉంది

# 4.

హృదిలో ఆకాశం శబ్ద గుణంతో
స్పందనలో అహంకార ప్రేరణతో కళామయం
సమాజ సంబంధంలో మానవతా సూత్రంతో
కవి ఇష్టంతో ప్రభవిస్తుంది కవిత!

ఎవరికి ప్రియమయినా కాకపోయినా
పదంలో భావ పరిమళంతో కృతిలో
చివరి మాట ! ఎప్పటికీ ఆ కవిదే!

కవికీ సంఘానికీ మధ్య నిశ్శబ్ద కీర్తి స్తంభం!
కాలం తలకు చుట్టిన వెలుగు పాగాలా
రహస్యాన్ని అందుకొనే పనిలో ఎత్తిన అరచేయిలా

ఎవరి స్వాగత మాలతో పనిలేదు
ఎవరి గుడ్‌బై మాటతో పని లేదు
అది ఆ కవికి కేటాయించిన సమయం
ఇందులో ఎవరి జోక్యానికీ అవకాశం లేదు

తన ఆలోచనా రాజ్యానికి ప్రభువు కవి
అనుభూతికి చెందిన అధికారం సహజమైంది

లోపలి నుండి వెలుగు దారి చూపుతుంది
వ్యక్తి నుండి సమాజానికి ఆదర్శంతో దార్శనికం
అందరికి కావలసిన బంధుతతో
భౌతిక మానసికాలను కలిపే సేతువు

నిప్పు రవ్వ ఎగిరి పడితే
బూది అయ్యే పూరి పాక కాదు

తీవ్ర తీవ్రంగా వీచే గాలికి
పెళఫెళ విరిగి పడే శుష్క శాఖి కాదు

# 5.

వెలుగు దారి విప్పారి గంధ లహరి తోసుకొని
ఆకాశమంత ఏకాంత వేదికపై
సముద్ర మంత సమాజ చలన గుణంతో
అక్షరాల మౌనంలో! హృదయ భాషతో
కవిత! మరో సృజన కళా ప్రపంచం

ప్రవాహంలో కదలి పోయే నావల్లా
నిఘంటువులో వరస క్రమంలో పదాల్లా
షాపులో అద్దాల కేసులో అమరిన మందుల్లా
కావలసిన వస్తువు పైనే కవి చూపు!

అమ్మను మాటి మాటికి అడిగే అవసరం లేదు
ఎప్పుడేది అవసరమో అంతరంగం అందుకుంటుంది!

ఎంత పెద్ద జలధి అయినా స్వేచ్ఛలో
పడవ సాగేది! కొన్ని అలల పైనే!
ఎంత మంచి కవిత అయినా సృజనలో
కవిత పలికేది! కొన్ని పదాలతోనే

తాను మేల్కొని మానసికంగా కవి
మరొకరిని మేల్కొల్పడం అక్షర సుందర సందర్భం
వివాదం ఆలోచనల్ని వేగవంతం చేస్తుంది
నినాదం ఆచరణల్ని తీవ్రతరం చేస్తుంది

ఏ పదాన్ని అయినా కవిత పలకరిస్తుంది
ఏ విషయం అయినా చేయిని అందిస్తుంది
ఒకరి నుండి పరిచయమై మరొకరికి
సహృదయ స్పందనతో విశ్వమయమవుతుంది

ఒకరిపై ప్రభావ ముద్ర వేస్తుంది
ఒకరిలో ప్రేరణ రూప మవుతుంది
అనుభవ నవ్యతతో ఆప్త మవుతుంది
ఉన్న స్థితిలో మానసిక శోభ పెంచుతుంది

# 6.

ఆగని నది వలె అందంగా కదలుతూ
తన మార్గంలో తీర భూమి విశేషాలు వేరు
ఎవరి పయనంలో వారికి తృప్తి
ఎవరి గమ్యంపై వారికి ఆస్థ

విమర్శనా సలాకలు బోనులా ఏర్పడి
సృజన స్వేచ్ఛను హరించే యత్నం ప్రమాదం
కవి అస్తిత్వం ప్రతిఫలనం కవిత
మానసిక స్వేచ్ఛ! సృజనకు తెరచిన ద్వారం

సరికొత్త జగంతో మనిషిలో మార్పుకు
సంకేతం! కవితలో శబ్ద విజయం
పయనం సాగంది గమ్యం చేరే ప్రసక్తి లేదు
ఉన్నత లక్ష్యం లేంది! శ్రమ ఫలం సార్థకం అవదు

సమయం గాజు సీసాలా దొర్లిపోతూ
మధ్యలో పగిలి చెదరి గాయపరచవచ్చు
ఎవరికి వారు అనుభవ పాఠాలతో గడిపేరు
తమకు తెలియకుండ లౌకిక తంత్రంలో పావులుగా!

సుఖమూ సౌకర్యం భాగ్యం ఎంత పెరిగినా
బాధలవే! దు:ఖమదే ఎప్పటికీ
గడియారం ముల్లులా చుట్టూ తిరుగుతూ ఉండదు
విడిచిన బాణంలా సూటిగ పోతుంది జీవితం

అహంకార మూలం నుండి సృజన రూపం
ఏదో ఘన కార్యం నెరవేరిన సంతోషం
శిరసు ఎత్తి సాచి నింగిని తాకాలని కోరిక
మనిషి ఎత్తు పెరుగుతుంది! కవితలో! తనకే ఆశ్చర్యంగా

# 7.

చుట్టు పరచిన పచ్చని మైదానమే కాదు
ఇసుక ఎడారిలోను శిలా శ్రేణులలోను
కవిత వెడలుతుంది నిర్నిబంధ చేతనతో
స్పందనలో వేదనతో పొరలే అనుభూతులతో

పూల తోట అనుకునే కవితా క్షేత్రం
జన బాధా శిఖల మధ్య కర్తవ్యం బోధిస్తుంది
మనిషిలో దాగిన వెలుగు మనిషిని పైకి తీస్తుంది
సమూహ వర్తనంతో సమాజ గతి మారుస్తుంది

అనుభవ రూపాలతో కవిత! అలలపై నావలా
తీరం చేరేంతవరకు కవి కెప్టెన్ అధీనంలో

బాష్ప కణంలో మానవ హృదయం బింబిస్తుంది
అగ్ని లవమో! మంచు బిందువో! ఏదయినా
రెండిటిలో కవిత! ససందర్భంగా, ఒంటరిగా
తనలో కొత్త జగంకై ఆరాటం పడుతుంది!

బాష్ప బిందువుల్లో మంచు ముత్యాలు
సంతోషంలో! బాధను మరపిస్తాయి
మౌన శిల్పాలను మాట్లాడిస్తాయి
స్తబ్ధ శాఖికలను సుమింప జేస్తాయి

వచ్చే వాతావరణం సూచనగా గాలి
సమాజ చలనంలో మార్పుకు ముందుమాటగా!

కవిలో త్యాగ ఫలం కవిత!
పదాల కరెన్సి నాణాలతో నోట్లతో
జీవన సార్థకమౌ విలువలతో
కాలాన్ని ఆవహించే జీవన వాస్తవం

వ్యవహారంలో లెక్క తప్పితే ప్రమాదం.
కవితలో ఎవరి లెక్కలు వారివి
అభిప్రాయ భేదాలతో విలువలు మారుతూ
కవి బ్రతికిన కాలానికి ఆలోచనా దర్పణం

హృదయానికి హ్లాదంగా సంఘానికి శ్రేయంగా
కవిత ఎప్పటికీ పూలు పూసే సమాజ వనం
ఈ విశాల వైవిధ్యం సంస్కృతి సంపదలో భాగం
టేబిల్‌పై ఆకర్షించే ప్లాస్టిక్ పూల పాత్ర కాదు

ఎండలకు ఎండి పాయలై చీలిన నది
అడుగు చూపే నీటి ఇసుక పొరలలో
సన్నని వేదన వినిపిస్తుంది! చూచే వారికి
కవికి మాత్రం! మనసు కెక్కుతుంది.

కవి వదలి వెళ్ళినా సమాజం వదలదు
కవితను అందుకొనీ, ఏర్పడిన బంధంతో
తనలో ఒకటిగ కలుపుకుంటుంది
మానవ సంస్కృతిలో భాగమయిపోతుంది

## 8.

సృజన వనంలో కవిత
ఎపుడు మల్లె పూవులా విరిసేదీ
ఎపుడు బొగ్గు ముక్కలా మారేదీ
ఏ కవికీ తెలియదు! అంచనాకు వీలు లేని స్థితిలో

ఫలానా చెట్టుకు ఫలాన పూలు పండ్లు
వస్తాయని చెప్పొచ్చు, ఆశపడొచ్చు

ఇల్లు బయట ఆపీసు మార్కెట్‌లో
ఎవరికి వారు తమ తమ ప్రపంచాలలో
పరిచయాల సూత్రంతో మానవ బంధంతో
పూర్వ పాత్రల నమూనాల్ని తలపిస్తూ ఎందరో

ఇంట్లో ఉన్నవారి ముఖాలలో
మారే వోల్టేజిలతో బల్బుల వెలుగులు
బాంధవ్యం సంబంధం రంగులలో
మనసులో ఇంద్ర చాపం ప్రతిఫలిస్తుంది

బయట కనిపించే వారి ముఖాలలో
తలుపులు మూతబడి లోపల ఏముందో?
స్నేహ స్పర్శతో తలుపులు తెరచుకొనీ
కథను వదలి పాత్రలు ముందుకు వస్తాయి

ఆఫీసులో కనబడేవారి ముఖాలలో
అధికారం ఆరోహణలో శిఖరాలకై పోటి
తమ బాధ్యత మరచి హక్కులకై ఆరాటం
తమ విధులపై కన్న ఇతరుల పనులపై చర్చ!

మార్కెట్‌లో కనిపించే వారి ముఖాలలో
కావలసిన వస్తువు అన్వేషణలో పరిచయాలు
పైనుండి కిందికి కింది నుండి పైకి మారే ధరలతో
రూపాయి పెట్టుబడితో వేల రాబడికి ప్లాన్

కొందరి ముఖాలపై నీలి తెర వేలాడుతూ
అది తొలగితే గాని! అసలు వాలకం తెలియదు
కొందరి ముఖాలలో ఏదో ఒక జాతి పూవు
పరీక్షిత్తు కథను మెరపులా గుర్తుకు తెస్తుంది

కొందరి ముఖాలలో రెడిమేడ్ ఆదర్శ ప్రదర్శనం
పైకి దూక నున్న సింహంలా ప్రత్యర్థుల అవతారం
కొందరి ముఖాలలో వాలిన సూర్యకిరణం
పదును కత్తిపై అనుమానం తళతళ మెరుస్తుంది

వార్తల గుసగుసలతో కదలుతుంది గాలి
చీకటి మడుగు నుండి వెలుగు కమలంపై ఆశ!

అన్నిటినీ వహిస్తూ పుష్పక విమానంలా కవిత
ఒక చోటు నుండి మరో చోటికి తప్పని పయనం
కవి పైలట్ అధీనంలో సమాజ యానం
హృదయం నుండి హృదయానికి అక్షర ప్రసారం

# 9.

ఈ అవని ఎప్పటికీ తరగని యౌవనవతి
యశో మూర్తులు అమృత పుత్రులు వెలుగులతో

పైరు పంట మొక్క తరు గుణ సంపదతో
ఎండలు వానలు కొండలు నదీ నద విభవంతో
సర్వం సహ! ఉదార చరిత! ప్రకృతి రూపం
జీవన పోషణ రక్షణలో మాతృ భావనా ప్రతీక!

భూమి లేంది మనిషికి బ్రతుకు లేదు
మనిషి లేంది భూమికి యశసు లేదు
మంచులా కరగి మనసు ప్రవహిస్తేనే అందం
జలాలపై హంసల్లా ఉదార చరితుల పయనం

మానవ గుణ కర్మల అందం
సమాజ నిజ సంస్కృతి చిహ్నం

గగనంలా పరచుకొన్న ఏకాంతం
మనిషిని తిప్పుతుంది ఇష్టానుసారంగా
వర్తమానం గురించి భయం లేని గుండెకు
భవిష్యత్తు గురించి ఏ చింత ఉండదు

మాయమైన నిన్నటి కల గురించి
తనలో నిర్వేదం అనవసరం నిష్ప్రయోజనం

భూమి కంపిస్తుంది, విధ్వంసం తాండవిస్తుంది
నిర్దయగా విసరిన మృత్యువు వలలో ప్రజలు!
వసుధ తవ్వబడీ, నిక్షేపం బయటపడుతుంది
అక్షయ సంపదతో, భాగ్యం తళతళ లాడుతుంది

బయటకు తగిలిన గాయం మానుతుంది
లోపల పుష్పం రేకులు విప్పుతుంది

నిశ్శబ్ద విషాద వలయాన్ని ఛేదించుకొని
శబ్ద విహగాలు బయట పడతాయి
కవితలో అక్షరాలై వాలతాయి!
స్వేచ్ఛా భావ మూర్తులై తిరుగుతాయి

ఎంతటి అలజడి లోను కటు రవాల మధ్య
మానవ మధుర స్వరం వినబడుతూనే ఉంటుంది
సందర్భం పాత్రల్ని వహింప జేస్తుంది
జీవన రుచికి కళా రూపం ఇస్తుంది

చేతిలో చిక్కి ఎగిరి పో జూచే
పావురం రెక్కల కదలికలో ఉత్సాహం!
అందమైన పట్టును, ప్రియమైన స్పర్శను
వదలి ఎగిరి పోవాలని, స్వేచ్ఛగా బతకాలని

అనుభవ చిత్రం! మిగులుతుంది స్మృతిలో
గతానికి వర్తమాన స్పృహలో చోటుతో

పద్మశాలి నేసే సన్నని వస్త్రంలా సమయం
విడుదల అవుతుంది, రంగులతో నగిషీలతో
ఎవరు కోరేదీ ఎవరికి తగిందీ వారు ఎన్నుకొని
ధరించడమే! తప్పకనో! అలంకార సుందరతకో!

# 10.

ఏ చెట్టో! ఏ ఇల్లో! ఏ గోడో! ఏ మనిషో
ప్రతి వస్తువుతో నీడ! తప్పని సరి వెలుగుతో

నీడ ఎన్ని రహస్య విషయాలకో సాక్షి
నిజాన్ని దాచేసే కల్లకు అవకాశం! ఉంది

మనిషి సహజ మిత్రం వలె నీడ!
పునాది లేని తలుపులు లేని నిలయం
భూ చర ఖేచర ప్రాణులకు ఆశ్రయం
చెట్టు నుండి చల్లని దీవెన రూపం!

వేదనలో ఊరట కలిగిస్తుంది
తాపంలో మనసును చల్ల బరుస్తుంది
ఎంతటి శ్రమనూ హ్లాద మయం చేస్తుంది
ఎంతటి వారూ ఎప్పుడో నీడకు రావలసిందే!

కోట గోడ నంటుకొని, తరాలుగా
గత చరిత్రను దాచిన పేటిలా!
మరచిన స్మృతులను మేల్కొల్పుతుంది
క్షోభలో ఆలోచనకు శాంతి ప్రసాదిస్తుంది

ఎండలో బడలికలో విరామంలో ప్రాణికి
స్వాగతమిస్తుంది, హద్దులను తెలుపుతుంది

దేని కది విడదీయరాని
పలు రంగుల కలయికతో వాస్తవం
దేని కది వివరించరాని
బహు భంగుల చలనంతో సమాజం

మనిషి ఊహ, కోర్కెల వెలుగులతో
బ్రతుకు తీరు, చీకటి మలుపులతో

# 11.

సూచనతో తుపాను! అంతలో ప్రత్యక్షం
క్షణాలలో సర్వం విధ్వంసం! ఏండ్లపైన నిర్మాణం
అల్పమైన దైనా గరిక పాదుకొనీ
వరద వేగ తీవ్రతల్ని అదుపులో పెడుతుంది

రణమైనా మారణ దృశ్యం! ఎపుడో ఒకచోట
దాని ప్రభావం! పలుచోట్ల! ఎప్పటి దాకానో!
నిప్పుతో చెలగాటం తప్పదు ఒక స్థితిలో
మనసులో కరుణ జలం సానుభూతి సమర్పణలో

నేలపై నీలి మబ్బు సిగ్నేచర్ చేస్తూ పోతుంది
వదలిన గుర్తులతో బ్రతుకులకు భరోసా ఇస్తుంది
ప్రకృతికి ప్రాణికి ఆర్ద్ర శోభ నిస్తుంది
దీని విలువ సృష్టిలో ప్రాణంతో సమానం

ఒక సమయంలో కాలానికి లొంగి పోతూ వేడికి గాజులా
ఒక సమయంలో కాలాన్ని ఎదిరించే శక్తిని ప్రదర్శించేను

సంకల్పం మనసును నడిపిస్తుంది
సమయం మంచులా మారవచ్చు
ఏ ఆకృతి నయినా పొందుతుంది
వెంటనే కదలుతుంది, సరిస్తుంది.

బ్రతుకులో రహస్య నిలయాలెన్నో
తలుపులు వేయబడి ఎప్పటికీ

తలుపులు తెరిస్తే ఏముంది? అంటే
మానసిక బంధంతో అనుకునేవి ఎన్నో?
ఉన్న గుర్తుల్లో ప్రకాశ బిందువు కనిపిస్తుంది
లేంది! అదొక శూన్యం! తెగిన సాలీడు పటం

గగనంలో చంద్ర బింబం కందుకంలా
సమాజంలో మనిషి! దిశ నుండి దిశకు

## 12.

శిశు దశ నుండి మేధలో
అనుభవ ముద్రలతో రహస్య నిలయాలు
రోజు విడవకుండా డైరి విశేషాలు నమోదు
అవసరమైనవి ఎపుడెపుడో బయటికి వస్తాయి

చుట్టు నిశ్శబ్దం అన్వేషణకు పురి కొల్పుతుంది
శబ్ద సార తరంగాల్ని వినే కోరిక కలుగుతుంది
స్థలం నుండి స్థలానికి భౌతికం, వాహనం
ఎక్కడా క్షణం ఆగని కెరటంలా, మానసికం

స్వార్థం పడగ విప్పి ఆలోచనలో
విష బిందువు జార వచ్చు
త్యాగం వెలుగు విరిసి అనుభవంలో
అమృత కణం ఒలక వచ్చు

అపుడపుడు కలలు మిల మిల లాడుతూ
అపుడపుడు ఆశలు తళ తళ లాడుతూ

ఏదో ఒక చిక్కు ముడిలో చిక్కిపోతే
బ్రతుకంతా ఖైదు సమం కాదు

ఎపుడో ఒక లిప్త అనల కణ స్పర్శతో
బ్రతుకంతా జ్వాలా సంచారంతో నిండదు

వైజ్ఞానికం ఆధ్యాత్మికం చెరొక వైపు నుండి
కొంత వరకు మృత్యువును పోస్ట్‌పోన్ చేసే పనిలో
మనిషిని విజయ శిఖరాలపై నడిపించినవే అయినా
మరో దారి లేని లోయ లోకి పయనం ఆపలేవు

## 13.

గాలి స్పృశించని ప్రదేశం లేదు
ఆలోచన లేని మస్తిష్క శాల లేదు
ధూళి ధూమం మలినం నుండి
శుభ్రంగా బయట పడుతూ పోవడం కర్తవ్యం

మనుషుల బుజాలపై చేయి వేసి కదలుతుంది
తలలను స్పృశిస్తూ దీవిస్తూ పోతుంది
ఎదురయిన ఎదపై ఆరచేత తాకి పోతుంది
స్వేచ్ఛగా తరలుతుంది, ఎంత దూరమైనా
మొక్కను చెట్టును పలకరిస్తూ పోతుంది
ఉదార గుణంతో ప్రాణ రూపం నిలబెడుతుంది

నది అలలపై నుండి సుఖద భావ చలనంతో
జలధి అలలపై నుండి ఆర్తి హరణ వేగంతో
అదృష్టంలో మేఘాన్ని ముందుకు తెచ్చి చూపిస్తుంది
వీచే గాలుల ఆలోచనలతో మారుతుంది సమాజ రూపం!

దుర్వాసనతో గాలిని గుర్తించే దౌర్భాగ్యం వదలి
పూల తోట పరిమళ వాతావరణం సమాజానికవసరం

భూమి నుదురుపై రేఖలు
దున్నిన నాగలి చాలు వరసలు
రానున్న భాగ్యానికి సూచనగా
అయినా దరిద్రం మిగిలే ఉంటుంది

ఎదురు పడే బిక్షువు లెందరో! ఎన్ని తీరుల లోనో
వ్యవహారం వ్యాపారం సాహిత్యం కళలు రాజకీయం
ఇంకా ఇంకా సర్వ బిక్షుమయం, సమాజ పథంలో
దరిద్రమయ హృదయం, గాలిని క్షుభితం చేస్తుంది

# 14.

బుజాన కావడికి ఇరు వైపుల
సఫలం విఫలం రెండు కుండలతో
నడచే మనిషి బ్రతుకులో నిరాశతో
ఏ కుండ ఎపుడు పైకి లేచేదీ తెలియదు

ఉత్తమ లక్ష్యంలో తగిలిన గాయం
మలుపు తిప్పుతుంది! యశో చిహ్నమవుతుంది
వెలుగులో చెట్టు నీడ బయట పడుతుంది
మాటతో మనిషి జాడ బయట పడుతుంది

నినాదం నిరాశ్రయులకు ఆశ్రయం ఇస్తుంది
పోరాటం మార్పుకు కొత్త దారి చూపిస్తుంది

తనకు తెలియకుండా చెలరేగే
మంటల నాశన చర్యల సమాజంలో
సామన్యుని దృష్టి ఆకాశం వైపు పోదు
భూమిపై జన సమూహంలో చరిస్తుంది

నిజాన్ని కప్పిన పలు రంగుల్లో మాటలు
భ్రమలో తిప్పుతాయి, ఆకర్షణలో ముంచుతాయి

అనుమానం తొలగే అవకాశంతో నిజం
అబద్ధం మడుగుపై నుండి సింహంలా దూకుతుంది

సూది మొన అంత నిజం తెలిస్తే
బ్రహ్మాండ రహస్యం తెలిసినంత ఆనందం

ఏ ఊరు వెళితే, ఆ పాట అందుకున్నా
అందరికీ పావురం తెచ్చే సందేశ మొకటే

వర్తమానంలో గడ్డ కట్టిన ఆలోచనకు
భవిష్యత్తు స్వర్ణ ద్వారం తలుపులు తెరచుకోవు

# 15.

సమాజ జీవనంలో రణ చరణం
వివిధ స్థాయిల్లో ఎప్పటికీ ఏదో రూపంలో
పాత వస్త్రం చీరిన గళ స్వరంతో
ఆగి నట్లవుతుంది, అంతలో వేగ మందుకుంటుంది

రక్త సిక్త పతాకలా మనిషిలో ఆలోచన
నిప్పును కప్పిన బూదితో కాలి క్రింద నేల
ఎక్కడా మొగ మోటం లేదు! తమ పనిలో
మొనదేరిన ఉద్దేశం బరిసెయై దిగుతూంది

ఇదొక నాటితో సరిపెట్టుకోనే తంత్రం కాదు
తెల్లని కాలం! దశ దశలలో పలు స్థాయిల్లో
ఎరుపు నలుపు గీతల అంచులతో పరచుకొనీ
సమాజంలో మనుషుల చరితకు రూపం! ఇస్తూంది

యథాస్థితిని కాపాడే కోటల వలె కొందరు
మార్పుకు వేగం తెచ్చే ఆశ్వాల వలె కొందరు

ఒక చోట విద్వేషం మరో చోట విద్రోహం
ఒక చోట విపరీతం, ఇదీ సమాజ చిత్రం!

మారణ ధ్వని మ్రోగి ప్రతిరోజు ఒక సమయంలో
బాధాచరణాలకు పల్లవిగా మారుతూంది

ఎదురు తీర్చి పోరాడే రణ నిపుణత కన్నా
రహస్య ప్రకారాలతో మెరపు దాడుల రణం
మనుషులు కనిపించరు, ఆయుధం కనిపించదు
ధూమ రేఖ మాత్రం! కనిపిస్తుంది! ఎదురుగా!

పరిష్కరించలేని సమస్య కావచ్చు
సిద్ధాంత విభేదం అయినా కావచ్చు
ఉద్రేక స్థాయిని దాటవచ్చు
ఉన్మాద స్థితులను పొందవచ్చు

అందమైన కంటి చివర నుండి
ముళ్ళను వదల వచ్చు, పూల సంగతి మరచి
చీకటిని చిమ్మ వచ్చు, వెలుగు సంగతి మరచి
బాకును విసర వచ్చు, మానుషీయం మరచి

గుండెలో శతఘ్ని పేల వచ్చు
ఆదర్శం అద్దంలా ముక్కలు కావచ్చు

తుపాను చిత్రాలతో భూకంపం ధ్వనులతో
పరివర్తన కోరే చలనం నిర్దయగా
విలయానికి దగ్గరగా చేరుతూ
శాంతికి బహు దూరం అవుతూంది

రెండిటి మధ్య మనిషి! ఆరోహణ క్రమంలో
సందేహ స్తంభంలా నిలిచి పోయే ప్రమాదం!
ఎక్కడికి తీసుక వెళుతుంది అంటే
వెళ్లిన చోటు నుండి ప్రాణం నిలిచే చోటికి

కాలం అద్దంలో మనిషి రూపం ఉజ్వలంగా
ప్రేమ కరుణ త్యాగంతో శాంతి వైపు
లోపల నిలిచిన బండ రాయి మారుతుంది
సుందర హృదయంతో వెలసే సజీవ శిల్పంగా

## 16.

వర్తమాన స్పందనతో కాలం ఎదురవుతుంది
వాస్తవ స్థితులతో సమాజాన్ని అలంకరిస్తుంది
వర్తనలో ఒకటై, అలంకార మొక గుణమై
వ్యక్తిత్వానికి మానుష పూర్ణత నిస్తూంది

హృదయం నుండి మరో హృదయానికి
రహస్య పేటి తెరచి చూపుతుంది కవిత

వీరానికి మొదటి మెట్టుగా
కరుణకు నిలయంగా
రాగానికి భావ శిఖరమై
శాంతికి గగన బింబమవుతూంది

చావు పుట్టుకల మధ్య విశాల మైదానం!
జీవితాల కెన్నో అవకాశ దిశలతో చుట్టూ
కాలం ఎదురు పడుతుంది, మనిషిని కదిలిస్తుంది
సమయాన్ని ప్లేయింగ్ కార్డ్‌లా వదలుతుంది

బాల్యం నుండి మనసు ఆటకు సిద్ధమవుతుంది
జ్ఞానం పెరిగే కొద్దీ ఆట ఆటకూ కొత్త ఉత్సాహం

కొత్త కొత్త వ్యక్తులతో పరిచయం
మధు కణ కుసుమంలా స్పృశిస్తుంది
వెలుగులా హ్లాద తంత్రి మీటుతుంది
నీటి పాయలా స్నేహ హస్త మందిస్తుంది

నేలపై జలాలపై గాలిలో
పయనానికి వాహన సమ మవుతుంది
నిజం కోసం తిరిగి తిరిగి అన్వేషణలో
మనిషి తన హృదయ పీఠం వద్దకు చేరేను

## 17.

పచ్చని ఇంటి ఆవరణం లోనే కాదు
వెచ్చని శ్మశాన వాటిక లోనూ మొక్క
ఉదయం మంచు బిందువు నిలిచిన పూవుతో
వాస్తవ జీవన దృశ్యం! కాల్పనిక సౌందర్యంతో

ఎరుపెక్కిన కళ్ళ నుండి దొరలి
కన్నీరు బయటికి తరలుతుంది
కనుపాప తెర వెనక దృశ్యం
కారుణ్య రూపానికి సంకేతం!

దు:ఖాన్ని బాధనూ దూరం విసరేస్తూ
మనిషిలో చేతనకు క్రియాశక్తి! అవసరం

గాజు నిలయంలో నివాసం కాల్పనికం
విసరిన రాయి కన్న, పగిలిన గాజు ముక్కతో
గాయం! తీవ్రమై మనిషిని బొమ్మను చేస్తుంది

నిశ్శబ్దం పేలుతుంది! మౌన శిథిల ధ్వనితో
ఆర్త స్వరంలో దూసే వేడి వేడి గాలి
చరిత్ర లలాటంపై! బూదిని రాలుస్తుంది

సంధ్యా సందేహ స్థితి! ఎంత కాలమో ఉండదు
క్షణాలు దగ్గరవుతూ, ఏదో ఒకటి తేలుతుంది

రాత్రి అయితే చంద్ర బింబం నుండి ఆశ్వాసం
పగలయితే సూర్య బింబం నుండి విశ్వాసం
కాలం ఎప్పటికీ ముందుకే! వెనక్కి కదలదు
సాగే మనిషి అడుగు ముందుకే! వెనక్కి నడవదు

పునరుద్భవ గుణంతో కాలం!
పరివర్తన పథంలో సంఘం!

# 18.

అగ్నికి దయ లేదని కాదు
అదుపు చేయ లేని మనిషి పట్ల
దాక్షిణ్య రహితంగా ఉంటుంది, కాల్చేస్తుంది
చేతికి బూది సంచి దొరకుతుంది

కళ్ళలో తడి, మనిషి చూపును కాపాడుతుంది
లేంది! నిప్పు గుణం చూపును దహిస్తుంది

బుజాలపై కప్పిన శాలువాలా ఆదర్శం
కిందికి జారుతూ మాటి మాటికీ
సవరించడంలోనే సమయం గడుస్తూంది
రావలసిన మార్పు గురించి ఆలోచన ఎప్పుడు?

మానవత తప్పిన జీవితంలో
కాలం విసరుతుంది! సవాలు
సవాలుకు జవాబు మాత్రం
శుభ్రమైన మనసుకే సాధ్యం!

మధు బిందువుకై తిరిగే భ్రమరం
ఎగురుతూ మనిషికి జ్ఞాపకం చేస్తుంది
బ్రతుకులో మరచింది! అదే పనిగా ధ్వనిస్తుంది
హడావిడిలో! ఎవరు పట్టించుకుంటారు?

తుమ్మెద కాటేస్తుందని భయంతో తొలగుతారు
మన కెందుకులే అని కొందరు జారుకుంటారు
కాలక్షేపానికి కొందరు వింటే వింటారు!
ముసుగుతో అంతరంగం కప్పబడీ కొందరు

# 19.

ఎంత కఠినతర మయినా హృదయం
రివాల్వర్‌గా మారడం చిత్రాతి విచిత్రం
చరిత్రలో! మనిషి వికసించిన సంస్కృతి రూపం
మానుష చిహ్నం! జ్ఞాపకం రావడం సహజం

దారికి వస్తూ పోయే మనుషులతో పనిలేదు
దొంగలు దొరలు హంతకులు ప్రేమికులు ఉండొచ్చు
ఎవరు ఎవరికి మిత్రులో శత్రువులో అసలు తెలియదు
గాలికి తెలియదు, ఆయుధానికీ తెలియదు

దీపం దారి చూపిస్తుంది అందరికీ
ఎక్కువ తక్కువ భేదం లేకుండా
మంచి చెడు అవసరం లేకుండా
ఇది తెలిసీ! దీపం ఆర్పివేయబడదు!

సాయం వేళకు అలసిన పగలు
శ్రమ జీవి ఫాలంపై వాలుతుంది
చీకటి భయంతో ఏదీ ఆగదు
వెలుగుపై విశ్వాసం అదృష్టంలో భాగం

ఎదురు పడే మనుషుల ముఖాలలో
ఎన్ని పాత్రల మెరపులో! చకితంగా

ఏ రోజూ ఉదయం చూచే మొదటి క్షణం
ముంగిలిలో వేచి లోనికి దయ చేస్తుంది
వెనక నుండి గతంలోకి వెళిపోతుంది
మనిషి ఫాలతలాన్ని ముద్దుగా స్పృశిస్తూ.

## 20.

ఇది నిన్న మొన్నటి దృశ్యం కాదు,
ఈనాటి వాస్తవ ముఖంతో జీవన రూపం
సుందరతను సార్ధకతను కోరే బ్రతుకులో
నర నరాన కణ కణాన జిజీవిష మనిషిలో

మధ్య మధ్య నోరు తెరచిన కత్తెరతో కాలం సిద్ధంగా
శుభ్రమైన వాస్యం! డ్రెస్‌పై నీలి చుక్కలు
ఇది విషాద ప్రదర్శనం కాదు
ఇది నిరాశ ప్రకాశనం కాదు

మనిషి చుట్టు పెరిగే వాడి ముళ్ళ గురించి
లోన అల్లుకొనే ఇనుప తీగె గురించి
"ఇంత కన్న బంధనం ఏముంది?" అని ప్రశ్నిస్తే,
నిర్బంధం స్వేచ్ఛలో అనుకున్నంత సులభం కాదు

ఇంతకన్న ఏ ఆయుధం తోనో
"పని ముగిస్తే మంచిది" అని కొందరు
అందమైన కళేబరంలో రక్షణ కవచం నుండి
ప్రాణం తీయడం అంత సులభం కాదు

ఒకరి గుణం మరొకరికి దోష స్థానంగా
ఒకరి దోషం మరొకరికి గుణ స్థానంగా
దృష్టిలో భేదంతో అంతా తారు మారు అవుతుంది
మనిషి శక్తి ముందు ప్రశ్న! ముడులు వీడుతుంది

కళ్ళ లోకి చూస్తూ మాట్లాడే ధైర్యంతో
చూపులో కిరణం లోతులు చూపిస్తుంది

దారిలో కుడి ఎడమల రాక పోకలు
దేశ దేశానికీ వేరు వేరు విధానాలు ఉండొచ్చు

మనిషి మనిషినీ సొంత లాభం అడ్డదారి పట్టిస్తుంది
అణువణువున సృజనతో విలయ చర్య చేరుతుంది

గతం ఎక్కడికి పోతుంది? వెనక్కి తిరిగి చూస్తే
ఊహ నావరించి చూపు మేరలో అంచునే ఉంటుంది

ఆలోచన సంఘర్షణ ఒత్తిడి కదలికలో
కఠోర వాస్తవాలు సరికొత్త మలుపులతో
వర్తమానం ఎప్పటికీ మనతో తప్పనిదీ
మెజిషియన్ సంచి నుండి తీసే వస్తువు కాదు

చీకటి ఏ పాపానికి గుర్తు కాదు
ప్రకృతి సహజ వర్తనలో భాగం
వెలుగు ఏ పుణ్యానికి గుర్తు కాదు
బ్రతుకు నడతలో పరమ మిత్రం

నగరంలోకి వస్తే తెలిసిన రూపం లానే ఉంది
మేడలు రోడ్లు జన సమూహాలు! సందడులు
ఇంకా ఏదో కనిపించక మిగిలి పోయినట్లు! ఉంటుంది
అది మానవ సంబంధం! జీవన సుందర బింబం

అందంగా కనిపించడం ఎంత ముఖ్యమో
అందంగా బ్రతకడమూ అంత అవసరం

నీరు నిండిన చెరు కట్టపై నుండి రాత్రి
లైట్లతో పరుగెత్తే రైలు ప్రతిబింబం!
చెరువులో ప్రవాహం పరుగిడుతున్నట్లు ఉంది
కిటికి నుండి తొంగి చూచే తలకాయలతో

రూపం ప్రతి రూపం కలిసి ఒక విశేష సమయం
వాస్తవానుభవంలో బాహ్యాంతర జీవన రమణీయం

స్వేచ్ఛా కవిత్వం - 64

# తెలంగాణ స్వరం

## Voice of Telangana

(English Translation)

Dr. Lanka Siva Rama Prasad

## ఆత్మ బంధం

మాదిరాజు రంగారావు



**2018**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

# TELANGANA SWARAM
# &
# ATHMA BANDHAM

by

Prof. Maadiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

Y.P. : 2015 and 2018

ఇది

ఉద్యమ త్యాగ మూర్తులకు

అంకితం

తెలంగాణ రాష్ట్రం

అవతరణ సందర్భంగా

**02 జూన్, 2014**

# పీఠిక

ఈ కృతి అపుడపుడూ మిత్రుల కోరికపైన ప్రత్యేక సందర్భాలలోను వ్రాసిన స్వీయ పద్య రచనల సంపుటి. పద్యం పట్ల నా అభిమానాన్ని, గౌరవాన్ని తెలియజేసేవి. తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంకై జరిగిన ఉద్యమ దశల్ని మొదటి నుండి చూచిన వాళ్ళలో నేనొకణ్ణి. ఆ ప్రభావంతో చివరకు మంచి ఫలితాన్ని చూచిన సంతోషం స్పష్టం.

ఇదే విధంగా 'ఆత్మ బంధం' కాల్పనిక స్పర్శనూ, మానవీయం సామాజిక వాస్తవ స్పృహనూ కలిగినవి.

"తెలంగాణ స్వరం" కృతిని ఇంగ్లీషు భాషలో Voice of Telangana పేరుతో అనువదించిన డా॥ లంకా శివరామ ప్రసాద్‌గారు సహృదయులు బహు గ్రంథకర్తలు విశాలమైన ఆలోచన, ఉన్నతమైన ఆదర్శం అంకితమైన జీవన రూపంతో విశిష్టమైన అస్తిత్వాన్ని పొందిన మాన్యులు! సన్మిత్రులు కృతజ్ఞతలతో..

**మాదిరాజు రంగారావు**

# తెలంగాణ స్వరం

## 1

ఈ తెలగాణ నేడు ప్రజ
స్వేచ్ఛకు వేదికయైన భూమియై
ప్రాత రుదార బింబమయి
ప్రాభవ శోభను పొంది నట్టిదై
శాంతి కవాటముల్ తెరచి
స్వాగతమున్ రచియించు చున్నదీ
ప్రాంత మనోజ్ఞ సంస్కృతుల
ప్రాపణముల్ ప్రకటించు దీప్తితో

✲

## 2

తెలగాణమ్మొక రాజకీయ ఘన నీ
తిన్ నిల్చి, కాలాగ్నికిన్
జలదం బై విచరించి నిల్చినది, ఓ
జన్, నేడు స్నేహాశయా
కలితంబై ఒక తృప్తి రేఖ హృది, రా
కా కార పద్మాకృతిన్
వెలసెన్ రాష్ట్ర చరిత్ర ఏండ్ల పయి ఆ
వేశాల ఘట్టాలతో

## 3

ఈ దిన మాత్మ తైజసము
నింగిని ఆనెడు కీర్తి మూర్తియై
ఈ దిన మాత్మ భావనలు
రేకులు విప్పిన పద్మ గంధమై
ఈ దిన మాత్మ గౌరవము
రెక్కలు విప్పిన హంస శోభతో
ఈ దిన మందు ఉద్విభవ
వీచిక! కాలము మార్పు గుర్తుగా

✲

## 4

మా తెలంగాణ ఉద్యమ మాన్య చరిత
వివిధ భాషల సంస్కృతి విభవ నిలయ
నిఖిల జగతికి ఆదరణీయ మగుచు
ఇంద్ర ధనుసును తలపించు పీఠ భూమి

❊

## 5

హైదరాబాదు సంస్థాన హార రత్న
ఈ తెలంగాణ ప్రాకృత స్నేహ సీమ
ప్రజల స్వాతంత్ర్య కాంక్షతో ప్రభవ రూప
రాష్ట్ర భావ తరంగిత రాగ రమ్య

❊

## 6

తన అస్తిత్వము రూపు దిద్దుకొని, చి
త్తంబందు స్వేచ్ఛాశయా
నినదం బెంతయు శాంతి తేజమున, ఆ
నీతాంశు త్యాగాలతో
కనిపించెన్ ఒక రేమి? అందరును, ఏ
కాకార చైతన్యమై
విన సొంపైనది రానె వచ్చినది, భా
విన్ భాగ్య రాష్ట్రంబుగా

❊

## 7

వీరా లోలము లోన ఏండ్లు గడచెన్
స్వేచ్ఛా స్వయం పాలనా
భారానన్ తమ వంతు కోసమయి, ఈ
ప్రాంతానికిన్ మేలుగా
హర్తాల్ స్ట్రైకులు దీక్షలున్ నిరసనల్
హారాళిగా వీధులున్
ప్రారబ్ధంబని ఊరకుండ గలరే!
ప్రాణైక ధీ సేవధుల్

❊

**8**

ఆశ సన్న గిల్లి రాష్ట్రమ్ము రాదని
ఒకడు టవరు నెక్కి దూక బోయె
ఆశ దూర దూరమై క్రుంగి వేసారి
ఒకడు అగ్ని నంటి బూది అయ్యె

❊

**9**

సాహసాన దూసి శాసన ధిక్కార
చర్య వెంట ప్రభుత చకిత చర్య
నేర మన్న మాట నిండు ప్రాణము తీసె
కరుణ చిమ్ము త్యాగ గాథ మిగిలె

❊

**10**

క్లాకు టవరు సాక్షి కదలిన స్థితులకు
మనసు సాక్షి మనిషి మలిన కృతికి
పొద్దు పొడవ జేసె, పోరాట గడ్డపై
మనిషి నమ్మ కమ్మె! మనిషి పైన

❊

## 11

అన్ని వైపుల నుండి ఆవేశ గతులు
కర్మ వేది నుండి కార్యమతులు
సర్వ జనుల మహోద్యమ సవన ఫలము
అమృత శక్తి హృదికి అందజేసె!

❊

## 12

ఆనాడే ఉదయించి నట్టిది సుమీ
ప్రత్యేక రాష్ట్రాభిమా
నా నూనం బగు ఈహ! అందున ప్రయ
త్నం బంత! పోరాటమే,
నానా కష్ట ఫలంబుగా ప్రజల, ప్రా
ణాలాకులై రాలి పోన్
నానా వాద ప్రకారముల్ కలిసి, స
న్నాదంబుతో ఒక్కటై

❊

## 13

ఒక రటు నుండి, పాట అయి
గుండెల నూపుచు పోవు చుండగా
ఒక రిటు నుండి, మాటలకు
ఊపిరి నింపుచు పోవుచుండగా
ఒక రెటు నుండొ, మ్రోడులకు
పూతల దుస్తులు తాల్ప జేయగా
నికరము తేల్చి వేయుటకు
నిర్ణయ భావ నిమగ్న శోభితుల్

❊

## 14

వనముల్ గుట్టలు చెర్వులున్ చెలమలున్
వాసించు ఈ ప్రాంత మం
దనువై యున్నది భాగ్య రాసులకు, సా
దా జీవనాపేక్ష వీ
డని, లే కొబ్బరి పాల వంటి హృదయుల్,
ఏ దారిలో సాగినన్
నినదించున్ తెలగాణ నాణెము, దిశల్
నిర్వ్యాజ స్వేచ్ఛా గతిన్

❊

## 15

అనల పథమున నడచిన అమర చరిత
శాంతి కవచము వీడని కాంతి కలిత
ప్రజల దైన్యము హైన్యము బాపు సుహిత
మా తెలంగాణ ఉద్యమ మాన్య చరిత

❊

## 16

రుతువు లన్నియు ఒక చోట రూపు నంది
బ్రహ్మ నాశ్చర్య పరచు సమాజ విభవ!
భయము లేని చీకట్లకు భయము గొలుపు
మా తెలంగాణ! ఉజ్వల మాన్య చరిత

❊

## 17

పచ్చ పచ్చని చేలపై ప్రభలు విరిసి
తెల్ల తెల్లని వెలుగుతో తెలివి సాగి
ప్రజ మనో భావముల నేలు పరమ రాజ్ఞి
మా తెలంగాణ! ఉన్నయ మాన్య చరిత

❊

## 18

అందముగ గౌరి రూపము నావహించి
ఎన్నొ రంగుల పూలను పేర్చి పైకి
పరమ బిందువు సాకార ప్రకృతి హేల
అమ్మ భావన! హత్తిన బ్రతుకు ఆట!

## 19

సంస్కృతిని అల్లుకొన్న ఉత్సవము లెన్నొ
అన్నియును ఆత్మ బింబ ప్రకాశకములె!
ఈ తెలంగాణ అట్టిది! ఎవరి కైన
శాంత జీవన సుందర స్వేచ్ఛ భూమి

## 20

శ్రేణు లన్నియు వర్గముల్ ఏక మైన
వేల కిరణాల సంహిత! వెలుగు రూపు,
ఈ తెలంగాణ మీనాడు విజయ సుషమ
అస్తమించుట లేని ఉత్సాహ పూర్ణ!

## 21

పరచిన ఎఱ్ఱ ఎఱ్ఱని తి
వాచిగ మోదుగ పూల దారిలో
తెరలను చీల్చి వైచి జన
తేజము రూపము మధ్య మధ్యలో
పరి పరి హింసలున్ మసక
బారిన మానస దుష్ట చర్యలన్
తరలుచు, కాల రేఖలను
దాటుచు, పొందిన దీ స్వతంత్రమున్

❊

## 22

తొలి నాళ్ళన్ బహు బంధనమ్ములవి సం
తోషంబు లేనట్టి చే
తలతో పాలన సాగి పోయినది, సం
తాపంబు చేకూర్చు, విం
తలలో వింతగ నోరు మూయబడి, అ
తా ఉర్దు భాషా రుచిన్
తెలుగున్ మూలకు నెట్టి వైచి, బ్రతుకుల్
తిప్పల్ వడన్ జేయుచున్

❊

## 23

ఆంధ్ర మన్న అగ్గి అంటి నట్లయి పోయి
కత్తి దూయ బోయె! కరకు గుండె
తెలుగు నేల అయిన తెలుగిట శూన్యమ్ము
పగలు కూడ చంద్ర వంక వెలుగె!

## 24

మంచు కప్పి యైన మరపున బడి యైన
జనత చూడ లేని జాతి చరిత
ఎవరొ! చూప! ముకుర బింబము సాక్షిగ
ఉద్యమమ్ము నడచె! ఊర్జితముగ

## 25

గడచిన రోజు లన్నియును
గాసిలి నట్టి హృదంతరంబుతో
నడచు శిలల్ వలెన్ ప్రజలు
నాలుగు వైపుల చిమ్ము! చీకటిన్
వెడలిన సూర్యరశ్మి వలె
విజ్ఞత మబ్బుల చాటు మాటునై
జడ మయ మైన మానవత
జాలిని గొల్పెడు శిల్ప భంగిమన్

❉

## 26

ఈ సమయమ్ము వర్ణనకు
వీలును కాని విచార ధారలన్
వాసిత మానసంబు ఒక
అగ్ని సమాన విభాస నీతితో
ఈసురు వోవు ప్రాణములు
నిల్పగ జేయుటయే ప్రధానమై
వేసర జేయు వారలకు
వీర నికామము చూప నెంచెడున్

❉

## 27

కాల మేదైన స్నిగ్ధమౌ కాంతి లేని
మానసాకృతి బ్రతుకులో మాను సమము
తెగిన బంధము ముక్కలౌ తీరు లోన
కలిపి ఉంచుట, సాధ్యము కాని నిజము

## 28

బండి చక్రమ్ము కింద పుష్పమ్ము వోలె
బ్రతుకులో శూన్య భావము ప్రబలి పోయి
గాయపడి నట్టి హరిణమై గడుపు టెట్లు
సాదువైనను, ఈ ప్రజాస్వామ్య మందు

## 29

ఉత్సవ పూర్ణమై వెలుగు
నూతన రాష్ట్రము నందు వాయువుల్
ఉత్సుక భావనా లహరి
లోలములై తన రారు చుండగా
వత్సరముల్ యథావిధి న
వాంబుద వర్ష సమార్ద్ర రీతులన్
మత్సరముల్ తొలంగిన మ
నమ్ములు! అభ్యుదయంబె! కోరెడిన్!

❊

## 30

అభ్యుదయమ్ము కోరు మన
మందున పోవలె ! దుష్ట తంత్రముల్
సభ్యత తోడ రావలెను
శాసన పర్వము నీతి చిహ్నమై
లభ్యము కాని ఆశ పయి
లంగరు నెత్తి తుపాను లందు, వా
ల్లభ్యము రీవి జారిన, వి
లాప మనస్కత వీడగా వలెన్

❊

## 31

కంట కమ్ముల మొనలపై కదలి కదలి
విజయ మంత్రము పెదవిపై వెడలి వెడలి
కడచి వచ్చిన దీ తెలంగాణ చరిత
ఉద్యమమ్ముల కాదర్శ రూప! మాన్య

❈

## 32

విషయ మర్యాద తెలిసిన విపుల మతికి
అధిక భావ మనే దొక సహజ గుణము
స్థాయిలో పైకి ఎదిగిన స్థాన మందు
విలువ లెరిగిన చేతిలో "గెలుపు" కార్డు

❈

## THE VOICE OF TELANGANA

**1**

This Telangana today,
the stage for the freedom of the native throng
Opened the gates of peace and
scripting the delightful welcome song
Shining with the magnificent glow
of the morning Sun ray legion
Of the mind-blowing memories
of this enchanting multi cultural region

**2**

This Telangana today,
a legacy of the cherished state-craft
A compassionate cloud comforting
the people in the inferno of time ripples
A memorable line of satisfaction
in the agitated heart and a full moon lotus
Blossomed in the history of Telangana,
with many chapters of uneasy hiatus

**3**

Today the soul's grandeur touched the sky
illuminating it with bright colours
Today the soul's thoughts emanated the earth
as the fragrance of the lotus flowers
Today the self-respect shone forth
as the spread wings of the Royal Swans
Today the spirits rose high in the West wind
as a symbol of change in time-caravans

**4**

Our Telangana movement has its own unique splendour
An inimitable confluence of many a lingo and cultural
grandeur A proud pattern for the whole world in limbo
A varied color plateau simulating the rainbow

**5**

The Jewel in the garland of the bygone epoch of Telangana
It is the land of cultured friendship and political stamina
The desire for the separate state donned the firm shape
The opus of the people's voice opened the door of hope

**6**

The contemplation of freedom
sculpted its desired existence
The beam of peace reflected
on the relentless struggle's pace
The willing sacrifices of one and all
unifying into a formidable force
The protracted dream of a separate state
finally shaping into a reality source

7

Waiting for ages in the hope
of gaining emancipation and self-governance
Expressing the unique regional sentiments
and cultural diversity instance
Putting into action of the displeasure
in the form of strikes, demonstrations
And mass disobedience, Never resigned,
leaving it to its fate, the committed ones

8

Hopeless days prompted some youth
To jump from the high towers to death
Waiting for ages wilted the life's hue
Disappointment fire devoured a few

**9**

With civil disobedience the struggle reached the peak
Resistance of the people all over the land began to speak
When State proclaimed it as unlawful and crime
Depressed state did claim a few lives in prime

**10**

The Clock- tower was the spectator
of the colossal movement
The mind was the witness
for the maligned man's grotesque sentiment
But the trust in fellow men
on this land of undaunted fighting spirit feast
Severed the sickening clouds and
the freedom Sun dawned in the East

**11**

From all directions arose the hot springs of excitement
From thinkers to the first line soldiers in that commitment
It is the impulse of the people in the right direction
Infused the heart with the ambrosia of resurrection

**12**

On that day itself, a live thought and hope
percolated in all spheres
The efforts and endeavors evolved
into a mighty force allaying fears
The people's participation is total
and for them sacrificing life is a relief
All the different paths and approaches
have now a single aim and belief

**13**

One moving about like a heart rending
song from that direction
Another one breathing life
into the dry words with compassion
This one is transplanting
tender twigs and flowers to the stems barren
Resolved to achieve the separate state,
liberation and self-determination

**14**

With hills, meadows, lakes, ponds,
mines and fields, our Telangana
A treasure trove, an El Dorado
and the fortune seekers' arena;
With populace of highly soft
and tender hearts of coconut milk
Far and wide one can hear
the echoing slogans of our native folk

**15**

An immortal saga
that trod upon the path of fire and ice
The resplendent light
that never shed the shield of peace
The helping hand
that removed the strife of the populace
Our Telangana movement
a matchless unique historical piece

**16**

When the seasons all
gathered to become a united form
The creator God Brahma
Himself pondered in amazement
When fearless nights got shivers
with fear and astonishment
Born our Telangana!
An inimitable, unrivalled land of charm

**17**

Shining gold bright on top of the carpet green fields
Silvery light in the mind realm with gnosis yields
Ruling people's minds with majestic queenly poise
Our Telangana! The land of plenty and peerless equipoise

**18**

Here the life itself takes
the form of a goddess highly revered always
Colorful flowers assemblage
points towards the mystic absolute force
Whole nature for these people,
a Goddess of supreme life source
A Mother of mothers she is!
Batukamma, the Deity of native Populace

**19**

Many festivals have deep roots in the culture past
Reflects the self and soul in the light of reality vast
This Telangana is a land of solace and comfort
A beautiful land of serenity and peaceful life fort

❃

20

All contingents and orders
amalgamated into a mighty force
Like a million rays of light
releasing from one unique source
This Telangana today is
a symbol of victory and achievement
A whole font of excitement fire
sans snuff out and  extinguishment

**21**

Walking on the path
of the forest flowers red carpet with clenched fist
Here and there the misguided peoples
war tearing the many screen mist
Lots of violence, bloodshed and
dimmed mind's destructive utopian quest
Crossing the time line barriers
this land finally gained its desired conquest

## 22

In those initial days
many shackles made the life less pleasurable
Governance was harsh and
the existence was entirely miserable
Natives were forcibly made
to write and speak in Urdu a lingo
Telugu was put aside and
the survival existed in a sort of limbo

## 23

Intolerable even to the word Andhra
and with simmering grudge
The rulers made the people of this land
walk on the razor's edge
The terra firma of Telugu suffered
tongue restricting terror might
The sun was under clouds
and the daytime too lit with moonlight

**24**

Covered by thick layered fog
and constricting forgetfulness
Native folk reeled blind
under the despotic rule in pitch darkness
Somebody woke them up
and the bright mirror was the prime witness
The movement was nurtured
and marched fast with eagerness

**25**

Everyday people gathered and
moved with hardened determination
Unprompted processions filled
all four directions in walking stone formation
The Sunshine of wisdom
whispered into the darkness rapture
The listless humanity crawled
under cloud like some sad looking sculpture

## 26

This melancholic period carried
the grief beyond description
Wilted mind whispering
warm sighs of withered fire inscription
Keeping the disenchanted
élan vital as the prime prescription
And fighting against
the miscreants with redeemed conniption

## 27

Whatever may be the Time,
if the illumination of the mind
Goes less bright,
that life is equal to a dry barren tree kind
When a strained bond
breaks into pieces infinitum
Bringing them into original form
is an impossible dream

## 28

Like a tender flower
crushed under the wheels of a train
Some vast emptiness
fills the life's caravan, a song of pain
A wounded deer doe,
this gutted life, sheds tears of woe
Though this democracy
a gentle, compassionate forest toe

## 29

In our new State festivities
proclaimed the peoples mind state
Hope and excitement of self government
brightened the thought plate
As usual Time passes on its seven horses,
twelve spoke wheel chariot right
The mutual hate and mistrust vanishes, .
in no time and dawns morning bright

## 30

In that right path we all have to travel
demolishing the destructive bushes
The Legislature chapter should maintain
dignity and decorum switches
Avoid chasing rainbows in search of treasures
in the troubled seas and rushes
Even in defeat maintain self-respect
and stop crying over spilled milk twitches

## 31

Treading on the path of thorns and arrow tips again and again
The magic chant of victory always on the lips of the native train
This great Telangana reached its target station,
after a prolonged struggle
A proud example to the movements of resistance,
a non-violent battle regal

## 32

For a knowledgeable and intelligent person with wisdom
It is a natural tendency to think beyond time and serfdom
The one who reaches the pinnacle of command tower
In his discriminative hand shines the victory card
of values and power.

స్వీయ కవిత

## ఆత్మ బంధము

### 1

అది ఏదో ఒక ఆత్మ బంధము, మనో
వ్యాసక్తమై నిల్చె, నా
ఎదలో వెన్నెల గంధమై రస ధునీ
హేవాకమై డోలికా
పదమై, జీవన సార్థమై, నవ దశా
పారీణతా భవ్యమై
పది యారేడుల నుండి నేటి వరకున్
ప్రాంచత్కళా బింబమై

✲

## 2

అది ఏదో ఒక ఆత్మ రూపము, జలే
జాకారమై పొల్చె, నా
ఎదలో మాధు ఝరీ ప్రసారముల బ్రా
హ్మీ భ్రామరీ స్వానమై
వదనం బెల్లను శోక తప్త రవ సం
వాదంబుతో, దీనతా
స్పదమై ఎట్టెదురయ్యె దృశ్యము! ప్రజా
సంవేదనా రూపమై

❊

## 3

అది ఏదో ఒక ఆత్మ భావము, ప్రభా
తా పూర్ణమై నిల్చె, నా
ఎదలో మెత్తని రూపమై, తరళతా
హేరాళమై స్వాదువై,
సదయా పేక్షను దాటి, దీన జనతా
సంయోజనల్ ప్రక్కనే
కదలెన్, హెచ్చిన స్థాయిలో నలిగి, చీ
కాకైన సంఘంబునన్।

❊

## 4

అది ఏదో ఒక ఆత్మ లోకము! సుధా
హార్దమ్ము సౌభ్రాత్రమై
ఎదలో విశ్వజనీన కాంతి కళ, నెం
తే నింపె, ఆత్మీయమై,
ఎదురై తోచెడు! రక్త సిక్త పద చి
హ్నా భూత దృశ్యావళుల్
తుద ముట్టింపగ జాల కున్న విట, పం
క్తుల్ పంక్తు లై మేఘముల్।

※

## 5

అది ఏదో ఒక ఆత్మ గంధము! జగత్
యాత్రా పథం బంధు! నా
ఎదలో ఉత్సవ వీచికావళుల, నెం
తే నింపె! సాహిత్యమై
అదయా కారమునన్ వినీల గతి సం
ధ్యా ధూమముల్ సాగి, వే
అదనున్ చూచి జ్వలించు వర్తనములో
'హాహా' రుతుల్ చిమ్మెడున్।

※

## 6

అది ఏదో ఒక ఆత్మ లక్ష్యము అనం
తాపూర్ణమై నవ్యమై
మదిలో ఈ యుగ శాంతి మార్గమున, స
మ్మానర్హులన్ ఎంచుచో
పద మెత్తన్ మృగ జంతు పక్షి తతి, స
ర్వాకార సందోహముల్
కదిలెన్ మానిసి లోని మానసిక కీ
కారుణ్య భావాకృతుల్।

❊

## 7

అది ఏదో ఒక ఆత్మ రాగము, మనో
యాత్రా జగం బందు, తా
నది వోలెన్ మది జీవితాయువును, స
న్నాదంబుతో నింపు వే
ళ, దివారాత్రము లందు ఏ క్షణమొ, కా
లా వేశముల్ వచ్చెడిన్,
విదితాశా తటి పై, హఠాద్విలయమై
విచ్ఛేద శబ్దంబులన్.

❊

## 8

అది ఏదో ఒక ఆత్మ తత్త్వము సమూ
హశ్రేయమై నిల్చె, నా
మదిలో దర్పణ మందు బింబమయి, అ
మ్లానైకమై దివ్యమై,
ఉదయం బయిన క్షణంబు నుండి, కటు వ
హ్నుల్ చీకటుల్ హింసలున్
రుదితాంభోనిధి సేచనల్ గల మహో
రోషాకృతుల్ చిమ్మెడున్.

❀

## 9

అది ఏదో ఒక ఆత్మ నాదము మదీ
య స్వాంత మందిష్టమై
నది, ఆనంద తుషార నిర్ఝరిణి గా
నాకారమౌ వేళ, ఆ
పదలో చిక్కిన ఉగ్ర వాదములతో
పక్షాకృతుల్ విప్పి, నా
కెదురై వచ్చెడు, హక్కులందు పదునై
ఏ రోజు సంధ్వానముల్।

❀

## 10

అది ఏదో ఒక ఆత్మ బీజము కథా
వ్యాకీర్ణమై శాఖలై
ఎద పర్ణంబులు పుష్ప సంతతులతో
ఇంపౌ ఫలాకార సం
పదతో రాగిల, జీవితాశయ కళా
ప్రావీణ్యతా చిహ్నమై
కదలింపంగను జూచు! వృక్షమును, వే
కాలుండు ఝుంఝూ హతిన్

❊

## 11

అది ఏదో ఒక ఆత్మ దర్శనము! నా
నా కార చైతన్య సా
రదమై, మానవ చింతనా రుచిర ధా
రా సిక్తమై, భావ సం
పదలో చేరిన వెన్ని రూపములు! ఇం
పారన్ రస స్పందనా
స్పదమై తోచెడు, అన్ని అందములు! ప్రా
భాతాంశు దృగ్వీథిలో.

❊

## 12

అది ఏదో ఒక ఆత్మ భావము, మనో
యత్రా కథా చిహ్నమై
ఎదలో ప్రాక్తన బింబమై వరలె, నీ
దృశ్యమ్ము సౌవర్ణమై
పదియార్వన్నెల మానసాకృతి నభో
పారావతంబై, దిశా
పద మందంచిత రాగమై, జన మనః
పద్మాకరా హ్లాదమై.

❊

## 13

వెలుగు లనంతముల్ వెలుగు
వెంబడి ఇంకొక వెల్గు వచ్చెడిన్
విలయము దాక, జీవన న
వీన కళా మయ పుష్ప మాలలై
తళ తళ లాడగా బ్రతుకు
ద్వారము ముంగిట తోరణాలుగా
తలపుల దారిలో రుచిర
తా గుణ మందిన శాంతి రమ్యముల్.

❊

## 14

వెలుగు లనంతముల్, శిశువు
విప్పిన ఆ తొలి నేత్ర కాంతిలో
విలసితమై హృదంతర న
వీనముగా ప్రసరించు నట్టి వై,
వెలుగు లనంతముల్ మనిషి
విప్పిన మానస నేత్ర దృష్టితో
తలపులలో, నికామ మహి
తాకృతి విచ్చు లసన్మతి ప్రభల్।

## 15

వెలుగు లనంతముల్ సకల
విశ్వ హృదబ్జము విప్పి, మాధురీ
కలిత విభాత వీచికల
కంటికి దారులు చూపు దేశికుల్,
లలితము లైన పాద విచ
లన్మృదు హార్దిక భావ బంధువుల్
లలి సుమ డోలికా శిశువు
లన్ తలపించెడు, రాగ రూపముల్।

## 16

వెలుగులు మేఘ బృందము ప్ర
　　వేశములోన స్రవించు చేతనల్
తలపయి నుండి గుండెకు సు
　　తారముగా జను, జ్ఞాన సారముల్,
కలలను వాస్తవాకృతుల
　　కందగ జేయు, ప్రసార భూమికల్
వెలిగెడు! శాంత రాగ నయ
　　వీర కృపామయ జీవితమ్ములన్.

ఈ పద్యాల్లో అంతరమయిన ఆదర్శమూ బయట దీనికి భిన్నమయిన వాస్తవ జీవితమూ వీటి సమాకలనంతో వర్తమాన దృశ్యం చిత్రితమయింది. అభివ్యక్తిలో మొదటి ఎనిమిది పద్యాల్లో 'మోడ్ ఆఫ్ కాంట్రాస్ట్', చివరి నాలుగు పద్యాల్లో 'ఇంటర్‌ప్రెటివ్ మోడ్' దృష్టికి వస్తాయి.

# మానవీయం

## 1

మానవ భావనా మహిత
మౌ కవితాకృతి ! ఈ నవీన కా
లాన ప్రజా సమస్యలకు
లంగరు ఎత్తిన నావ యౌచు, స
మ్మానము నొందు చున్నది, స
మాజము నందు నవాశయాలతో
విన్నవి చూచి నట్టివి, ప్ర
వేశము నొందెడు ! వాస్తవాలతో

✲

## 2

విన్నవి చూచి నట్టివి, న
వీకృతమైన విచార ధోరణిన్
ఎన్నగ భేద, భావములు
వేల యుగాల చరిత్రతో, సమా
జోన్నతి కోరు వైఖరి, ని
జోపకరంబయినట్టి తీరులో
మిన్నక ఉండలేని కవి,
ఎన్నిక చేసిన దారి సాగెడిన్

## 3

అగ్నులు చిమ్ముచున్, నడచి
నారిట కొందరు దేశ పాలకుల్,
భగ్న మనో రథుల్ ప్రజలు
బాధలలో పడి, డీలు వోవగా
అగ్నులు నార్పు, మేఘ మన
వచ్చినదీ జన తంత్ర భావనా
లగ్న మనస్క తన్ సమత!
లాభము కూర్చు సమాజ బంధువై.

✻

**4**

ఇది, స్వేచ్ఛా పథమందు దార్శనిక ని
ర్ణేయంబుగా నిల్చి, సం
పదలో భాగము పంపిణీకి అనువై,
బాధా స్థితుల్ మాసి, ఆ
పదలో నుండి సముద్ధరింపబడి, ప్రా
భాతాంశు రేఖా నటత్
ముద మొప్పంగ, సమాజ భాగ్యదశలే
ముఖ్యాతి ముఖ్యంబుగా.

**5**

అయినను దైన్య హైన్యములు
అంతట వింతలు గొల్పుచున్ మదిన్
పయి పయి హింసలున్ పెరిగి
పాయని వైరపు కత్తి దూకుడుల్,
నయముగ కాల వాహినులు
దాటగలేని, ప్రయాణ గాథలో
దయయను మాట దూరమయి
దారుణ మారణ కాండ రేగెడున్

## 6

ప్రజలను గూర్చి, వారి పలు
బాధల పట్ల, విచార శీలతా
నిజ గుణ నీతి తప్పి! ఒక
నిశ్చయ రూపము లేని యోజనన్
ప్రజ అసమానతల్ పెరిగి
పచ్చదనమ్ము నశించి, గుండెలో
నిజేములు తారుమారగుచు
నేతల మార్పుకు దారి తీసెడున్

## 7

విజయ మెవ్వరి దైనను విభవముందు,
బ్రతుకు దారుల వర్తన రీతులందు,
మనిషి అస్తిత గుర్తులు మరచు టన్న
మానవీయము విచ్ఛిన్నమయిన యట్లె!

✲

## 8

ఎక్కడ చూచినన్ మనిషి !
మేరలు మీరిన పాల పొంగుతో
ఎక్కిన నిచ్చెనన్ మరచి
నింగిని చేరగ నెంచు ఆశతో
లెక్కకు రాని తంత్రముల
లేచిన నిప్పు కణాల జోరులో
నిక్కము నాగ! దీనతను
నిల్చెడు! మ్లాన తరూప మానమై

## 9

ఇంక ఏ మాత్రమీస్థితి నిలువ రాదు
ఎంత కష్టములోనైన, శీతమైన
అనల ధానికనెవ్వడు హత్తుకొనును!
మానవీయము మాత్రమే మాన్యమిపుడు!

❊

## 10

శాంతికి చోటు లేదు ఇట
సర్వ జనాళి హితంబు కోరు, యే
నేతయు కాను పించ డిట
నిర్మల మైన మనోభిలాషతో
నీతులు చెప్పు టందు, ఘన
నిష్ఠను చూపెద రీ ప్రశాసకుల్
ఎంతటి చర్యకైన దిగి
నిప్పులు చిమ్ముచు పోదురీ గతిన్

## 11

ఎన్నో రీతుల మానవీయము కళా
విజ్ఞాన సంశ్రేయమై
విన్నాణంబులు వోవు కీర్తి కలదై
ఈనాడు నిర్ధూతమై
అన్నీ పోయిన ఈ స్థితిన్ గడచు టె
ట్లన్నన్ మహా ప్రశ్నతో
ఉన్నా రన్నది ! నైజమీ సమయ మం
దున్మాద దుశ్చర్యలన్

❊

## 12

అనువై కట్టడి లేని స్వేచ్ఛ, ఒక శా
పంబై, ప్రజాస్వామ్య మం
దున భీ భావ తరంగ లోల జన సం
దోహంబు వేసారెడిన్
అనయంబైన విషాద రేఖలివి, సా
యం వేళలో నీడలై
పెను చీకట్లకు దారి చూపెడు నిశా
ప్రీతంబులై అంతటన్

❊

# చంద్రునికొక నూలుపోగు

## 1

అతడొక శాంతి మంత్రమున
కాకృతి, దుర్గయ శాస్త్రి మా గురుం
డతులితమైన పాండితికి
ఆదరణీయ గుణాశ్రయుండునై
అతడొక మౌన రాగ పరి
పాలిత చిన్మయ మాన్యుడున్! సర
స్వతి దరహాస శోభితుడు!
సాధువు! కావ్య కళా ప్రమోదియున్.

## 2

ఈ మనోజ్ఞ సమావేశ వేళ యందు
వెలుగు చూచిన నాలోని విరుల మాల
స్వీకరింపుము! ఈ హృది విజయ గీతి
ఈప్సితాలోల చేతన మీ జగత్తు

ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో 1966 వ సంవత్సరంలో పిహెచ్.డి డిగ్రీ పొందిన సంతోష సందర్భంలో, మరునాడు పరిశోదనా నిర్దేశకులు (నేను హైదరాబాద్‌లో అడుగుపెట్టిన రోజు 1952 జూన్‌నుండి అనుబంధం కలవారు) డా॥ పల్లా దుర్గయ్య గారికి సమర్పించినవి.

❋

# చిర యశస్వి

## 1

అతడొక సత్పదార్థ గుణ
భాసుర మానస వర్తి, శారదా
వితత మనోజ్ఞ చంద్ర కళ
విప్పెసలారు సుధా మనస్కుడు
న్నతుడయి సన్నుతంబయిన
నన్నయ సాహితికిన్ ప్రతీకయై
మతి విభవమ్ముతో హృదయ
మందున గంగార్ఝురీ రసార్ద్రమై

## 2

ఆర్ష విద్యా ప్రపంచ విజ్ఞాత యశుడు
సత్యసాయి కృపా సార శాంత మూర్తి
గురువుగా, చిత్కళాకృతి మెరుపు గాను
ఆత్మ శోభా మనీషి! అవధాని గారు

❊

## 3

ఈయన, కాలు మోపిన ధ
　　రిత్రి పయిన్ తెలుగైన వెల్గుతో
ఈయన, మాట విన్పడిన
　　సీమలలో తెలుగైన గాలితో
ఈయన, కీర్తి సౌరభము
　　నిండిన మేరలలోన తెల్గుతో
పాయని సంప్రదాయ బల
　　మంతయు మూటగ, ఆత్మరూపమై

ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారిని గురించి ఒక విశేష సందర్భంలో వ్రాసినవి.

# మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా

## 1

వెలుగులు చిమ్ముచున్ కదలి
　　వీర మహోదధి వోలె సాగి, మా
తలపుల లోని బంధన వి
　　తానము ఛిన్నము చేసి నావు, మా
తల పయి రాతలన్ మలచి
　　తళ్ళుకు దిద్దిన "శిల్పి" వీవు, వే
వెలుగుల "రుద్రవీణ" పయి
　　విప్పగ జేసితి అగ్ని గీతముల్

## 2

మా గాథల్ వినదించి నావు, జనతా
　　మాన్యమ్ము "మంజీర" గా
మా గోసల్ వినిపించినావు, కవితా
　　మానోజ్ఞతా గర్జగా

✲

త్యాగానన్ సుఖ భూమికల్, విడిచి, స్వాం
తంత్ర్యైక మార్గాన, కా
రాగారంబున నుండి, నీవు ఒక వీ
రావేశ గోళంబు నాన్.

## 3

ఈ కనువిందు నైనది సు
మీ! తెలగాణము రాష్ట్ర దీప్తితో
మా కయి వచ్చి, మా హృదయ
మంటపమందు వసింపు మీ కృపన్
ఈ కమనీయ వేళ! తమ
స్వేచ్ఛను పొందిన హ్లాద వేదిపై
నీ కిదె! స్వాగతమ్ము నవ
నీరజ మాలలు సాగు చూపులన్

## మాదిరాజు రంగారావు కృతులు - 1953-2025

### A) స్వేచ్ఛా కవిత్వం

**❖ I.స్వేచ్ఛా కవిత్వం - మొదటి సంపుటం  రచనా కాలం 1953 - 2002**

**i. స్వేచ్ఛా నవం :** 1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం 3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం 5. యుగ సంకేతం **ii. 6. ఆవాహనం iii. 7. ముక్తకాలు. iv. సమయ దర్పణం :** 8. నాలో ప్రవహిస్తోంది నది 9. నాకు జ్ఞాపకముంది **v. 10. కిర్మీరం** 11.మనోభూమికలు **vi. వర్తమానం స్క్రీన్ పై :** 12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై 15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం 18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై **vii. 20. అగ్ని నుండి ఆనందానికి viii. ఈ శాతాబ్ది రెక్కలపై** 21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం 23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం **ix. అగ్నిపితం** 26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య **x. 29. కిరణ పథం** 30. స్వేచ్ఛకు సిగ్నల్

**❖II. స్వేచ్ఛా కవిత్వం - రెండో సంపుటం రచనా కాలం 2003 - 2012**

31. అభిషేకం 32. ఆగమనం 33. ఎప్పటికీ కొత్తే 34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం  37. సమకాలీనం 38. అభినవ యానం  39. ఆత్మ బంధం  40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం 43. గిఫ్ట్ ప్యాకెట్ 44. నవ దర్శనం 45. పునర్దర్శనం 46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి 49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం 52. అద్దంలో ప్రజాస్వామ్యం 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం

**❖III.స్వేచ్ఛా కవిత్వం - మూడో సంపుటం రచనా కాలం 2013-2015**

54. ఖడ్గం కన్నీరు కార్చదు 55. చార్ ధామ్ 56. ఆల్ ఇన్ వన్ 57. ఉద్యమ పథం 58. అడవిలో ఆయుధం 59. చెదరిన ప్రజాస్వామ్యం 60. గాయ పడిన ప్రజాస్వామ్యం 61.ఈనాటి నిజం 62. ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం 63. సంస్కృతి & హృదయం నుండి 64. తెలంగాణ స్వరం, ఆత్మబంధం

**❖IV. స్వేచ్ఛా కవిత్వం - నాలుగో సంపుటం రచనా కాలం 2015 నుండి 2018**

65. వర్తమాన స్వనం 66. లైన్ క్లియర్, 67. వర్తమాన వాస్తవం 68. వర్తమాన లహరి 69. వర్తమాన యానం 70. వర్తమాన సంకేతం 71. ఇదే దారి 72. నవ మానవం 73. ప్రపంచీయం 74. హృది కిటికి నుండి  75. కార్నర్ కవితలు

**❖V. స్వేచ్ఛా కవిత్వం - ఐదో సంపుటం రచనా కాలం 2017 నుండి 2019**

**ఇది జీవితం :** 76. ప్రశ్నలతో ఇప్పటికీ 77. బ్రతుకులో కవితయై 78. గమ్యంపై గురితో 79. అస్మితలు, అస్తితలు 80. వాస్తవ చక్రంపై  81. ఎవరి దారి వారిది 82. అశాంతి పరిచయం 83. కవిత నా ఆత్మ 84. కాలం కప్పులో 85. నిప్పు రెక్కలపై 86. సమాప్తి కాదు 87. కాలానికి కృతజ్ఞతలు  88. సమయ పథం 89. ఇది అందరిదీ 90. సమాంతరం 91. ప్రాణం కన్న మిన్న 92.

వర్తమానం ఆనవాలు 93. నీడ నుండి వెలుగులోకి 94. అక్షర ముకురం 95. జీవితం స్వతంత్రం 96. కాలంతో నేను 97. కర్తవ్యంలో కవిత

### ❖VI. స్వేచ్ఛా కవిత్వం – ఆరో సంపుటం రచనా కాలం 2019 నుండి 2020

98. ఏది కవిత 99. వర్తమానం ముందుకే 100. మార్పుకు సిగ్నల్ 101 కవిత ప్రభుతతో 102 హృదయ దర్పణం 103. నేను నేనే 104. స్వేచ్ఛలో స్వతంత్రం 105. భవితకు సంకేతం 106. అక్షరంలో స్వేచ్ఛ – సమాజ యానం 107. స్వేచ్ఛలో బంధనం 108. కాక్‌టెయిల్

### ❖VII. స్వేచ్ఛా కవిత్వం – ఏడో సంపుటం రచనా కాలం 2020 నుండి 2022

109. రేపటికి రిజర్వులో 110. అక్షతం 111. లాక్‌డౌన్ 112. వర్తమానం మెట్లమీంచి 113 అజేయం 114 ఈ వారం కవిత 115. గుడ్ బై 116. అక్షర హృదయం 117. గాయ పడిన శాంతి 118. వార్తలో కవిత 119. నిప్పులపై మేఘం 120. తెలియని వాస్తవం

### ❖VIII. స్వేచ్ఛా కవిత్వం – ఎనిమిదో సంపుటం రచనా కాలం 2022 నుండి 2023

121. మార్నింగ్ వాక్ 122. విప్లవ ప్లవనం, స్వేచ్ఛలో మనోజ్ఞం 123. అదృష్టం 124. మేల్కొన్న కవిత 125. ఆగని పయనం 126. కవిత్వమొక థెరపి, తెలంగాణ స్వరం

### ❖IX. స్వేచ్ఛా కవిత్వం – తొమ్మిదో సంపుటం రచనా కాలం 2023

127. హృది నుండి హృదికి 128. రౌండ్ టేబుల్ 129. మానస తంత్రులపై 130. సరికొత్తగ 131. ఆశానవం 132. మౌనం మాట్లాడుతుంది 133.శిల నుండి రసాకృతి 134. అశాంతి చక్రంపై 135. మేనిఫెస్టో

### ❖ X. స్వేచ్ఛా కవిత్వం – పదో సంపుటం రచనా కాలం 2024

136. కవిత సర్వ స్వతంత్రం 137. ఇది మలి తెలంగాణ 138. నిజయానం – (బొన్సాయ్ అనంతం) 139. స్వేచ్ఛామేఘం, మెరపులు తలపులు 140 స్వేచ్ఛా పవనం

### ❖ XI. స్వేచ్ఛా కవిత్వం – పదకొండో సంపుటం రచనా కాలం 2025

141. జీవన దర్శనం 142. అద్దంలో అనల చిత్రం 143. ముక్తకాలు 144. ఆశాబన్ధం

### B) పరిశోధన – సమాలోచనం

1. కవిత్రయం సృజనకళ (సిద్ధాంత గ్రంథం) 2. నవల స్వరూపం 3. పరిశోధనా స్వరూపం 4. అధికార భాష 5. అనువాద కళ 6. దాశరథి కవితా సమాలోచనం 7. ఆలోకనం 8. సమదర్శనం 9. సృజన రూపం–మానవీయ భావన 10. సృజన చేతన–భావ రూపాలు 11. Facets of to Free-verse 12. శ్రీశ్రీ మహా ప్రస్థానం–సమాలోచనం 13. రామాయణ కల్పవృక్షం–సృజన చేతన 14. స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య దర్శనం 15. స్వేచ్ఛా కవిత్వం – మానవీయ దర్శనం 16. స్వేచ్ఛా కవిత్వం–సహృదయ స్పందనం 17. గురజాడ ఆధునిక చేతన (2013) 18. కవితా సమాలోచనం–2017 19. కవితల సమాలోచనం 2019 20. సాహిత్య విమర్శ వ్యాసాలు

## సంక్షిప్త పరిచయం



మాదిరాజు రంగారావు గారి జననం జూన్ 8, 1935న పండితాపురం గ్రామం, ఖమ్మం, తెలంగాణ రాష్ట్రం. మాదిరాజు రంగారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి నిజాం కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ (O.U), హైదరాబాద్, తెలంగాణలో చేరారు. మాదిరాజు రంగారావు తెలుగు మరియు సంస్కృత సాహిత్యంలో M.A. సంస్కృతం 1960 (O.U), M.A. తెలుగు 1962 (O.U), Ph.D. తెలుగు 1966 (O.U) మరియు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి, UGC) యొక్క పరిశోధనా పండితులు.

డాక్టర్ మాదిరాజు రంగారావు ఆంధ్ర మహాభారతం మరియు ఆంధ్ర మహాభాగవతం యొక్క విమర్శనాత్మక సంచికా సంపాదక మండలిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టర్ రావుకు మొదటి విద్యా సంబంధ నియామకం లభించింది. ఆ తరువాత తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా మరియు డీన్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆచార్య రావు యు.జి.సిచే మంజూరు చేయబడిన రెండు ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంట్‌లకు మరియు భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ, న్యూఢిల్లీచే స్పాన్సర్ చేయబడిన ఒక పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంటుకు ప్రధాన పరిశోధకులుగా ఉన్నారు. ఆచార్య రావు 'రసధుని సాహితీ పరిషత్తు' అనే సాహిత్య సంస్థకు వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులుగా ఉన్నారు. ప్రముఖ కవి, రచయిత మరియు సాహిత్య విమర్శకులైన ఆచార్య మాదిరాజు రంగారావు, సాంప్రదాయ సాహిత్యం, ఆధునిక కవిత్వం మరియు విమర్శతో సహా తెలుగు సాహిత్యం యొక్క వివిధ ప్రక్రియలకు విస్తృతంగా సేవలనందించారు. మాదిరాజు రంగారావు గారు తమ స్వేచ్ఛా కవిత్వం మరియు సాహిత్య విమర్శ రచనల ద్వారా సమకాలీన ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రముఖ పత్రికలైన భారతి, స్వతంత్ర, స్రవంతి, జయంతి, ఆకాశిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మరియు ఆంధ్రభూమి వంటివి, మాదిరాజు రంగారావు గారి సృజనాత్మక రచనలను క్రమం తప్పకుండా ప్రచురించాయి.

ఆచార్య మాదిరాజు రంగారావు కవిత్వానికి మూల స్తంభం మానవతా ఆదర్శాలు మరియు శాంతికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య దృక్పథం. ఇదే వారి స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టు. మాదిరాజు రంగారావు గారు స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియలో సాగించిన ప్రస్థానం వారి విశిష్ట వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, మానవతా భావాలు, ప్రజాస్వామ్య సామ్యవాద సామరస్య దృక్పథం మరియు శాంతి సందేశం ద్వారా సుసంపన్నమైంది. మాదిరాజు రంగారావు గారి 'పరిశోధన మరియు సాహిత్య విమర్శ' రచనలు సాంప్రదాయ సాహిత్యం, సాహిత్య ఇతివృత్తాలు, భావజాలాలు, మానవ అంశాలు మరియు సార్వత్రిక దృక్పథం యొక్క సృజనాత్మక మరియు కళాత్మక విశ్లేషణపై దృష్టి పెడతాయి. తన సుదీర్ఘమైన మరియు అత్యంత ఫలవంతమైన సాహిత్య జీవితంలో, ఆచార్య మాదిరాజు రంగారావు యొక్క సృజనాత్మక రచనలు జూన్ 21, 2025న వారు కాలధర్మం చెందిన నాటికి 'స్వేచ్ఛా కవిత్వం' పై 150కి పైగా, సాహిత్య విమర్శపై 20కి పైగా, మొత్తం సుమారు 170 పుస్తకాలుగా వెలువడ్డాయి.

## BRIEF SKETCH



Madiraju Ranga Rao was born on June 8, 1935, in Pandithaapuram village, Khammam, Telangana. Madiraju Ranga Rao completed High School Education from Govt. High School, Khammam and joined Nizam's College Osmania University (O.U), Hyderabad, Telangana. Madiraju Ranga Rao was a student of Telugu and Sanskrit literature, obtained M.A. Sanskrit 1960 (O.U), M.A. Telugu 1962 (O.U), Ph.D. Telugu 1966 (O.U) degrees and was a research scholar of the University Grants Commission (UGC).

Dr. Madiraju Ranga Rao was a member of the Editorial Board for the critical editions of Andhra MahaBharatham and Andhra MahaBhagavatham. Dr. Rao's first academic appointment in 1964 was with the Department of Telugu, O.U, Hyderabad, then a long tenure at Kakatiya University, Warangal, Telangana as Professor, Chair Board of Studies, and Dean for Faculty of Arts followed. Prof. Rao was the Principal Investigator on two major research project grants awarded by UGCand one research project grant sponsored by the Department of Human Resources, Govt of India, New Delhi. Prof. Rao was the Founder and President of 'Rasadhuni Sahithi Parishath' literary organization.

Prof. Madiraju Ranga Rao, an acclaimed poet, writer and a literary critic, contributed extensively to various literary genres of Telugu literature including classical literature, modern poetry, and criticism. Prof. Rao established his niche in contemporary modern Telugu literature through his literary works in 'Free Verse'(Swecchaa Kavithvamu) and Literary Criticism. Popular journals published his creative writings on a regular basis and this list includes Bharathi, Swathanthra, Sravanthi, Jayanthi, Akashik, AndhraPathrika, AndhraPrabha, AndhraJyothi, AndhraBhoomi and several others.

Central to Prof. Madiraju Ranga Rao's poetic purpose was humanistic ideals and a democratic ideology that symbolized peace. This was the very essence of his 'free verse' poetry. Prof. Madiraju Ranga Rao's journey in the genre of 'free verse' poetry is enriched by his unique personal spirit, social consciousness, humanitarian feelings, a democratic ideology, and a message of harmony. A substantial number of Prof. Rao's contemporary modern 'free verse'poetic works are based on his creative mindset pertinent to historical development, existing situations, social realism, element of reason and reform, humanistic sentiment with a sign of peace and harmony. Prof. Rao's 'literary criticism' works focus on creative and artistic analysis of classical literature, literary ideologies, human elements, and universal outlook. During his long and highly productive literary career, Prof. Madiraju Ranga Rao's creative writings culminated in more than150 books on 'free verse' poetry and over 20 books on 'literary criticism' – a total of about 170 books – published until his departure on June 21, 2025.

9 789356 358423